సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 16 సంచిక: 157

బుధవారం 21-2-2024

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | VIJAYAWADA | DELHI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'రాష్ట్రాన్ని దేశానికే అన్నం పెట్టే అన్నపూర్ణగా తీర్చిదిద్దాలనేది నా స్వప్నం'



కథల అమ్మమ్మ

విజయనగరం జిల్లాకు చెందిన రచయిత్రి కోరుపోలు కళావతిపై కథనం - 11లో



మార్చి 22 నుంచి ఐపీఎల్

అన్ని మ్యాచ్‌లు భారత్‌లోనే నిర్వహిస్తామని ఐపీఎల్ చైర్మన్ అరుణ్ వెల్లడి - 12లో



స్విస్‌కు పోటీగా కశ్మీర్

కశ్మీర్ లోయను పర్యాటకానికి గమ్యస్థానంగా, స్విట్జర్లాండ్‌కు పోటీగా మారుస్తామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రకటించారు.

వివరాలు 6లో ▸



టెన్త్, ఇంటర్ ఏటా రెండుసార్లు..

ఇకపై టెన్త్, ఇంటర్ పరీక్షలను ఏడాదికి రెండు సార్లు నిర్వహించాలని నిర్ణయించినట్లు కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ చెప్పారు.

వివరాలు 6లో ▸



ముంచెత్తుతున్న మాంద్యం

యుద్ధాలు, పర్యావరణ మార్పులు తదితర కారణాలతో ప్రపంచాన్ని క్రమంగా మాంద్యం మేఘాలు కమ్ముకుంటున్నాయి.

వివరాలు 6లో ▸



'ఆప్' అభ్యర్థే మేయర్

చండీగఢ్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ఎన్నికల్లో ఆప్–కాంగ్రెస్ కూటమి అభ్యర్థి కులదీప్‌ను విజేతగా 'సుప్రీం' నిర్ధారించింది.

వివరాలు 6లో ▸

మార్గదర్శి డిపాజిట్లు చట్ట విరుద్ధం

సుప్రీంకోర్టుకు నివేదించిన రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

సెక్షన్ 45ఎస్‌కు వ్యతిరేకంగా డిపాజిట్ల సేకరణ తప్పు

- మార్గదర్శి ఇలాగే డిపాజిట్లు సేకరించింది
- హైకోర్టులో ప్రతివాది కాకపోవడంతో అక్కడ ఈ విషయాలు చెప్పలేదు
- లిఖిత పూర్వకంగా పూర్తి వివరాలు ఇవ్వాలన్న సుప్రీంకోర్టు.. వాటి ఆధారంగా పూర్తి స్థాయి విచారణ జరుపుతాం
- ఇరుపక్షాలకు స్పష్టం చేసిన ధర్మాసనం
- తదుపరి విచారణ ఏప్రిల్ 9వ తేదీకి వాయిదా
- కేసు కోర్టు పరిధిలో ఉండగానే రూ.2 వేల కోట్లు వసూలు.. అంతకు ముందే చట్ట విరుద్ధంగా రూ.2,600 కోట్ల సేకరణ
- ఏపీ ప్రభుత్వ న్యాయవాది నిరంజన్‌రెడ్డి నివేదన
- డిపాజిట్లు వెనక్కి ఇచ్చేశారా.. లేదా? అన్నది ముఖ్యం కాదు..
- చట్ట విరుద్ధంగా సేకరించారా.. లేదా? అన్నదే ముఖ్యం : ఉండవల్లి

10 లో



'మార్గదర్శి' కేసులో కీలక మలుపు 10 లో

ఫ్యాక్ట్‌చెక్



నిరుద్యోగంపై దగా కథ

- జగన్ సర్కారుపై మరోసారి అక్కసు వెళ్లగక్కిన రామోజీ
- సీఎం జగన్ అధికారంలోకి వచ్చిన 4 నెలల్లోనే కొత్తగా 1.25 లక్షల రెగ్యులర్ ఉద్యోగాలు సృష్టి, భర్తీ
- ఇప్పటి వరకు 2.21 లక్షల రెగ్యులర్ ఉద్యోగాలు భర్తీ

3 లో

మీ 'మద్దతు' బాధంతా బాబు కోసమేగా!

- రూ.3 వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధి మీ పచ్చ కళ్లకు కనిపించదా?
- సీఎం యాప్ ద్వారా ఎప్పటికప్పుడు మార్కెట్ ధరల పర్యవేక్షణ
- కనీస మద్దతు ధర దక్కని ఉత్పత్తులు ప్రభుత్వమే కొనుగోలు
- రూ.65 వేల కోట్లు చెల్లించి 3.38 కోట్ల టన్నుల ధాన్యం సేకరణ

2 లో



వైఎస్సార్ కల్యాణమస్తు-షాదీ తోఫా చెక్కును లబ్ధిదారులకు అందజేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్

చదువులకు ఊతమిచ్చేలా కల్యాణమస్తు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టీకరణ

'వైఎస్సార్ కల్యాణమస్తు–వైఎస్సార్ షాదీ తోఫా' కింద ఆర్థిక సాయం విడుదల

అర్హులైన 10,132 జంటలకు రూ.78.53 కోట్లు జమ

ఇప్పటి వరకు 56,194 జంటల కుటుంబాలకు రూ.427 కోట్లు లబ్ధి

గ్రామ సచివాలయాల్లోనే మ్యారేజ్ సర్టిఫికెట్ తీసుకునే వెసులుబాటు

2లో

'తేజస్' పరీక్ష విజయవంతం



దేశీయంగా అభివృద్ధి చేసిన డిజిటల్ ఫ్లై–బై–వైర్ ఫ్లయిట్ కంట్రోల్ కంప్యూటర్‌తో అనుసంధానించిన తేజస్ యుద్ధ విమానాన్ని విజయవంతంగా పరీక్షించినట్లు రక్షణ శాఖ తెలిపింది. గగనతలం, సముద్రజలాలపై గస్తీకి ఇది ఉపయోగపడుతుంది.

6లో

టీడీపీలో సీనియర్ల సీట్లు గల్లంతు

కొన్ని చోట్ల చంద్రబాబు, కొన్ని చోట్ల పవన్ అభ్యర్థుల ప్రకటనలతో సీనియర్ల గగ్గోలు



గాజువాక, పెందుర్తిలో జనసేన అభ్యర్థులకు పవన్ గ్రీన్ సిగ్నల్

ఆగ్రహంతో పల్లా శ్రీనివాసరావు, బండారు సత్యనారాయణమూర్తి

గోరంట్ల బుచ్చయ్య చౌదరి ఆశలన్నీ అడియాసలే

ఆయన సీటు రాజమండ్రి రూరల్‌లో అభ్యర్థిని ప్రకటించిన పవన్

మైలవరంలో దేవినేని ఉమాకు చంద్రబాబు మొండిచేయి

మైలవరం సీటు వసంత కృష్ణప్రసాద్‌కు ఇవ్వడానికి నిర్ణయం

జేసీ, పరిటాల కుటుంబాలకు ఒక టికెట్‌తోనే సరి

- వివరాలు 10లో

ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం

- నేటి నుంచి హాల్‌టికెట్ల జారీ
- 1,559 సెంటర్లు సిద్ధం.. 1 నుంచి 20వ తేదీ వరకు పరీక్షల నిర్వహణ
- అన్ని పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు
- పరీక్ష పేపర్లపై ఈసారి క్యూఆర్ కోడ్
- ఫొటో తీసినా, స్కాన్ చేసినా తెలిసిపోయేలా ఏర్పాట్లు

14 లో



తిరుపతి ఐఐటీ, ఐసర్, విశాఖ ఐఐఎం శాశ్వత ప్రాంగణాల ప్రారంభోత్సవంలో ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్.. వర్చువల్‌గా పాల్గొన్న సీఎం జగన్



తిరుపతి ఐఐటీ, ఐసర్, విశాఖ ఐఐఎం ప్రారంభం

వర్చువల్ విధానంలో జాతికి అంకితం చేసిన ప్రధాని మోదీ

విజయవాడ నుంచి వర్చువల్‌గా పాల్గొన్న గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి వైఎస్ జగన్

రేణిగుంట/ఏర్పేడు (తిరుపతి జిల్లా)/తిరుపతి సిటీ/ఆనందపురం(విశాఖ)/పెద్దారవీడు/కర్నూలు కల్చరల్: రాష్ట్రంలో ఏర్పాటుచేసిన ప్రముఖ జాతీయ విద్యాసంస్థలైన తిరుపతి ఐఐటీ, ఐసర్, విశాఖ ఐఐఎం శాశ్వత ప్రాంగణాలు, కర్నూలు ఐఐఐటీడీఎంను ప్రధాని మోదీ మంగళవారం వర్చువల్ విధానంలో ప్రారంభించి జాతికి అంకితమిచ్చారు. తిరుపతి జిల్లా ఏర్పేడు సమీపంలోని

మిగతా 2వ పేజీలో ▶



ఇవిగో నవరత్నాల వెలుగులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో నిర్విఘ్నంగా అమలు చేస్తున్న నవరత్న పథకాల ద్వారా కోట్లాది మంది జీవితాల్లో వెలుగు నిండింది. ఈ పథకాల వల్లే తాము ఆనందంగా జీవిస్తున్నామని ఊరూరా ప్రజలు సంతోషంగా చెబుతున్నారు. వారంతా ఏ విధంగా అభివృద్ధిపథం వైపు పయనిస్తున్నారో వారి మాటల్లోనే 'సాక్షి' మీ ముందుకు తెస్తోంది.

నా పసుపు, కుంకుమ కాపాడిన సీఎం



నా భర్త గంగాధర్ ఎల్‌ఐసీ ఏజెంట్‌గా పని చేస్తున్నారు. అనంతపురం జిల్లా గార్లదిన్నె మండలం ముకుందాపురంలో మాకున్న తొమ్మిది ఎకరాల్లో చీనీ సాగు చేస్తున్నాం. పెద్ద కుమారుడు విజయవాడలోని ప్రైవేట్ కళాశాలలో, చిన్నకుమారుడు అనంతపురంలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో చదువుకుంటున్నారు. 2021లో కరోనా సమయంలో నా భర్తకు ఊపిరితిత్తుల సమస్య వచ్చింది. అప్పుడు చేతిలో చిల్లిగవ్వ లేదు. శ్వాస తీసుకునేందుకూ తీవ్ర ఇబ్బంది పడ్డారు. ఆ సమయంలో ఎక్కడికి పోవాలో కూడా నాకు దిక్కు తోచలేదు. నా భర్త ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్న వలంటీర్ సూచన మేరకు ఆరోగ్యశ్రీ కార్డు తీసుకెళ్లి అనంతపురంలోని ఓ కార్పొరేట్ ఆస్పత్రిలో చేర్పించా. నయా పైసా ఖర్చు లేకుండా వెంటనే ఆస్పత్రిలో అడ్మిట్ చేసుకుని రూ.4 లక్షలకు పైగా ఖర్చయ్యే చికిత్సను ఉచితంగా అందించారు. దీంతో నా భర్త ప్రాణాలతో బయటపడ్డారు. నా కుమారుడికి అమ్మ ఒడి పథకం ద్వారా ఏటా రూ.15 వేలు చొప్పున, రైతు భరోసా పథకం ద్వారా ఏటా రూ.13,500 చొప్పున, పంటల బీమా పథకం ద్వారా రూ.72,000 వంతున రెండు సార్లు, రూ.58,000 వంతున ఇంకో రెండుసార్లు అందింది. నేను మహిళా సంఘంలో సభ్యురాలిని కావడంతో సున్నా వడ్డీ పథకం ద్వారా ఏటా రూ.3 వేలు చొప్పున మూడు పర్యాయాలు వచ్చింది. గతంలో ఏ ప్రభుత్వమూ ఇంతలా ఆదుకున్న దాఖలాల్లేవు. నా పసుపు కుంకుమ కాపాడిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఎప్పుడూ రుణపడే ఉంటాను.

– ఆదిలక్ష్మి, ముకుందాపురం
(జి.ఆదినారాయణ, విలేకరి, గార్లదిన్నె)

ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు



మాది సాధారణ కుటుంబం. విజయనగరం జిల్లా తెర్లాంలో ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నా. కిరాయి అన్ని రోజులూ ఒకేలా ఉండేది కాదు. బేరం లేకపోతే ఆ రోజు రాబడి సున్నా. అప్పుడప్పుడు మరమ్మతు చేయించాల్సి వస్తే అప్పు చేయక తప్పేది కాదు. మా గురించి ఏ ప్రభుత్వం ఆలోచించలేదు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మాత్రం ఆటో డ్రైవర్లకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. ఏటా రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నారు. ఇప్పటి వరకు నాకు రూ.40 వేలు వచ్చాయి. అమ్మఒడి పథకం ద్వారా నా కుమార్తెకు ఏటా రూ.15 వేలు చొప్పున నాలుగేళ్లకు రూ.60 వేలు నా భార్య ఖాతాలో జమయింది. వైఎస్సార్ ఆసరా కింద ఏడాదికి రూ.2,800, సున్నా వడ్డీ ద్వారా ఏటా రూ.840 చొప్పున వచ్చింది. ప్రజా సంకల్ప యాత్రలో ఆటో డ్రైవర్లకు ఇచ్చిన మాటను అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేసిన సీఎం వైఎస్ జగన్ మేలును ఎన్నటికీ మరచిపోలేం.

– రాజాన రమేష్, తెర్లాం
(గొండేల సూర్యనారాయణ, విలేకరి, తెర్లాం)

జగనన్న దయతో డయాలసిస్



మాది పేద కుటుంబం. పశ్చిమగోదావరి జిల్లా కాళ్ల మండలం ప్రాతాళ్లమెరకకు చెందిన నా భర్త రేవు నాగరాజు 2013 మార్చి నుంచి కిడ్నీ సమస్యతో బాధ పడుతున్నారు. అప్పటి ప్రభుత్వం ఎటువంటి వైద్య సాయం అందించలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక కిడ్నీ వ్యాధితో బాధ పడుతున్న బాధితులకు ఆరోగ్యశ్రీ ద్వారా డయాలసిస్ చేయించడంతోపాటు నెలకు రూ.10 వేలు పింఛన్ సాయం ప్రకటించారు. ఫలితంగా మా పేద బతుకులకు ధైర్యం వచ్చింది. నాలుగేళ్లుగా ఆరోగ్యశ్రీ ద్వారా వారానికి రెండుసార్లు ఉచితంగా డయాలసిస్ చేయించుకుంటున్నాం. తోడబుట్టిన అన్నయ్యలా జగనన్న పింఛన్ సాయం అందిస్తున్నారు. పింఛన్‌గా ఇప్పటి వరకు రూ.4,80,000 మేర లబ్ధి పొందాం. మా పాప చదువుకు అమ్మ ఒడి ద్వారా ఏటా రూ.15 వేలు వంతున సాయం అందుతోంది. జగనన్న రుణం తీర్చుకోలేం. ఆయనే నిరంతరం ముఖ్యమంత్రిగా ఉండాలి.

– రేవు ఎస్తేరు రాణి, ప్రాతాళ్లమెరక
(కడితల శివాజీ, విలేకరి, కాళ్ల)

చదువులకు ఊతమిచ్చేలా కల్యాణమస్తు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ స్పష్టీకరణ

సాక్షి, అమరావతి : పిల్లలను చదివించే దిశగా ఒక అడుగు ముందుకేసి వైఎస్సార్ కల్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. అక్టోబర్–డిసెంబర్ 2023 (త్రైమాసికం)లో వివాహం చేసుకున్న అర్హులైన 10,132 జంటలకు ఈ పథకం కింద రూ.78.53 కోట్ల ఆర్థిక సాయాన్ని మంగళవారం ఆయన తన క్యాంపు కార్యాలయం నుంచి కంప్యూటర్‌లో బటన్ నొక్కి వధువుల తల్లుల ఖాతాల్లో జమ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చదువులను ప్రోత్సహిస్తూ వధూవరులు ఇద్దరూ పదో తరగతి పాసై ఉండాలన్న నిబంధన పెట్టామన్నారు. దీనివల్ల ఈ పథకానికి అర్హత రావాలంటే, ఆ మేరకు కనీస విద్యార్హత ఉండాలి కాబట్టి పిల్లలను చదివించడానికి ప్రోత్సాహం అందించేదిగా ఉంటుందన్నారు. వధువుకు 18 సంవత్సరాలు, వరుడికి 21 సంవత్సరాలు వయస్సు ఉండాలన్న నిబంధన వల్ల పది పాసయ్యాక ఇంటర్‌లో చేరుస్తారని చెప్పారు. పైగా ఇంటర్ చదువుకు అమ్మఒడి పథకం కింద సాయం అందిస్తున్నాం కాబట్టి ఆ దిశగా అడుగులు వేస్తారన్నారు. ఇంటర్ పూర్తైన తర్వాత విద్యా దీవెన పథకం కింద పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో పాటు పిల్లల బోర్డింగ్ అండ్ లాడ్జింగ్ ఖర్చుల కోసం వసతి దీవెన పథకం ఉన్నందున డిగ్రీ, ఇంజనీరింగ్ వంటి కోర్సుల వైపు అడుగులు పడతాయని అన్నారు. ఇలా చదువులను ప్రోత్సహిస్తూ.. ప్రతి అమ్మాయి, అబ్బాయి గ్రాడ్యుయేట్స్ అయ్యేలా అడుగులు వేయించగలుగుతున్నామని తెలిపారు. 'కుటుంబంలో తల్లి చదువుకుని ఉంటే ఆ తర్వాత తరంలో వచ్చే పిల్లలు ఆటోమేటిక్‌గా చదువుల బాట పడతారు. భవిష్యత్‌లో కుటుంబాల తల రాతలు మారాలన్నా, మంచి జీతాలతో ఉద్యోగాలు రావాలన్నా, మంచి చదువులు మన చేతుల్లో ఉండాలి. అప్పుడు మన తల రాతలు మార్చే ఆస్తి మన చేతుల్లోనే ఉంటుంద'ని చెప్పారు. అందువల్ల గత ప్రభుత్వ హయాంలో వలె ఈ పథకాన్ని ఏదో నామ్‌కే వాస్తేగా ఇచ్చామంటే ఇచ్చామన్నట్టు కాకుండా.. ప్రతి త్రైమాసికం (క్వార్టర్) పూర్తయిన వెంటనే ఒక నెల వెరిఫికేషన్ చేసి తర్వాత ఇస్తున్నామని తెలిపారు. సీఎం జగన్ ఇంకా ఏమన్నారంటే..



బటన్ నొక్కి నిధులు విడుదల చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుకు వెళ్లాల్సిన అవసరం లేదు

- సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో సర్టిఫికెట్ తీసుకోవాల్సిన అవసరం లేకుండా నేరుగా మన గ్రామ సచివాలయాల్లోనే మ్యారేజ్ సర్టిఫికెట్ ఇచ్చేలా మార్పు చేశాం. ప్రతి ఒక్కరికీ ఈ పథకాన్ని అందుబాటులోకి తీసుకొస్తూ ఏ ఒక్కరూ మిస్ కాకుండా దీన్ని ఉపయోగించుకునే అవకాశం కల్పించేలా సచివాలయం వరకూ తీసుకుపోయాం.
- గతం కంటే పెంచి మరీ సాయమందిస్తున్నాం. గతంలో ఎస్సీలకు రూ.40 వేలకే పరిమితమైన పథకాన్ని రూ.లక్ష వరకు తీసుకుపోయాం. అదే కులాంతర వివాహం అయితే రూ.1.20 లక్షల వరకూ పెంచాం. ఎస్టీలకు గతంలో రూ.50 మాత్రమే ఉంటే దాన్ని కూడా రూ.లక్ష వరకు పెంచడంతోపాటు, కులాంతర వివాహానికి రూ.1.20 లక్షలకు పెంచాం. గతంలో బీసీలకు కేవలం రూ.35 వేలు మాత్రమే ఇస్తున్న పరిస్థితుల నుంచి రూ.50 వేలకు, కులాంతర వివాహం అయితే రూ.75 వేలకు తీసుకుపోయాం. దివ్యాంగులకు అయితే ఏకంగా రూ.1.50 లక్షల వరకు తీసుకెళ్లాం. వాళ్ల కుటుంబాల్లో తల్లిదండ్రులు ఏ ఒక్కరూ అప్పులపాలయ్యే పరిస్థితి రాకూడదని సబ్‌స్టాన్షియల్ అమౌంట్ పెంచి ఇస్తున్నాం. చదువులను ప్రోత్సహించే దిశగా తల్లిదండ్రులను అడుగులు వేయిస్తాయన్న నమ్మకంతో ఈ కార్యక్రమాన్ని చేస్తున్నాం.
- గతంలో అరకొరగా ఇచ్చిన పరిస్థితులు. దాదాపు 17,709 మంది పిల్లలకు అరకొరగా ఇచ్చేవి కూడా దాదాపు రూ.70 కోట్లు ఎగరగొట్టిన పరిస్థితి గతంలో ఉంది. ఏ ఒక్కరూ మిస్ కాకూడదని అనే ఉద్దేశంతో త్రైమాసికం (క్వార్టర్) అయిన వెంటనే ఇచ్చే కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నాం. ఇది ఐదో విడత కార్యక్రమం. అక్టోబరు, నవంబరు, డిసెంబర్ త్రైమాసికానికి సంబంధించి దాదాపు రూ.78 కోట్లు ఇస్తున్నాం. ఈ ఒక్క పథకానికే ఇప్పటి వరకు 56,194 జంటలకు, వారి కుటుంబాలకు మంచి చేస్తూ రూ.427 కోట్లు ఇచ్చాం.

ఇది అందరూ గర్వించే పథకం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహోన్నత ఆశయంతో అమలు చేస్తున్న వైఎస్సార్ కల్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా పథకం మన రాష్ట్రంలో గొప్ప ప్రెస్టీజియస్ పథకం. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, వికలాంగులు, భవన నిర్మాణ కార్మికుల కుటుంబాల్లో గౌరవప్రదంగా వివాహం నిర్వహించేలా భరోసా కల్పిస్తున్న పథకం. ఇంత గొప్ప కార్యక్రమం జరుగుతుంటే ప్రతిపక్షాలు ఇప్పటికీ కళ్లు లేని కబోదుల్లా నోరు పారేసుకుంటున్నాయి. ఇటీవల బెంగళూరులో సామాజిక న్యాయంపై దక్షిణాది రాష్ట్రాల సమావేశం జరిగింది. కళ్యాణమస్తు పథకం చదువుకు లింక్ అవడంతో అన్ని రాష్ట్రాల కన్నా మిన్నగా ఏపీలో నిరక్షరాస్యత తగ్గడం పట్ల ప్రతి ఒక్కరూ మన రాష్ట్రాన్ని ప్రశంసించారు.

– మేరుగు నాగార్జున, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి

పేదల పెళ్లికి పెద్ద భరోసా



అన్నా.. మాది నిరుపేద కుటుంబం. మాలాంటి నిరుపేద కుటుంబంలో ఆడపిల్లకు ఇంత సాయం చేస్తున్నందుకు మీకు చాలా ధన్యవాదాలు. నేను ఎస్సీని. పెళ్లి చేయడం అంటే ఈ రోజుల్లో ఎంత భారమో అందరికీ తెలిసిందే. కానీ మీరు నేనున్నా మీకు తోడుగా అంటూ పేదల పెళ్లికి పెద్ద భరోసా ఇస్తున్నారు. అందరూ చదువుకునేలా చేస్తున్నారు. బాల్య వివాహాలు తగ్గుతున్నాయి. అక్షరాస్యత పెరుగుతోంది. మీ వల్లే ఇదంతా సాధ్యమవుతోంది. మీరు ప్రవేశపెట్టిన అనేక పథకాల వల్ల మేం చాలా లబ్ధి పొందాం. నాడు–నేడుతో స్కూళ్ల స్వరూపమే మారిపోయింది. పేదలకు ఇంగ్లిష్ చదువులు వచ్చాయి. పేదల ఇళ్లలో వెలుగులు నింపుతున్నారు. థ్యాంక్యూ జగన్ అన్నా.

– భార్గవి, ఏర్పేడు మండలం, తిరుపతి జిల్లా

తిరుపతి ఐఐటీ, ఐసర్, విశాఖ ఐఐఎం ప్రారంభం

▶ మొదటి పేజీ తరువాయి

తిరుపతి ఐఐటీలో మంగళవారం జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్ విధానంలో పాల్గొని తిరుపతి ఐఐటీ బృందాన్ని అభినందించారు. కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద పిల్లలకు నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో దేశంలో మరే రాష్ట్రంలో లేనివిధంగా విద్యావిధానంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారన్నారు. కార్యక్రమంలో ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ సత్యనారాయణ, తిరుపతి ఎంపీ గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు. అలాగే ఏర్పేడు మండలం జంగాలపల్లి సమీపంలో శాశ్వత క్యాంపస్ ఏర్పాటుచేసుకున్న ఐసర్ (ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్)ను ప్రధాని మోదీ జమ్ము నుంచి వర్చువల్‌గా ప్రారంభించి జాతికి అంకితమిచ్చారు. ఐసర్ డైరెక్టర్ శంతాను భట్టాచార్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీ డాక్టర్ గురుమూర్తి, జిల్లా కలెక్టర్ లక్ష్మీశా పాల్గొన్నారు.

ఎడ్యుకేషనల్ హబ్‌గా తిరుపతి

తిరుపతి ఎడ్యుకేషనల్ హబ్‌గా పేరుపొందిందని ఎంపీ ఎం.గురుమూర్తి హర్షం వ్యక్తం చేశారు. పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో మంగళవారం వర్చువల్ విధానం ద్వారా ప్రధాని ప్రారంభించిన పీఎం–యూఎస్‌హెచ్‌ఏ నిధుల మంజూరు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ తిరుపతిలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో మంచి ఎడ్యుకేషనల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్ అవుతోందని తెలిపారు. ఇందులో భాగంగా ప్రధాన మంత్రి ఉచ్చతర్ శిక్షా అభియాన్ పథకం కింద కేంద్రం మహిళా వర్సిటీ అభివృద్ధికి రూ.100 కోట్లు కేటాయించడం శుభపరిణామమన్నారు. అలాగే, కర్నూలులోని జగన్నాథగట్టు మీద ఉన్న ట్రిపుల్ ఐటీడీఎం (ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, డిజైన్, మాన్యుఫాక్చరింగ్)ను ప్రధాని జాతికి అంకితం చేశారు. జమ్మూ కశ్మీర్ నుంచి పీఎం వర్చువల్‌గా పాల్గొన్నారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.



క్యాంప్ కార్యాలయం నుంచి ప్రారంభోత్సవాల్లో పాల్గొన్న సీఎం జగన్

ఐఐఎం శాశ్వత క్యాంపస్ ప్రారంభం

విశాఖ జిల్లా ఆనందపురం మండలం గంభీరం వద్ద 241 ఎకరాల్లో ఏర్పాటు చేసిన ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం) శాశ్వత భవనాలను ప్రధాని మోదీ మంగళవారం వర్చువల్ పద్ధతిలో జమ్మూ నుంచి ప్రారంభించి జాతికి అంకితమిచ్చారు. గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమంలో వర్చువల్‌గా పాల్గొన్నారు. 2016లో ఐఐఎం ప్రారంభం కాగా.. అప్పటి నుంచి ఏయూలో తాత్కాలిక క్యాంపస్‌లో నిర్వహిస్తూ వస్తున్నారు. కాగా మొదట దశ భవనాలు అందుబాటులోకి రావడంతో విద్యాలయాన్ని శాశ్వత ప్రాంగణానికి మార్చారు. కార్యక్రమంలో ఎంపీ ఎంవీవీ సత్యన్నారాయణ, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, జిల్లా కలెక్టర్ మల్లికార్జున, ఐఐఎం డైరెక్టర్ ప్రొఫెసర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

కేంద్రీయ విద్యాలయం ప్రారంభించిన ప్రధాని

ప్రకాశం జిల్లా పెద్దారవీడు మండలంలోని రాజంపల్లి గ్రామం సమీపంలో కేంద్రీయ విద్యాలయాన్ని ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హైదరాబాద్ అసిస్టెంట్ కమిషనర్ ప్రభుదాసు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ స్నేహలత మాట్లాడుతూ మాజీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి సహకారంతో 8 ఏళ్ల కిందట తాత్కాలిక భవనాల్లో కేంద్రీయ విద్యాలయాన్ని ప్రారంభించారన్నారు. కేంద్రం రూ. 25 కోట్లు కేటాయించడంతో ప్రస్తుతం 16 ఎకరాల విస్తీర్ణంలో నూతనంగా కేంద్రీయ విద్యాలయ భవనాల సముదాయాన్ని నిర్మించినట్లు చెప్పారు.

మీ 'మద్దతు' బాధంతా బాబు కోసమేగా!

రూ.3 వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధి మీ పచ్చ కళ్లకు కనిపించదా?

- సీఎం యాప్ ద్వారా ఎప్పటికప్పుడు మార్కెట్ ధరల పర్యవేక్షణ
- కనీస మద్దతు ధర దక్కని ఉత్పత్తులు ప్రభుత్వమే కొనుగోలు
- రూ.65 వేల కోట్లు చెల్లించి 3.38 కోట్ల టన్నుల ధాన్యం సేకరణ
- రూ.7,757.87 కోట్లతో ఇతర పంట ఉత్పత్తుల కొనుగోలు
- గన్నీ బ్యాగులు, కూలీలు, రవాణా ఖర్చు కూడా ప్రభుత్వానిదే
- ఎమ్మెస్పీకి మించి మార్కెట్‌లో రైతులకు మంచి ధరలు
- ఇన్ని చేస్తున్నా ప్రభుత్వంపై రామోజీ విషం



సాక్షి,అమరావతి: 'నవ్విపోదురు గాక నాకేటి సిగ్గు' అనే చందంగా పచ్చ పత్రికాధినేత రామోజీరావు తీరు ఉంది. వ్యవసాయం దండగ అని చంద్రబాబు తీసిపారేస్తే.. వ్యవసాయం పండుగ అని వైఎస్ జగన్ ప్రభుత్వం నిరూపించింది. అధికారంలోకి వచ్చింది మొదలు గ్రామాల్లోనే రైతు భరోసా కేంద్రాలు, అక్కడే విత్తు నుంచి విక్రయం వరకు అన్ని ఏర్పాట్లు, కనీస మద్దతు ధర దక్కని పంటలను ప్రభుత్వమే కొనుగోలు, మార్కెట్‌లో ధరలు పడిపోయిన ప్రతిసారి రైతులను ఆదుకోవడానికి ప్రభుత్వ జోక్యం, ఏకంగా రూ.3 వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధి, ఆరు పంటలకు కనీస మద్దతు ధర, సీఎం యాప్ ద్వారా ధరల పర్యవేక్షణ, ధాన్యాన్ని కొనుగోలు చేసినప్పుడు గోనె సంచులతోపాటు కూలీల భారం, రవాణా ఖర్చులను కూడా ప్రభుత్వమే పెట్టుకుంటున్నా.. ఇంకా రైతు సంక్షేమమే ధ్యేయంగా ఎన్నో చేస్తున్నా రామోజీ విషం జిమ్ముతున్నారంటే ఏం అనుకోవాలి? ఈ ఏడుపుకు, కడుపుమంటకు అసలు మందు ఉందా? బుధవారం తన పచ్చ పత్రిక 'ఈనాడు'లో 'కనీస మద్దతు ధర.. గరిష్ఠ మోసం దొర' అంటూ ఒక తప్పుడు కథనాన్ని అచ్చేశారు. దీనికి సంబంధించి అసలు వాస్తవాలివిగో..

ఆరోపణ: ధరల స్థిరీకరణ నిధి ఒక దగా

వాస్తవం: మార్కెట్‌లో మద్దతు ధర దక్కని పంట ఉత్పత్తులు కొనుగోలు చేసేందుకు రూ.3 వేల కోట్లతో ప్రభుత్వం ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేసింది. వాస్తవానికి ఈ 57 నెలల్లో 1–2 సీజన్‌లలో 2–3 పంట ఉత్పత్తులకు మినహా మిగిలిన పంటల మార్కెట్ ధరలు మద్దతు ధరకు మించి పలికాయి. ఈ ఏడాది కూడా మద్దతు ధరలు ప్రకటించిన పంట ఉత్పత్తులతో సహా పలు రకాల వ్యవసాయ, ఉద్యాన పంటల ధరలు ఎమ్మెస్పీకి మించి పలుకుతున్న మాట వాస్తవం కాదా? అలాంటప్పుడు మార్కెట్‌లో జోక్యం చేసుకోవల్సిన అవసరం ప్రభుత్వానికి ఏముంటుందో 'ఈనాడు'కే తెలియాలి.

ఆరోపణ: సీఎం యాప్ సిగ్గు..సిగ్గు

వాస్తవం: దేశంలోనే తొలిసారిగా గ్రామాల వారీగా మార్కెట్‌లో ధరలను సేకరించి ఎప్పటికప్పుడు వాటి హెచ్చుతగ్గులను సమీక్షించేందుకు సీఎం యాప్‌ను తీసుకొచ్చారు. ఈ యాప్ ద్వారా ఈ 57 నెలల్లో ధరలు పతనమైన ప్రతిసారీ ప్రభుత్వమే మార్కెట్‌లో జోక్యం చేసుకొని వ్యాపారులతో పోటీపడి రైతులకు కనీసమద్దతు ధర దక్కేలా కృషి చేస్తోంది. టీడీపీ ప్రభుత్వం ఐదేళ్లలో 3.74 లక్షల మంది రైతుల నుంచి రూ.3,322 కోట్ల విలువైన 9 లక్షల టన్నుల పంటల ఉత్పత్తులు కొనుగోలు చేస్తే.. ఈ 57 నెలల్లో 6.18 లక్షల మంది రైతుల నుంచి రూ.7,757.87 కోట్ల విలువైన 21.61 లక్షల టన్నుల ఉత్పత్తులను జగన్ ప్రభుత్వం కొనుగోలు చేసింది. అంటే... రెట్టింపు కన్నా అధికం. అలాగే చంద్రబాబు ఐదేళ్లలో 17.94 లక్షల మంది రైతుల నుంచి రూ.40,237 కోట్ల విలువైన 2.65 కోట్ల టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు చేస్తే.. ఈ 57 నెలల్లో వైఎస్ జగన్ ప్రభుత్వం 37.34 లక్షల మంది రైతుల నుంచి 3.38 కోట్ల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి రూ.65 వేల కోట్లు చెల్లించింది. బాబు హయాంలో ధాన్యం, ఇతర పంటల కొనుగోలుకు రూ.43,559 కోట్లు మాత్రమే వెచ్చిస్తే, వైఎస్ జగన్ ప్రభుత్వం ఈ 57 నెలల్లో ఏకంగా రూ.72,445 కోట్లు ఖర్చుచేసింది అంటే.. సగటున చంద్రబాబు హయాంలో ఏడాదికి రూ.8,711 కోట్లు వెచ్చిస్తే, జగన్ ప్రభుత్వం ఏటా సగటున రూ.16,099 కోట్లు వెచ్చించింది.



2023-24 సీజన్‌లో ప్రస్తుతం ఎమ్మెస్పీకి మించి పలుకుతున్న ధరల వివరాలు..

పంట	ఎమ్మెస్పీ	ప్రస్తుతం మార్కెట్‌లో ధరలు (క్వింటాకు రూ.ల్లో)
కందులు	7,000	10,000-10,600
మినుము	6,950	9,000-9,500
పెసలు	8,558	9,000-9,300
మొక్కజొన్న	2,090	2,350-2,450
శనగ	5,440	5,400-5,650
జొన్న	3,180	3,200-3,400
సజ్జ	2,500	2,800-3,650
పసుపు	6,850	10,500(మోడల్)-11,975(గరిష్టం)
అరటి	800	5,200(మోడల్)-5,500(గరిష్టం)
బత్తాయి	1,400	6,300(మోడల్)-6,400(గరిష్టం)
మిరప	7000	23,000(మోడల్)-29,000(గరిష్టం)
ఉల్లి	770	3,219(మోడల్)-5,598(గరిష్టం)

ఆరోపణ: గిట్టుబాటు ధర కల్పనలో చేతులెత్తేశారు

వాస్తవం: గిట్టుబాటు ధరలు పడిపోతే చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రూ.139.90 కోట్ల విలువైన పొగాకుతో పాటు రూ.1,789 కోట్ల విలువైన పత్తిని సైతం రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేసింది. ఇలా ప్రభుత్వ భరోసా వల్లే మార్కెట్లో ధరలు స్థిరపడ్డాయి. అలాగే 2021–22లో ఉల్లి ధరలు పతనమైనప్పుడు మద్దతు ధరకు, 2022–23లో ధరలు పెరిగినప్పుడు మార్కెట్ ధరకు రైతుల నుంచి కొనుగోలు చేసి ఇటు రైతులకు, అటు వినియోగదారులకు ప్రభుత్వం అండగా నిలిచింది. ఇలా రూ.64 కోట్ల విలువైన 9,025 టన్నుల ఉల్లిని కొనుగోలు చేసి ప్రజలకు సబ్సిడీ ధరలకు అందించింది. 2022–23లో రూ.22.94 కోట్ల విలువైన 2,541 టన్నులు, 2023–24లో రూ.43.46 కోట్ల విలువైన 5,517 టన్నుల పసుపును కనీస మద్దతు ధరకు కొనుగోలు చేసి రైతులకు అండగా నిలిచింది. మిరప ఎమ్మెస్పీ రూ.7వేలు కాగా మూడేళ్లుగా మార్కెట్‌లో క్వింటా రూ.15వేల నుంచి రూ.30వేలకు పైగా ధరలు పలుకుతున్నాయి. నాలుగేళ్లుగా చిరుధాన్యాల మార్కెట్ ధరలు మద్దతు ధర కంటే ఎక్కువగానే ఉన్నాయి. ప్రభుత్వం తీసుకున్న పలు చర్యల ఫలితంగానే ప్రస్తుత ఎమ్మెస్పీ ధరల కంటే మిరప, పత్తి, పసుపు, వేరుశనగ, మినుము, మొక్కజొన్న పంటలకు మార్కెట్‌లో రైతులకు మంచి ధరలు లభిస్తున్నాయి.

జీఎల్‌టీ ఖర్చులను కూడా భరిస్తూ..

రైతుల నుంచి పంట ఉత్పత్తులను కొనుగోలు చేయడమే కాకుండా జీఎల్‌టీ (గన్నీ బ్యాగ్‌లు, కూలీలు, రవాణా)ఖర్చులను కూడా ప్రభుత్వమే భరిస్తోంది. ధాన్యం కొనుగోలు సందర్భంలో టన్నుకు రూ.2,523 (గోనె సంచులకు రూ.1,750, కూలీలకు రూ.220, రవాణా చార్జీలకు రూ.468తో పాటు ఒకసారి వాడిన గోనె సంచులకు రూ.85), ఇతర పంట ఉత్పత్తుల సేకరణ సందర్భంలో క్వింటాకు రూ.418 చొప్పున భరిస్తోంది.

ఆరోపణ: వ్యవసాయ ఖర్చులు పెరిగాయి

వాస్తవం: సహజంగా మద్దతు ధరలు ప్రకటించేది కేంద్ర ప్రభుత్వమే. కేంద్రం మద్దతు ధరలు ప్రకటించని పంటలు వేసే రైతులు నష్టపోకూడదని రాష్ట్ర ప్రభుత్వం దేశంలో మరెక్కడా లేని విధంగా సొంతంగా వాటికి మద్దతు ధరలను ప్రకటించింది. మద్దతు ధరకు మించి పలికితే మార్కెట్లోనే రైతులు విక్రయించుకుంటారు. మార్కెట్‌లో ధర లేనప్పుడు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రైతుకు బాసటగా నిలుస్తోంది. రైతులకు పెట్టుబడి పెరిగిందని వాదిస్తున్న రామోజీ... అదే సమయంలో రైతుకు ఏటా రూ.13,500 చొప్పున ఇస్తున్న రైతు భరోసా సాయాన్ని మాటమాత్రం ప్రస్తావించలేదు. ఈ 57 నెలల్లో ప్రతి రైతుకు రూ.65,500 చొప్పున 53.53 లక్షల మందికి రూ.33,209.81 కోట్ల పెట్టుబడి సాయాన్ని ప్రభుత్వం అందించినా రామోజీ పచ్చ కళ్లకు కనిపించలేదు.

క్లుప్తంగా...

పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్లకు 23% జీతం పెంపు

సాక్షి, అమరావతి: రాష్ట్ర సమగ్రశిక్ష ద్వారా వివిధ ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో ఆర్ట్, వర్క్, హెల్త్, ఫిజికల్ ఎడ్యుకేషన్, నేత, సంగీతం, నృత్యం విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్ల వేతనాలను 23 శాతం పెంచుతూ సమగ్రశిక్ష అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. కొంతకాలంగా తమ వేతనాల పెంపు కోసం చేస్తున్న ప్రయత్నాన్ని అర్థం చేసుకుని ఆశలు నెరవేర్చిన సీఎం వైఎస్ జగన్‌కు ఇన్‌స్ట్రక్టర్లు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎం.వి. రామచంద్రారెడ్డితో కలిసి వారు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.

ఎమ్మెల్యే కాటసానిపై ఆరోపణలు నిరూపించాలి

'ఈనాడు'వద్ద వైఎస్సార్‌సీపీ శ్రేణుల నిరసన

కల్లూరు: పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డిపై 'ఈనాడు'లో ప్రచురించిన ఆరోపణలు నిరూపించాలని ఆయన అనుచరులు పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేశారు. మంగళవారం వారు ఈనాడు కార్యాలయానికి వెళ్లి ఆరోపణలపై ఆధారాలు చూపించాలని అడిగారు. ఈ సందర్భంగా ఈనాడు కార్యాలయ సిబ్బంది తాళాలు వేసుకుని పరారయ్యారు. రోడ్డుపై మహిళలు, నాయకులు నిరసన వ్యక్తం చేస్తూ ప్రతులను దహనం చేశారు. కార్పొరేటర్ లక్ష్మీకాంతరెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే రాంభూపాల్‌రెడ్డి ప్రజల మనిషి అని, నియోజకవర్గంలో ఎంతో అభివృద్ధి చేశారన్నారు. ఈనాడు రామోజీ తప్పుడు రాతలు మానుకోకపోతే తగిన బుద్ధి చెబుతామన్నారు. కార్పొరేటర్ శ్వేతారెడ్డి మాట్లాడుతూ రాంభూపాల్‌రెడ్డికి ప్రజల్లో ఆదరణను జీర్ణించుకోలేక పచ్చ పత్రికలు ఆరోపణలు చేస్తున్నాయన్నారు. ఆరోపణలు నిరూపిస్తే సంబంధిత ఆస్తులు వారికే రాసిస్తానని గతంలోనే ఎమ్మెల్యే సవాల్ విసిరారన్నారు. అభివృద్ధిని జీర్ణించుకోలేకే పచ్చ పత్రికలు తప్పుడు రాతలకు తెగబడ్డాయని డీఏబీ చైర్మన్ మహేశ్వరరెడ్డి అన్నారు.

నూజివీడు టీడీపీ ఇన్‌చార్జిగా పార్థసారథి

పార్టీలో చేరకుండానే నియమించిన చంద్రబాబు

సాక్షి, అమరావతి: ఏలూరు జిల్లా నూజివీడు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జిగా కే పార్థసారథి నియమితులయ్యారు. ఆయన్ను ఇన్‌చార్జిగా నియమిస్తున్నట్లు మంగళవారం పార్టీ ప్రకటన విడుదల చేసింది. ఇప్పటివరకు నూజివీడు ఇన్‌చార్జిగా ఉన్న ముద్దరబోయిన వెంకటేశ్వరరావు.. తన స్థానంలో పెనమలూరు ఎమ్మెల్యే కేపీ సారథికి సీటు ఇవ్వడాన్ని తీవ్రంగా వ్యతిరేకించడంతోపాటు పార్టీని వీడుతున్నారు. దీంతో వెంటనే ఆయన స్థానంలో సారథిని ఇన్‌చార్జిగా ప్రకటించారు. కానీ ఇంత వరకు సారథి అధికారికంగా టీడీపీలో చేరలేదు. అయినా ఆయన్ను ఇన్‌చార్జిగా ప్రకటించడం పార్టీ వర్గాల్లో చర్చనీయాంశమవుతున్నది.

బీజేపీతో జతకట్టే టీడీపీ, జనసేనను ఓడిస్తాం

సాక్షి, అమరావతి: మతోన్మాద బీజేపీకి మద్దతునిచ్చే టీడీపీ, జనసేన కూటమిని ఓడిస్తామని సీపీఎం, సీపీఐ ఉమ్మడి సదస్సు తీర్మానం చేసింది. విజయవాడలోని ఎంబీ భవన్‌లో సీపీఎం, సీపీఐ రాష్ట్ర కార్యదర్శులు వి.శ్రీనివాసరావు, కె.రామకృష్ణ అధ్యక్షతన మంగళవారం రాష్ట్ర సదస్సు నిర్వహించారు. 'రాష్ట్రానికి ద్రోహం చేసిన మతోన్మాద బీజేపీ.. టీడీపీ, జనసేన కూటమి తోడ్పాటుతో ప్రజాభీష్టానికి వ్యతిరేకంగా రాష్ట్రంలో తిష్టవేయడానికి దుష్టపన్నాగం పన్నుతోంది. రాష్ట్రంలో బీజేపీని ఓడించడమంటే దానికి కొమ్ముకాస్తున్న టీడీపీ-జనసేన కూటమి, నిరంకుశ వైఎస్సార్‌సీపీని ఓడించడమే లక్ష్యం' అని రాజకీయ తీర్మానం చేసింది.

దమ్ముంటే బీజేపీని మడతెట్టండి..

'మీలో మీరు మడతపెట్టుకోవడం కాదని మీకు దమ్ముంటే రాష్ట్రానికి ద్రోహం చేసిన బీజేపీని మడతపెట్టాలి' అని ప్రధాన పక్షాలకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు సవాల్ విసిరారు. సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ, కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యుడు గిడుగు రుద్రరాజు పాల్గొన్నారు.

యరపతినేనికి బాబు ఝలక్!

సాక్షి, నరసరావుపేట: తెలుగుదేశం మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావుకు చంద్రబాబు ఝలక్ ఇచ్చినట్టు ప్రచారం జరుగుతోంది.. గురజాల నియోజకవర్గంలో 1994 నుంచి యరపతినేని ఆరుసార్లు టీడీపీ తరఫున పోటీ చేశారు. మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. ఇటీవల ఆయన గురజాల నుంచి ఏడోసారి పోటీ చేస్తున్నానంటూ పదేపదే చెబుతున్నారు. అయితే యరపతినేనికి బాబు కచ్చితంగా హ్యాండిస్తారనే ప్రచారం పార్టీ శ్రేణుల్లోనే వినిపిస్తోంది. 2019లో కాసు మహేశ్‌రెడ్డి చేతుల్లో ఓడిన తర్వాత యరపతినేని గుంటూరుకు మకాం మార్చారు. మూడేళ్లపాటు నియోజకవర్గం వైపు కన్నెత్తి చూడలేదు. ఇక ఎన్నికలు ఏడాది ఉందనగా నియోజకవర్గంలో యరపతినేని హడావుడి మొదలైంది. ఈలోపు చారిటబుల్ ట్రస్టు ద్వారా కార్యక్రమాలు చేస్తున్న చింతలపూడి శ్రీనివాసరావును చినబాబు లోకేశ్ తెరపైకి తెచ్చారు. అయినా ఎలాగైనా సీటు తనకే వస్తుందని నమ్మకంగా ఉన్న యరపతినేనికి తాజాగా ఐవీఆర్ఎస్ ఫోన్ సర్వే షాకిచ్చిందట. ఈ సర్వేలో గురజాల నుంచి ఎవరు పోటీ చేస్తే బాగుంటుందంటూ యరపతినేని శ్రీనివాసరావు, చింతలపూడి శ్రీనివాసరావుతోపాటు జంగా కృష్ణమూర్తి పేరూ వినిపిస్తుండడం చర్చనీయాంశమైంది. చింతలపూడి శ్రీనివాసరావు గురజాల సీటు కోసం తీవ్రంగా యత్నిస్తున్నట్టు సమాచారం.

నిరుద్యోగంపై దగా కథ

జగన్ సర్కారుపై మరోసారి అక్కసు వెళ్లగక్కిన రామోజీ

- సీఎం జగన్ అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే కొత్తగా 1.25 లక్షల రెగ్యులర్ ఉద్యోగాలు సృష్టి, భర్తీ
- ఇప్పటి వరకు 2.21 లక్షల రెగ్యులర్ ఉద్యోగాలు భర్తీ
- స్వాతంత్య్రం వచ్చినప్పటి నుంచి 2019 వరకు ఉన్న ఉద్యోగాలు 3.97 లక్షలు
- ప్రస్తుతం ఉద్యోగాల సంఖ్య 6.38 లక్షలు
- ఇంత పెద్ద ఎత్తున నియామకాలు దేశ చరిత్రలోనే తొలిసారి
- ఈ ఒక్కటి చాలు రామోజీ రాతలు పచ్చి అబద్ధాలని చెప్పడానికి
- నిరుద్యోగులను వంచించిందే చంద్రబాబు
- జాబ్ రావాలంటే బాబు రావాలంటూ నిలువునా మోసం చేశారు
- ఉన్న రెగ్యులర్ ఉద్యోగాలను కూడా రద్దు చేశారు
- బాబు ఐదేళ్లలో ఇచ్చిన ఉద్యోగాలు 34 వేలు మాత్రమే
- చంద్రబాబు నిర్వాకంపై పల్లెత్తు మాట అనని రామోజీ
- కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులరైజేషన్‌పై మాట తప్పిన బాబు.. నెరవేర్చిన సీఎం జగన్

బాబు హయాంలో ఉద్యోగుల వివరాలు

- 2014-19 మధ్య బాబు హయాంలో ఉద్యోగాల భర్తీ 34,108
- బాబు దిగిపోయిన మే 2019 నాటికి మొత్తం ఉద్యోగుల సంఖ్య 3,97,128

2019 జూన్ నుంచి వైఎస్ జగన్ సర్కారులో ఉద్యోగుల వివరాలు

శాశ్వత ఉద్యోగుల సంఖ్య	కాంట్రాక్టు ఉద్యోగుల సంఖ్య	ఔట్ సోర్సింగ్, ఇతర ఉద్యోగుల సంఖ్య	మొత్తం ఉద్యోగాల సంఖ్య
2,21,003	43,923	3,73,161	6,38,087



సాక్షి, అమరావతి: బాబు వస్తేనే జాబు అంటూ నిరుద్యోగులను నిలువునా మోసం చేసిన వ్యక్తి చంద్రబాబు. నిరుద్యోగులకు ఇచ్చిన మాట ప్రకారం సీఎంగా బాధ్యతలు చేపట్టిన నాలుగు నెలల్లోనే 1.25 లక్షల గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగాలను కొత్తగా సృష్టించి మరీ భర్తీ చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్. ఇవే కాదు.. వైద్య రంగంతో సహా పలు రంగాల్లో వేలాది ఉద్యోగాలు ఇచ్చారు. బాబు దిగిపోయే 2019 మే నాటికి.. అంటే ఈ 75 ఏళ్లలో రాష్ట్రంలో ఉద్యోగాల సంఖ్య 3,97,128. ప్రస్తు తం రాష్ట్రంలో మొత్తం ఉద్యోగుల సంఖ్య 6,38,087. ఈ ఒక్కటి చాలు ఈ నాలుగున్నరేళ్లలో సీఎం వైఎస్ జగన్ ఏ విధంగా ఉద్యోగాలిచ్చి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించారో చెప్ప డానికి. 'దగా క్యాలెండర్' అంటూ సీఎం జగన్ సర్కారుపై రామోజీ కక్కిన అక్కసు పచ్చి అబద్ధమనడానికి. ఐదేళ్లలో ఏ రాష్ట్రంలోనూ ఏ ప్రభుత్వమూ ఇవ్వలేనన్ని ఉద్యోగాలు సీఎం వైఎస్ జగన్ ఇచ్చారని చెప్పడానికి. సీఎం జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్తగా 2.21 లక్షల ఉద్యోగాలను రెగ్యులర్ చేశారు. 43,923 కాంట్రాక్టు ఉద్యోగాలు ఇచ్చారు. 3.73 లక్షల ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలిచ్చారు. ఒక్క వైద్య ఆరోగ్య శాఖలోనే ఏకంగా 53,446 పోస్టులను వైఎస్.జగన్ సర్కారు భర్తీ చేసింది. అంతే కాదు.. వైద్య ఆరోగ్య శాఖలో ఎన్నడూ లేని విధంగా పోస్టులు ఖాళీ వెంటనే భర్తీ చేసేలా జగన్ సర్కారు ఉత్తర్వులు జారీ చేసింది. ప్రైవేటు రంగంలోనూ పరిశ్రమలను ప్రోత్సహిస్తూ జగన్ సర్కారు పెద్ద ఎత్తున ఉద్యోగాలు కల్పిస్తోంది. ఇవన్నీ కళ్ల ముందు కనిపించే నిజాలు. అయినా, ఈనాడు రామోజీ మాత్రం కళ్లుండీ చూడలేని కబోదిలా జగన్ సర్కారుపై అక్కసు వెళ్లగక్కుతున్నారు. వాస్తవానికి రాష్ట్రంలో నిరుద్యోగులను నిలువునా మోసం చేసింది చంద్రబాబే. జాబు రావాలంటే బాబు రావాలని, జాబ్ ఇవ్వకపోతే ప్రతి ఇంటికి నెలకు రూ.2 వేలు నిరుద్యోగ భృతి ఇస్తానంటూ 2014 ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి ఇవ్వకుండా యువత నోట్లో మట్టి కొట్టారు. బాబు హయాంలో ఐదేళ్లలో ఇచ్చింది 34,108 ఉద్యోగాలు మాత్రమే. చంద్రబాబు నిర్వాకంపై రామోజీ ఒక్క మాటా రాయరు. చంద్రబాబు సర్కారు ఆర్టీసీ ఉద్యోగుల డిమాండ్‌ను పట్టించుకోకపోతే ఇచ్చిన మాట మేరకు సీఎం వైఎస్ జగన్ ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేశారు. కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులరైజేషన్ చేస్తానని బాబు మాట ఇచ్చి గాలికి వదిలేస్తే, వైఎస్ జగన్ సర్కారు నెరవేర్చింది. సీఎం వైఎస్ జగన్ తీసుకుంటున్న చర్యలతో రాష్ట్రంలో నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు పెరిగినట్లు ఇటీవల కేంద్ర కార్మిక ఉపాధి కల్పన మంత్రిత్వ శాఖ వెల్లడించింది. 2018–19లో 44.85 లక్షల ఈపీఎఫ్ ఖాతాలుంటే 2022–23 నాటికి ఈపీఎఫ్ ఖాతాల సంఖ్య 60.73 లక్షలకు పెరిగినట్లు కేంద్ర మంత్రిత్వ శాఖ పేర్కొంది. అంటే 35 శాతం మేర ఈపీఎఫ్ ఖాతాలు పెరిగాయి. అంటే ఆమేరకు ఉద్యోగావకాశాలు పెరిగినట్టే. అత్యధిక ఉద్యోగావకాశాలు కల్పిస్తున్న రాష్ట్రాల్లో దేశంలోనే ఏపీ నాలుగో స్థానంలో ఉందని 2023 స్కిల్ రిపోర్ట్ వెల్లడించింది. బాబు హయాంలో నిరుద్యోగ రేటు 5.3 శాతం ఉండగా, వైఎస్ జగన్ హయాంలో 4.1 శాతానికి తగ్గిపోయింది.

జూన్ 2019 నుంచి వివిధ శాఖల్లో రెగ్యులర్, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగాల భర్తీ ఇలా..

శాఖ	రెగ్యులర్	కాంట్రాక్టు	ఔట్ సోర్సింగ్, ఇతర	మొత్తం
వ్యవసాయ-సహకార	133	2	40	175
పశు సంవర్ధక, మత్స్య	56	290	26	372
బీసీ సంక్షేమ	328	--	41	369
వినియోగదారులు-పౌరసరఫరాలు	2	116	119	237
ఇంధన	639	7,694	--	8,333
ఆర్థిక	92	2	7	101
జీఏడీ (ఏపీపీఎస్సీ)	3,784	-	22	3,806
గ్రామ, వార్డు సచివాలయాలు, వలంటీర్లు	1,25,110	-	2,60,867	3,85,977
వైద్య, ఆరోగ్య	22,271	26,517	4,678	53,466
ఉన్నత విద్య	136	385	533	1,054
గృహ నిర్మాణం	1	-	-	1
పరిశ్రమలు-వాణిజ్యం	17	-	46	63
ఐటీ, ఎలక్ట్రానిక్స్	-	-	2	2
కార్మిక	59	-	22	81
మున్సిపల్, పట్టణాభివృద్ధి	25	11	21	57
పాఠశాల విద్య	6,361	-	-	6,361
స్కిల్ డెవలప్‌మెంట్	88	814	374	1,276
సాంఘిక సంక్షేమ	605	1	152	758
ఏపీఎస్ఆర్టీసీ	51,387	-	7,001	58,388
గిరిజన సంక్షేమం	650	-	525	1,175
జలవనరులు	176	1	-	177
మహిళా శిశు సంక్షేమం	90	7	3,403	3,500
యువజన సర్వీసులు, పర్యాటక	19	3	70	92
గ్రూప్-1	81	-	-	81
గ్రూప్-2	897	-	-	897
పశు సంవర్ధక అసిస్టెంట్స్	1,896	-	-	1,896
మొత్తం	2,14,903	35,843	2,77,943	5,28,695
డీఎస్సీ-2008	-	2,193	-	2,193
డీఎస్సీ-1998	-	5,887	-	5,887
డీఎస్సీ-2024	6,100	-	-	6,100
ఆప్కోస్	-	-	95,212	95,212
మొత్తం	2,21,003	43,923	3,73,161	6,38,087

ఉనికి కోసమే బీజేపీతో చంద్రబాబు పొత్తు

- జనసేనతో జతకట్టినా బాబుకు భయమే..
- అందుకే బీజేపీతో పొత్తు కోసం పాకులాట
- కేంద్రం, రాష్ట్రం మధ్య సత్సంబంధాలకు కట్టుబడే కేంద్ర బిల్లులకు మద్దతు
- సెక్యులర్ భావనకు విఘాతం కల్పించే ట్రిపుల్ తలాఖ్ వంటి బిల్లులను వ్యతిరేకించాం
- వచ్చే ఎన్నికల్లో 175 అసెంబ్లీ, 25 లోక్‌సభ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ విజయం ఖాయం
- వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి విజయసాయిరెడ్డి



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ ఉనికిని కాపాడుకోవడం కోసమే చంద్రబాబు బీజేపీతో పొత్తు కోసం పాకులాడుతున్నారని వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి, పార్లమెంటరీ పార్టీ నేత వి.విజయసాయిరెడ్డి చెప్పారు. జనసేనతో జతకట్టినా చంద్రబాబుకు ఘోర ఓటమి భయం వెంటాడుతోందని, అందుకే బీజేపీతో పొత్తుకు ప్రయత్నిస్తున్నారని అన్నారు. సీఎం జగన్‌కు ప్రజల్లో వ్యతిరేకత ఉందని చంద్రబాబు భావిస్తే ఒంటరిగా పోటీ చేయడానికి ఎందుకు భయపడుతున్నారని నిలదీశారు. ఆయన మంగళవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో 99.5 శాతం అమలు చేయడం ద్వారా ప్రజల్లో విశ్వసనీయతను సీఎం వైఎస్ జగన్ మరింత పెంచుకున్నారని చెప్పారు. వైఎస్సార్‌సీపీ పొత్తులకు వ్యతిరేకమని, ఒంటరిగా పోటీ చేయడమే తమ విధానమని అన్నారు. ఎన్నికల్లో అమలు చేయగలిగిన హామీలే ఇవ్వడం, అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయడం, నిత్యం జనంతో మమేకమవడం, ప్రజలకు మంచి చేయడం, మరింత మంచి చేయడానికి ఆశీర్వదించాలని ప్రజలను కోరడమే సీఎం జగన్ సిద్ధాంతమని తెలిపారు. ఇచ్చిన హామీలు అమలు చేయకుండా మోసం చేసే చంద్రబాబును ప్రజలు నమ్మరని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో 175 శాసనసభ స్థానాలు, 25 లోక్‌సభ స్థానాల్లోనూ వైఎస్సార్‌సీపీని గెలిపించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. మళ్లీ వైఎస్ జగన్ సీఎం కావడం తథ్యమని, ప్రజలకు మరింత మేలు చేయడం ఖాయమని స్పష్టం చేశారు. కేంద్ర, రాష్ట్రాల మధ్య సత్సంబంధాలు, రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వ బిల్లులకు మద్దతు తెలిపామని ఆయన చెప్పారు. సెక్యులర్ భావనకు విఘాతం కలిగించే ట్రిపుల్ తలాఖ్ వంటి బిల్లులను వైఎస్సార్‌సీపీ వ్యతిరేకించిందని గుర్తు చేశారు.

రేపల్లె, వేమూరులో టీడీపీకి గట్టి షాక్

వైఎస్సార్‌సీపీలో చేరిన ఆ నియోజకవర్గాల టీడీపీ, జనసేన నేతలు, కార్యకర్తలు

బాపట్ల జిల్లా రేపల్లె, వేమూరు నియోజకవర్గాల్లో తెలుగుదేశం పార్టీకి గట్టి షాక్ తగిలింది. రేపల్లె నియోజకవర్గ టీడీపీ, జనసేన నాయకులు, వేమూరు నియోజకవర్గం చుండూరు, భట్టిప్రోలు, అమర్తలూరు మండలాలకు చెందిన వందలాది టీడీపీ నేతలు, కార్యకర్తలు మంగళవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి వైఎస్సార్‌సీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ విజయసాయిరెడ్డి, పార్టీ బాపట్ల జిల్లా అధ్యక్షులు మోపిదేవి వెంకటరమణ తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా విజయసాయిరెడ్డి మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు పెద్ద పీట వేసే పార్టీ అని చెప్పారు. రాష్ట్రంలో లోక్‌సభ, శాసన సభ అభ్యర్థుల ఎంపికలో సీఎం వైఎస్ జగన్ సామాజిక న్యాయాన్ని పాటిస్తున్నారని తెలిపారు. వేమూరు ప్రజలు వరికూటి అశోక్‌బాబును గెలిపించాలని, ఆయన అందరికీ న్యాయం చేస్తారని చెప్పారు. ఎస్సీ సామాజికవర్గంలో వర్గ విభేదాలు సృష్టించేందుకు చూస్తున్నారని, జాగ్రత్తగా ఉండాలని కార్యకర్తలకు సూచించారు. నిత్యం ప్రజల్లోనే ఉండే ఈవూరు గణేష్‌ను రేపల్లె ప్రజలు గెలిపించాలని కోరారు. రేపల్లెలో టీడీపీ ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్‌కు మూడో అవకాశం ఇవ్వొద్దని కోరారు. సత్యప్రసాద్ హైదరాబాద్‌లో కూర్చుని జూదం ఆడుకుంటాడని, ప్రజలకు అందుబాటులో ఉండడని చెప్పారు. పార్టీ కోసం రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణ చేసిన త్యాగం మరువలేనిదని తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ కేసులు పెట్టినా ధైర్యంగా నిలబడి పార్టీ కోసం పని చేశారని కొనియాడారు. మోపిదేవికి మరొక్కసారి రాజ్యసభ సీటు ఇవ్వనున్నట్లు సీఎం జగన్ చెప్పారన్నారు.

మంగళగిరిలో ఎవరికి సీటిచ్చినా మద్దతిస్తా



ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో సీఎం వైఎస్ జగన్‌ను కలిసిన ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి. చిత్రంలో ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, గంజి చిరంజీవులు తదితరులు

- బీసీ అభ్యర్థి చేతిలో నారా లోకేశ్ ఓటమి ఖాయం
- మరో 30 ఏళ్లు సీఎం వైఎస్ జగన్
- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి
- సొంత గూటికి తిరిగి చేరిక

సాక్షి, అమరావతి: వచ్చే ఎన్నికల్లో మంగళగిరిలో వైఎస్సార్‌సీపీ విజయదుందుభి మోగించడం ఖాయమని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. గత ఎన్నికల్లో తన చేతిలో ఓడిన నారా లోకేశ్ ఈసారి బీసీ అభ్యర్థి చేతిలో ఓడిపోవడం ఖాయమన్నారు. వైఎస్ జగన్ మరో 30 ఏళ్ల పాటు ముఖ్యమంత్రిగా ఉండాలనేదే తన బలమైన ఆకాంక్ష అని తెలిపారు. అందుకోసం మంగళగిరిలో ఏ అభ్యర్థికి టికెట్ ఇచ్చినా వారి గెలుపు కోసం కృషి చేస్తానని వెల్లడించారు. మంగళవారం సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సమక్షంలో ఆళ్ల వైఎస్సార్‌సీపీలో చేరారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. 175కి 175 స్థానాలను వైఎస్సార్‌సీపీ గెలుస్తుందన్నారు. పేదవారికి జరుగుతున్న మేలును చూసి ప్రతిపక్షాలు ఓర్వలేకపోతున్నాయన్నారు. రాష్ట్రానికి దీర్ఘకాలం సీఎంగా జగన్ ఉంటేనే తమకు మేలని పేదలు భావిస్తున్నారని చెప్పారు. తనకు రెండు సార్లు ఎమ్మెల్యే అయ్యే అవకాశాన్ని పార్టీ ఇచ్చిందని తెలిపారు. బిల్లులు రాకపోవడంతో బాధపడి రెండు నెలలు వైఎస్సార్‌సీపీకి దూరమయ్యానన్నారు. సీఎం వైఎస్ జగన్ తన సమస్యను పరిష్కరించారని చెప్పారు. తన తప్పును తాను తెలుసుకున్నానన్నారు. తొలి నుంచి తాను వైఎస్ కుటుంబానికి వీరవిధేయుడినని గుర్తు చేశారు. అందుకే తిరిగి వైఎస్సార్‌సీపీలో చేరానన్నారు. మంగళగిరిలో బీసీలకు అండగా నిలిచి ఆ అభ్యర్థిని గెలిపిస్తానన్నారు. తాను ఎక్కడా పోటీ చేయనని స్పష్టం చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను, పేదలను రాజ్యాధికారం దిశగా సీఎం జగన్ అడుగులు వేయిస్తున్నారని కొనియాడారు. సీఎం జగన్ ఏ బాధ్యత అప్పగించినా నిర్వర్తిస్తానని స్పష్టం చేశారు. సీఎం జగన్ ఆ రోజు తనను తమ్ముడుగానే చూశారని.. ఈరోజు కలిసినప్పుడు కూడా తమ్ముడుగానే చూశారన్నారు. దేశంలోనే ఆదర్శ పరిపాలకుడిగా ఆయన నిలుస్తారని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ ఎంపీ ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, మంగళగిరి సమన్వయకర్త గంజి చిరంజీవి పాల్గొన్నారు.

టీడీపీ ఆఫీసులోనైనా చర్చకు మేం సిద్ధమే

- కానీ.. ఒక్క షరతు... చర్చ అయిపోయాక బావురుమని ఏడ్వకూడదు
- మేనిఫెస్టోను మోసఫెస్టోగా మార్చిన బాబుకు సీఎం జగన్‌కు సవాల్ విసిరే నైతిక హక్కు లేదు
- కుర్చీలు మడతబెట్టడంలో లోకేశ్ గిన్నిస్ బుక్ రికార్డులకు ఎక్కుతారు
- వచ్చే ఎన్నికల్లో టీడీపీని లోకేశ్ మడతపెట్టడం ఖాయం



సాక్షి, అమరావతి: 'రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధిపై టీడీపీ ఆఫీసులోనైనా చర్చకు మేం సిద్ధం. కానీ ఒక్క షరతు. చర్చ పూర్తయ్యాక ఏడ్వకూడదు' అని టీడీపీ అధినేత చంద్రబాబుకు జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు చురకలంటించారు. అంబటి మంగళవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. సీఎం జగన్ పరిపాలన వ్యవహారాలు, ఎన్నికల మేనిఫెస్టో రూపకల్పనలో బిజీగా ఉన్నారని, చర్చకు తానొస్తానని చెప్పారు. మేనిఫెస్టోను మోసఫెస్టోగా మార్చేసిన చంద్రబాబుకు సీఎం వైఎస్ జగన్‌కు సవాల్ విసిరే నైతిక హక్కే లేదని స్పష్టం చేశారు. 2014లో ఎన్నికలు పూర్తయ్యాక మేనిఫెస్టోను మాయం చేసి.. మోసం చేయడాన్ని ప్రజలు మర్చిపోతారనుకుంటే ఎలా అంటూ బాబుపై విరుచుకుపడ్డారు. మేనిఫెస్టోకు విలువ లేకుండా చేసిన చరిత్ర ఒక్క చంద్రబాబుకే దక్కిందన్నారు. సీఎం వైఎస్ జగన్ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 99.5 శాతం అమలు చేసి చూపించారని, డీబీటీ రూపంలో గత 57 నెలల్లోనే పేదల ఖాతాల్లోకి రూ.2.55 లక్షల కోట్లు జమ చేశారని గుర్తు చేశారు. రా కదలిరా అంటూ టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నిర్వహిస్తున్న సభలకు జనం మొహం చాటేస్తున్నారని, దత్తపుత్రుడు పవన్ రహస్యంగా తిరుగుతున్నారన్నారు. సీఎం వైఎస్ జగన్ సిద్ధం సభలకు వస్తున్న జనస్పందనను చూశాక టీడీపీ నేతలకు భ్రమలు తొలగిపోయాయంటూ దెప్పిపొడిచారు. 175కు 175 స్థానాల్లో వైఎస్సార్‌సీపీ విజయం సాధించడం, సీఎం వైఎస్ జగన్ మళ్లీ ముఖ్యమంత్రి కావడం తథ్యమని తేల్చి చెప్పారు. శంఖం ఊదలేని స్థితిలో లోకేశ్ శంఖారావం ఉందని ఎద్దేవా చేశారు. చంద్రబాబును ముసలోడు అంటుంటే లోకేశ్‌కు ఎందుకు కోపం వస్తుందో అర్థం కావడం లేదని అన్నారు. స్కిల్ స్కాం కేసులో చంద్రబాబు జైల్లో ఉన్నప్పుడు 'నా తండ్రి ముసలోడు, నడవలేకున్నాడు' అంటూ లోకేశే బావురుమన్నాడని గుర్తు చేశారు. కుర్చీలు మడతబెట్టడంలో లోకేశ్ గిన్నిస్ బుక్ రికార్డులకు ఎక్కడం ఖాయమన్నారు. లోకేశ్ ఇప్పటికే శాసన మండలి సీటు, ఐదు శాఖల మంత్రి పదవిని, మంగళగిరి ఎమ్మెల్యే సీటును మడతబెట్టేశారని వ్యంగ్యోక్తులు విసిరారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీని కూడా లోకేశ్ మడతబెట్టడం ఖాయమని స్పష్టం చేశారు.

రూ.1కే టిడ్కో ఇళ్లు

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే సామాన్యులకు ఇల్లు
- విజయనగరంలో మంత్రి బొత్స సత్యనారాయణ
- టిడ్కో ఇళ్ల లబ్ధిదారులకు పట్టాలు, తాళాలు అప్పగింత
- సీఎం జగన్ కటౌట్‌కు క్షీరాభిషేకం



టిడ్కో కాలనీ ప్రారంభోత్సవంలో పాల్గొన్న మంత్రి బొత్స, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల, తదితరులు

సాక్షి ప్రతినిధి, విజయనగరం: రాష్ట్రంలో సొంతిల్లు లేని సామాన్య, మధ్య తరగతి ప్రజల సొంతింటి కలను సీఎం వైఎస్ జగన్ నెరవేర్చారని, అందరినీ ఒక ఇంటివారిని చేశారని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. విజయనగరం సోనియానగర్‌లో నిర్మించిన 448 టిడ్కో ఇళ్లను రూ.1కే లబ్ధిదారులకు అందజేశారు. అందుకు సంబంధించిన పట్టా, ఇంటి తాళాలను వారి చేతికి ఇచ్చారు. దీంతో పట్టలేని సంతోషంతో లబ్ధిదారులు సీఎం జగన్ కటౌట్‌కు క్షీరాభిషేకం చేశారు. మంత్రి బొత్స మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో టిడ్కో ఇళ్లను ఇస్తామని ఒక్కో లబ్ధిదారుతో రూ.500 చొప్పున డీడీ తీయించారని, రూ.5 లక్షల బ్యాంకు రుణానికి అంగీకరింపజేశారని గుర్తు చేశారు. ఇప్పుడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆ ఇబ్బందులన్నీ లేకుండా ఒక్క రూపాయికే టిడ్కో ఇల్లును అందించిందని చెప్పారు. గత టీడీపీ ప్రభుత్వంలో మాదిరిగా ఏ ఒక్కరి నుంచి డబ్బు వసూలు చేయలేదన్నారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి మాట్లాడుతూ అన్ని మౌలిక వసతులతో అన్ని పనులు పూర్తిచేసి టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అందిస్తున్నామని చెప్పారు.

అంగరంగ వైభవంగా...

పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు మునిసిపాలిటీ పరిధిలో నిర్మించిన 1,056 టిడ్కో ఇళ్లలో మంగళవారం గృహప్రవేశాలు అంగరంగ వైభవంగా జరిగాయి. రూ.82.85 కోట్లతో ఈ ఇళ్ల సముదాయాన్ని నిర్మించారని, ఒక్కొక్కటీ రూ.12 లక్షల విలువైన సొంత ఆస్తిని అక్కచెల్లెమ్మలకు కేవలం రూ.1కే అందించిన ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందని ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. లబ్ధిదారులకు ఇంటితాళాలతోపాటు రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేశారు. టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్, టిడ్కోబోర్డు డైరెక్టర్ నాగేశ్వరి పాల్గొన్నారు.

పేదలకు సుస్థిర జీవనోపాధి అవకాశాలు కల్పిద్దాం

సాక్షి, అమరావతి: పేదలకు, సహాయం అవసరమైన వారికి సుస్థిర జీవనోపాధి అవకాశాలు కల్పించి, చిట్టచివరి వ్యక్తి వరకూ అభివృద్ధి ఫలాలు చేర్చేందుకు కనెక్ట్ టు ఆంధ్రా చేపడుతున్న బృహత్తర కార్యక్రమాల్లో ఆర్‌బీఎల్ బ్యాంకు భాగస్వామ్యం కావడం అభినందనీయమని రాష్ట్ర ప్లానింగ్ డిపార్ట్‌మెంట్ ఎక్స్ అఫీషియో కార్యదర్శి గిరిజా శంకర్ అన్నారు. విజయవాడలోని కనెక్ట్ టు ఆంధ్రా కార్యాలయంలో మంగళవారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో సుమీత్ భండారీ నేతృత్వంలోని ఆర్‌బీఎల్ బ్యాంక్ బృందం కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కింద రూ. 5 లక్షల చెక్కును గిరిజా శంకర్‌కు అందజేసింది. ఈ సందర్భంగా గిరిజా శంకర్ మాట్లాడుతూ వ్యాపార, వాణిజ్య కార్యకలాపాలు సాగిస్తున్న సంస్థలు కనెక్ట్ టు ఆంధ్రా ద్వారా చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యకలాపాలకు చేయూతనందిస్తుండటం గొప్ప పరిణామమని పేర్కొన్నారు. పవర్ గ్రిడ్ కార్పొరేషన్ సహకారంతో కనెక్ట్ టు ఆంధ్రా రాష్ట్రవ్యాప్తంగా 14 వేల మంది టీబీ వ్యాధిగ్రస్తులకు పోషకాహార కిట్లు పంపిణీ చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. కనెక్ట్ టు ఆంధ్రా సీఈవో కోట్ల శివశంకరరావు మాట్లాడుతూ ఆర్‌బీఎల్ అందించిన రూ. 5 లక్షలతో పేద మహిళలు, వితంతువులు తదితరులకు సుస్థిర జీవనోపాధి కల్పించేలా కుట్టు మిషన్లు అందజేయనున్నట్లు తెలిపారు. ఆర్‌బీఎల్ హెడ్ (గవర్నమెంట్ బిజినెస్, పబ్లిక్ సెక్టార్ అండర్‌టేకింగ్స్) సుమీత్ భండారీ తదితరులు పాల్గొన్నారు.



చాలామంది వస్తుగతంగా పేదవాళ్లు అయినప్పటికీ తమ దృక్పథం కారణంగా చాలా ధనవంతులు. అదే సమయంలో చాలామంది వస్తుగతంగా అత్యంత ధనవంతులు అయినప్పటికీ, ఉన్నది ఎన్నడూ చాలని కారణంగా నిరుపేదలుగా ఉండిపోతారు.

– థానిస్సరో భిక్షు (బౌద్ధ ధర్మం)

సాక్షి

బుధవారం, 21 ఫిబ్రవరి 2024

సరికొత్త సాంకేతిక సవాలు

మరో సంచలనాత్మక సాంకేతిక ప్రయోగం జరిగింది. కృత్రిమ మేధ (ఏఐ) వినియోగంలో ఒకడుగు ముందుకేసి, విప్లవాత్మకమైన ఛాట్‌బాట్ 'ఛాట్ జీపీటీ'ని సృష్టించిన 'ఓపెన్ ఏఐ' సంస్థ గురువారం మరో ముందంజ వేసింది. సరికొత్త జెనరేటివ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (జెన్‌ఏఐ) మోడల్‌ను ఆవిష్కరించింది. రాతపూర్వక సమాచారాన్ని వీడియోగా మార్చే 'సోరా' అనే ఈ మోడల్ ఆసక్తి రేపుతోంది. సోరా అంటే జపనీస్‌లో ఆకాశమని అర్థం. సృజనకు ఆకాశమే హద్దంటూ ఏఐ వినియోగంతో చేసిన ఈ కొత్త ప్రయోగం ఏ మంచికి, ఎంత చెడుకు దారితీస్తుందనే చర్చ జరుగుతోంది.

యూజర్ ఇచ్చిన సమాచారానికి కట్టుబడి ఉంటూ, నాణ్యతలో రాజీ లేకుండా గరిష్ఠంగా ఒక నిమిషం నిడివి వీడియోలను సృష్టించడం 'సోరా' ప్రత్యేకత. కోరినట్టుగా జెన్‌ఏఐ వేదికలు బొమ్మల్ని సృష్టించడం, సమాచార ప్రతిస్పందనలు అందించడమనేది కొన్నేళ్ళుగా జరుగుతున్నదే, అంతకంతకూ మెరుగవుతున్నదే. టెక్స్ట్ నుంచి బొమ్మలను ఇప్పటికే సృష్టిస్తున్నప్పటికీ వీడియో తయారీ సంక్లిష్టమైనది. అందుకే, ఆ పని వెనుకబడింది. తీరా ఇప్పుడు ఓపెన్‌ఏఐ ప్రయోగాత్మకంగా 'సోరా'ను ముందుకు తెచ్చింది. దాని పని తీరుకు ఉదాహరణగా మంచు కురుస్తున్న టోక్యో నగర వీధుల దృశ్యాల్ని సృష్టించింది. వాస్తవికమని భ్రమింపజేస్తున్న ఆ వీడియోను చూసి అబ్బురపడనివారు లేరు.

నిజానికి, టెక్స్ట్ నుంచి వీడియో సృష్టి అనే సాంకేతిక ప్రయోగం బరిలోకి ఇప్పటికే కొన్ని ఇతర సంస్థలూ ప్రవేశించాయి. గూగుల్, మేటా, అంకురసంస్థ రన్‌వే ఎంఎల్ లాంటివి ఈ సాంకేతికతను ఇప్పటికే చూపాయి. గూగుల్ 'లూమియర్' గత నెలలో విడుదలైంది. సమాచారం, లేదంటే ఛాయా చిత్రాల ఆధారంగా 5 సెకన్ల నిడివి వీడియోను సృష్టించడాన్ని 'లూమియర్' చేసి చూపింది. అలాగే, రన్‌వే, పికా లాంటి ఇతర సంస్థలు సైతం తమవైన వీడియో సృష్టి మోడల్స్‌ను ముందుకు తెచ్చాయి. నిమిషం నిడివి గల వీడియోలు సృష్టించే 'సోరా' విషయానికొస్తే, సంక్లిష్ట సన్నివేశాలు, పలు రకాల పాత్రలు, ప్రత్యేక తరహా కదలికలు, కచ్చితమైన నేపథ్యంతో కూడిన దృశ్యాలు ఈ 'సోరా'తో సాధ్యమట. వస్తువులనూ, మనుషులనూ అచ్చంగా భౌతిక ప్రపంచంలో ఉన్నట్టే చూపుతుందట.

అయితే, ఈ మోడల్ ఇంకా నిర్దుష్టంగా తయారుకాలేదనీ, సంక్లిష్ట సమాచారమిస్తే గందరగోళ పడవచ్చనీ దాన్ని రూపొందించిన ఓపెన్‌ఏఐ సైతం ఒప్పుకుంటోంది. అలాగే, కుడి, ఎడమల విషయంలో కాస్తంత తడబాటుకు గురికావడం లాంటి బలహీనతలూ 'సోరా'లో లేకపోలేదు. ఈ పరిస్థితుల్లో ఇది తప్పుడు, విద్వేషపూరిత సమాచారాలకు వేదిక కాకుండా ఉండేలా... భద్రతా నిపుణులతో, విధాన నిర్ణేతలతో ఓపెన్‌ఏఐ చర్చించనుంది. అందుకే, ప్రస్తుతానికి 'సోరా'ను సామాన్యులకు అందుబాటులో ఉంచలేదు. విజువల్ ఆర్టిస్టులు, డిజైనర్లు, సినీ రూపకర్తలకు మాత్రం దీన్ని వాడుకొనే వీలు కల్పించింది. సృజనశీలురకు మరింత ఉపయోగపడేలా చేయాల్సిన మార్పులు చేర్పులపై వారి స్పందన తీసుకోనుంది.

మొత్తానికి, ఏఐతో ప్రపంచం మారిపోతోంది. గత రెండు దశాబ్దాల్లో ఇంటర్నెట్, సోషల్ మీడియా రాకతో అపరిమిత డేటా సేకరణ, సమాచార విప్లవం వచ్చింది. ఇటీవలి జెన్‌ఏఐ పుణ్యమా అని ఆ భారీ డేటాను ఆసరాగా చేసుకొని, కీలక నిర్ణయాలు తీసుకొనేలా ఏఐ వ్యవస్థలు, అప్లికేషన్ల అభివృద్ధి జరిగింది. దాదాపు 30 వేల కోట్ల పదాలను వాడుకొని ఛాట్‌జీపీటీ సిద్ధమైంది. సుమారు 580 కోట్ల చిత్రాలు – రాతపూర్వక సమాచారం ఆధారంగా ఏఐ ఆధారిత ఇమేజ్–జనరేటింగ్ అప్లికేషన్లు డాల్–ఇ, మిడ్‌జర్నీ లాంటివి శిక్షణ పొందాయి. ఏఐ వినియోగం పలు రంగాల్లో ఉపయుక్తమైనా, దాని వల్ల సమాజానికి సవాళ్ళూ అధికమే. సృజనశీలుర కృషిని అనుమతి లేకుండానే ఏఐ మోడల్స్ శిక్షణకు వాడుకోవడంపై పెద్ద కంపెనీలపై పలువురు కేసులేశారు. ఏఐని సర్వసిద్ధం చేయడానికి ఇప్పుడున్న డేటా సరిపోక, కొరత వస్తుందనీ అంచనా. ట్విట్టర్‌ను కొన్న ఎలాన్ మస్క్ నుంచి ప్రసిద్ధ రచయిత యువల్ నోవా హరారీ దాకా పలువురు 'భారీ ఏఐ ప్రయోగాలకు విరామం ఇవ్వా'లంటూ నిరుడు బహిరంగ లేఖ రాయడం గమనార్హం.

అమెరికా నుంచి ఇండియా దాకా ఎన్నికలు జరగనున్న వేళ ఈ ఏఐ సృష్టి వీడియోలతో మోసపుచ్చే ప్రమాదం ఉంది. తప్పుడు ప్రచారంతో నైతిక, సామాజిక సమస్యలు తలెత్తుతాయి. ప్రతి రంగంలో ఏఐతో చిక్కులు రాక మానవు. అయినా ఇప్పటికీ ఏఐ పర్యవేక్షణ టెక్ సంస్థల చేతిలోనే నడుస్తోంది. ప్రభుత్వాలింకా నిద్ర మేల్కోలేదు. యూరోపియన్ యూనియన్ మాత్రం డిసెంబర్‌లో ఒక ఒప్పందం చేసుకుంది. ప్రపంచంలోనే తొలిసారిగా సమగ్రమైన ఏఐ నిబంధనలవి. అయితే, తుది ఆమోదం పొందిన రెండేళ్ళ తర్వాత కానీ చట్టం అమలులోకి రాదు. ఇక, ఏఐ దుర్వినియోగంపై రచ్చతో ఓపెన్‌ఏఐ, మరో 19 టెక్ సంస్థలు ఎన్నికల డీప్‌ఫేక్‌ల నిరోధానికి కృషి చేస్తామన్నాయి.

పైకి ఏమంటున్నా, సోరా లాంటి ఏఐ టూల్స్ శిక్షణకు ఎక్కడ నుంచి, ఎంత వీడియోలు వాడుకున్న సంగతి కూడా ఓపెన్‌ఏఐ లాంటి సంస్థలు బయటపెట్టడం లేదు. ఛాట్‌జీపీటీ లాంటి జెన్‌ఏఐ టూల్స్ శిక్షణకై తమ కాపీరైట్ ఉల్లంఘించారంటూ ఇప్పటికే పలువురు రచయితలే కాదు, సాక్షాత్తూ న్యూయార్క్ టైమ్స్ సైతం ఓపెన్‌ఏఐ, దాని వ్యాపార భాగస్వామి మైక్రోసాఫ్ట్‌పై కేసులు పెట్టాల్సి వచ్చింది. అమెరికన్ సంపన్నులు, వారి వెంట చైనీయులు ఇప్పటికే ఏఐ రేసులోకి దిగారు. ప్రస్తుతానికి భారతీయులం వెనుకబడివున్నా, అనివార్యమవుతున్న ఈ మార్పును అందిపుచ్చుకోక తప్పదు. ఏఐ ఓ సరికొత్త పారిశ్రామిక విప్లవానికి దారి తీస్తుందని నిపుణుల అభిప్రాయం. అందుకే, కేవలం ఏఐ వినియోగదారులుగా మిగిలిపోకుండా, ఏఐ ఆవిష్కర్తలం కావాలన్నది వారి సూచన.

నిజమైన తపస్వి విద్యాసాగరులు



నరేంద్ర మోదీ
భారత ప్రధాని

సంత్ శిరోమణి ఆచార్య శ్రీ 108 విద్యాసాగర్ జీ మహరాజ్ జీ సమాధిని పొంది మనందరినీ విషాదంలో ముంచెత్తారు. జ్ఞానం, కరుణ, సేవల త్రివేణీ సంగమంగా పూజ్య ఆచార్యులు ఎప్పటికీ గుర్తుండిపోతారు. ఆయన నిజమైన తపస్వి. ఆయన జీవితం భగవాన్ మహావీరుని ఆదర్శాలకు ప్రతీక. జైన సామాజిక వర్గంలో ఆయన ఉన్నత స్థానంలో నిలిచినప్పటికీ ఆయన ప్రభావం, పలుకుబడి కేవలం ఒక సామాజిక వర్గానికే పరిమితం కాలేదు. మతాలు, ప్రాంతాలు, సంస్కృతులకు అతీతంగా ప్రజలు ఆయన వద్దకు వచ్చేవారు. ప్రకృతికి నష్టాన్ని తగ్గించే జీవన విధానానికి ఆయన పిలుపునిచ్చారు. నిబద్ధత పునాదులపైనే ఒక బలమైన దేశం నిర్మితమవుతుందని విశ్వసించారు.

లోతైన జ్ఞానం, ఎల్లలెరుగని దయ, మానవాళిని ఉద్ధరించాలన్న అచంచలమైన నిబద్ధతతో ఆచార్య విద్యాసాగర్ జీ (10 అక్టోబర్ 1946 – 18 ఫిబ్రవరి 2024) జీవితం ఆధ్యాత్మికంగా సుసంపన్నం అయింది. అనేక సందర్భాల్లో ఆయన ఆశీస్సులు అందుకున్న గౌరవం నాకు దక్కింది. అందువలన, నాతో సహా లెక్కలేనన్ని ఆత్మలకు మార్గాన్ని ప్రకాశవంతం చేసిన మార్గదర్శక కాంతిని కోల్పోయినట్లుగా నేను తీవ్రమైన లోటును అనుభవిస్తున్నాను. ఆయన అనురాగం, ఆప్యాయత, ఆశీస్సులు కేవలం సుహృద్భావ సంకేతాలు మాత్రమే కాదు, ఆయనతో సన్నిహితంగా మెలిగిన అదృష్టవంతులందరి మీదా ఆధ్యాత్మిక శక్తిని ప్రసరింపజేసి, స్ఫూర్తిని కలిగిస్తాయి.

ఆయన జీవితం జైన మత మూల సూత్రాలకు ఉదాహరణగా నిలిచింది. దాని ఆదర్శాలను తన సొంత చర్యలు, బోధనల ద్వారా ప్రతిబింబింప జేశారు. సకల జీవరాశుల పట్ల ఆయనకున్న శ్రద్ధ, జైన మతానికి జీవితం పట్ల ఉన్న అమితమైన గౌరవానికి అద్దం పట్టింది. ఆలోచనల్లో, మాటల్లో, చేతల్లో నిజాయితీకి జైన మతం ఇచ్చిన ప్రాధాన్యాన్ని ప్రతిబింబిస్తూ ఆయన తన జీవితాన్ని గడిపారు. సరళమైన జీవనశైలిని అనుసరించారు. జైనమతం, భగవాన్ మహావీరుని జీవితం నుంచి ప్రపంచం ప్రేరణ పొందడానికి ఆయన వంటి మహానుభావులే కారణం. ఆధ్యాత్మిక జాగృతికి, ముఖ్యంగా యువతలో ఆధ్యాత్మిక జాగృతికి ఆయన అవిశ్రాంతంగా కృషి చేశారు.

విద్య ఆయన హృదయానికి చాలా దగ్గరైన రంగం. విద్యాధర్ (ఆయన చిన్ననాటి పేరు) నుండి విద్యాసాగర్ వరకు ఆయన చేసిన ప్రయాణం జ్ఞానాన్ని సంపాదించడం, అందించడంలో లోతైన నిబద్ధతతో సాగింది. న్యాయమైన, జ్ఞానవంతమైన సమాజానికి విద్య మూలస్తంభమని ఆయన ప్రగాఢ విశ్వాసం. వ్యక్తులను శక్తిమంతం చేయడానికీ, లక్ష్యం, సహకారంతో కూడిన జీవితాలను గడపడానికీ వీలు కల్పించే సాధనంగా ఆయన జ్ఞానాన్ని సమర్థించారు. విద్యను వ్యక్తులకు సాధికారత కల్పించి ఒక ప్రయోజనం, సేవాభావంతో జీవితం గడిపేందుకు దోహదపడే సాధనంగా ఆయన భావించారు. వారి బోధనలు స్వీయ అధ్యయనం, స్వీయ అవగాహన ప్రాముఖ్యతను నిజమైన జ్ఞానానికి మార్గాలుగా నొక్కిచెప్పాయి. జీవితకాల అభ్యాసం, ఆధ్యాత్మిక ఎదుగుదలలో నిమగ్నం కావాలని వారి అనుచరులకు ప్రబోధించాయి.

మన సాంస్కృతిక విలువలతో ముడిపడిన విద్యను మన యువత పొందాలని విద్యాసాగర్ జీ ఆకాంక్షించారు. నీటి ఎద్దడి వంటి కీలక సవాళ్లకు పరిష్కారం కనుగొనలేక పోయామనీ, గతం నుంచి నేర్చుకున్న పాఠాలకు దూరంగా ఉండటం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందనీ ఆయన తరచూ చెప్పేవారు. సంపూర్ణ విద్య అనేది నైపుణ్యం, నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించేదిగా ఉంటుందని ఆయన విశ్వసించారు. భారతదేశ భాషా వైవిధ్యం పట్ల ఆయన ఎంతో గర్వ పడ్డారు. భారతీయ భాషలను నేర్చుకోవడానికి యువతను ప్రోత్స హించారు. పూజ్య ఆచార్యులు స్వయంగా సంస్కృతం, ప్రాకృతం, హిందీలో విస్తృతంగా రచనలు చేశారు. ఒక సాధువుగా చేరుకున్న శిఖరాలు, భూమిపై ఎంతగా నిలదొక్కుకున్నారు అనేవి ఆయన ప్రతిష్ఠాత్మక రచన 'మూక్‌మతి'లో స్పష్టంగా కనిపిస్తుంది. తన రచనల ద్వారా అణగారిన వర్గాలకు గళం అందించారు.



సంత్ శిరోమణి ఆచార్య శ్రీ 108 విద్యాసాగర్ జీ మహరాజ్: అభివాదం చేస్తున్న నరేంద్ర మోదీ (ఫైల్ ఫొటో)

ఆరోగ్య సంరక్షణ రంగంలో కూడా ఆచార్యుల కృషి చిరస్మరణీయం. ముఖ్యంగా నిరుపేదల నివాస ప్రాంతాల్లో ఆయన అనేక ప్రయత్నాల్లో పాలుపంచుకున్నారు. ఆరోగ్య సంరక్షణ పట్ల ఆయన విధానం సంపూర్ణమైనది. శారీరక శ్రేయస్సును ఆధ్యాత్మిక శ్రేయస్సుతో మిళితం చేస్తుంది. తద్వారా వ్యక్తి మొత్తం అవసరాలను తీరుస్తుంది.

విద్యాసాగర్ జీ దేశ నిర్మాణం పట్ల చూపిన నిబద్ధత గురించి రాబోయే తరాలు విస్తృతంగా అధ్యయనం చేయాలని నేను ప్రత్యేకంగా కోరుతున్నాను. పక్షపాత ఆలోచనలకు అతీతంగా జాతీయ ప్రయోజనాలపై దృష్టి సారించాలని ఆయన ప్రజలను ఎల్లప్పుడూ కోరేవారు. ప్రజాస్వామ్య ప్రక్రియల్లో భాగస్వామ్య వ్యక్తీకరణగా భావించిన ఓటును బలంగా విశ్వసించేవారిలో ఆయన ఒకరు. ఆరోగ్యకరమైన, స్వచ్ఛమైన రాజకీయాలను సమర్థించారు. విధాన రూపకల్పన ప్రజా సంక్షేమం గురించి ఉండాలి కానీ స్వప్రయోజనాల గురించి కాదనీ అనేవారు.

నివాళి

పౌరులకు తమ పట్ల, తమ కుటుంబాల పట్ల, సమాజం పట్ల, దేశం పట్ల ఉండే బాధ్యతల నిబద్ధత పునాదులపైనే ఒక బలమైన దేశం నిర్మితమవుతుందని ఆయన విశ్వసించారు. నిజాయితీ, చిత్త శుద్ధి, స్వావలంబన వంటి సుగుణాలను పెంపొందించుకోవాలని వ్యక్తులను ప్రోత్సహించారు. న్యాయమైన, దయగల, అభివృద్ధి చెందు తున్న సమాజ నిర్మాణానికి అవి అవసరమని భావించారు. మనం వికసిత్ భారత్ నిర్మాణం కోసం కృషి చేస్తున్నందున విధుల పట్ల ఈ ప్రాధాన్యత చాలా ముఖ్యం.

ప్రపంచవ్యాప్తంగా పర్యావరణ క్షీణత తీవ్రంగా ఉన్న ఈ కాలంలో, పూజ్య ఆచార్యులు ప్రకృతికి నష్టాన్ని తగ్గించే జీవన విధానానికి పిలుపునిచ్చారు. అదేవిధంగా, మన ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయానికి ఉన్న అత్యంత ముఖ్యమైన పాత్రను ఆయన గుర్తించారు. వ్యవసాయాన్ని ఆధునికంగా, సుస్థిరంగా మార్చాలని నొక్కి చెప్పారు. జైలు ఖైదీల సంస్కరణకు ఆయన చేసిన కృషి కూడా చెప్పుకోదగినది.

వేల సంవత్సరాలుగా మన నేల ఇతరులకు వెలుగులు చూపించి మన సమాజాన్ని బాగు చేసిన మహానుభావులను అందించింది. సాధువులు, సంఘ సంస్కర్తల ఈ మహోన్నత పరంపరలో విద్యాసాగర్ జీ మహోన్నత వ్యక్తిగా నిలుస్తారు. ఆయన ఏం చేసినా వర్తమానం కోసమే కాకుండా భవిష్యత్తు కోసం కూడా చేసేవారు. గత ఏడాది నవంబర్‌లో ఛత్తీస్‌గఢ్‌లోని డోంగర్‌గఢ్‌లో ఉన్న చంద్రగిరి జైన మందిరాన్ని సందర్శించే అవకాశం నాకు లభించింది. అప్పటి సందర్శనే ఆయనతో నా చివరి సమావేశం అవుతుందని నాకు తెలియదు. ఆ క్షణాలు చాలా ప్రత్యేకమైనవి. ఆయన నాతో చాలాసేపు మాట్లాడి, దేశానికి సేవ చేయడంలో నేను చేసిన కృషిని ఆశీర్వదించారు. మన దేశం తీసుకుంటున్న దిశ, ప్రపంచ వేదికపై భారత్‌కు లభిస్తున్న గౌరవం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. తాను చేస్తున్న పని గురించి మాట్లాడేటప్పుడు ఉత్సాహం చూపించారు. అప్పుడూ, ఎప్పుడూ, వారి సున్నితమైన చూపులు, నిర్మలమైన చిరునవ్వు... శాంతి, సేవా భావనను కలిగిస్తాయి. ఆయన ఆశీస్సులు మనసుకు ఓదార్పునిచ్చే ఔషధంలా, మనలోని, చుట్టుపక్కల ఉన్న దైవిక ఉనికిని గుర్తుచేసేలా ఉంటాయి.

సంత్ శిరోమణి ఆచార్య శ్రీ 108 విద్యాసాగర్ జీ మహరాజ్ జీ లేని లోటును ఆయన గురించి తెలిసిన వారు, ఆయన బోధనలు, జీవితం స్పృశించినవారు శూన్యంగా భావిస్తారు. అయితే, ఆయన వల్ల స్ఫూర్తి పొందినవారి హృదయాల్లో వారు ఎప్పటికీ చిరస్థాయిగా నిలిచిపోతారు. ఆయన స్మృత్యర్థం వారు బోధించిన విలువలను పాటించడానికి మేము కట్టుబడి ఉంటాము. ఈ విధంగా, మనం ఒక గొప్ప ఆత్మకు నివాళులు అర్పించడమే కాకుండా, మన దేశం కోసం, ప్రజల కోసం ఆయన లక్ష్యాన్ని ముందుకు తీసుకెళ్తాము.

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ఎక్కడైనా సరే!



కొన్ని రోజుల క్రితం ఇప్పటి తరం ఒక భారతీయ వ్యవస్థాపకుడు తన కంపెనీని శాన్ ఫ్రాన్సిస్కో (అమెరికా)లో ఉంచాలా, ఇండియాలోనా అని అడిగాడు. ఇండియాలో స్టార్టప్ కంపెనీలు వర్ధిల్లుతున్నట్టున్నాయి కాబట్టి, వెనక్కి వెళ్తే బానే ఉంటుందని చెప్పాను.

– పాల్ గ్రాహమ్, అమెరికా సైంటిస్ట్

మరింత విస్తరణ



మా పెట్టుబడులను స్పెయిన్‌లోకి విస్తరింపజేసే పథకాలను ప్రకటించాం. పబ్లిక్, ప్రైవేటు రంగాల్లో బాధ్యతాయుతమైన కృత్రిమ మేధను ప్రోత్సహించడంలో భాగస్వాములం కావడాన్ని కొనసాగిస్తాం.

– సత్య నాదెళ్ల, మైక్రోసాఫ్ట్ సీఈఓ

రావాల్సిన విప్లవం



ఒక ప్లాస్టిక్ సీసా పూర్తిగా భూమిలో కలిసిపోవడానికి 400 ఏళ్లు పడుతుంది. అలాంటిది ప్లాస్టిక్ వ్యర్థాలను వేగంగా తినే ఒక ఎంజైమ్‌ను జపాన్ శాస్త్రవేత్తలు కనుగొన్నారు. రీసైక్లింగ్ ప్రక్రియలో ఇది విప్లవాత్మకమైన మార్పును తేగలదు.

– ఎరిక్ సోల్‌హెయిమ్, నార్వే మాజీ దౌత్యవేత్త

ఏదీ వద్దు



ఇండియా సిక్కుల మాతృభూమి. మేము అందులో జీవిస్తాం, దాన్ని పాలిస్తాం. ఖలిస్తాన్ వద్దు. హిందూ రాజ్యం వద్దు.

– అశోక్ సింగ్, యాక్టివిస్ట్

అంతేనా?



అసలు ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటిస్తారా? లేదా బీజేపీ గెలిచిందని అనుకునేసి, మన పనుల్లో మనం పడిపోవాలా?

– రమేశ్ శ్రీవత్స్, సెటైరిస్ట్

జానపద గాథల్లో... సమ్మక్క

ఇంతింతై వటుడింతయై...

ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జన జాతరగా ప్రసిద్ధిగాంచిన 'మేడారం సమ్మక్క జాతర'కు కారకులైన గిరిజన వీరవనితలు సమ్మక్క, ఆమె కూతురు సారలమ్మల పుట్టుపూర్వోత్తరాల గురించి అందుబాటులో గల ఆధారాలతో తెలుసుకునే ప్రయత్నం చేద్దాం. 13వ శతాబ్దానికి చెందిన కాకతీయ రాజు ప్రతాపరుద్రునితో జరిగిన పోరాటంలో కుట్రతో ఒక సైనికుడు దొంగ చాటుగా బల్లెంతో చేసిన దాడిలో సమ్మక్క క్షతగాత్రురాలై చిలకలగుట్ట వద్ద అదృశ్యమైనట్టు జనసామాన్యంలో ప్రచారంలో ఉన్న కథల ద్వారా తెలుస్తోంది.

కానీ కాకతీయ రాజ్య చరిత్రలో మేడారం పోరాటం, సమ్మక్క– పగిడిద్దరాజుల సామంత రాజ్యం గురించిన ప్రస్తావన లేదు. గిరిజనుల ఆశ్రిత కులం వారు డోలీలు. వీరు 'పడిగె' అనే త్రికోణాకార గుడ్డపటం సాయంతో గిరిజన పూర్వీకుల చరిత్ర, వీర గాథలను 'డోలి' వాయిస్తూ గానం చేస్తారు. మణుగూరు ప్రాంతంలోని గూడెంకు చెందిన డోలి కళాకారుడు 'సకిన రామచంద్రయ్య' చెప్పే పడిగె కథ ప్రకారం: పేరంబోయిన కోయ రాజు వంశానికి చెందిన ఆరవ గట్టు సాంబశివ రాజు– తూలు ముత్తి దంపతులకు ఐదుగురు సంతానం – సమ్మక్క పెద్దకూతురు. ఆమెకు యుక్త వయస్సు రావడంతో బస్తరు ప్రాంతానికి వెళ్లి పగిడిద్ద రాజును చూసి ఆయనతో పెళ్లి చేయ నిశ్చయించాడు తండ్రి. మేడారం దగ్గరి కామారం గ్రామానికి చెందిన గిరిజన నాయకుడు మైపతి అరుణ్ కుమార్ తన క్షేత్ర పర్యటనలు, పూర్వీకుల మౌఖిక కథల ద్వారా సేకరించిన సమాచారం ప్రకారం... కోయత్తూర్ సమాజంలోని ఐదవ గట్టు 'రాయి బండని రాజు' వంశానికి చెందిన ఆడబిడ్డ సమ్మక్క.



'చందా' ఇంటి పేరు గల రాయి బండాని రాజుకు ఇద్దరు భార్యలు. ఆ రాజుకు వెదురు పొదల వద్ద ముద్దులొలికే పసిపాప కనిపిస్తుంది, ఆ పాపను ఇంటికి తెచ్చి సమ్మక్క అని పేరు పెట్టి పెంచుకున్నారు. ఈ రాజుకు నాగులమ్మ అనే మరో కుమార్తె జన్మించింది. కోయ వారి సంప్రదాయం ప్రకారం తొలిసూరి బిడ్డను ఇంటి వేల్పుగా కొలుస్తారు. అందుకే సమ్మక్క చందా వారి ఇలవేల్పు అయ్యింది. ఈ రెండు కథనాల్లోనూ పగిడిద్దరాజుతో సమ్మక్క వివాహాన్ని ఆమె తండ్రి కుదుర్చుతాడు. అయితే నాటకీయ పరిణామాల మధ్య సమ్మక్క, నాగులమ్మలను ఇద్దరినీ పగిడిద్దరాజు వివాహం చేసుకుంటాడు. స్వాతంత్ర్యానికి పూర్వం నైజాం రాజ్యంలో చందా, సిద్ధబోయిన ఇంటిపేర్లున్న గిరిజన కుటుంబాలు మాత్రమే చేసుకునే చిన్న జాతర ఇది. ప్రతి ఏటా జాతర చేసే స్థోమత లేక రెండేళ్లకోమారు అది కూడా చందాలు వేసుకునీ, అవీ చాలక వరంగల్‌లోని వర్తకులు దగ్గర వడ్డీలకు డబ్బులు తెచ్చి ఈ జాతర నిర్వహించేవారు. 1961లో నాటి రాష్ట్ర ప్రభుత్వం జాతర నిర్వహణ, పర్యవేక్షణ బాధ్యతలు చేపట్టింది. 1996లో 'రాష్ట్ర అధికారిక పండుగ'గా గుర్తించింది. పాలకులు, భక్తుల కృషితో నేడు ఉన్న స్థితికి ఈ జాతర చేరింది.

– డా॥ అమ్మిన శ్రీనివాసరాజు, పరిశోధక రచయిత

(నేటి నుంచి ఫిబ్రవరి 23 వరకు మేడారం జాతర)

కుంకుమ భరిణ రూపంలో...

సమ్మక్క ఓ కోయరాజు కుమార్తెగా జానపద కథలు చెబుతున్నాయి. ప్రతాపరుద్రునితో జరిగిన యుద్ధంలో తమ వారంతా మరణించడంతో సమ్మక్క వీరావేశంతో శత్రు మూకలను సంహరించింది. కానీ ఒక సైనికుడు ఆమెను వెన్నుపోటు పొడవడంతో రక్తపు టేరుల మధ్య అడవి వైపు వెళ్తూ అదృశ్యమయ్యింది. గిరిజనులు ఆమె కోసం వెదుకుతుండగా చిలకల గుట్టపై నెమలినార చెట్టుకింద కుంకుమ భరిణ కనిపించింది.

తన శక్తియుక్తులనూ, ధైర్యసాహసాలనూ సమ్మక్క ఆ భరిణలో నిలిపిందని భావించి ఆమె ప్రతి రూపంగా భావించారు గిరిజనులు. అక్కడే గద్దెలను నిర్మించి అప్పటినుండి సమ్మక్క సారలమ్మ జాతర జరిపించ సాగారు.


మాఘశుద్ధ పౌర్ణమి నుండి నాలుగు రోజులు ఈ జాతర అంగరంగ వైభవంగా జరుగుతుంది. మొదటిరోజు కన్నెపల్లి నుండి సారలమ్మకు ప్రతి రూపమైన పసుపు భరిణను మేళతాళాలతో తీసుకువచ్చి వెదురు కర్రకు పట్టుదారంతో కడతారు. రెండవ రోజు సమ్మక్కకు ప్రతిరూపంగా భావించే కుంకుమభరిణను చిలకల గుట్టనుండి తీసుకువచ్చి వెదురుకర్రకు అలంకరిస్తారు.

రెండు గద్దెలపై రెండు వెదురు కర్రలను సమ్మక్క, సారలమ్మలుగా ప్రతిష్ఠించి పూజలు చేస్తారు. ఈ సమయంలో భక్తులు పూనకాలతో ఊగిపోతారు. మూడవ రోజు 'వనదేవతలు'గా భక్తులకు దర్శనమిస్తారు. భక్తులు బెల్లాన్ని బంగారంగా భావించి అమ్మవార్లకు నివేదిస్తారు. జంపన్న వాగులో స్నానం చేసి, తలనీలాలు సమర్పించుకుంటారు. కోరికలు నెరవేరాలని వేడుకుంటారు. నాలుగవ రోజు సమ్మక్క, సారలమ్మల వన ప్రవేశంతో జాతర ముగుస్తుంది.

– అయిత అనిత, రచయిత్రి

భాషా అవరోధాలను అధిగమించి న్యాయం

సందర్భం



డా॥ మంగారి రాజేందర్

ఈ మధ్య భాష గురించిన రెండు వార్తలు నా దృష్టిని ఆకర్షించాయి. మొదటిది వీడియో. రెండవది వార్త. వీడియో ప్రకారం ఓ వ్యక్తి ఇలా అంటాడు – 'మన దేశంలో ఇంగ్లీష్ మాతృభాషగా కలిగిన వ్యక్తుల సంఖ్య 2 లక్షల 70 వేల మంది. మిగతా వ్యక్తులవి విభిన్న భాషలు. అయితే సుప్రీంకోర్టు మాత్రం తన తీర్పులను ఇంగ్లీష్‌లో ప్రకటిస్తుంది. ఇంగ్లీష్‌లోనే వాదనలను వింటుంది. నా భాషలో సుప్రీంకోర్టులో నేను మాట్లాడలేను. ప్రజాస్వామ్యం అంటే అర్థం ఏమిటి? కేసు నాది. నాకు హిందీ వచ్చు. నా న్యాయవాది ఇంగ్లీష్‌లో ఏవో వాదనలు చేస్తాడు. న్యాయమూర్తి కూడా ఇంగ్లీష్‌లో ఏవో అడుగుతాడు. ఆ తరువాత తన నిర్ణయాన్ని ప్రకటిస్తాడు. వాళ్ళు ఏం వాదనలు చేశారో నాకు తెలియదు. కోర్టు ఏమి తీర్పును ప్రకటించిందో అంతకంటే తెలియదు. ఈ ప్రక్రియలో నా పాత్ర లేదు. ఇది బాధ కలిగించే విషయం.'

ఇది ఇలా ఉంటే 2022 జనవరిలో మరో సంఘటన గుజరాత్ హైకోర్టులో జరిగింది. అప్పుడు గుజరాత్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అరవింద్ కుమార్. ఆయన కర్ణాటక రాష్ట్రానికి చెందిన వ్యక్తి. ఆయన మాతృభాష కన్నడ. ఆయనకు గుజరాతీ భాష తెలియదు. ప్రధాన న్యాయమూర్తి అరవింద్ కుమార్ నేతృత్వంలోని డివిజన్ బెంచ్‌లోని మరో న్యాయమూర్తి జస్టిస్ అశుతోష్ జె. శాస్త్రి. ఓ కోర్టు ధిక్కరణ నోటీసుని ఎదుర్కొంటున్న ఓ జర్నలిస్ట్ గుజరాతి భాషలో తన వాదనలను వినిపించడానికి ఆ బెంచ్ ముందు ప్రయత్నం చేశారు. అతని వాదనలను వినడానికి కోర్టు అంగీ కరించలేదు. 'కోర్టుకు మరీ ముఖ్యంగా నాకు (ప్రధాన న్యాయమూర్తికి) అర్థం కాని భాషలో వాదనలను మేం అంగీకరించలేము. రాజ్యాంగంలోని ఆర్టికల్ 348 ప్రకారం హైకోర్టు అధికార భాష ఇంగ్లీష్. అందుకని అతను తన వాదనలను గుజరాతీలో చెప్పడానికి మేం అంగీకరించం' అని కోర్టు తన ఉత్తర్వుల్లో పేర్కొంది.

సుప్రీంకోర్టులో అన్ని రాష్ట్రాలకు సంబంధించిన న్యాయమూర్తులు ఉంటారు. వారి మాతృభాషలు వేరు. అదే విధంగా హైకోర్టులలో ఎక్కువ శాతం ఆ రాష్ట్రానికి చెందిన న్యాయమూర్తులే ఉన్నప్పటికీ కొంతమంది వేరే రాష్ట్రాలకు చెందిన వారు కూడా ఉంటారు. ఈ రెండు పరిస్థితులను గమనించినప్పుడు రెండిటిలోనూ న్యాయం కనిపిస్తుంది. ఈ పరిస్థితిని అధిగమించడం ఎలా?

రాజ్యాంగంలోని ఆర్టికల్ 348 (1) (ఎ) ప్రకారం పార్లమెంటు మరో విధంగా చెప్పనంత వరకు సుప్రీంకోర్టు, హైకోర్టులలోని కార్య కలాపాలు ఇంగ్లీష్‌లోనే జరగాలి. ఆర్టికల్ 348 (2) ప్రకారం 348 (1)తో సంబంధం లేకుండా రాష్ట్రపతి పూర్వ అనుమతితో ఆ రాష్ట్ర గవర్నర్ హైకోర్టులోని కార్య కలాపాలను హిందీలో గాని ఇతర భాషలలో గాని జరపడానికి ఆ యా ప్రభుత్వాలు చర్యలు తీసుకున్నాయి. తమిళనాడు రాష్ట్రం కూడా ఆ దిశగా ప్రయత్నం చేస్తోంది. సుప్రీంకోర్టు, హైకోర్టుల్లో హిందీని ప్రాథమిక భాషగా రాజ్యాంగం గుర్తించింది.

రాజ్యాంగంలోని ఆర్టికల్ 19, 21ల ప్రకారం ప్రతి లిటిగెంట్‌కీ కోర్టు కార్యకలాపాలు అర్థం చేసుకునే హక్కు వుంటుంది. అది ప్రాథమికమైనది. అదే విధంగా కోర్టులో తన భాషలో మాట్లాడే హక్కు కలిగి వుంటాడు. అప్పుడే అతనికి న్యాయం గురించి తెలుసుకునే పరిస్థితి ఏర్పడుతుంది. సుప్రీంకోర్టు దాకా వ్యక్తిగతంగా కక్షిదారులు వెళ్ళే అవకాశాలు తక్కువ. కానీ హైకోర్టులకు వెళ్ళే అవకాశం ఎక్కువగా ఉంది. తన భాష తెలిసిన న్యాయమూర్తుల ముందు అతను వాదనలు వినిపించే అవకాశం కల్పిస్తే ఈ పరిస్థితులను కొంతమేరకైనా అధిగమించవచ్చు.



జిల్లా కోర్టుల పరిస్థితి వేరు. అక్కడ కోర్టు కార్యకలాపాలు తెలుగులో జరపడానికి ఎలాంటి ఆటంకాలూ లేవు. సివిల్ ప్రొసీజర్ కోడ్‌లోని 137 ప్రకారం తెలుగు భాషను కోర్టు భాషగా హైకోర్టుని సంప్రదించి ప్రభుత్వం నిర్ధారించింది. అదే విధంగా క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ లోని సెక్షన్ 272 ప్రకారం తెలుగును కోర్టు భాషగా ప్రభుత్వం నిర్ధారించింది.

సుప్రీంకోర్టు ఈ మధ్య 'ఎలక్ట్రానిక్ కోర్టు రిపోర్ట్స్' అనే ప్రాజెక్టు ద్వారా ప్రాంతీయ భాషల్లో సుప్రీంకోర్టు తీర్పులను ఉచితంగా అందచేస్తోంది. దేశంలోని 99.9 శాతం ప్రజలకు ఇంగ్లీష్ రాదని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి. వై. చంద్రచూడ్ అన్నారు. ప్రాంతీయ భాషలో తీర్పులను తీసుకొని రావడానికి ఆయన కృషి చేస్తున్నారు. ఈ చర్యలను ప్రధానమంత్రి కూడా ప్రశంసించారు. తెలంగాణ రాష్ట్ర జ్యుడీషియల్ అకాడమీ ఇచ్చిన స్ఫూర్తితో ఓ మహిళా న్యాయమూర్తి తన తొలి తీర్పును తెలుగులో ప్రకటించటం తెలుగు భాషాభిమానులకే కాదు, కోర్టుకు వచ్చే వ్యక్తులకూ ఆనందం కలిగించింది. మరెంతో మంది న్యాయమూర్తులు ఆ దిశగా తెలుగులో న్యాయపాలన కొనసాగించి ప్రజలకు చేరువ అవుతారని ఆశించవచ్చు.

వ్యాసకర్త రచయిత, విశ్రాంత జిల్లా సెషన్స్ జడ్జి

(నేడు అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం)

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘ మాసం, **తిథి:** శు.ద్వాదశి ప.12.39 వరకు, తదుపరి త్రయోదశి, **నక్షత్రం:** పునర్వసు ప.3.32 వరకు, తదుపరి పుష్యమి, **వర్జ్యం:** రా.12.07 నుండి 1.47 వరకు, **దుర్ముహూర్తం:** ప.11.51 నుండి 12.39 వరకు, **అమృత ఘడియలు:** ప.1.02 నుండి 2.44 వరకు ; **రాహుకాలం:** ప.12.00 నుండి 1.30 వరకు, **యమగండం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **సూర్యోదయం:** 6.29, **సూర్యాస్తమయం:** 5.58.



నయన మనోహరం.. ఊయల మహోత్సవం

ఆలయంలోకి ప్రవేశించిన ఉయ్యూరు వీరమ్మతల్లి

వీరమ్మతల్లి తిరునాళ్ల మహోత్సవంలో భాగంగా మంగళవారం రాత్రి ఉయ్యూరు పట్టణంలో అమ్మవారి ఊయల మహోత్సవం కనులపండువగా సాగింది. మెట్టినింటి నుంచి బయలుదేరిన అమ్మవారు ప్రధాన సెంటర్‌లోని ఊయల స్తంభం వద్దకు చేరుకున్నారు. ప్రత్యేకంగా ముస్తాబుచేసిన ఊయలపై అమ్మవారిని ఉంచారు. అమ్మవారు ఊయల ఊగే సన్నివేశాన్ని వీక్షిస్తూ భక్తులు తన్మయత్వం చెందారు. ఈ ఉత్సవాన్ని వీక్షించేందుకు ఉమ్మడి కృష్ణాజిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన భక్తులతో ఉయ్యూరు పట్టణం భక్తజనసంద్రంగా మారింది. ఊయల ఉత్సవాన్ని పూర్తిచేసుకున్న అమ్మవారు తిరుగుడు గండదీప భక్తులు వెంటరాగా ఆలయ ప్రవేశం చేశారు. - ఉయ్యూరు

నేటి నుంచి సచివాలయాల్లో ఉద్యోగుల సర్దుబాటు

ప్రతి వార్డు, గ్రామ సచివాలయంలో కనీసం 8 మంది ఉండేలా చర్యలు

27, 28, 29 తేదీల్లో సీనియారిటీ ప్రకారం కౌన్సెలింగ్

దాదాపు 5 వేల మంది ఉద్యోగుల సర్దుబాటుకు అవకాశం



సాక్షి, అమరావతి: గ్రామ, వార్డు సచివాలయాల్లో ఉద్యోగుల సర్దుబాటు ప్రక్రియ గురువారం నుంచి ఆరంభం కానుంది. కొద్దినెలల క్రితం పెద్దఎత్తున గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీలు కొనసాగాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుతం కొన్ని సచివాలయాల్లో ఎక్కువ మంది, మరి కొన్ని సచివాలయాల్లో తక్కువ మంది ఉద్యోగులు పనిచేస్తున్న పరిస్థితి నెలకొంది. ఈ దృష్ట్యా అన్ని గ్రామ, వార్డు సచివాలయాల్లో కనీసం 8 మంది ఉద్యోగులు తప్పనిసరిగా పనిచేసేలా ప్రభుత్వం రేషనలైజేషన్ (ఉద్యోగుల సర్దుబాటుకు పూనుకున్న విషయం తెలిసిందే. 10 రోజుల క్రితమే ఇందుకు సంబంధించి ప్రభుత్వం విధివిధానాలతో కూడిన ఉత్తర్వులు జారీ చేయగా.. జిల్లాలో సర్దుబాటు ప్రక్రియకు సంబంధించిన తేదీల వారీగా షెడ్యూల్‌ను గ్రామ, వార్డు సచివాలయాల శాఖ మంగళవారం ఖరారు చేసింది. ఈ మేరకు సచివాలయాల శాఖ డైరెక్టర్ ధ్యాన్‌చంద్ర మెమో ఉత్తర్వులు జారీ చేశారు.

సర్దుబాటు ఇలా..

- గురువారం (22వ తేదీ)కల్లా జిల్లాల వారీగా 8 మంది కన్నా తక్కువ మంది పనిచేస్తున్న గ్రామ, వార్డు సచివాలయాలు.. 8 మంది కంటే ఎక్కువ మంది పనిచేస్తున్న సచివాలయాల వివరాలతో అధికారులు నివేదికలు రూపొందిస్తారు.
- ఈ నెల 24వ తేదీకల్లా 8 మంది కంటే తక్కువ ఉద్యోగులు పనిచేస్తున్న సచివాలయాల్లో ఏ కేటగిరి ఉద్యోగ స్థానాలు ఖాళీగా ఉన్నాయో గుర్తిస్తారు.
- ఆ పోస్టుల భర్తీకి ఇప్పటికే సచివాలయాల ఉద్యోగుల రేషనలైజేషన్ ప్రక్రియ కోసం ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్న నిబంధనల ప్రకారం ఎక్కువ మంది ఉద్యోగులు పనిచేస్తున్న సచివాలయాల నుంచి సర్దుబాటుకు ఎవరెవరిని ఒకచోట నుంచి మరోచోటకు బదలాయించే ఉద్యోగుల జిల్లాల వారీగా జాబితాను సిద్ధం చేస్తారు. ప్రతి సచివాలయంలో కనీసం 8 మంది పనిచేసే అవకాశం ఉన్నంతవరకు అవసరమైన ఉద్యోగులకు పరిమితే ఆయా జాబితాను జిల్లా అధికారులు సిద్ధం చేస్తారు.
- సర్దుబాటు ప్రక్రియ కోసం జిల్లాల వారీగా ఎంపిక చేసిన ఉద్యోగులకు ఈ నెల 27, 28, 29 తేదీల్లో సీనియారిటీ ప్రకారం కౌన్సెలింగ్ నిర్వహించి, సర్దుబాటు ప్రక్రియలో పేర్కొన్న ఖాళీల ప్రకారం ఆ ఉద్యోగులకు నచ్చిన సచివాలయానికి బదలాయించే ప్రక్రియ చేపడతారు.
- రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మొత్తం 15,004 గ్రామ, వార్డు సచివాలయాల్లో దాదాపు 1.34 లక్షల మంది ఉద్యోగులు పనిచేస్తుండగా.. ఈ సర్దుబాటు ప్రక్రియలో సుమారు 5 వేల మంది ఉద్యోగులు స్థానచలనం కలిగే పరిస్థితి ఉంటుందని గ్రామ వార్డు సచివాలయాల శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.
- మరోవైపు సర్దుబాటు ప్రక్రియ చేపట్టే సమయంలోనే.. ఎక్కడైనా భార్యభర్తలు వేర్వేరు సచివాలయా ల్లో పనిచేస్తుంటే.. వారి అభ్యర్థన మేరకు ఇరువురు ఒకేచోట బదిలీకి అవకాశం కల్పిస్తారు. కేవలం భార్యభర్తల కోటాకే పరిమితమై కొనసాగే ఈ బదిలీలు జిల్లా పరిధిలో అంతర్గతంగానూ, అదే సమయంలో ఒక జిల్లా నుంచి మరొక జిల్లాకు అవ కాశం కల్పించనున్నట్టు అధికారులు పేర్కొన్నారు.

మోసకారి బాబూ మీకో దండం

- టీడీపీకి, నూజివీడు ఇన్‌చార్జి పదవికి ముద్దరబోయిన రాజీనామా



చంద్రబాబు ఫ్లెక్సీని తొలగిస్తున్న ముద్దరబోయిన

సాక్షి ప్రతినిధి ఏలూరు/నూజివీడు: తెలుగు దేశం పార్టీకి, ఆ పార్టీ నూజివీడు నియోజక వర్గ ఇన్‌చార్జి పదవికి రాజీనామా చేస్తున్నట్టు మాజీ ఎమ్మెల్యే ముద్దరబోయిన వెంకటేశ్వరరావు ప్రకటించారు. ఏలూరు జిల్లా నూజివీడులోని తన కార్యాలయంలోని మీటింగ్ హాల్‌లో టీడీపీ అధినేత చంద్రబాబు ఫొటోతో కూడిన ఫ్లెక్సీని మంగళవారం ముద్దరబోయిన వెంకటేశ్వరరావు స్వయంగా తొలగించారు. అనంతరం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. నియోజకవర్గంలో పదేళ్ల పాటు పనిచేసి టీడీపీని పటిష్టంగా తయారు చేస్తే ఇప్పుడు చంద్రబాబుకు తాను పనికిరాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. 2014లో ఎవరూ లేకపోవడంతో తాను అడగకుండానే యనమల రామకృష్ణుడితో కబురు చేసి నూజివీడు టిక్కెట్ ఇచ్చారని, ఇప్పుడు టిక్కెట్ నిరాకరించడంపై కారణమేమిటో అడుగుతుంటే చంద్రబాబు వద్ద సమాధానమే లేదని చెప్పారు. తనను పదేళ్ల పాటు వాడుకొని బలిపశువును చేశారని ధ్వజమెత్తారు. ఉరిశిక్ష వేసేటప్పుడు కూడా ఆఖరి కోరిక ఏమిటని జడ్జి అడుగుతారని, టీడీపీలో మాత్రం అలాంటి నైతిక విలువలు ఏమీ లేవని దుయ్యబట్టారు. 'చంద్రబాబుకు, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడికి, యనమల రామకృష్ణుడికి నమస్కారం, టీడీపీకి నమస్కారం' అంటూ చేతులెత్తి దండం పెట్టారు. తన అభిమానులు, సానుభూతిపరులు, కలిసివచ్చే కార్యకర్తలు, నాయకులతో చర్చించి వారి నిర్ణయం మేరకు త్వరలోనే భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తానన్నారు.

నమ్మించి.. మోసం చేశారు: చంద్రబాబు పైకి ఏం చెబుతారో.. అది చేయరని, అనివార్య కారణాల వల్ల తాను సీటు ఇవ్వడం లేదని చెబుతున్నారే తప్పితే ఆ కారణాలు ఏమిటో మాత్రం చెప్పడం లేదని ముద్దరబోయిన విమర్శించారు. గతేడాది బస్సు యాత్రలో భాగంగా నూజివీడు వచ్చినప్పుడు, ఆ తరువాత పెద్దాపురం పిలిచి నూజివీడు టిక్కెట్ తనకేనని చంద్రబాబు చెప్పారని, తీరా ఎన్నికలు దగ్గరకు వచ్చేసరికి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యేకు టీడీపీ టికెట్ అంటూ లీకులు ఇచ్చారని ధ్వజమెత్తారు. కరోనా సమయంలో పార్టీ రాష్ట్ర కార్యాలయాన్ని మూసేసినా, నూజివీడులో తన కార్యాలయాన్ని మూయలేదని, పార్టీ కార్యకర్తలకు సేవ చేస్తూనే ఉన్నానని తెలిపారు. తనను పదేళ్లపాటు వాడుకొని అన్యాయంగా బయటకు గెంటివేసిన వారి అంతు చూస్తానని ఆయన స్పష్టం చేశారు. తనకు జరిగిన అన్యాయంపై పోరాడతానని తెలిపారు. పుట్టగతులు లేకుండా పోయే పరిస్థితి టీడీపీకి వచ్చిందని, తనకు అన్యాయం చేసిన ఆ పార్టీ సంగతి చూస్తానని హెచ్చరించారు.

బాలికపై టీడీపీ కార్యకర్త లైంగిక దాడి



బాలికపై లైంగిక దాడికి పాల్పడిన నిందితుడు టీడీపీ కార్యకర్త సెల్వరాజ్

రామకుప్పం(చిత్తూరు జిల్లా): రామకుప్పం మండలం బల్ల గ్రామానికి చెందిన ఓ బాలిక(12)పై అదే గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త సెల్వరాజ్ లైంగిక దాడికి పాల్పడ్డాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం... బల్ల గ్రామానికి చెందిన సెల్వరాజ్(24)కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. తాపీ మేస్త్రిగా పని చేస్తున్న సెల్వరాజ్ టీడీపీలో క్రియాశీలక కార్యకర్తగా వ్యవహరిస్తున్నాడు. అతను ఆదివారం మధ్యాహ్నం గ్రామానికి చెందిన ఓ బాలిక తన ఇంట్లో ఉండగా, బయటకు వెళ్లిన ఆమె తండ్రి పిలుస్తున్నాడని చెప్పి బైక్‌పై ఎక్కించుకుని పాలరేవుగడ్డ అటవీ ప్రాంతానికి తీసుకువెళ్లాడు. అక్కడ బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. భయంతో బాలిక బిగ్గరగా ఏడుస్తూ కేకలు పెట్టడంతో అటుగా వెళ్తున్న స్థానికులు గమనించి బాలికను కాపాడారు. ఈ సమాచారం తెలుసుకున్న గ్రామస్తులు సెల్వరాజ్‌కు దేహశుద్ధి చేశారు. బాలిక తల్లిదండ్రులు సోమవారం రాత్రి రామకుప్పం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన ఎస్ఐ శివకుమార్ మంగళవారం ఉదయం సెల్వరాజ్‌ను అదుపులోకి విచారిస్తున్నట్లు తెలిసింది. కాగా, కుప్పం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధిత బాలికను మంగళవారం ఎమ్మెల్సీ భరత్ పరామర్శించారు. కామాంధుడి చేతిలో లైంగిక దాడికి గురైన బాలికకు మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్యులను ఆయన కోరారు. కుప్పం మున్సిపల్ చైర్మన్ డాక్టర్ సుధీర్, ఏఎంసీ చైర్మన్ విద్యాసాగర్ కూడా ఆయన వెంట ఉన్నారు.

నేత్రపర్వం.. నరసన్న రథోత్సవం



రథోత్సవానికి హాజరైన భక్తులు

సాక్షి, అమలాపురం: గోవింద నామస్మరణ.. వేద పండితుల మంత్రోచ్చారణలతో ఆది దేవుడు అంతర్వేది శ్రీలక్ష్మీ నరసింహస్వామి రథోత్సవం వైభవంగా సాగింది. మంగళవారం భీష్మ ఏకాదశి పర్వదినాన మాడవీధుల్లో నిర్వహించిన రథయాత్ర అపూర్వ ఘట్టంగా నిలిచింది. బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేదిలో జరిగిన ఈ కార్యక్రమానికి వేలాదిగా భక్తులు వచ్చారు. కల్యాణం మరుసటి రోజు ఇంటి ఆడపడుచు గుర్రాలక్కకు చీర, సారె పెట్టేందుకు రథంపై స్వామివారు, అమ్మవార్లు వెళ్లడం ఆనవాయితీ. దీనిలో భాగంగా స్వామివారి రథయాత్ర మధ్యాహ్నం 2:05 గంటలకు మెరక వీధి నుంచి మొదలై గుర్రాలక్క ఆలయం వరకు వెళ్లి తిరిగి అక్కడ నుంచి పల్లపు వీధి 16 కాళ్ల మంటపానికి చేరుకుంది. మొగల్తూరుకు చెందిన ఆలయ చైర్మన్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ రాజా కలిదిండి కుమార రామగోపాలరాజా బహద్దూర్, ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు కొబ్బరికాయలు కొట్టి రథయాత్రకు శ్రీకారం చుట్టారు. కల్యాణం పూర్తికాగానే భక్తులు సముద్ర స్నానాలాచరించి ఆలయం వద్దకు చేరుకుని స్వామి వారిని దర్శించుకున్నారు. వీరందరికీ ఆలయ వర్గాలు అన్నదానం చేశాయి.

వైభవంగా వాసవీ మాత స్వర్ణ కిరీట ధారణ

ప్రత్యేక పూజల్లో కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్



పెనుగొండ: పశ్చిమ గోదావరి జిల్లా పెనుగొండలో అఖిల భారత శ్రీవాసవీ పెనుగొండ ట్రస్ట్ ఆధ్వర్యంలోని వాసవీ శాంతిధాంలో 90 అడుగుల వాసవీ కన్యకాపరమేశ్వరి పంచలోహ విగ్రహ పంచమ ప్రతిష్ఠాపన మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం మరకత శిల వాసవీ మాత విగ్రహానికి స్వర్ణ కిరీట ధారణ ఘనంగా నిర్వహించారు. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్, రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ హాజరయ్యారు. వీరికి ట్రస్ట్ అధ్యక్షుడు డాక్టర్ పీఎస్ గోవిందరాజులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ వాసవీ మాతకు, స్వర్ణ కిరీటానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల అనంతరం ఆలయ అర్చకుడు శిష్టామణికంఠ అమ్మవారికి స్వర్ణ కిరీటాన్ని అలంకరించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు చెరుకువాడ శ్రీరంగనాథ రాజు, పితాని సత్యనారాయణ పాల్గొన్నారు.

రాజ్యసభ సభ్యులుగా వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల ఎన్నిక ఏకగ్రీవం

సాక్షి, అమరావతి: రాజ్యసభలో ఏప్రిల్ 2వ తేదీతో ఖాళీ కానున్న మూడు స్థానాలకు నిర్వహించిన ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు గొల్ల బాబూరావు, మేడా రఘునాథరెడ్డి, వైవీ సుబ్బారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ మంగళవారంతో పూర్తయ్యింది. నామినేషన్లు దాఖలు చేసిన ముగ్గురు వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు రాజ్యసభకు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లుగా ఎన్నికల సంఘం ప్రకటించింది. రాజ్యసభలో రాష్ట్ర కోటాలో 11 స్థానాలు ఉన్నాయి. ఇందులో ఇప్పటికే వైఎస్సార్‌సీపీకి 8 మంది సభ్యులున్నారు. ఇప్పుడు మిగతా మూడు స్థానాలూ వైఎస్సార్‌సీపీ ఖాతాలోకి చేరాయి. దాంతో రాజ్యసభలో రాష్ట్ర కోటాకు సంబంధించిన 11 స్థానాలూ వైఎస్సార్‌సీపీ పరమయ్యాయి. టీడీపీ బలం సున్నాకు చేరింది. టీడీపీ ఆవిర్భవించినప్పటి నుంచి ఇప్పటివరకు.. 41 ఏళ్ల చరిత్రలో రాజ్యసభలో టీడీపీ అడ్రస్ గల్లంతవ్వడం ఇదే మొదటిసారి కావడం గమనార్హం.

కారు, ఆటో ఢీ... ముగ్గురి దుర్మరణం

- ప్రకాశం జిల్లాలో ఘటన
- ఇద్దరు రైతులు, వెల్ఫేర్ అసిస్టెంట్ మృతి



మంటల్లో దగ్ధమవుతున్న ఆటో



చిన్నవెంకటేశ్వరనాయుడు, చిత్తారు రాములు (ఫైల్) వెంకటేశ్వర్లు మృతదేహం

బేస్తవారిపేట: నిద్రమత్తులో కారు... ఆటోను ఢీకొట్టిన ఘటనలో ఇద్దరు రైతులు, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ మృతి చెందిన ఘటన ప్రకాశం జిల్లా బేస్తవారిపేట మండలంలోని పూసలపాడు రహదారిపై మంగళవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఆటో డ్రైవర్ షేక్ ఖాశీంషా, కారులోని బైనగాని ఓబయ్య, గురవయ్య తీవ్రంగా గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే... బేస్తవారిపేట మండలంలోని ప్రకాశం జిల్లా, బార్లకుంటకు చెందిన చిత్తారు వెంకటేశ్వర్లు (53), చిత్తారు రాములు (40), బిళ్ల చిన్నవెంకటేశ్వర నాయుడు కలిసి ఎండుమిర్చి పంటను అమ్ముకునేందుకు గుంటూరు మిర్చియార్డుకు వెళ్లారు. విక్రయించిన సొమ్ముతో గుంటూరులో రైలు ఎక్కారు. కంభంలో దిగాల్సి ఉండగా, నిద్రపోవడంతో గిద్దలూరులో దిగారు. అక్కడ నుంచి బేస్తవారిపేటకు వచ్చేందుకు ఆటో ఎక్కారు. మరోవైపు విజయవాడలో కొత్తగా కొనుగోలు చేసిన కారును తీసుకుని తండ్రీకొడుకులు ఓబయ్య, గురవయ్య వెళుతూ మార్గమధ్యంలో నిద్రమత్తులో పూసలపాడు వద్ద ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొట్టారు. దీంతో ఆటో నుజ్జు నుజ్జు అయ్యింది. అందులో ఇరుక్కుపోయిన ముగ్గురిలో వెంకటేశ్వర్లును రోడ్డుపై వెళ్లే వాహనదారులు బయటకు తీశారు. ఆ సమయానికే అతడు మృత్యువాత పడ్డాడు. రాములు, చినవెంకటేశ్వర నాయుడు ఆటోలో చిక్కుకుపోయారు. ఈలోగా లీకైన ఆయిల్ ట్యాంక్ నుంచి మంటలు వ్యాపించడంతో ఇద్దరి శరీరాలు కాలిపోయాయి. వారి వద్ద మిర్చి పంట విక్రయించిన సొమ్ము రూ.10లక్షలు కాలి బూడిదైపోయాయి. మృతుడు చిన్న వెంకటేశ్వర నాయుడు సీఎస్‌పురం మండలం, నల్లమడుగుల సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు.

పొగమంచుతో విమానాలకు ఇక్కట్లు

గన్నవరం: దట్టమైన పొగమంచు వల్ల విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం (గన్నవరం)లో విమానాల రాకపోకలకు తిప్పలు తప్పడం లేదు. ఎయిర్‌పోర్ట్ రన్‌వే ప్రాంతాన్ని మంగళవారం ఉదయం 9 గంటల వరకు దట్టమైన పొగమంచు కప్పి వేసింది. దీంతో ఉదయం 7.40 గంటలకు షార్జా నుంచి వచ్చిన ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ విమానం, ఢిల్లీ, హైదరాబాద్, చెన్నై, బెంగళూరు నుంచి వచ్చిన విమానాలు రన్‌వేపై విజిబులిటీ లేకపోవడంతో గంటలకుపైగా గాల్లో చక్కర్లు కొట్టాయి. వాతావరణం అనుకూలించకపోవడంతో షార్జా విమానాన్ని హైదరాబాద్‌కు దారి మళ్లించారు.

ఆలపాటి ఔట్

సీటు లేదని తేల్చిన లోకేశ్



తెనాలి: తెనాలి అసెంబ్లీ నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీకి ప్రయత్నాలు చేస్తున్న మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆశల అడియాసలయ్యాయి. ఆయనకు పార్టీ టికెట్ లేదని సాక్షాత్తూ నారా లోకేశ్ మంగళ వారం తేల్చి చెప్పేశారు. 2024 ఎన్నికలకు జనసేన, టీడీపీ పొత్తుల నేపథ్యంలో తెనాలి నుంచి ఉమ్మడి అభ్యర్థిగా జనసేన పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ రంగం సిద్ధం చేసుకుంటున్న విషయం తెలిసిందే. తెనాలి నుంచి నాదెండ్ల మనోహర్ పోటీచేస్తారని, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ రెండు నెలల క్రితమే మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో తెనాలి జనసేన నేతలకు స్పష్టం చేసిన విషయం తెలిసిందే. అయినప్పటికీ పార్టీ వర్గాలను మభ్యపెడుతూ తానూ పోటీలో ఉన్నట్టుగా ప్రచారం చేసుకుంటూ వచ్చారు ఆలపాటి. పైగా ప్రజా చైతన్యయాత్ర పేరుతో నియోజకవర్గంలో పాదయాత్ర కూడా చేపట్టారు. వార్డులవారీ సమావేశాల్లో పాల్గొంటున్నారు. నాదెండ్ల మనోహర్‌తో పోలిస్తే పార్టీ సర్వేలో తనకే ఎక్కువ స్కోరు ఉన్నట్టుగా కార్యకర్తలు, నాయకులకు చెప్పారు. చివరి నిముషంలో తనకే టికెట్ వస్తుందని నమ్మబలుకుతూ వచ్చారు. ఈ నేపథ్యంలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ మంగళవారం దీనిపై స్పష్టత ఇచ్చినట్టు తెలిసింది. గుంటూరు ఎంపీ స్థానం నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీచేస్తే చెయ్... లేదంటే నీదారి నువ్వు చూసుకొమ్మని లోకేశ్ చెప్పినట్టు విశ్వసనీయ సమాచారం. బుర్రిపాలెంకు చెందిన ప్రవాస భారతీయుడు పెమ్మసాని చంద్రశేఖర్ ఇప్పటికే గుంటూరు ఎంపీ స్థానానికి టీడీపీ అభ్యర్థిగా పోటీచేసేందుకు సన్నాహాల్లో ఉన్నారు. దీనితో ఆలపాటికి ఏం చేయాలో పాలుపోవటం లేదంటున్నారు.

ఆ మహిళా అధికారి ఇంట్లో 3.6 కిలోల బంగారం స్వాధీనం

- లంచం తీసుకుంటూ పట్టుబడిన ట్రైబల్ వెల్ఫేర్ శాఖ ఇన్‌చార్జ్ ఎస్ఈ ఇంట్లో ఏసీబీ సోదాలు

సాక్షి, హైదరాబాద్: లంచం తీసుకుంటూ ఏసీబీ చేతికి చిక్కిన గిరిజన సంక్షేమశాఖ ఇంజినీరింగ్ విభాగం ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ ఇంజినీర్ (ఎస్ఈ) కె.జగజ్యోతి ఇంట్లో భారీగా నగదు, బంగారం పట్టుబడ్డాయి. మెహిదీపట్నంలోని వెంకటసాయి అపార్ట్‌మెంట్ ఫ్లాట్ నంబర్ 202 జగ జ్యోతి నివాసంలో మంగళవారం ఏసీబీ అధికారులు నిర్వహించిన సోదాల్లో రూ.1, 51,08,175 విలువ చేసే దాదాపు 3.6 కిలోల బంగారు ఆభరణాలు, రూ.65.5 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. వీటితో పాటు ఓపెన్ ప్లాట్లు, ఇళ్ల స్థలాలు, వ్యవసాయ భూములకు సంబంధించిన డాక్యుమెంట్లను అధికారులు సీజ్ చేశారు. సోదాలు ముగిసిన అనంతరం జగజ్యోతిని కోర్టులో ప్రవేశపెట్టేందుకు ఏర్పాట్లు చేశారు. అదే సమయంలో జగజ్యోతి అస్వస్థతకు గురవ్వగా...వెంటనే ఆమెను ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఛాతీనొప్పి వచ్చిందని చెప్పడంతో ఆమెకు డాక్టర్లు వైద్యపరీక్షలు నిర్వహించారు. వైద్యుల సూచన మేరకు బుధవారం ఉదయం డిశ్చార్జ్ చేయించి ఆమెను కోర్టులో హాజరుపరుచనున్నారు. జగజ్యోతి ఆరోగ్యం ప్రస్తుతం నిలకడగానే ఉన్నట్లు తెలుస్తోంది.

తిరుమల తిరుపతి దేవస్థానం సౌకర్యాలు భేష్

హోం వ్యవహారాల పార్లమెంటరీ కమిటీ అభినందన



టీటీడీ అధికారులతో పార్లమెంట్ కమిటీ

తిరుమల/న్యూఢిల్లీ: శ్రీవారి దర్శనార్థం దేశం నలుమూలల నుంచి విచ్చేస్తోన్న భక్తులకు శ్రీవారి దర్శనం, అన్నప్రసాదాలు, గదులు తదితర సౌకర్యాలను టీటీడీ చక్కగా కల్పిస్తోందని బ్రిజ్ లాల్ అధ్యక్షతన ఉన్న భారత హోం వ్యవహారాల పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ అభినందించింది. కమిటీ సభ్యులు మంగళవారం తిరుమల అన్నమయ్య భవనంలో టీటీడీ అధికారులతో సమావేశమయ్యారు. టీటీడీ ఆవిర్భావం నుంచి చేపడుతోన్న సామాజిక, ధార్మిక, సంక్షేమ కార్యకలాపాలను 40 నిమిషాల ఆడియో విజువల్ ప్రజెంటేషన్ ద్వారా ఈవో ఏవీ ధర్మారెడ్డి వారికి వివరించారు. కమిటీ చైర్మన్ మీడియాతో మాట్లాడుతూ.. తిరుమలలో భక్తుల రద్దీ క్రమబద్ధీకరణ పద్ధతులు, పారిశుద్ధ్యం, భద్రతా చర్యలు, విపత్తుల నిర్వహణ ప్రణాళికలను ప్రశంసించారు. కమిటీ సభ్యులు బిప్లవ్ కుమార్ దేవ్, నీరజ్ శేఖర్, దిలీప్ ఘోష్, దులాల్ చంద్ర గోస్వామి, రాజా అమరేశ్వర నాయక్, డాక్టర్ సత్య పాల్ సింగ్, డాక్టర్ నిషికాంత్ దూబే, హోం వ్యవహారాల శాఖకు చెందిన ఇతర అధికారులతో పాటు టీటీడీ జేఈవో వీరబ్రహ్మం, సీవీఎస్‌వో నరసింహ కిషోర్, జాయింట్ కలెక్టర్ శుభం భన్సల్, ఎస్పీ మలికా గర్గ్, టీటీడీ, జిల్లా, పోలీసు శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

టీటీడీ ట్రస్టులకు రూ.43 లక్షల విరాళం

బెంగళూరుకు చెందిన యాక్సిస్ హెల్త్ కేర్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ వ్యవస్థాపకుడు వర్ధమాన్ జైన్ టీటీడీలోని పలు ట్రస్టులకు రూ.43 లక్షలు విరాళంగా అందించారు. శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో విరాళం డీడీలను టీటీడీ ఈవోకు దాత అందజేశారు. ఇందులో ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు రూ.33 లక్షల 33 వేలు, ఎస్వీబీసీ ట్రస్టుకు రూ.10 లక్షల11 వేలు అందించారు.

తిరుపతి పరిశుభ్రతపై కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రశంస

తిరుపతి నగరం పారిశుధ్యంలో మరింత నిబద్ధత పాటిస్తుందని కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రశంసించింది. తడి–పొడి చెత్త ద్వారా సేకరించిన వ్యర్థాలను ప్రాసెసింగ్, నిర్వహణ సౌకర్యాల కోసం శాస్త్రీయంగా ప్రాసెసింగ్ చేస్తున్నట్లు పేర్కొంది. స్వచ్ఛభారత్ మిషన్, కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జనవరి 11న తిరుపతి నగరానికి స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డు లభించిన విషయం తెలిసిందే. ఈ అవార్డు అందుకున్న అనంతరం పారిశుద్ధ్యానికి సంబంధించి తిరుపతి నగరం పాటిస్తోన్న నిబద్ధతను కేంద్ర మంత్రిత్వ శాఖ వివరించింది. పారిశుధ్య సేవలను మరింతగా విస్తరించేందుకు, సిటీని ది బెస్ట్ క్లీన్‌సిటీగా తీర్చిదిద్దేందుకు 1,000 మంది కార్మికులను నియమించింది. కార్మికులు ప్రతిరోజూ ఇంటింటికీ వెళుతూ ప్లాస్టిక్, నాన్ ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి వాటిని వేరు చేస్తున్నారు. ఇలా ఇంటింటికి వెళుతూ చెత్త సేకరణ, క్లీన్‌సిటీపై అవగాహన సైతం పెంపొందించుతున్నట్లు పేర్కొంది. ఇక్కడ ఏర్పా టు చేసిన వికేంద్రీకృత వ్యర్థాల ప్రాసెసింగ్.. కేంద్రీకృత ప్లాంట్లపై భారాన్ని తగ్గిస్తుందని, వాటి పనిభారం, రవాణా ఖర్చులను కూడా తగ్గించేందుకు చర్యలు తీసుకుంటుందని తెలిపింది. గణనీయ పరిమాణంలో సేంద్రీయ వ్యర్థాలు ఉత్పన్నమయ్యే మార్కెట్‌లు, తోటల్లో తడి వ్యర్థాలను ప్రాసెస్ చేయడంపై దృష్టి సారించిందని వెల్లడించింది. 3 ప్రధాన మార్కెట్లు, 3 తోటల వద్ద 6 వికేంద్రీకృత వ్యర్థాల ప్రాసెసింగ్ సౌకర్యాలు ఉన్నట్లు తెలిపింది. నగరంలో 3 వేర్వేరు ప్రదేశాల్లో 3 బయో చెస్ట్ యంత్రాలను ఏర్పాటు చేసి రోజుకు 100 కిలోలకు పైగా ఉత్పత్తి చేసే 27 బల్క్ వేస్ట్ జనరేటర్లను, రోజుకు 50–100 కిలోలు ఉత్పత్తి చేసే 60 జనరేటర్లను గుర్తించి వర్గీకరించినట్లు పేర్కొంది. ప్లాస్టిక్ వ్యర్థాలను ప్రత్యేకమైన రీతిలో రీసైక్లింగ్ చేయడానికి వాషింగ్ ప్లాంట్, ఆగ్లోమెరేటర్ మిషన్ (ధన మెషినరీ)ని ప్రవేశపెట్టినట్లు తెలిపింది. ఈ మిషనరీ వల్ల తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ బృందం ఏడాది కాలంలో 263.29 టన్నుల ప్లాస్టిక్ గ్రాన్యూల్స్‌ను విక్రయించేలా తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కృషి చేసినట్లు కేంద్ర మంత్రిత్వ శాఖ కొనియాడింది.

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు

తిరుమల: తిరుమల శ్రీవారిని హోమ్ అఫైర్స్ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ చైర్మన్ బ్రిజ్ లాల్, త్రిపుర మాజీ సీఎం బిప్లబ్ కుమార్ దేబ్, సినీ నటులు ప్రియాంక జవల్కర్, సుహాసిని, రఘు, తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాసులు రెడ్డి, రాష్ట్ర మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు మంగళవారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు పలుకగా.. టీటీడీ అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

సర్వే పేరుతో టీడీపీ అత్యుత్సాహం...

- వృద్ధుడు మృతి



గండికోట సొట్టయ్య (ఫైల్)

కిర్లంపూడి: సర్వే పేరుతో టీడీపీ శ్రేణులు ప్రదర్శించిన అత్యుత్సాహం కారణంగా ఓ వృద్ధుడు మృతిచెందాడు. ఈ ఘటన కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం ఎస్.తిమ్మాపురంలో మంగళవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం... ఎస్.తిమ్మాపురం గ్రామంలో టీడీపీకి చెందిన పలువురు మంగళవారం ఉదయం సర్వే పేరిట వీడియోలు తీస్తున్నారు. అదే గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త గండికోట లోవరాజు జోక్యం చేసుకుని... 'ఎప్పుడో చేసిన అభివృద్ధి పనులు మీరు చేసినట్లు చూపించుకుంటారా..' అని వారిని ప్రశ్నించాడు. దీంతో ఇరువర్గాల మధ్య తోపులాట చోటుచేసుకుంది. విషయం గమనించిన లోవరాజు తండ్రి గండికోట సొట్టయ్య (83) వెళ్లి వారిని వారించేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో వారి మధ్యలోకి వెళ్లిన సొట్టయ్య ఒక్కసారిగా నేలపై కుప్పకూలి చనిపోయారు. జగ్గంపేట సీఐ సూర్య లక్ష్మణరావు, కిర్లంపూడి ఇన్‌చార్జి ఎస్ఐ ఎన్.రామలింగేశ్వరావు ఘటనాస్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రత్తిపాడు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గండికోట లోవరాజు ఫిర్యాదు మేరకు అదే గ్రామానికి చెందిన నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

సుబ్రహ్మణ్యం... రాం రాం!

- తాజాగా రామచంద్రపురం టీడీపీ ఇన్‌చార్జి రెడ్డి సుబ్రహ్మణ్యానికి చెక్
- ఆయన స్థానంలో కొత్తగా పార్టీలో చేరిన సుభాష్‌కు అవకాశం
- సొంతంగా ఖర్చుపెట్టుకుని పార్టీకి భారీగా ముడుపులు
- బాబు సూచనతో నియోజకవర్గంలో ప్రచారం కూడా ప్రారంభించిన వైనం



సాక్షి, అమలాపురం: 'ముందొచ్చిన చెవుల కన్నా... వెనుకొచ్చిన కొమ్ములు వాడి' అన్న చందంగా ఉంది ఇప్పుడు తెలుగుదేశం పార్టీలో పరిస్థితి. ఇన్నాళ్లు పార్టీకోసం పాటుపడిన సీనియర్లు ఒక్కొక్కరినీ పక్కకు నెట్టి తాజాగా వచ్చి... డబ్బు పెట్టుబడి పెట్టగలిగేవారికి ఆ పార్టీలో ఎర్రతివాచీ పరుస్తున్నారు. ఇటీవల జరుగుతున్న పరిణామాలు ఈ విషయాన్ని రుజువు చేస్తున్నాయి. మొన్నటికి మొన్న పొత్తు పేరుతో మాజీమంత్రి గొల్లపల్లి సూర్యారావును పక్కన పెట్టేందుకు సిద్ధమైన చంద్రబాబు ఇప్పుడు మరో సీనియర్ నేత, శాసనమండలి మాజీ డిప్యూటీ స్పీకర్ రెడ్డి సుబ్రహ్మణ్యం (ఆర్ఎస్)కు జెల్లకొట్టారు.

మూడేళ్లు తిప్పించుకుని...

రామచంద్రపురం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహించిన మాజీ ఎమ్మెల్యే తోట త్రిమూర్తులు వైఎస్సార్‌సీపీలో చేరిన తరువాత అక్కడ సుబ్రహ్మణ్యంను ఇన్‌చార్జిగా నియమించారు. ఆయన సతీమణి రెడ్డి అనసూయ జిల్లా పార్టీ అధ్యక్షురాలిగా వ్యవహరిస్తున్నారు. రామచంద్రాపురం నుంచి ఆర్ఎస్‌కు అవకాశం ఇస్తారని ఇన్నాళ్లూ కేడర్ భావిస్తూ వచ్చింది. ఒకవేళ కాపు సామాజికవర్గానికిస్తే రాయపురెడ్డి సూరిబాబు(రాజా)కు ఇవ్వొచ్చని భావించింది. కానీ వీరిద్దరినీ కాదని ఇప్పుడు కొత్తగా పార్టీలో చేరిన అమలాపురానికి చెందిన వాసంశెట్టి సుభాష్ వైపు పార్టీ అధినేత మొగ్గు చూపుతున్నారు. తన ఖర్చు తానే పెట్టుకోవడమే గాకుండా పార్టీకి కూడా భారీగా ఫండ్ ఇస్తానని ఆయన చెప్పడంతో అధినేత ఆయన్ను లైన్‌లో పెట్టినట్టు తెలుస్తోంది.

'కమ్మ'గా లేనందునే...

ఆర్థికంగా పట్టులేకపోవడమే గాకుండా... ఆర్ఎస్‌ను పక్కన పెట్టడానికి వేరే కారణాలు కూడా ఉన్నాయన్న ప్రచారం సాగుతోంది. ఆయన ఆదినుంచి కమ్మ సామాజికవర్గంలోని పలువురిని పక్కన పెడుతూ వచ్చారు. దీనిని వ్యతిరేకిస్తున్న రామచంద్రపురం, పాణింగపల్లి, అముజూరు, కూళ్ల, యనమదల, దంగేరు వంటి ప్రాంతాల్లోని ఆ సామాజికవర్గ నేతలంతా ఇటీవల చంద్రబాబును కలిసి ఆర్ఎస్ వ్యవహార శైలిపై ఫిర్యాదు చేశారు. అప్పటినుంచి ఆయన్ను అధినేత పక్కకు తప్పించాలని నిర్ణయించుకున్నారు. తాజాగా సుభాష్ ఎంట్రీగురించి తెలుసుకున్న ఆయన అధినేతను కలసి తన ఆవేదన వ్యక్తం చేసినప్పటికీ సరైన హామీ మాత్రం దక్కలేదని తెలిసింది. 2014 ఎన్నికల సమయంలో సైతం కొత్తపేట ఇన్‌చార్జిగా ఉన్న తనను తప్పించి పీఆర్పీ నుంచి వచ్చిన బండారు సత్యానందరావుకు అవకాశం ఇచ్చారని, ఇప్పుడు తనను తప్పించి కొత్తగా పార్టీలో చేరేవారికి అవకాశమిస్తున్నారని ఆర్ఎస్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ముంచెత్తుతున్న మాంద్యం

మరో 18 దేశాల్లో మాంద్యం ఛాయలు | జాబితాలో ఎక్కువగా యూరప్ దేశాలే

ఒకవైపు యుద్ధాలు. మరోవైపు పర్యావరణ మార్పులు. కారణాలేమైతేనేం... ప్రపంచాన్ని క్రమంగా మాంద్యం మేఘాలు కమ్ముకుంటున్నాయి. జపాన్ ఇటీవలే ఆర్థిక మాంద్యపు ఛాయల్లోకి జారుకుంది. ప్రపంచంలో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థల జాబితాలో మూడు నుంచి నాలుగో స్థానానికి దిగజారింది. బ్రిటన్ కూడా సాంకేతికంగా మాంద్యంలోకి జారుకుంది. అయితే ఇది ట్రైలర్ మాత్రమేనని ఆర్థికవేత్తలంటున్నారు. పదుల సంఖ్యలో దేశాలు ఆర్థిక ఒడిదొడుకులతో విపరీతంగా సతమతమవుతూ మాంద్యం దిశగా సాగుతున్నట్టు చెబుతున్నారు. ఇప్పటికే కనీసం మరో 18 దేశాలు ఈ జాబితాలోకి చేరడం కలవరపరుస్తోంది...



ఒక ఆర్థిక సంవత్సరంలో కనీసం వరుసగా రెండు త్రైమాసికాల్లో దేశ స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ)లో తగ్గుదల నమోదైతే సాంకేతికంగా దాన్ని మాంద్యం కిందే పరిగణిస్తారు. 2023 డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికానికి జపాన్, బ్రిటన్ రెండూ ఈ మాంద్యం బారిన పడ్డాయి. ఇవి అతి పెద్ద ఆర్థిక వ్యవస్థలు కావడంతో ఈ పరిణామం సర్వత్రా చర్చనీయంగా మారింది. కానీ ప్రపంచవ్యాప్తంగా చాలా చోట్ల చాలా దేశాల్లో మాంద్యం ఛాయలు ప్రస్ఫుటమవుతున్నాయని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. వీటిలో ఇప్పటికే మాంద్యం బారిన పడ్డవి కొన్ని కాగా మరికొన్ని అతి త్వరలో ఆ ముప్పు దిశగా సాగుతున్నాయని హెచ్చరిస్తున్నారు.

జపాన్, బ్రిటన్‌తో పాటు ఐర్లండ్, ఫిన్లండ్ కూడా ప్రస్తుత ఆర్థిక సంవత్సర నాలుగో త్రైమాసికంలో సాంకేతిక ఆర్థిక మాంద్యం బారిన పడ్డాయి. ఐర్లండ్ జీడీపీ మూడో త్రైమాసికంలో 0.7 శాతం తగ్గగా నాలుగో త్రైమాసికంలో ఇప్పటికే ఏకంగా 1.9 శాతం తగ్గుదల నమోదు చేసింది! ఫిన్లండ్ జీడీపీలో వరుసగా 0.4, 0.9 శాతం తగ్గుదల నమోదైంది. నిజానికి చాలా దేశాల్లో ఈ పరిస్థితి నెలకొని ఉందని ఆర్థికవేత్తలు అంచనా వేస్తున్నారు. చాలా దేశాల నాలుగో త్రైమాసిక జీడీపీ గణాంకాలు ఇంకా రావాల్సి ఉంది. అవి వెల్లడయ్యాక సాంకేతిక మాంద్యం జాబితాలోని దేశాల సంఖ్య బాగా పెరిగేలా కన్పిస్తోంది. అయితే కనీసం మరో 10 దేశాలు జూలై–సెప్టెంబర్ త్రైమాసికంలో జీడీపీ తగ్గుదలను చవిచూశాయి. ఈ జాబితాలో కెనడా, న్యూజిలాండ్‌తో పాటు డెన్మార్క్, లగ్జెంబర్గ్, మాల్డోవా, ఎస్టోనియా, ఈక్వెడార్, బహ్రెయిన్, ఐస్‌లాండ్, దక్షిణాఫ్రికా ఉన్నాయి. వీటిలో డెన్మార్క్, లగ్జెంబర్గ్, మాల్డోవా, ఎస్టోనియా మూడో త్రైమాసికంలోనే ఆర్థిక మాంద్యం నమోదు చేశాయి! ఇవేగాక తాజాగా నాలుగో త్రైమాసిక ఫలితాలు విడుదలైన మరో 9 దేశాల్లో కూడా జీడీపీ తగ్గుదల నమోదైంది. వీటిలో ఆరు దేశాల్లో ఇటీవలి కాలంలో జీడీపీ తగ్గుదల నమోదవడం ఇదే తొలిసారి! జీడీపీ తగ్గుదల జాబితాలో జర్మనీ వంటి ప్రపంచంలో మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థ కూడా ఉండటం యూరప్‌ను మరింత కలవరపెడుతోంది. ఇది మొత్తం యూరప్ ఆర్థిక వ్యవస్థనే ప్రభావితం చేయడం ఖాయమన్న అంచనాలు వెలువడుతున్నాయి. నాలుగో త్రైమాసికంలో యూరో జోన్ జీడీపీ వృద్ధి సున్నాగా నమోదవడం వాటికి మరింత బలం చేకూరుస్తోంది. ఫ్రాన్స్ కూడా మాంద్యం బాట పడుతున్న సంకేతాలు ఇప్పటికే వెలువడుతున్నాయి.

భారత్‌పై ప్రభావమెంత...?

ఆర్థిక వృద్ధి విషయంలో భారత్‌కు ప్రస్తుతానికి పెద్ద సమస్యేమీ లేదు. మూడో త్రైమాసికంలో 6.5 శాతం జీడీపీ వృద్ధి రేటు నమోదైంది. నాలుగో త్రైమాసిక అంచనా 6 శాతంగా ఉంది. కాకపోతే ప్రపంచీకరణ యుగంలో ప్రపంచవ్యాప్త పరిణామాలు భారత్‌పైనా కచ్చితంగా ప్రభావం చూపనున్నాయి. పైగా మన మొత్తం ఎగుమతుల్లో 10 శాతం వాటా మాంద్యం జాబితాలోని ఆరు పెద్ద దేశాలదే! వీటిలో బ్రిటన్‌కు 11 బిలియన్ డాలర్లు, జర్మనీకి 10 బిలియన్ డాలర్ల మేరకు మన ఎగుమతులున్నాయి. సేవలు, ఐటీ రంగంలో అతి పెద్ద ఎగుమతిదారుల్లో భారత్ ఒకటన్నది తెలిసిందే. ఇక మాంద్యం కారణంగా ఆయా దేశాల్లో నమోదయ్యే ధరల పెరుగుదల మన దిగుమతులపైనా ప్రభావం చూపనుంది. మన దిగుమతుల్లో మాంద్యం బారిన పడ్డ జపాన్, ఆ ముప్పున్న జర్మనీ వాటా చెరో 17 బిలియన్ డాలర్లు!

దేశం	జీడీపీలో తగ్గుదల
కెనడా	0.3 శాతం
న్యూజిలాండ్	0.3 శాతం
డెన్మార్క్	0.7 శాతం
ఫిన్లాండ్	0.9 శాతం
ఐస్‌లాండ్	3.8 శాతం
ఎస్టోనియా	1.3 శాతం
లిథువేనియా	0.3 శాతం
ఐర్లండ్	1.9 శాతం
రొమేనియా	0.4 శాతం
జర్మనీ	0.3 శాతం
కొలంబియా	0.2 శాతం
ఈక్వెడార్	1.3 శాతం
లగ్జెంబర్గ్	0.1 శాతం
బహ్రెయిన్	2.4 శాతం
మాల్డోవా	0.8 శాతం
మలేసియా	2.1 శాతం
దక్షిణాఫ్రికా	0.2 శాతం
బ్రిటన్	0.1 శాతం
థాయ్‌లాండ్	0.6 శాతం
జపాన్	0.8 శాతం

(నోట్: జీడీపీ తగ్గుదల శాతం గణాంకాలు ప్రస్తుత ఆర్థిక సంవత్సర మూడో/నాలుగో త్రైమాసికానివి)

– సాక్షి, నేషనల్ డెస్క్

సోనియా, నడ్డా ఏకగ్రీవం




న్యూఢిల్లీ: కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ, బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా, ఇటీవలే బీజేపీలో చేరిన మహారాష్ట్ర మాజీ సీఎం అశోక్‌చవాన్, కేంద్ర మంత్రులు అశ్వనీ వైష్ణవ్, ఎల్.మురుగన్ సహా 41 మంది ఏకగ్రీవంగా రాజ్యసభకు ఎన్నికయ్యారు. పోటీ అనివార్యమైన మిగతా 15 స్థానాలకు ఫిబ్రవరి 27న ఎన్నికలు జరగనున్నాయి. ఏకగ్రీవంగా గెలిచిన వారిలో బీజేపీ నుంచి అత్యధికంగా 20 మంది ఉన్నారు. కాంగ్రెస్ నుంచి ఆరుగురు, తృణమూల్ కాంగ్రెస్ నుంచి నలుగురు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి ముగ్గురు, ఆర్జేడీ నుంచి ఇద్దరు, బీజేడీ నుంచి ఇద్దరు, ఎన్సీపీ, శివసేన, బీఆర్ఎస్, జేడీ(యూ)లకు చెందిన ఒక్కొక్కరు చొప్పున రాజ్యసభకు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గుజరాత్‌లో ఖాళీ అయ్యే నాలుగు స్థానాలకు నడ్డా, మరో ముగ్గురు బీజేపీ నేతలే నామినేషన్ వేశారు. ఇంకెవరూ లేకపోవడంతో ఈ నలుగురూ గెలిచారు. రాజస్తాన్‌లో పోటీ లేకపోవడంతో సోనియాతో పాటు మరో ఇద్దరు బీజేపీ నేతలు విజయం సాధించారు. ఉత్తరప్రదేశ్‌లో 10, హిమాచల్‌లో 1, కర్ణాటకలో 4 స్థానాలకు 27న పోలింగ్ జరగనుంది.

'తేజస్' పరీక్ష సక్సెస్

న్యూఢిల్లీ: దేశీయంగా అభివృద్ధి చేసిన డిజిటల్ ఫ్లై–బై–వైర్ ఫ్లయిట్ కంట్రోల్ కంప్యూటర్(డీఎఫ్‌సీసీ)తో అనుసంధానించిన తేజస్ యుద్ధ విమానాన్ని మంగళవారం విజయవంతంగా పరీక్షించినట్లు రక్షణ శాఖ తెలిపింది. 'తేజస్ ఎంకే1ఏ అభివృద్ధిలో ఇది కీలక ముందడుగు. డీఎఫ్‌సీసీతో అనుసంధానించిన ప్రొటోటైప్ ఎల్ఎస్‌పీ7ని 19న బెంగళూరులోని నేషనల్ ఫ్లయిట్ టెస్ట్ సెంటర్ నుంచి విజయవంతంగా పరీక్షించాం' అని రక్షణ శాఖ తెలిపింది. ఈ పరీక్ష అన్ని పరామితులను అందుకున్నట్లు చెప్పింది. దేశీయంగా అభివృద్ధి చేసిన సింగిల్ ఇంజిన్ తేజస్ విమానాన్ని అన్ని వాతావరణ పరిస్థితుల్లో నడుపొచ్చు. వాయు, సముద్రజలాల గస్తీకి ఉపయోగపడుతోంది.

మరాఠాల రిజర్వేషన్‌కు ఓకే

ముంబై: మహారాష్ట్రలో విద్య, ఉద్యోగాల్లో మరాఠాలకు 10 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ ఆ రాష్ట్ర శాసనసభ సంబంధిత బిల్లుకు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. ఇందుకోసం మంగళవారం ప్రత్యేకంగా సమావేశమైన రాష్ట్ర అసెంబ్లీలో మహారాష్ట్ర రాష్ట్ర విద్య, సామాజిక వెనుకబాటు బిల్లు–2024ను ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిండే ప్రవేశపెట్టారు. రాష్ట్రజనాభాలో మరాఠాలు 28 శాతం మంది ఉన్నారు. రాష్ట్రంలో మరాఠాలకు అమలయ్యే 10 శాతం రిజర్వేషన్‌ను పదేళ్ల తర్వాత సమీక్షిస్తారు. ''రాష్ట్రంలో భిన్న కులాలు, వర్గాలకు ఇప్పటికే 52 శాతం రిజర్వేషన్‌లు అమలవుతున్నాయి. ఇందులోనే ఓబీసీలకు19 శాతం రిజర్వేషన్ కలిసి ఉంది. అంటే దేశంలో పరిమిత 50 శాతం మార్కును దాటి రిజర్వేషన్లు అమలవుతున్నాయి'' అని బిల్లులో పేర్కొన్నారు. ''తమిళనాడులో 69 శాతం, హరియాణాలో 67 శాతం, రాజస్థాన్‌లో 64 శాతం, బిహార్‌లో 69 శాతం, గుజరాత్‌లో 59 శాతం, పశ్చిమబెంగాల్‌లో 55 శాతం రిజర్వేషన్లు అమలవుతున్నాయి. ఓబీసీ కోటాలో కాకుండా రాష్ట్రంలో మరాఠాలకు విడిగా రిజర్వేషన్ ఇస్తున్నాం'' అని సీఎం అన్నారు. వ్యవసాయ ఆధారిత కుంబీ కులానికి చెందిన మరాఠాలకు, వారి రక్తసంబంధీలకు మాత్రమే కుంబీ కుల ధ్రువీకరణ పత్రమిస్తామని ప్రభుత్వం ముసాయిదా నోటిఫికేషన్‌లో పేర్కొంది.

విడిగా కోటా వద్దు: జరాంగే

మరాఠాలకు విడిగా కాకుండా ఓబీసీ రిజర్వేషన్లలోనే కోటా కావాలని ఉద్యమనేత మనోజ్ జరాంగే డిమాండ్ చేశారు.

స్విట్జర్లాండ్‌కు పోటీగా కశ్మీర్

అద్భుతంగా తీర్చిదిద్దుతాం: మోదీ

- రూ.32,000 కోట్ల పై చిలుకు ప్రాజెక్టులకు శంకుస్థాపన
- దేశంలోనే అతి పెద్దదైన రైల్వే సొరంగం ప్రారంభం



జమ్మూ: ఆర్టికల్ 370 రద్దు తర్వాత జమ్మూకశ్మీర్‌లో అభివృద్ధి వేగం పుంజుకుందని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. సామాజిక న్యాయం, సమీకృత అభివృద్ధి అనే కొత్త శకంలోకి కశ్మీర్ అడుగుపెట్టిందన్నారు. ఈ ప్రాంత సమగ్రాభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, కశ్మీర్ లోయను పర్యాటకానికి గమ్యస్థానంగా, స్విట్జర్లాండ్‌కు పోటీగా అన్ని విషయాల్లోనూ అద్భుతంగా తీర్చిదిద్దుతామని ప్రకటించారు. జమ్మూకశ్మీర్‌లో కొత్త శకం ఆరంభమైందని, ఇక్కడి ప్రజలు వారసత్వ రాజకీయాల నుంచి విముక్తి పొందారని పేర్కొన్నారు. గతంలో అధికారం చెలాయించిన వారసత్వ పాలకులు సొంత ప్రయోజనాలు తప్ప ప్రజల బాగోగులు ఏనాడూ పట్టించుకోలేదని విమర్శించారు. మోదీ మంగళవారం జమ్మూకశ్మీర్‌లో పర్యటించారు. రూ.32,000 కోట్లకుపైగా విలువైన ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. ప్రభుత్వోద్యోగాలు పొందిన వారితో, పథకాల లబ్ధిదారులతో ముచ్చటించారు. ఉధంపూర్–శ్రీనగర్–బారాముల్లా రైల్ లింక్‌లో దేశంలోనే అతిపెద్దదైన 12.77 కిలోమీటర్ల పొడవైన రైల్వే సొరంగాన్ని ప్రారంభించారు. అనంతరం జమ్మూలో బహిరంగ సభలో ప్రసంగించారు. గల్ఫ్ దేశాల నుంచి జమ్మూకశ్మీర్‌కు భారీగా పెట్టుబడులు వస్తున్నాయన్నారు. కశ్మీర్‌ను రైలు మార్గం ద్వారా కన్యాకుమారితో అనుసంధానించే రోజు దగ్గర్లో ఉందన్నారు.

ఆ అడ్డుగోడ కూల్చేశాం..

జమ్మూకశ్మీర్‌లో నిత్యం బాంబులు, తుపాకులు, కిడ్నాప్‌లు, వేర్పాటువాదం వార్తలొచ్చే రోజులు పోయాయని, సమతులాభివృద్ధితో కూడిన నూతన కశ్మీర్ కనిపిస్తోందని మోదీ హర్షం వ్యక్తం చేశారు. పర్యాటక రంగ ప్రగతితోపాటు అక్కడి పుణ్యక్షేత్రాలను దర్శించుకొనే భక్తుల సంఖ్య పెరుగుతుండడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఆర్టికల్ 370 రద్దు నేపథ్యంలో రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి 370 సీట్లు కట్టబెట్టాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

ఐఐఎం క్యాంపస్‌లు ప్రారంభం

ఐఐఎం–జమ్మూ, ఐఐఎం–బోధ్‌గయ, ఐఐఎం–విశాఖపట్నం క్యాంపస్‌లను మోదీ మంగళవారం వర్చువల్‌గా ప్రారంభించారు. ఐఐటీ–భిలాయ్, ఐఐటీ–తిరుపతి, ఐఐటీ–జమ్మూ తదితర ప్రతిష్టాత్మక విద్యాసంస్థల క్యాంపస్‌లను జాతికి అంకితం చేశారు. 20 కేంద్రీయ విద్యాలయాలు, 13 నవోదయ పాఠశాలల శాశ్వత క్యాంపస్‌లకు శంకుస్థాపన చేశారు. విద్యా రంగంలో స్కిల్ డెవలప్‌మెంట్‌కు ప్రాధాన్యమిస్తున్నామన్నారు.

'ఆప్' అభ్యర్థే చండీగఢ్ మేయర్

సుప్రీంకోర్టు సంచలన తీర్పు

- ఆ 8 ఓట్లు ఆమ్ ఆద్మీ పార్టీ అభ్యర్థికే పడినట్లు గుర్తింపు
- ఎన్నికల ప్రక్రియనే తారుమారు చేశారంటూ ఆర్వోపై ధ్వజం
- ఆయనపై విచారణకు ఆదేశం


కులదీప్ కుమార్


ఆర్వో అనిల్ మాసి

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన చండీగఢ్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ఎన్నిక విషయంలో ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్)కి అత్యున్నత న్యాయస్థానంలో ఘన విజయం లభించింది. కొన్ని వారాలుగా కొనసాగుతున్న వివాదానికి తెరపడింది. ఈ ఎన్నికల్లో ఆప్–కాంగ్రెస్ కూటమి అభ్యర్థి కులదీప్ కుమార్‌ను విజేతగా సుప్రీంకోర్టు నిర్ధారించింది. బీజేపీ అభ్యర్థి మనోజ్ సోంకర్ మేయర్‌గా ఎన్నికైనట్లు గతంలో రిటర్నింగ్ ఆఫీసర్ అనిల్ మాసి విడుదల చేసిన ఫలితాలను న్యాయస్థానం తిరస్కరించింది. రిటర్నింగ్ అధికారి 'క్రాస్' గుర్తు రాసి, చెల్లనివిగా ప్రకటించిన 8 ఓట్లు కులదీప్ కుమార్‌కు పడినట్లు గుర్తించింది. చండీగఢ్ మేయర్‌గా ఆప్–కాంగ్రెస్ అభ్యర్థి కులదీప్ కుమార్ ఎన్నికైనట్లు తేల్చిచెబుతూ సంచలన తీర్పు వెలువరించింది. ఇందుకోసం రాజ్యాంగంలోని ఆర్టికల్ 142 కింద తమకు సంక్రమించిన ప్రత్యేక అధికారాలను సుప్రీంకోర్టు ఉపయోగించుకుంది.

ఎన్నిక ప్రక్రియను తారుమారు చేశారు

మేయర్ ఎన్నిక ఓట్ల లెక్కింపులో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ 'ఆప్' నేత, మేయర్ అభ్యర్థి కులదీప్ కుమార్ దాఖలు చేసిన పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు త్రిసభ్య ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. చెల్లనివిగా రిటర్నింగ్ ఆఫీసర్ ప్రకటించిన 8 బ్యాలెట్ పేపర్లను స్వయంగా పరిశీలించింది. అవి ఎక్కడ పాడైపోయాయి? ఎందుకు చెల్లుబాటు కావో చెప్పాలని అనిల్ మాసిని ప్రశ్నించింది. ఆ 8 ఓట్లు కులదీప్ కుమార్‌కు పడినట్లు తేల్చింది. పిటిషనర్‌కు అనుకూలంగా పడిన ఓట్లను రిటర్నింగ్ అధికారి ఉద్దేశపూర్వకంగానే చెల్లనివిగా గుర్తించినట్లు ఆక్షేపించింది. ప్రజాస్వామ్య విలువలు కాపాడాల్సిన బాధ్యత తమపై ఉందని పేర్కొంది. మేయర్ ఎన్నిక విషయంలో రిటర్నింగ్ ఆఫీసర్ వైఖరి సక్రమంగా లేదని వెల్లడించింది. మేయర్ ఎన్నిక ప్రక్రియను ఆయన చట్టవిరుద్ధంగా తారుమారు చేశారని, అంతేకాకుండా కోర్టులో తప్పుడు స్టేట్‌మెంట్ ఇచ్చారని, ఇందుకు ఆయన బాధ్యత వహించాల్సిందేనని తేల్చిచెప్పింది. అనిల్ మాసిపై సీఆర్‌పీఎస్ సెక్షన్ 340 కింద ధర్మాసనం విచారణ ప్రారంభించింది.

అసలేం జరిగింది?

చండీగఢ్ మేయర్ ఎన్నికను జనవరి 30న నిర్వహించారు. కార్పొరేషన్‌లో మొత్తం 36 ఓట్లు ఉన్నాయి. బీజేపీ అభ్యర్థి ఓడిపోయే అవకాశం ఉండడంతో రిటర్నింగ్ అధికారి అనిల్ మాసీ 8 ఓట్లపై రహస్యంగా 'క్రాస్' గుర్తు రాసి, చెల్లనివిగా ప్రకటించారు. ఈ వీడియో బయటకు వచ్చింది. మిగిలిన ఓట్లను లెక్కించగా ఆప్–కాంగ్రెస్ అభ్యర్థి కులదీప్ కుమార్‌కు 12, బీజేపీ అభ్యర్థికి 16 ఓట్లు వచ్చాయి. బీజేపీ అభ్యర్థి గెలిచినట్లు రిటర్నింగ్ ఆఫీసర్ ప్రకటించారు. దీంతో కులదీప్ కుమార్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

ప్రజాస్వామ్యాన్ని కాపాడింది: కేజ్రీవాల్

సుప్రీంకోర్టు తీర్పు పట్ల ఆప్ జాతీయ కన్వీనర్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ హర్షం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యాన్ని సుప్రీంకోర్టు కాపాడిందన్నారు. ఇదో చరిత్రాత్మక తీర్పు అన్నారు. విపక్ష 'ఇండియా' కూటమి కలిసికట్టుగా పని చేస్తే బీజేపీని ఓడించడం సులువేనని తాజా పరిణామం స్పష్టం చేస్తున్నట్లు చెప్పారు. లోక్‌సభ ఎన్నికల్లో పోలయ్యే 90 కోట్లకు పైగా ఓట్లను బీజేపీ ఎలా దొంగిలిస్తుందని ప్రశ్నించారు.

నీచ రాజకీయాలను ఎదిరించాలి: ఖర్గే

సుప్రీంకోర్టు తీర్పు పట్ల కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే హర్షం వ్యక్తం చేశారు. నిరంకుశ బీజేపీ కబంధ హస్తాల నుంచి ప్రజాస్వామ్యాన్ని న్యాయస్థానం రక్షించిందంటూ ఎక్స్‌లో పోస్టు చేశారు. బీజేపీ నీచ రాజకీయాలను ప్రజలంతా కలిసికట్టుగా ఎదిరించాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యాన్ని హత్య చేయడానికి బీజేపీ పన్నిన కుట్రలో రిటర్నింగ్ అధికారి అనిల్ మాసి ఒక పావు మాత్రమేనని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ఈ కుట్ర వెనుక ఉన్న అసలు ముఖం నరేంద్ర మోదీ అని ఆరోపించారు.

సీబీఎస్‌ఈ టెన్త్, 12వ తరగతి పరీక్షలు...

ఇక ఏడాదికి రెండుసార్లు

రాయ్‌పూర్: ఏడాదికి ఒక్కసారి మాత్రమే సీబీఎస్‌ఈ పదో, 12వ తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థుల్లో కొందరు తీవ్ర పరీక్షల ఒత్తిడికి గురవుతున్న నేపథ్యంలో ఇకపై ఏడాదికి రెండు సార్లు ఈ పరీక్షలు నిర్వహించాలని కేంద్రం నిర్ణయించింది. ఛత్తీస్‌గఢ్‌లోని 211 పాఠశాలలను పీఎం శ్రీ(స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా) పథకం కింద నవీకరించే పథకాన్ని మంగళవారం రాయ్‌పూర్‌లో ప్రారంభించిన సందర్భంగా కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ మాట్లాడారు. '' నూతన జాతీయ విద్యావిధానంలో భాగంగా విద్యార్థులపై అకడమిక్ ఒత్తిడిని తగ్గించే లక్ష్యంతో ఇకపై ఏడాదికి రెండుసార్లు పది, 12వ తరగతి బోర్డు పరీక్షలు రాయొచ్చు. రెండుసార్లు రాస్తే రెండింటి ఫలితాల్లో అధిక స్కోరు సాధించిన వాటినే లెక్కలోకి తీసుకుంటారు. విద్యార్థులకు మరింతగా ఎగ్జామ్స్‌కు సిద్ధమయ్యే సమయం, అవకాశం లభిస్తుంది. వారిపై పరీక్షల ఒత్తిడి సైతం తగ్గుతుంది. 2025–26 విద్యాసంవత్సరం నుంచి దీనిని అమలుచేస్తాం'' అని ఆయన అన్నారు. అయితే, ఈ బోర్డు పరీక్షలు తొలి దఫా 2024 నవంబర్–డిసెంబర్‌లో, రెండో దఫా 2025 ఫిబ్రవరి–మార్చిలో జరుగుతాయని కేంద్ర విద్యా శాఖలోని విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. తాజా నిర్ణయంపై విద్యా శాఖ ఉన్నతాధికారి ఒకరు వివరణ ఇచ్చారు. ''విద్యార్థి ఒకవేళ మొదటి దఫా పరీక్షలోనే తాను అద్భుతంగా రాశానని భావిస్తే రెండో దఫాలో పరీక్ష రాయాలా వద్దా అనేది అతని ఇష్టమే. కచ్చితంగా రెండోసారి రాసి తీరాలనే నిబంధన లేదు'' అని ఆయన చెప్పారు.

రిటైరైన 5 నెలలకు తీర్పా?

మద్రాస్ హైకోర్టు రిటైర్డు న్యాయమూర్తి తీరుపై సుప్రీంకోర్టు తీవ్ర విస్మయం

న్యూఢిల్లీ: మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి ఒకరు రిటైరైన ఐదు నెలలకు తీర్పు వెలువరించడంపై సుప్రీంకోర్టు విస్మయం వ్యక్తం చేసింది. దాన్ని పక్కనబెట్టి మళ్లీ విచారణ చేపట్టాలని మద్రాస్ హైకోర్టును ఆదేశించింది. రిటైర్డు జడ్జి నిర్వాకంపై ఏం చేయాలో నిర్ణయించాలని కోరింది. మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.మత్తివనన్ ఓ క్రిమినల్ కేసులో 2017 ఏప్రిల్ 17న ఏకవాక్య తీర్పు వెలువరించారు. మే 26న రిటైరయ్యారు. మరో 5 నెలలకు ఏక వాక్య తీర్పుపై 250 పేజీల తీర్పు వెలువరించారు. దీనిపై జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌ల సుప్రీంకోర్టు ధర్మాసనం విస్మయం వెలిబుచ్చింది. తొలి తీర్పు నుంచి రిటైరయ్యే మధ్య ఐదు వారాల వ్యవధిలో ఆయన ఏం చేశారని ప్రశ్నించింది.

హైవేలపై ట్రాక్టర్–ట్రాలీలు వద్దు

పంజాబ్–హరియాణా హైకోర్టు

చండీగఢ్: పంటలకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కోసం 'ఢిల్లీ చలో' చేపట్టిన పంజాబ్ రైతులు జాతీయ రహదారిపై ట్రాక్టర్–ట్రాలీల్లో తరలిరావడాన్ని పంజాబ్–హరియాణా హైకోర్టు తప్పుబట్టింది. ''మోటార్ వాహనాల చట్టం ప్రకారం హైవేలపై ఇలా ట్రాక్టర్–ట్రాలీ నడపకూడదు. ఢిల్లీకే వెళ్లాలనుకుంటే రైతులు బస్సుల్లోనో, ప్రజారవాణా సదుపాయాన్నో వాడుకోవచ్చు. రైతులు సరిహద్దులపై గుమికూడకుండా చూడాల్సిన బాధ్యత పంజాబ్ ప్రభుత్వానిదే'' అని చీఫ్ జస్టిస్ జీఎస్ సంధావాలియా, జస్టిస్ లపితా బెనర్జీల ధర్మాసనం సూచించింది. ''రైతులతో ప్రభుత్వం తరఫున కేంద్ర మంత్రుల బృందం జరిపిన చర్చల తాలూకు సమగ్ర వివరాలతో కూడిన తాజా నివేదికను అఫిడవిట్ రూపంలో సమర్పించండి'' అని కేంద్ర ప్రభుత్వాన్ని కోర్టు ఆదేశించింది. పప్పు లు, మొక్కజొన్న, పత్తి పంటలను కనీస మద్దతు ధరకు ప్రభుత్వ ఏజెన్సీలు కొంటాయని, ఆ మేరకు ఐదేళ్ల ఒప్పందం చేసుకుందామని ప్రభుత్వం చేసిన ప్రతిపాదనను రైతుసంఘాలు తోసిపుచ్చడం తెల్సిందే.

పార్లమెంట్‌లో చట్టం తెండి: పంథేర్

పంజాబ్, హరియాణా సరిహద్దుల్లోని శంభు బోర్డర్‌పాయింట్ వద్ద వందలాది మంది రైతులతో కలిసి రైతు సంఘం నేత శర్వాన్‌సింగ్ పంథేర్ ఉద్యమంలో పాల్గొన్నారు. '' మా డిమాండ్ల మేరకు బిల్లు తెచ్చి చట్టంగా మార్చండి. ప్రధాని మోదీ నిజంగా రైతుల బాగు కోరే వారే అయితే, సంకల్పబలం ఉంటే రోజంతా పార్లమెంట్ ప్రత్యేక సెషన్ నడిపి అయినా చట్టం తెండి. విపక్షాల్లో ఒక్క పార్టీ కూడా ఇందుకు అభ్యంతరం చెప్పబోదు'' అని పంథేర్ అన్నారు.

మార్చి 9 తర్వాత ఎన్నికల షెడ్యూల్?

న్యూఢిల్లీ: కీలకమైన లోక్‌సభతో పాటు పలు రాష్ట్రాలకు ఎన్నికల తేదీలను మార్చి 9వ తేదీ తర్వాత కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించే అవకాశాలున్నాయని విశ్వసనీయ వర్గాల సమాచారం. ఎన్నికల షెడ్యూల్ ఈసారి కూడా 2019లో మాదిరిగానే ఉంటుందని చెబుతున్నారు. 2019లో మార్చి 10వ తేదీన ఈసీ ఎన్నికల తేదీలను ప్రకటించగా ఏప్రిల్ 11, మే 19 మధ్యన ఏడు విడతల్లో ఎన్నికలు జరిగాయి. తాజాగా, ఎన్నికల సన్నద్ధతను తెలుసుకునేందుకు ఇప్పటికే ఎన్నికల అధికారులు రాష్ట్రాల్లో పర్యటిస్తున్నారు. లోక్‌సభతోపాటు కొన్ని రాష్ట్రాల అసెంబ్లీకు సైతం ఎన్నికలు జరపాల్సి ఉంటుంది. మార్చి 8, 9 తేదీల్లో ఎన్నికల అధికారులు జమ్మూకశ్మీర్ యంత్రాంగంతో చర్చించి, అక్కడ భద్రతా సిబ్బంది అందుబాటుపై సమీక్ష చేపట్టనున్నారు. మరో రెండు మూడు రోజుల తర్వాత మరోమారు వెళ్లి క్షేత్రస్థాయిలో పరిస్థితులను అంచనా వేయనున్నారని సమాచారం.

సమాజ్‌వాదీ పార్టీకి మౌర్య గుడ్ బై

సొంత పార్టీని ప్రకటిస్తానన్న సీనియర్ నేత



లక్నో: సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ)జాతీయ ప్రధాన కార్యదర్శి పదవి నుంచి వైదొలిగిన సీనియర్ నేత స్వామి ప్రసాద్ మౌర్య మంగళవారం ఆ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి, యూపీ ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశారు. ఈ నెల 22న ఢిల్లీలోని తల్కటోరా స్టేడియంలో జరిగే కార్యక్రమంలో సొంతంగా పార్టీని ప్రకటించనున్నట్లు తెలిపారు. కార్యకర్తల అభీష్టం తెలుసుకుని భవిష్యత్తు కార్యాచరణను ప్రకటిస్తానన్నారు. ఈ మేరకు ఎస్పీ చీఫ్ అఖిలేశ్ యాదవ్‌కు ఆయన ఒక లేఖ రాశారు. ఈ నెల 12వ తేదీన మీతో భేటీ అయ్యాను. 13న పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి పదవికి రాజీనామా చేశాను. ఆ తర్వాత మీ నుంచి ఎలాంటి స్పందనా రాలేదు. అందుకే పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నాను'అని అందులో పేర్కొన్నారు. ఇండియా కూటమిలో చేరుతారా లేక ఎన్డీఏలోకి వెళతారా అన్న ప్రశ్నకు ఆయన..ప్రస్తుత పరిస్థితుల్లో ఇండియా కూటమి అవసరం ఎంతో ఉందని వ్యాఖ్యానించారు.

చిన్నారి దత్తత ప్రాథమిక హక్కు కాదు

న్యూఢిల్లీ: చిన్నారిని దత్తత తీసుకోవడం రాజ్యాంగంలోని ఆర్టికల్ 21లోని ప్రాథమిక హక్కు కిందికి రాదని ఢిల్లీ హైకోర్టు స్పష్టం చేసింది. పెంపుడు తల్లిదండ్రులకు ఎవరిని దత్తత తీసుకోవాలో ఎంచుకునే హక్కు లేదని కూడా తేల్చి చెప్పింది. 'దత్తత ప్రక్రియ పూర్తిగా పిల్లల సంక్షేమం ప్రాతిపదికగానే ఉంటుంది. ఈ విషయంలో కాబోయే పెంపుడు తల్లిదండ్రుల హక్కులు పరిగణనలోకి రావు'అని పేర్కొంది. ఇద్దరు, అంతకంటే ఎక్కువ మంది పిల్లలను కలిగి ఉన్న తల్లిదండ్రులు ప్రత్యేక అవసరాలు, ఇతర ఇబ్బందులున్న పిల్లలను మాత్రమే దత్తత తీసుకోవాలన్న నిబంధనను సమర్థించింది. ఈ నిబంధన పిల్లల సంక్షేమంతోపాటు కాబోయే పెంపుడు తల్లిదండ్రుల హక్కుల పరిరక్షణకు పనికొస్తుందని తెలిపింది. దత్తత నిబంధనలు–2022 ఏకపక్షంగా ఉన్నాయని, అవి రాజ్యాంగంలోని ఆర్టికల్ 14కు భంగకరమంటూ దాఖలైన పలు పిటిషన్లను జస్టిస్ సుబ్రమణియం ప్రసాద్ సారథ్యంలోని ధర్మాసనం కొట్టివేస్తూ ఈ మేరకు తీర్పు వెలువరించింది.

నా కుమారుడి మృతదేహాన్ని అప్పగించండి

రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు నవాల్నీ తల్లి వినతి



మాస్కో: తన కుమారుడి మృతదేహాన్ని అప్పగించాలని ఇటీవల మృతి చెందిన రష్యా ప్రతిపక్ష నేత అలెక్సీ నవాల్నీ తల్లి ల్యుద్మిలా నవాల్నయా అధ్యక్షుడు పుతిన్‌ను కోరారు. నవాల్నీ శుక్రవారం ఆకస్మికంగా చనిపోయినట్లు అధికారులు ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే, అధికారులు నవాల్నీ మృతదేహాన్ని ఇప్పటికీ కుటుంబసభ్యులకు అప్పగించలేదు. మృతదేహం జాడను కూడా వెల్లడించడం లేదు. దీంతో, ల్యుద్మిలా నవాల్నయా శనివారం రాజధాని మాస్కోకు 2 వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న ఖర్ప్‌కు వెళ్లారు. అక్కడ నవాల్నీ శిక్ష అనుభవించిన జైలు పీనల్ కాలనీ–3 అధికారులను, మృతదేహాన్ని ఉంచినట్లుగా భావిస్తున్న ఆస్పత్రి అధికారులను కలిశారు. నవాల్నీ మృతదేహాన్ని ఎక్కడుంచిందీ తెలిపేందుకు వారు నిరాకరించడంతో తీవ్ర ఆవేదన చెందుతున్నారు. అధ్యక్షుడు పుతిన్‌ను ఉద్దేశించి ల్యుద్మిలా మాట్లాడిన వీడియోను నవాల్నీ బృందం ఆన్‌లైన్‌లో ఉంచింది. 'అయిదు రోజులుగా ఇక్కడ నిరీక్షిస్తున్నాను. ఇకనైనా నా కుమారుడి మృతదేహాన్ని అప్పగించండి. అతడికి గౌరవప్రదంగా అంత్యక్రియలు జరపనివ్వండి. ఇక నిర్ణయం తీసుకోవాల్సింది మీరే'అని అందులో ఆమె కోరారు.

టొరంటో–న్యూయార్క్ విమానంలో మంటలు

టొరంటో: కెనడాలోని టొరంటో నుంచి న్యూయార్క్‌కు బయలుదేరిన విమానంలో మంటలు రావడంతో తిరిగి టొరంటోలోనే అత్యవసరంగా ల్యాండయ్యింది. ఈ నెల ఫిబ్రవరి 3వ తేదీన జరగ్గా సోమవారం వెలుగులోకి వచ్చింది. డెల్టా ఎయిర్ లైన్స్ ఆధీనంలోని ఎండీవర్ ఎయిర్‌కు చెందిన జెట్ విమానం ఈ నెల 3న టొరంటోలోని పీయర్సన్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు నుంచి న్యూయార్క్‌లోని జేఎఫ్‌కే ఎయిర్‌పోర్టుకు టేకాఫ్ తీసుకుంది. కొద్దిసేపటికే కాక్‌పిట్‌లో వైర్లు మండుతున్న వాసన రావడంతో సిబ్బంది అప్రమత్తమయ్యారు. కెప్టెన్ పక్కనుండే విండ్‌షీల్డ్ ఎలక్ట్రికల్ కంట్రోల్ యూనిట్‌లో నిప్పు రవ్వలు, మంటలు రావడం గమనించిన సిబ్బంది వెంటనే విండ్ షీల్డ్ హీటర్‌ను ఆపు చేశారు. పై అధికారుల సూచన మేరకు విమానాన్ని తిరిగి టొరంటోలో ల్యాండ్ చేశారు. ఘటనలో విమానంలోని 74 మందికి ఎటువంటి అపాయం కలగలేదని ఎండీవర్ ఎయిర్ తెలిపింది.

కిమ్‌కు లిమోజిన్ పంపిన పుతిన్



సియోల్: ఉత్తరకొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్‌కు రష్యా అధ్యక్షుడు పుతిన్ విలాసవంతమైన లిమోజిన్ కారును కానుకగా పంపారు. కిమ్ వ్యక్తిగత అవసరాల కోసం అధ్యక్షుడు పుతిన్ దీనిని పంపించినట్లు రష్యా ప్రతినిధి పెస్కోవ్ తెలిపారు. ఇటీవల రష్యాలో పర్యటన సమయంలో అధ్యక్షుడు పుతిన్ ఈ లిమోజిన్‌ను ఆయనకు చూపించారని గుర్తు చేశారు. ఈ కానుకను కిమ్ సోదరి కిమ్ యో జోంగ్, మరో ఉన్నతాధికారి ఆదివారం స్వీకరించి, పుతిన్‌కు కిమ్ తరఫున ధన్యవాదాలు తెలిపారు. రష్యా, ఉత్తరకొరియాల మధ్య బంధం బలోపేతం అవుతోందనేందుకు ఇది తాజా ఉదాహరణ అని పరిశీలకులు అంటున్నారు. పుతిన్ చర్య ఐక్యరాజ్యసమితి ఆంక్షల ఉల్లంఘన కిందికి వస్తుందని కూడా వ్యాఖ్యానిస్తున్నారు.

పుణేలో రూ.1,100 కోట్ల మెఫెడ్రిన్ స్వాధీనం

పుణే: మహారాష్ట్ర పోలీసులు మెఫెడ్రిన్ అనే సింథటిక్ డ్రగ్‌ను పెద్ద మొత్తంలో పట్టుకుని, ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. 'ఆదివారం ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసి, వారి నుంచి ఎండీగా పిలిచే రూ.3.85 కోట్ల విలువైన 1.75 కిలోల మెఫెడ్రిన్‌ను స్వాధీనం చేసుకున్నాం. విచారణలో వారు వెల్లడించిన సమాచారం మేరకు కుర్‌కుంభ్ ఏరియాలోని రెండు గోదాముల్లో సోదాలు జరిపి మరో 600 కిలోల ఎండీ డ్రగ్‌ను పట్టుకున్నాం. దీని విలువ రూ.1,100కోట్లు పైమాటే'అని పుణే పోలీస్ కమిషనర్ అమితేశ్ కుమార్ చెప్పారు. అంతకుమించి వివరాలను వెల్లడించేందుకు ఆయన నిరాకరించారు.

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
బుధవారం ౹ 21 ౹ ఫిబ్రవరి ౹ 2024

ఎండలు బాబోయ్



ఫిబ్రవరి ఆఖరులోనే ఎండలు పెరిగాయి. మంగళవారం బెంగళూరు శివార్లలో మైసూరు రోడ్డులోని పట్టణగెరెలో గొడుగులతో వెళ్తున్న ఐటీ ఉద్యోగులు

ఎవరిది అబద్ధం?

- సీఎం సిద్ధు వర్సెస్ ప్రతిపక్షాలు
- విధానసభలో తీవ్ర చర్చ
- గవర్నర్ ప్రసంగంపై రగడ



మంగళవారం విధానసభలో సీఎం, ప్రతిపక్ష సభ్యుల వాదన

శివాజీనగర: అసెంబ్లీ మంగళవారం కూడా రణరంగమైంది. గవర్నర్ తొలిరోజు చేసిన ప్రసంగంలో అన్నీ అబద్ధాలేనని ప్రతిపక్షాలు గొడవకు దిగాయి. అధికార, విపక్షాల మాటల యుద్ధానికి దారితీసింది. గవర్నర్ ప్రసంగంలో నిజం ఉందని, ప్రభుత్వ విధానానికి అద్దం పట్టిందని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య సమర్థించుకొన్నారు. గ్యారంటీ పథకాల లబ్ధిదారులు సంతోషంగా ఉన్నారు. ప్రధాని మోదీ గ్యారంటీ పథకాల వల్ల ఆర్థిక వ్యవస్థ దివాలా తీస్తుందని రాజస్థాన్‌లో గతంలో చెప్పారు. ఇక్కడ ప్రభుత్వ ఆర్థిక వ్యవస్థ పడిపోయిందా? అని ప్రశ్నించారు. అన్నభాగ్య పథకానికి రూ.8,554 కోట్లు ఖర్చు చేశాం. గృహజ్యోతి పథకానికి రూ. 5,168 కోట్లు విడుదల చేశాం. గృహలక్ష్మీ పథకానికి ఇప్పటి వరకు రూ.13,362 కోట్లు ఖర్చు చేశాం, యువనిధి పథకానికి రూ.7 కోట్ల 34 లక్షలు ఖర్చు చేశాం, ఇది మా సర్కారు ఘనత అని చెప్పారు.

మీది సిద్దరామిక్స్

బీజేపీ రాజ్యాంగ, కార్మిక, మహిళా వ్యతిరేకమైనదని సీఎం ఆరోపించగా బీజేపీ పక్ష నేత ఆర్.అశోక్, బసవరాజ బొమ్మై భగ్గుమన్నారు. గ్యారంటీ పథకాలకు ఇష్టానుసారం నిధులను మళ్లించారని ఆరోపించారు. మీది సిద్దరామిక్స్ ఆర్థిక విధానమని ఎద్దేవా చేశారు. మీరు చెప్పే పదాన్ని నేను వినలేదని, కానీ అర్థశాస్త్రంపై నాకు విశ్వాసముందని సీఎం అన్నారు.

కేంద్రంతో ఎందుకు గొడవ: కుమార

జేడీఎస్ పక్షనేత హెచ్‌డీ కుమారస్వామి మాట్లాడుతూ కేంద్రంతో రాష్ట్రం సంఘర్షణ సరికాదని చెప్పారు. రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని ప్రశ్నిస్తూ న్యాయం చేయాలని కోరడం గొడవ చేయటమా అని సీఎం ప్రశ్నించారు. రాష్ట్రంలో కరువు ఏర్పడింది. ఉపాధి హామీ కూలీల పని దినాలను 150 రోజులకు పెంచాలని కేంద్ర ప్రభుత్వానికి 17 సార్లు లేఖ రాస్తే, ఒక్కసారి మాత్రమే లేఖ చేరిందని సమాచారం వచ్చింది. దీనిని సమాఖ్య వ్యవస్థ అని పిలుస్తారా?, మేం గొడవ చేయడం లేదు. 7 కోట్ల కన్నడిగులకు ద్రోహం చేశారు అని సీఎం మండిపడ్డారు.



సభాపతి ముందు నిరసన

బీజేపీ వాకౌట్

సీఎం సమాధానం సంతృప్తికరంకాలేదని బీజేపీ, జేడీఎస్‌లు విధాన సభ నుంచి వాకౌట్ చేశాయి. గవర్నర్ ప్రసంగం, ముఖ్యమంత్రి సమాధానం, ఆఖరికి బడ్జెట్ కూడా అబద్ధమేనని బీజేపీ నేత అశోక్ దుయ్యబట్టారు. అధికార పార్టీ సభ్యులంతా ఒక్కసారి నిలబడి అశోక్ మాటలను వ్యతిరేకించారు. ప్రతిపక్ష పార్టీ సభ్యులు కూడా లేచి గట్టిగా నినాదాలు చేశారు. దీంతో సభలో వాతావరణం వేడెక్కింది. ఎవరు ఏమి మాట్లాడుతున్నారో అర్థం కాలేదు. అధికార, ప్రతిపక్ష పార్టీ సభ్యుల మధ్య వాగ్వివాదం నెలకొంది. చివరకు ప్రతిపక్ష ఎమ్మెల్యేలు వాకౌట్ అని వెళ్లిపోయారు.

రూ.4.30 లక్షల కోట్లలో సగం ఇవ్వాలి



శివాజీనగర: కేంద్ర ప్రభుత్వానికి ఎక్కడి నుంచి సొమ్ము వస్తుంది? రాష్ట్రం, దేశంలో ప్రజలు ఇచ్చే పన్నుల సొమ్మే కదా? కర్ణాటక నుంచి రూ.4.30 లక్షల కోట్లు కేంద్రానికి ప్రతి సంవత్సరం పన్నుల రూపేణా వెళ్తోంది. రాష్ట్రానికి వెనుతిరిగి వస్తున్నది రూ. 50 వేల కోట్లు మాత్రమే అని సీఎం సిద్దరామయ్య కేంద్రంపై ధ్వజమెత్తారు. విధానసభలో చర్చలో ఆయన మాట్లాడుతూ 15వ ఆర్థిక కమిషన్ ద్వారా అన్యాయం జరిగింది. ఇప్పటికి రూ.50,252 కోట్ల నిధులే వచ్చాయి. గతంలో నరేంద్ర మోదీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కేంద్రం పన్ను వాటాపై ఏమి చెప్పారు? గుజరాత్ నుంచి పన్నులనే వసూలు చేయరాదని చెప్పలేదా? అన్నారు. ఎంపీ డీకే సురేశ్ నిధుల గురించి అడిగితే దేశ విభజన అని రాద్ధాంతం చేస్తారా? అని మండిపడ్డారు. బీజేపీ పక్ష నాయకుడు ఆర్.అశోక్ మాట్లాడుతూ నరేంద్ర మోదీ పన్ను గురించి అడిగారు. అయితే డీకే సురేశ్ దేశ విభజన గురించి వ్యాఖ్యలు చేశారు అని చెప్పడంతో మళ్లీ వాగ్వాదం చెలరేగింది. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పార్లమెంట్‌లో కేంద్రం తారతమ్యం గురించి ఎందుకు మాట్లాడలేదని అశోక్ ప్రశ్నించారు. సీఎం మాట్లాడుతూ 2023–24లో కర్ణాటక నుంచి రూ.4.30 లక్షల కోట్లు కేంద్రానికి వెళ్లింది, అందులో 50 శాతం వాటా ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీనికి బీజేపీ ఎమ్మెల్యే అరవింద్ బెల్లద్ అడ్డు చెబుతూ ముఖ్యమంత్రి తప్పుడు సమాచారం ఇస్తున్నారన్నారు. అనేక హైవే పథకాలకు కేంద్రమే నిధులు ఇచ్చిందన్నారు. ఇలా ఎవరికి వారు వాదనలను వినిపిస్తూ ఆరోపణలు చేసుకున్నారు.

మార్చి 21న వైరముడి ఉత్సవం



ఉత్సవాలపై అధికారుల సమావేశం

మండ్య: మండ్య జిల్లాలో ఉన్న చరిత్ర ప్రసిద్ధ మేలుకోటెలోని చెలువనారాయణ స్వామి వారి దేవాలయంలో మార్చి 21వ తేదీన వైరముడి ఉత్సవం నిర్వహిస్తారు. అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర డా.కుమార అధికారులకు సూచించారు. మంగళవారం మండ్యలో కలెక్టరేటులో ఆయన అధికారులతో సమావేశమయ్యారు. జిల్లా ట్రెజరీలో భద్రపరచిన వైరముడి వజ్రాభరణాల పెట్టెను మార్చి నెల 21వ తేదిన ఉదయం 7 గంటలకు తీసుకుని మేలుకోటెకు బయలుదేరాలన్నారు. దారి వెంబడి భారీ బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. వైరముడి బ్రహ్మోత్సవం మార్చి 21వ తేదీ రాత్రి 8 గంటల నుంచి ప్రారంభమవుతుంది.

కుక్కను ఎత్తుకెళ్లాడని బోనులో బంధించి..



బోనులో వ్యక్తిని బంధించిన దృశ్యం

సాక్షి, బళ్లారి: తాగిన మైకంలో ఓ వ్యక్తి బార్‌లో యజమానికి చెందిన కుక్కను పట్టుకెళ్లాడు, దాంతో బార్ సిబ్బంది ఆ మందుబాబుని తీసుకొచ్చి కుక్కను ఉంచిన బోనులోనే బంధించారు. ఈ అమానుష ఘటన విజయపుర నగరంలోని బబలేశ్వర రోడ్డులోని సాయి ప్రభాత్ బార్‌లో జరిగింది. వివరాలు.. సోము అనే వ్యక్తి బార్‌లో మద్యం తాగాడు, అక్కడే ఉన్న కుక్కను పట్టుకెళ్లాడు. సిబ్బంది గాలించి సోమును బార్‌కు లాక్కొచ్చి కొట్టి బోనులో బంధించారు. కుక్క ముద్దుగా ఉండటంతో మద్యం మత్తులో తీసుకెళ్లానని, వదిలిపెట్టాలని బాధితుడు మొర పెట్టుకున్నా వారు కనికరించలేదు. స్థానికులు, బార్‌కు వచ్చినవారు గొడవ చేయడంతో చివరకు అతన్ని విముక్తున్ని చేశారు. బార్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

డ్రైవర్ ఆత్మహత్యాయత్నం



డ్రైవర్‌ను అడ్డుకుంటున్న జనం

కృష్ణరాజపురం: హోసకోటె పట్టణం వద్దనున్న టోల్ ప్లాజా దగ్గర బీఎంటీసీ బస్సు డ్రైవర్ ఆత్మహత్యాయత్నం చేశాడు. మంగళవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో నంజుండయ్య అనే బీఎంటీసీ డ్రైవర్ బస్సును నిలిపివేసి, తనను ఉన్నతాధికారులు వేధిస్తున్నారని వాపోయాడు. పురుగుల మందు తాగేయత్నం చేయగా స్థానికులు అతన్ని అడ్డుకున్నారు. అక్కడి నుంచే పై అధికారులతో మాట్లాడి సమాధానపరిచారు.

న్యూస్‌రీల్

డ్రైవర్ లేని మెట్రో ఇదే



డ్రైవర్ రహిత మెట్రో రైలు

బనశంకరి: సిలికాన్ సిటీలో త్వరలో డ్రైవర్ రహిత మెట్రో రైలు పరుగులు తీయబోతోంది. చైనా నుంచి హెబ్బగోడి డిపోకు తరలించిన మెట్రో రైలు ఫోటోను మెట్రో సంస్థ మంగళవారం ఎక్స్‌లో విడుదల చేసింది. గ్రీన్ మార్గంలో సిల్క్‌బోర్డు జంక్షన్ నుంచి ఆర్‌వీ.రోడ్డు, బొమ్మసంద్ర వరకు సంచరిస్తుంది. రానున్న రోజుల్లో కాళేన అగ్రహార నుంచి నాగవార మార్గం విమానాశ్రయమార్గంలో డ్రైవర్‌లెస్ మెట్రో నడుపుతారు. మొదటగా ప్రయోగాత్మకంగా ఒకటి రెండు మార్గాల్లో నడిపి విజయవంతమైతే మిగిలిన మార్గాల్లో ప్రారంభిస్తారు.

దుబాయ్ టూర్ అని రూ.3 లక్షలు లూటీ

మైసూరు: దుబాయ్ పర్యటనకు తీసుకెళ్తానని ఒకరిని నమ్మించి రూ. 3 లక్షలను కొట్టేసిన ఘటన మైసూరులో జరిగింది. నగరంలోని బోగాదిలో నివాసం ఉంటున్న కృష్ణేగౌడకు పర్యటనలంటే ఆసక్తి. గతంలో జమ్ము కశ్మీర్‌కు వెళ్లి వచ్చాడు. ఈ సమయంలో స్నేహితుల ద్వారా కేరళకు చెందిన ప్రేమదాస్ అనే వ్యక్తి పరిచయమయ్యాడు. తాను ట్రావెల్ ఏజెంట్‌ను అని, విదేశాలకు టూర్లకు తీసుకుని వెళ్తానని చెప్పాడు. ఈసారి దుబాయ్ ట్రిప్‌కి వెళ్తున్నామని, రూ. 3 లక్షలు ఇస్తే నిన్నూ తీసుకెళ్తామనడంతో కృష్ణేగౌడ డబ్బులు ఇచ్చాడు. కానీ ఎన్ని రోజులు గడిచినా ప్రేమదాస్ దుబాయ్‌కి తీసుకెళ్లలేదు. ఫోన్ చేయగా స్విచాఫ్ రావడంతో మోసపోయానని తెలుసుకుని నజరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

రాత్రి గస్తీ ముమ్మరం



శివమొగ్గ నగరంలో పహరా

శివమొగ్గ: శివమొగ్గ జిల్లా పోలీసులు రాత్రి వేళ నడక ద్వారా గస్తీ నిర్వహిస్తూ ప్రజలతో మాట్లాడుతూ సమస్యలను తెలుసుకొంటున్నారు. అక్రమాలపైన కేసులు సైతం నమోదు చేస్తున్నారు. సోమవారం రాత్రి శివమొగ్గ, శికారిపుర, సాగర, తీర్థహళ్లిలో పోలీసులు గస్తీ నిర్వహించారు. ఆయా ప్రాంతాలో అనుమానంగా ఉన్న వారిపైన, ప్రజలపట్ల దురుసుగా ప్రవర్తించేవారి పట్ల 33 కేసులను నమోదు చేశారు. మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించే వారిపైనా కేసులు పెట్టినట్లు తెలిపారు.

బైక్‌ను వ్యాన్ ఢీకొని ఇద్దరు మృతి

మైసూరు: ఆస్పత్రిలో ఉన్న మిత్రున్ని పరామర్శించడానికి వెళ్తుంటే ఏకంగా పరలోకానికే చేరుకున్నారు. సరుకు రవాణా వ్యాన్.. బైకును ఢీకొనడంతో ఇద్దరు దుర్మరణం చెందారు. ఈ ప్రమాదం మైసూరులో హుణసూరు రోడ్డులోని బెళవాడి గేట్ వద్ద జరిగింది. మృతులు ఉత్తర ప్రదేశ్‌కు చెందిన వలస కార్మికుడు బాబురామ్ (55), స్థానికుడు మరియప్ప (58). వివరాలు.. వీరు ఇలవాల పారిశ్రామివాడలో ఓ కంపెనీలో పనిచేసేవారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న స్నేహితున్ని చూడటం కోసం మంగళవారం ఇద్దరూ బైక్‌పై బయల్దేరారు. ఆ సమయంలో వేగంగా వచ్చిన గూడ్స్ వ్యాన్ బైక్‌ను ఢీకొట్టింది, బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని పల్టీలు కొట్టింది. ఇద్దరూ తీవ్ర గాయాలతో సంఘటనా స్థలంలో మరణించారు. వివి పురం పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేశారు.

అనుమానం పెనుభూతమై

- భార్యపై కొడవలితో దాడి




బాధితురాలు నిందితుడు

బనశంకరి: వేధిస్తున్న భర్తను వదిలిపెట్టి పీజీ హాస్టల్‌లో నివసిస్తున్న భార్యపై భర్త నడిరోడ్డుపై కొడవలితో హత్యాయత్నం చేశాడు. ఈ ఘటన బెంగళూరు జీవన బీమానగరలో జరిగింది. బాధితురాలు నిగర్ (28) ప్రైవేటు ఆసుపత్రిలో ఐసీయులో చికిత్స పొందుతుంది. డ్రైవర్‌గా పనిచేస్తున్న షేక్ ముజీబ్ (37) ఆరేళ్ల క్రితం నిగర్‌ను పెళ్లి చేసుకున్నాడు. భార్యపై అనుమానం పెంచుకుని ఆమెను వేధించసాగాడు. 6 నెలల క్రితం భర్త నుంచి దూరంగా ఉంటూ మురుగేశ్‌పాళ్యలో పీజీలో ఆమె ఉంటోంది. సోమవారం సాయంత్రం 6:45కు వాకింగ్‌కు వెళ్లి నిగర్ పీజీకి తిరిగి వస్తోంది. అక్కడే పొంచి ఉన్న ముజీబ్ ఆమెపై కొడవలితో ఒక్కసారిగా నరికాడు. తల, చేతులు శరీరంపై 25 గాట్లు పడ్డాయి. తీవ్ర రక్తస్రావంతో పడి ఉన్న నిగార్ ను స్థానికులు ఆసుపత్రికి తీసుకెళ్లారు. జీవనబీమానగర పోలీసులు ఘరానా భర్తను అరెస్ట్‌చేశారు.

పేలుళ్లు జరిపి ప్రభావాన్ని పరీక్షించండి

- కేఆర్‌ఎస్ డ్యాం, గనుల గొడవపై హైకోర్టు ఆదేశం
- త్వరలోనే ప్రయోగాత్మక విస్ఫోటాలు



కృష్ణరాజ సాగర్ జలాశయం (ఫైల్)



త్వరలోనే పేలుళ్ల ప్రక్రియ

మండ్య: హైకోర్టు ఆదేశాల మేరకు కేఆర్‌ఎస్ జలాశయం చుట్టుపక్కల సుమారు 20 కిలోమీటర్ల పరిధిలో ప్రయోగాత్మకంగా పేలుళ్లు జరిపి, ఆ ప్రభావం డ్యాంపై ఎంత మేరకు ఉంటుందో నిపుణులు పరిశీలించనున్నారు. ఇందుకోసం నిపుణుల సమితి ఏర్పాటైందని, అతి త్వరలో పేలుళ్ల నిర్వహణకు తేదీని ప్రకటిస్తామని మండ్య జిల్లా కలెక్టర్ డా. కుమార తెలిపారు. మంగళవారం మండ్యలో కలెక్టరేటులో ట్రయల్ బ్లాస్టింగ్ విషయమై అధికారులతో భేటీ జరిపారు. ఆయన మాట్లాడుతూ కేఆర్‌ఎస్ చుట్టుపక్కల ఉన్న గనుల తవ్వకాలు జరుగుతున్నాయి. డ్యాంకు 20 కిలోమీటర్ల లోపుల ఉన్న గనుల తవ్వకాలు, పేలుళ్లు జరపకూడదని హైకోర్టు ఆదేశాలను జారీ చేసింది. అలాగే ఆరు నెలల లోపల జలాశయానికి 20 కి.మీ. పరిధిలో ప్రయోగాత్మకంగా విస్ఫోటాలను జరిపి దాని ప్రభావం డ్యాంపై ఎలా ఉంది అనేది నిపుణులు తనిఖీ చేసి నివేదిక ఇవ్వాలని ఆదేశించిందని తెలిపారు. డ్యాం చుట్టుపక్కల 20 కిలోమీటర్ల పరిధిలో ఉన్న గనులను గుర్తించి అక్కడ ట్రయల్ బ్లాస్టింగ్ జరుపుతామని చెప్పారు.

ముందు నుంచీ ఆరోపణలు

కాగా, డ్యాం చుట్టుపక్కల యథేచ్ఛగా గ్రానైట్, ఇతరత్రా గనుల తవ్వకాలు జరుగుతున్నాయి. వాటిలో పేలుళ్ల వల్ల డ్యాంకు ముప్పు ఉందని పలు ప్రజాసంఘాలు ఆరోపించాయి. దీనిపై పలువురు హైకోర్టును ఆశ్రయించడంతో తాజా చర్యలకు ఆదేశించింది. ఈ నేపథ్యంలో గనిదారుల్లో గుబులు నెలకొంది.

ప్రేమజంటకు పెద్దల బ్రేక్

- యువతిని బలవంతంగా తీసుకెళ్లిన కుటుంబీకులు
- ఇటీవలే గుడిలో పెళ్లి



పద్మజ, ప్రవీణ్

సాక్షి, బళ్లారి: కూతురు మరో కులం యువకున్ని ప్రేమించి పెళ్లి చేసుకుందని కోపగించుకున్న తల్లిదండ్రులు వారి రిజిస్టర్ పెళ్లిని అడ్డుకున్న ఘటన చిత్రదుర్గ జిల్లా మొళకాల్మూరు తాలూకా బీజీకెరెలో జరిగింది. వివరాలు.. బీజీకెరె గ్రామానికి చెందిన ప్రవీణ్, పద్మజ అనే ఇద్దరు ఐదేళ్ల నుంచి ప్రేమించుకుని గత వారం క్రితం ఆలయంలో పెళ్లి చేసుకున్నారు. అయితే కులాలు వేర్వేరని వారి పెళ్లికి అమ్మాయి తల్లిదండ్రులు అడ్డు చెప్పారు. ప్రేమికులిద్దరూ మంగళవారం రిజిస్టర్ పెళ్లి చేసుకోవాలని మొళకాల్మూరుకు బయల్దేరారు. ఇంతలో పద్మజను వారి బంధువులు అడ్డుకుని బలవంతంగా బైక్‌పై తీసుకెళ్లారు. ఈ వీడియో వైరల్ అయింది. బీజీకెరె గ్రామానికి చెందిన ప్రవీణ్‌నాయక్ ఎస్టీ అయితే, కోనసాగర గ్రామానికి చెందిన పద్మజ బీసీ కులం యువతి. పద్మజ మంగళూరు నర్సింగ్ కళాశాలలో అతిథి లెక్చరర్‌గా పని చేస్తుండేది. ఆమె బంధువులు తమపై బెదిరింపులకు పాల్పడుతున్నారని ప్రవీణ్ ఆరోపించారు. స్థానిక పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



బెంగళూరు టౌన్‌హాల్‌లో ఇందిరాగాంధీ ఓపెన్ వర్సిటీ స్నాతకోత్సవంలో పట్టభద్రులు

టీచర్ ఎమ్మెల్సీలో కాంగ్రెస్ గెలుపు

బనశంకరి: బెంగళూరు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గం ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి పుట్టణ్ణ గెలుపొందారు. గత శుక్రవారం పోలింగ్ జరిగితే, మంగళవారం నగరంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కాలేజీలో ఓట్ల లెక్కింపు నిర్వహించారు. బీజేపీ–జేడీయస్ కూటమి అభ్యర్థి ఏపీ రంగనాథ్‌పై 1,506 ఓట్ల మెజారిటీతో పుట్టణ్ణ పై చేయి సాధించారు. దీంతో ఆయన అభిమానులు సంబరాలు చేసుకున్నారు. రంగనాథ్ మాట్లాడుతూ ఇది పొత్తు ఓటమి కాదని, నా వ్యక్తిగత ఓటమి అని, కాంగ్రెస్‌వారు డబ్బును, అధికార యంత్రాంగాన్ని దుర్వినియోగం చేశారని ఆరోపించారు.

మహిళకు ఖతార్ నుంచి బెదిరింపులు

యశవంతపుర: మంగళూరు పాఠశాలలో ఓ మతం గురించి కించపరిచే బోధన చేశారని ధర్నా జరిగితే అందులో కవిత అనే ఓ మహిళ పాల్గొని మీడియా ముందు గళమెత్తింది. దీంతో ఆమెకు విదేశాల నుంచి బెదిరింపు కాల్స్ వస్తున్నాయి. బాధితురాలు స్థానిక కంకనాడి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఉపాధ్యాయురాలు కవిత సదరు పాఠశాల ముందు ధర్నాలో హిందూ సంఘాలతో కలిసి పాల్గొనింది. పాఠశాలలో తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మాధ్యమాలలో మాట్లాడింది. ఈ నేపథ్యంలో కొందరు వ్యక్తులు కవిత మొబైల్‌కు రాత్రి సమయంలో ఫోన్ చేసి అసభ్యకరంగా బెదిరింపులకు పాల్పడ్డారు. ఖతార్ నుంచి కాల్స్ వచ్చినట్లు కవిత తెలిపింది.

మెట్రో రైళ్లకు అంతరాయం



బైయప్పనహళ్లి స్టేషన్‌లో కిటకిట

- బైయప్పనహళ్లి మార్గంలో తీవ్ర గందరగోళం

కృష్ణరాజపురం: బెంగళూరు నగరంలోని బైయప్పనహళ్ళి నుంచి గరుడాచారి పాళ్య మధ్య నడిచే నమ్మ మెట్రో రైలు రూట్‌లో యాంత్రిక సమస్యలు తలెత్తడంతో పర్పుల్ లైన్‌లో గందరగోళం ఏర్పడింది. కొన్నిగంటల పాటు మెట్రో రైళ్లు లేక ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. రోజూ ఈ సమయంలో మెట్రోలో ప్రయాణానికి విపరీతమైన రద్దీ ఉంటుంది. ఐటీ ఉద్యోగులు, ప్రజలు ఈ మార్గంలో ఎక్కువగా వెళ్తుంటారు. ఏం జరిగిందో కానీ మంగళవారం పొద్దున నుంచి ఈ మార్గంలో మెట్రో రైళ్లు నడవలేదు. ఒకటీ అరా వచ్చినా ప్రయాణికులు ఎక్కేందుకు తోసుకున్నారు. లైన్‌లో సాంకేతిక సమస్య ఏర్పడిందని, మరమ్మతులు చేస్తున్నామని అధికారులు తెలిపారు. ఫలితంగా ఈ మార్గంలోని అన్ని స్టేషన్లలో రద్దీ ఆకాశాన్నంటింది. ఉదయం 10 గంటల వరకు ఇదే మాదిరిగా ఉండింది. ప్రయాణికులు ఆయా స్టేషన్లలోని రద్దీని ఫోటోలు, వీడియోలు తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేసి అక్కసు వెళ్లగక్కారు.



మరో మెట్రో స్టేషన్‌లో రద్దీ

రామనగరలో లాయర్ల పోరాటం

- కలెక్టరేట్ గేటు ముందు నిద్ర
- కేసుల నమోదుపై ఆగ్రహం



కలెక్టరేట్ ముందు న్యాయవాదుల ధర్నా

దొడ్డబళ్లాపురం: రామనగరలో న్యాయవాదులపై కేసులు పెట్టిన పోలీసు అధికారులను సస్పెండ్ చేయాలంటూ లాయర్లు చేస్తున్న పోరాటం ఉధృతమైంది. సోమవారం రాత్రి లాయర్లు కలెక్టరేట్ ముందు ధర్నా కొనసాగించారు. అక్కడే పరుపులు, చాపలు వేసుకుని పడుకున్నారు. కలెక్టర్, ఎస్పీ ఇద్దరినీ ఇళ్లకు వెళ్లకుండా గేటు మూసివేసి పడుకున్నారు. దీంతో కలెక్టర్ డా.అవినాశ్ మీనన్ రాజేంద్రన్, ఎస్పీ కార్తీక్‌రెడ్డి ఆఫీసుల్లోనే గడిపారు.

బీజేపీ పక్ష నేత ఆర్.అశోక్, జేడీఎస్ నేత హెచ్‌డీ కుమారస్వామి ఇద్దరూ వచ్చి లాయర్లకు మద్దతుగా నిలిచారు. 40 మంది వకీళ్లపై కేసు నమోదు చేసిన పోలీసులను సస్పెండ్ చేయాలని డిమాండు చేసారు. మంగళవారం కూడా లాయర్లు ధర్నా కొనసాగించారు. నిరసన నేపథ్యంలో రామనగరలో భారీ బందోబస్తు ఏర్పాటైంది. ఈ నేపథ్యంలో పోలీసులు డ్రోన్ కెమెరాలు,100 సీసీ కెమెరాలు, 40 హ్యాండి క్యామ్‌లతో ప్రతి కదలికను రికార్డు చేస్తున్నారు.

న్యాయవాదుల నిరసన

పావగడ: రామనగర జిల్లా ఐజూరు పోలీస్ స్టేషన్ ఎస్ఐ సయ్యద్ తన్వీర్ హుసేన్ ను తక్షణమే సస్పెండ్ చేయాలని స్థానిక న్యాయవాదులు డిమాండ్ చేశారు. మంగళవారం కోర్టు విధులు బహిష్కరించి ఆందోళన చేపట్టారు. కోర్టు నుంచి ర్యాలీగా తాలూకాఫీసుకు తరలివచ్చారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శేషనందన్ మాట్లాడుతూ రామనగర జిల్లా బార్ అసోసియేషన్ కు చెందిన 40 మంది న్యాయవాదుల పైన అపద్ధపు కేసులు నమోదు చేసిన ఐజూరు ఎస్ఐ సయ్యద్ తన్వీర్ హుసేన్‌ను వెంటనే సస్పెండ్ చేసి అతని పై న్యాయపరమైన చర్యలు చేపట్టి న్యాయవాదులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.



ఆందోళనలో పాల్గొన్న బీజేపీ, జేడీఎస్ నేతలు ఆర్.అశోక్, కుమారస్వామి

క్లుప్తంగా

దివ్యాంగుల సంక్షేమం ఏదీ?



మాట్లాడుతున్న సురేష్

రాయచూరు రూరల్: రాష్ట్రంలో వివిధ శాఖల నుంచి దివ్యాంగులకు కేటాయించిన నిధులను అధికారులు సక్రమంగా వినియోగించాలని దివ్యాంగుల టాస్క్‌ఫోర్స్ కార్యదర్శి సురేష్ పేర్కొన్నారు. మంగళవారం పాత్రికేయుల భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఎనిమిదేళ్ల నుంచి దివ్యాంగులకు సౌకర్యాలు కల్పించనందున సాంఘిక న్యాయం లభించడం లేదన్నారు. రాష్ట్రంలో 28 శాఖల నుంచి లభించిన 5 శాతం నిధులు వినియోగించకుండా ఇతర పనులకు వాడుకోవడాన్ని తప్పుబట్టారు. దివ్యాంగుల సమస్యలను పరిష్కరించడానికి ముగ్గురు సభ్యులున్నా ఏళ్ల తరబడి టాస్క్‌ఫోర్స్ సమావేశాలు నిర్వహించడం లేదన్నారు. అధికమైన నకిలీ దివ్యాంగుల సంఖ్య నియంత్రణకు జిల్లాధికారి చర్యలు చేపట్టాలన్నారు.

రేపటి నుంచి వాసవీ మాత ప్రాణ ప్రతిష్టాపన ఉత్సవాలు



మాట్లాడుతున్న నిజాముద్దీన్

రాయచూరు రూరల్: తాలూకాలోని యరగేరలో ఈనెల 22 నుంచి 24 వరకు వాసవి మాత ప్రాణ ప్రతిష్టాన ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు గ్రామ పంచాయతీ మాజీ అధ్యక్షుడు నిజాముద్దీన్ వెల్లడించారు. మంగళవారం పాత్రికేయుల భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు జరిగే వాసవి మాత ఉత్సవాల్లో భాగంగా నూతన దేవాలయం, వాసవి మాత ప్రాణ ప్రతిష్టాపనను చేపడతారన్నారు. కార్యక్రమంలో మంత్రి బోసురాజు, ఎంపీ రాజా అమరేశ్వర నాయక్, గ్రామీణ ఎమ్మెల్యే బసనగౌడ పాల్గొంటారన్నారు. ఈనెల 24న 108 కలశాలతో వాసవి మాతను పుర వీధుల్లో ఊరేగిస్తారన్నారు. విలేకరుల సమావేశంలో నాగరాజ్ శెట్టి, శంకర్, వీరేష్, సుబ్రమణ్యం, సత్యనారాయణలున్నారు.

బాలికల వసతి పాఠశాలలో ఆకస్మిక తనిఖీ

కంప్లి: మీ హక్కులను కాపాడడం బాలల హక్కుల కమిషన్ బాధ్యత అని, మీ సమస్యలు, మీకు హక్కులు సక్రమంగా అందుతున్నాయా? అని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యుడు శశిధర్ అన్నారు. తాలూకాలోని కోఛూరు గ్రామంలోని గాంధీ తత్వ ఆధారిత బాలికల వసతి పాఠశాలను ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. కురుగోడు పట్టణంలోని పాత చిత్రమందిర కట్టడంలో కొనసాగుతున్న పాఠశాలలో మౌలిక సౌకర్యాలకు వంచితులు కాగా వసతి పాఠశాల ఉన్న కోఛూరు గ్రామానికి సరైన వ్యవస్థ ఉన్నది లేనిది పరిశీలించారు. విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా ఉన్నది పరిశీలించి వారికి అభయహస్తం అందించారు.

సర్కార్ నిర్ణయం ఖండనీయం



వినతిపత్రం సమర్పిస్తున్న కార్యకర్తలు

రాయచూరు రూరల్: జ్ఞానదేవాలయంపై రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఏబీవీపీ ఖండించింది. మంగళవారం జిల్లాధికారి కార్యాలయం వద్ద చేపట్టిన ఆందోళనలో ఏబీవీపీ నగర సంచాలకుడు భీమేష్ సాగర్ మాట్లాడారు. జ్ఞానదేవాలయంలో ప్రవేశానికి ముందు చేతులు జోడించి లోపలకు రమ్మనే కువెంపు పదానికి శ్రీకారం చుట్టడాన్ని తప్పుబట్టారు. మరోవైపు పాఠశాల, హాస్టల్‌లో సరస్వతి, గణపతి, లక్ష్మి పూజ చేయకుండా నూతనంగా జ్ఞానదేగుల వద్ద కొత్త సంప్రదాయానికి నాంది పలికి ఆ ప్రాంతంలో అలజడి రేగడానికి అవకాశం కల్పించిన సర్కార్ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు.

మండీల తొలగింపునకు వినతి



వినతిపత్రం సమర్పిస్తున్న అంబాజీరావ్

రాయచూరు రూరల్: నగరంలోని తీన్‌కందిల్ వద్ద చేపల, పండ్ల మండీలను తొలగించాలని అఖిల భారత రాహుల్ గాంధీ బ్రిగేడ్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబాజీరావ్ డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లాధికారి కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టి మాట్లాడారు. ప్రధాన రహదారి అయిన తీన్‌కందిల్‌లో ఉదయం, సాయంత్రం వేళల్లో కుడి, ఎడమ వైపుల్లో చేపలు, పండ్ల వాహనాలను అడ్డంగా నిలబెట్టి విద్యార్థులు, ఇతర గ్రామాల నుంచి వచ్చే ప్రజలకు, వాహనదారులను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. అందువల్ల వాటిని అక్కడి నుంచి వేరే చోటకు తరలించాలని కోరుతూ జిల్లాధికారి చంద్రశేఖర్ నాయక్‌కు వినతిపత్రం సమర్పించారు.

మహిమాన్వితుడు.. బూది బసవేశ్వరుడు

- నేడు గబ్బూరు బూదిబసవేశ్వర జాతర
- తాడు లేకుండానే రథం నడవడం విడ్డూరం

రాయచూరు రూరల్: కళ్యాణ కర్ణాటకలో శైవ ఆలయాలకు కొదవలేదనడంలో అతిశయోక్తి లేదు. జిల్లా శరణులకు, సంతులకు, దాసులకు నిలయంగా మారింది. పూర్వ కాలంలో పెద్దలు చెప్పిన మాటలు వేదవాక్కులుగా ఉండేవి. దేవదుర్గ తాలూకా గబ్బూరు లో వెలసిన మహిమాన్విత పురుషుడు బూదిబసవేశ్వరుడు. అలనాడు నిజామ్ నవాబులు శరణులకు వ్యతిరేకంగా వాదనలకు దిగారు. తాడు లేకుండా రథాన్ని లాగాలని బసవేశ్వరుడితో సవాల్ చేశారు. ఇది గమనించిన బసవేశ్వరుడు రథాన్ని ఎద్దుబా బసవ అని పిలవగానే రథం దానంతటికదే రావడం విడ్డూరం కావడంతో ఆశ్చర్యచకితులైన నిజాం నవాబులు మఠానికి భూమిని దానంగా ఇచ్చారు. శావంతగేర కుటుంబానికి చాలా ఏళ్ల నుంచి పిల్లలు లేకపోవడంతో గబ్బూరు మఠంలో రాత్రి వేళ నిద్రిస్తుండగా కలలో బసవన్నగా కన్పించి అదృశ్యం అయ్యాడు. ఇంటిలో సంతానానికి కొదవ లేకుండా పది మందికి సంతానభాగ్యం కల్పించారు. పెళ్లికాని వారు మొక్కుకుంటే వారికి కళ్యాణ భాగ్యం లభించింది.



ఆలయంలోని బూది బసవేశ్వర మూల విరాట్

భక్తుల కొంగుబంగారం



పీఠాధిపతి బూది బసవ శివాచార్యులు

బూది బసవేశ్వరుడు భక్తుల కొంగుబంగారంగా విరాజిల్లుతున్నారు. బూది బసవేశ్వరుడిని నమ్ముకున్న రాజకీయ నాయకులంతా గ్రామ, తాలూకా, జిల్లా పంచాయతీ సభ్యులుగా ఎదిగారు. చుట్టు పక్కల గ్రామాల ప్రజలు బూది బసవేశ్వరుడి జాతరలో పది రోజుల పాటు మద్యం తాగడం, మాంసం తినడానికి దూరంగా ఉంటారు. బూది బసవేశ్వరుడి మహిమలను చూడడానికి భక్తులు తండోపతండాలుగా తరలి వస్తారు. ఈనెల 21న జరిగే గబ్బూరు బూదిబసవేశ్వరుడి జాతర వేళలో స్వామీజీ రథోత్సవాన్ని లేచి రా బసవ అని ఐదు సార్లు పిలిస్తే రథం దానంతటికదే నడుచుకుంటూ పది అడుగుల దూరం తాడు, ప్రజల తోడు లేకుండా నేరుగ రావడం కనిపిస్తుంది. భక్తుల సౌకర్యార్థం మౌలిక సౌకర్యాలను కల్పించారు. భోజన వసతి సౌకర్యాలున్నాయి. చుట్టుపక్కల ఉన్న మాన్వి, రాయచూరు, లింగసూగూరు, సింధనూరు, బళ్లారి, ఆదోని, కర్నూలు, మహబూబ్ నగర్, హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి జాతరలో పాల్గొంటారు.



గబ్బూరులోని బూదిబసవేశ్వర ఆలయం

యువతపై దేశ భవిష్యత్ ఆధారం

- కేంద్ర సహాయ మంత్రి భగవంత్ ఖూబా

సాక్షి,బళ్లారి: ఈ దేశ భవిష్యత్తు యువకులపై ఆధారపడి ఉందని, యువత సన్మార్గంలో నడిచి దేశాన్ని ముందుకు నడిపించాలని కేంద్ర సహాయ మంత్రి భగవంత్ ఖూబా అన్నారు. ఆయన మంగళవారం కలబుర్గిలో ప్రధానమంత్రి ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా ఒకే రోజు వర్చువల్‌గా రూ.13 వేల కోట్లతో వివిధ కట్టడాలు, శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు జాతికి అంకితం చేసే కార్యక్రమంలో భాగంగా కలబుర్గి సమీపంలో కడగంచిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. యువశక్తి అపారమైందన్నారు. దేశాన్ని యువత ముందుకు నడిపిస్తారనే నమ్మకం ఉందన్నారు. ఇటీవల ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో పరిశోధన, అన్వేషణ రంగంలో యువత తమ ప్రతిభను మెరుగు పరుచుకునేలా లక్ష కోట్ల నిధులు కేటాయించారన్నారు. యువత దేశం కోసం పని చేసి, ముందుకు నడిపిస్తే దేశం మరింత ముందుకు వెళుతుందన్నారు. దేశ సర్వతోముఖాభివృద్ధికి బీజేపీ కట్టుబడి ఉందన్నారు.

కవి సర్వజ్ఞ జయంతి



సర్వజ్ఞ చిత్రపటానికి పూలమాల వేసిన అధికారులు

రాయచూరు రూరల్: నగరంలో కవి సర్వజ్ఞ జయంతిని సరళంగా ఆచరించారు. మంగళవారం బసవేశ్వర సర్కిల్‌లో కవి సర్వజ్ఞ చిత్రపటానికి సమాజం అధ్యక్షుడు సురేంద్రబాబు పూలమాల వేసి పూజ నిర్వహించారు. అనంతరం పండిత సిద్దరామ జంబలదిన్ని రంగమందిరంలో జిల్లాధికార యంత్రాంగం, జిల్లా పంచాయతీ, నగరసభ, కన్నడ సంస్కృతి శాఖల ఆధ్వర్యంలో త్రిపది జయంతిని ప్రారంభించారు. అసిస్టెంట్ కలెక్టర్ సంగావి మాట్లాడుతూ సమాజంలో అట్టడుగున ఉన్న కుమ్మర సమాజం ఆర్థికంగా, సాంఘికంగా, విద్యాపరంగా అభివృద్ధి సాధించాలన్నారు. తహసీల్దార్ సురేష్ వర్మ, అధికారిణి మంగళ నాయక్‌లున్నారు.

బడుగుల ఆశాజ్యోతి అంబేడ్కర్

- ఆయన ఓ వ్యక్తి కాదు, శక్తి
- మాజీ మంత్రి శ్రీరాములు

సాక్షి,బళ్లారి: భారతరత్న డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్ ఒక వ్యక్తి కాదు, శక్తి అని మాజీ మంత్రి బీ.శ్రీరాములు పేర్కొన్నారు. ఆయన మంగళవారం నగరంలోని బుడా కార్యాలయ ఆవరణలో, కేఈబీ ఫంక్షన్ హాల్‌లో దళిత సంఘర్షణ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రాజ్యాంగంపై జాగృతి కార్యక్రమంలో మాట్లాడారు. భగవద్గీత, ఖురాన్, బైబిల్ తదితర అన్ని మతాల గ్రంథాలకు ఆయా మతాల వారు ఎంతో ప్రాధాన్యత ఇచ్చి పూజిస్తారని, అదే తరహాలో రాజ్యాంగాన్ని కూడా ఒక పవిత్ర గ్రంథంగా భావించి ప్రతి ఇంట్లో పెట్టుకుని పూజించాలన్నారు. రాజ్యాంగంలోని ప్రతి అంశం తెలుసుకుని ముందుకు వెళ్లాలన్నారు. తాను ప్రతి రోజు రాజ్యాంగ పుస్తకంలోని ఒక పేజీ అయినా చదువుతానన్నారు. నేటి యువత, ముఖ్యంగా విద్యార్థులు రాజ్యాంగం గురించి తెలుసుకోవాలన్నారు. బాబా సాహెబ్ అంబేడ్కర్ ఎంతో కష్టపడి భావి భారత పౌరులను, దళిత, బడుగు, బలహీన వర్గాల మేలుకు రాజ్యాంగాన్ని అద్భుతంగా రచించారని కొనియాడారు. నేడు మనందరం ఈ కుర్చీల్లో కూర్చొన్నామంటే ఆయన చలువేనన్నారు.



పాల్గొన్న శ్రీరాములు, ధదేసూగూరు బసవరాజు

అన్ని వర్గాలు, కులాలు, మతాల వారు ఆరాధించే దైవం అంబేడ్కర్ అని ప్రశంసించారు. రాజ్యాంగంపై జాగృతి సమావేశాల ద్వారా ప్రతి నిత్యం ప్రతి ఇంట్లో రాజ్యాంగాన్ని చదివేలా చూడాల్సిన అవసరం ఉందన్నారు. బీజేపీ ప్రభుత్వ హయాంలో దళితులకు ఎంతో మేలు చేశామని గుర్తు చేశారు. బీజేపీ రైతు మోర్చా నాయకుడు ఐనాథరెడ్డి మాట్లాడుతూ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం వల్లనే అందరికీ మంచి జరుగుతోందన్నారు. అంబేడ్కర్ అడుగు జాడల్లో మనందరం నడవాలన్నారు. అంబేడ్కర్, బుద్ధుడు, బసవణ్ణ వంటి మహనీయులు సమాజోద్ధరణ కోసం జన్మించిన కారణజన్ములన్నారు. మాజీ ఎమ్మెల్యే బసవరాజు, దళిత సంఘర్షణ సమితి నాయకులు సురేష్, మల్లికార్జున, ఓబుళేసు తదితరులు పాల్గొన్నారు.

హంపీ అభివృద్ధికి రూ.500 కోట్లు ఇవ్వాలి

హొసపేటి: ప్రపంచంలో తప్పక చూడవలసిన రెండో పర్యాటక ప్రదేశం హంపీ అని న్యూయార్క్ టైమ్స్ పత్రిక పేర్కొన్న నేపథ్యంలో హంపీలో మౌలిక వసతుల కల్పనకు కేంద్ర ప్రభుత్వం కనీసం రూ.500 కోట్ల గ్రాంట్ ఇవ్వాలని, తుంగభద్ర రిజర్వాయర్‌ను జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించాలని మాజీ ఎంపీ వీఎస్ ఉగ్రప్ప డిమాండ్ చేశారు. ఆయన మంగళవారం నగరంలోని పత్రికా భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. విజయనగర సామ్రాజ్య రాజధాని హంపీ శిల్పకళలు, స్మారక కట్టడాలకు ప్రపంచ ప్రసిద్ధి చెందిందన్నారు. ప్రపంచ నలుమూలల నుంచి ప్రతి రోజూ వేలాది మంది పర్యాటకులు వస్తుంటారన్నారు. కానీ హంపీలో తాగునీరు, ఆహారం లభించక పర్యాటకులు ఇబ్బందులు పడుతున్నారు. స్నానాల ఘాట్‌లో కనీస సౌకర్యాలు కూడా లేక మహిళలు నానాయాతన పడే పరిస్థితి ఉందన్నారు.



మాట్లాడుతున్న ఉగ్రప్ప తదితరులు

ఏటా రూ.కోట్ల గ్రాంటుతో ప్రభుత్వ ఖజానా నిండుతున్నా హంపీ అభివృద్ధికి పైసా కూడా ఖర్చు చేయడం లేదని వాపోయారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుత బడ్జెట్‌లో అంజనాద్రి అభివృద్ధికి రూ.100 కోట్లు కేటాయించిందన్నారు. దేశ, విదేశాల నుంచి వచ్చే పర్యాటకులకు సౌకర్యాలు కల్పించేందుకు వీలైనంత త్వరగా గ్రాంట్ విడుదల చేయాలని, కొప్పళ జిల్లా యలబుర్గా తరహాలో విజయనగర, బళ్లారి జిల్లాల్లోని చెరువులను నింపేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఒత్తిడి చేశారు.

ఏపీఎంసీలో తూకాల్లో మోసంపై నిలదీత

- బళ్లారిలో అనంత జిల్లా రైతులకు టోపీ
- బస్తాకు 8 కేజీలు మోసం చేసిన వైనం

సాక్షి,బళ్లారి: అరుగాలం కష్టపడి, అప్పులు చేసి పంట పండించిన రైతులకు మార్కెట్‌కు వెళితే ఏదో రకంగా వ్యాపారులు నిండా మోసం చేస్తూ దగా చేస్తున్న ఘటనలు నిత్యం వెలుగులోకి వస్తూనే ఉన్నాయి. బళ్లారిలోని ఏపీఎంసీ మార్కెట్ వేరుశనగతో పాటు జొన్న, సజ్జ, రాగులు, కొర్రలు, వరి తదితర అన్ని రకాల ధాన్యాలను కొనుగోలు చేస్తుంటారు. బళ్లారి జిల్లాతో పాటు ఇక్కడికి పొరుగున ఉన్న అనంతపురం, కర్నూలు జిల్లాకు చెందిన రైతులు కూడా వచ్చి అమ్మకాలు చేస్తుంటారు. ఈనేపథ్యంలో ఏపీఎంసీలో వ్యాపారుల దగా, మోసాన్ని అరికట్టాల్సిన అధికారులు, పాలకులు పట్టించుకోకపోవడంతో వ్యాపారులు ఆడిందే ఆట పాడిందే పాటగా మారి రైతులకు మోసాలు జరగడం పరిపాటి అయింది. సోమవారం ఏపీఎంసీకి మార్కెట్‌కు పొరుగున ఉన్న అనంతపురం జిల్లా కూడేరు మండలం రైతులు చింతకాయలు శ్రీరాములు, బాబు, బెస్త సుబ్బరాయుడు, చాకలి వీరాంజనేయులు తదితర 10 మంది రైతులు తాము పండించిన వేరుశనగను బళ్లారి ఏపీఎంసీకి తీసుకు రాగా, ఏపీఎంసీ మార్కెట్‌లో రైతులను నిండా ముంచేశారు. 30 కేజీలు నింపాల్సిన వేరుశనగ బస్తాలో 38 కేజీలు నింపి, 30 కేజీలు వేరుశనగ నింపామని చూపడంతో రైతులు గమనించి, వివరాలు సేకరించడంతో వ్యాపారస్తుల బండారం బయటపడింది. దీంతో గొడవకు దిగిన రైతన్నలు వ్యాపారులను నిలదీశారు. తాము కష్టపడి, అప్పులు చేసి పంట పండిస్తే ఒక బస్తాకు ఏకంగా 8 కేజీలు మోసం చేస్తే ఎలా? అని ప్రశ్నించారు. ఏపీఎంసీలో నిత్యం ఇలాంటి మోసాలు జరుగుతున్నాయని సాయినాథ్ అనే వ్యాపారి అంగడిలో జరిగిందని, ఇక్కడే కాకుండా ప్రతి మండీలోనూ మోసాలు జరుగుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈసారి ఖరీఫ్‌లో పంట నిండా నష్టపోయామని, రబీలో బోరుబావుల కింద లక్షలాది రూపాయలు అప్పులు చేసి పంట పండిస్తే వ్యాపారులు ఇలా మోసం చేస్తున్నారని ధ్వజమెత్తారు. అడిగేవారు లేరని ఇష్టారాజ్యంగా మోసాలు చేస్తున్నారని, ఇలాంటి మోసాలు అరికట్టకపోతే పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని రైతులు హెచ్చరించారు. ఎవడబ్బా సొమ్ము అని ఒక సంచికి ఏకంగా 8 కేజీలు తీసుకుంటున్నారన్నారు. పంటలు పండక, అప్పులు తీర్చకపోతే రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, వ్యాపారులు రైతులను నిండా ముంచితే తాము ఎవరికి అమ్ముకోవాలన్నారు. వ్యాపారులు, రైతుల మధ్య తీవ్ర ఘర్షణ నెలకొంది. వ్యాపారులు చేసిన మోసం వెలుగుచూడటంతో వ్యాపారులు సరికొత్త రాగం పాడారు. తమకు తెలియదని, హమాలీలు ఇలా చేశారని చెప్పడంతో రైతులు మరింత ఆగ్రహం వ్యక్తం చేశారు. మీ కనుసన్నల్లోనే మోసాలు చేస్తూ, అమాయకులైన హమాలీలపై వేస్తున్నారన్నారు. రైతుల ఆగ్రహం కట్టలు తెంచుకోవడంతో వ్యాపారుల మోసాన్ని అరికడతామని అక్కడకు చేరుకున్న అధికారులు పేర్కొన్నారు.

ఆయుర్వేదం పురాతన వైద్యం

కంప్లి: ఆయుర్వేదం పురాతన వైద్యమని, ఇంగ్లిష్ వైద్యం కంటే ఎంతో ఉపయోగకరమని, ప్రజలు ఆయుర్వేద వైద్యంపై ఆసక్తి చూపాలని హంపసాగర అభినవ శివలింగ రుద్రముని స్వామి తెలిపారు. ఆయన మంగళవారం హగరిబొమ్మనహళ్లి తాలూకా హంపసాగరలో మహదేవ తాత రథోత్సవం సందర్భంగా నిసర్గ హెల్త్ కేర్, పతంజలి కేంద్రం ద్వారా ఏర్పాటు చేసిన ఉచిత ఆయుర్వేద చికిత్సా శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. పండగలు, రథోత్సవాల్లో అధికంగా జన సందడి ఉన్న ప్రాంతాల్లో ఆయుర్వేదంపై ప్రజల్లో జాగృతి పెంపొందించడం అవసరమన్నారు.

మహిళకు రూ.23 లక్షల వంచన

హుబ్లీ: షేర్ మార్కెట్‌లో పెట్టుబడి పెడితే ఎక్కువ లాభాలు వస్తాయంటూ ధార్వాడకు చెందిన ఆస్మా అనే మహిళను సోషల్ మీడియాలో పరిచయం చేసుకున్న గుర్తు తెలియని వ్యక్తులు ఆమె నుంచి రూ.23 లక్షలు తమ ఖాతాల్లోకి బదలాయించుకుని మోసం చేసిన వైనంపై మంగళవారం సైబర్ పోలీసులకు ఫిర్యాదు అందింది. కునాల్ సింగ్, జ్యోతి శర్మ, ప్రియా, ఖలందర్, రీతుశర్మ, రాహుల్ పేరున ఆస్మాను సోషల్ మీడియాలో సంప్రదించి షేర్‌మార్కెట్‌లో డబ్బులు పెడితే బాగా లాభాలు వస్తాయని నమ్మించి మోసం చేశారు. ఈ క్రమంలో కేటుగాళ్లు తమ ఖాతాల్లో సొమ్ము జమ చేసుకున్నారు. పోలీసులు రంగంలోకి దిగి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బంగారు నెక్లెస్ చోరీ

హుబ్లీ: నగరంలో విద్యానగర రంభాపురి కళ్యాణ మంటపంలో జరుగుతున్న పెళ్లిలో సందట్లో సడేమియాలా ఓ మహిళకు చెందిన బంగారు నెక్లెస్‌ను దొంగలు చోరీ చేశారు. బెంగళూరులోని మధు రాంపుర అనే మహిళకు చెందిన బంగారు నెక్లెస్ చోరీ అయింది. వధూవరులకు అక్షింతలు వేస్తుండగా 23 గ్రాముల బరువు ఉన్న బంగారు గొలుసు చోరీ అయింది. ఘటనపై విద్యానగర పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పాత్రికేయుడి మృతికి సంతాపం



సంతాపం ప్రకటిస్తున్న పాత్రికేయులు

రాయచూరు రూరల్: నగరానికి చెందిన పాత్రికేయుడు, సంపాదకుడు, ఏజెంట్‌గా వ్యవహరించిన రమేష్ గొరేబాళ్(48) గుండెపోటుతో ఆదివారం రాత్రి హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో మరణించారు. సోమవారం సాయంత్రం స్వస్థలమైన బాగల్‌కోటె జిల్లా ఇలకల్ తాలూకా కరడి గ్రామంలో అంత్యక్రియలు జరిగాయి. కాగా పాత్రికేయుల భవనంలో ఏర్పాటు చేసిన సంతాప సభలో పాత్రికేయుల సంఘం అధ్యక్షుడు గురునాథ్, సభ్యులు పాల్గొని రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు.

సిలిండర్ పేలుడుతో అగ్నిప్రమాదం

రాయచూరు రూరల్: నగరంలోని లింగసూగూరు రోడ్డులోని హర్షిత గార్డెన్‌లో సోమవారం రాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో సిలిండర్ పేలింది. ఈ ప్రమాదంలో సుమారు రూ.10 లక్షల మేర నష్టం వాటిల్లింది. గార్డెన్ పక్కనే ఉన్న కొట్టానికి కూడా నిప్పు అంటుకోవడంతో అందులోని రెండు ఎద్దుల్లో ఒక ఎద్దు మరణించిందని పశ్చిమ పోలీస్ స్టేషన్ సీఐ నాగరాజ్ తెలిపారు.

హళ్లదరాయస్వామి మహా రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

కంప్లి: సండూరు తాలూకాలో హళ్లదరాయస్వామి మహారథోత్సవం వైభవంగా జరిగింది. గ్రామంలోని ఆలయంలో ఉదయం నుంచి అనేక ధార్మిక కార్యక్రమాలు నిర్వహించి అభిషేకం, పూలతో అలంకరణ జరిపారు. సాయంత్రం దేవస్థానం నుంచి పల్లకీ ఊరేగింపు, మహారథోత్సవం వద్దకు తెచ్చి రథంలో ప్రతిష్టించారు. అనంతరం వివిధ వాయిద్యాలు, కలశాలతో మహిళా భక్తుల నడుమ రథోత్సవం జరిగింది. చుట్టు పక్కల గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని తమ ముడుపులు చెల్లించుకున్నారు.

సాహిత్యానికి ఊపిరి సర్వజ్ఞ



జయంతిని ఆచరిస్తున్న అధికారులు, ప్రముఖులు

కంప్లి: కన్నడ సాహిత్యానికి ఊపిరి పోసిన శ్రేష్ఠుడు సర్వజ్ఞ అని తహసీల్దార్ శివరాజ్ తెలిపారు. తాలూకా కార్యాలయంలో ఏర్పాటు చేసిన జయంతిలో సర్వజ్ఞ కవి చిత్రపటానికి నివాళులు అర్పించి ఆయన మాట్లాడారు. వచన సాహిత్యంలో దిట్టగా పేరొందారన్నారు. సర్వం తెలిసిన వారైనందున సర్వజ్ఞగా పేరొందినట్లు తెలిపారు. పట్టణ ప్రముఖులు, తాలూకా కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం మత్తులో దావణగెరె వాసి మృతి



మృతుడు శివ

హిందూపురం అర్బన్: పట్టణంలోని బాలాజీ సర్కిల్ వద్ద మంగళవారం కర్ణాటకకు చెందిన ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన జరిగింది. వివరాలు.. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న వన్‌టౌన్ పోలీసులు అక్కడికి చేరుకొని విచారణ జరిపారు. మృతుడిని దావణగెరెకు చెందిన శివ(40) అనే వ్యక్తిగా గుర్తించారు. ఇతనికి 20 ఏళ్ల క్రితం పెళ్లయింది. భార్య, పిల్లలను వదిలేసి గత ఐదేళ్లుగా స్థానికంగా రహమత్‌పూర్‌లో ఉంటూ రీలింగ్ యూనిట్ల వద్ద పని చేసుకొంటూ జీవించేవాడని, వచ్చిన సంపాదనతో నిత్యం తాగేసేవాడని, మద్యం మత్తులో మృతి చెందినట్లు పోలీసుల విచారణలో తెలిసింది. మృతుడికి భార్య, ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారని, దావెణగెరెలో కుమార్తె పీయూసీ, కుమారుడు 10వ తరగతి చదువుతున్నారని సీఐ శ్రీనివాసులు తెలిపారు. శివ మరణవార్తను వారి కుటుంబ సభ్యులకు తెలియజేశామన్నారు. కేసు నమోదు చేసి మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని వారి బంధువులకు అప్పగిస్తామన్నారు.

సామాజిక న్యాయంతో సమానత్వం



కార్యక్రమం ప్రారంభిస్తున్న మహేశ్వరి హిరేమట్

రాయచూరు రూరల్: సమాజంలో భేదభావాలు లేకుండా సామాజిక న్యాయంతో అందరికీ సమానత్వం లభిస్తుందని డాక్టర్ మహేశ్వరి హిరేమట్ పిలుపు ఇచ్చారు. మంగళవారం కలబుర్గి వీరమ్మ గంగసిరి మహిళా కళాశాలలో సాంఘిక న్యాయ దినోత్సవాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. భేదాలు, అన్యాయం, వర్ణ నీతులు, పేదరికం, అసమానతలకు వ్యతిరేకంగా పోరాడాలన్నారు. సాంఘిక న్యాయం బాధ్యతలను గుర్తిస్తుందన్నారు. అందరికీ సమ న్యాయం లభించేలా చూడాలన్నారు. సమావేశంలో ప్రిన్సిపాల్ వీణా, అధ్యాపకులు గీతా పాటిల్, ప్రేమ, మహేష్, శివలీల, కవిత, వింధ్యా, శ్రద్ధ, శరణమ్మ, ధన్యాలున్నారు.

అక్రమంగా నీటి వాడకం నిషేధం



మాట్లాడుతున్న జిల్లాధికారి దివాకర్

హొసపేటి: మైలార లింగేశ్వర స్వామి వార్షిక కార్తికోత్సవం సందర్భంగా భద్రా రిజర్వాయర్ నుంచి తుంగభద్ర నదికి వదిలిన నీటిని అక్రమంగా వాడుకోవడాన్ని నిషేధిస్తూ జిల్లా మేజిస్ట్రేట్, జిల్లాధికారి ఉత్తర్వులు జారీ చేశారు. 2023-24 మైలార లింగేశ్వర స్వామి వార్షిక కార్తికోత్సవానికి భద్రా రిజర్వాయర్ నుంచి తుంగభద్ర డ్యాంకు ఫిబ్రవరి 18 నుంచి 23 వరకు ప్రజావసరాల దృష్ట్యా రోజుకు 500 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారన్నారు. ఆ నీటిని నది నుంచి అక్రమంగా పంపింగ్ చేసుకోవడాన్ని నిషేధించినట్లు తెలిపారు. నది ఒడ్డున ఏర్పాటు చేసిన పంపుసెట్ల వాడకం, నదిలో నడవడం, పశువులను నదిలోకి దింపడం, నదిలో నిర్మాణ పనులు చేపట్టడం వంటివి చేయరాదని హెచ్చరించారు. ఈ ఉత్తర్వుల అమలుకు జిల్లా ఎస్పీ, హరపనహళ్లి అసిస్టెంట్ కమిషనర్ చర్యలు తీసుకోవాలని సూచించారు.

24న గిరిజన జాగృతి సమావేశం

బళ్లారిటౌన్: వాల్మీకి భవనంలో ఈ నెల 24న రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, సంచార గిరిజన మహాసభ ఆధ్వర్యంలో జాగృతి సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు మహాసభ జిల్లాధ్యక్షుడు శివకుమార్ తెలిపారు. మంగళవారం పత్రికా భవనంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆ రోజు జరిగే సమావేశంలో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి నాగేంద్రతో పాటు సిటీ ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ వివిధ ప్రజాప్రతినిధులు, నేతలు పాల్గొంటున్నట్లు తెలిపారు. కాంతరాజు కమిషన్ నివేదిక అమలు చేయాలని, ఎస్సీ, ఎస్టీ సంచార జాతులకు సరైన వసతుల సౌకర్యాలు కల్పించాలని తదితర 10 డిమాండ్లపై ఈ సమావేశంలో చర్చించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 77 ఏళ్లు కావస్తున్నా ఎస్సీ, ఎస్టీ సంచార జాతులు అభివృద్ధి చెందడం లేదన్నారు. దీని కోసం తమకు కమిషన్‌ను ఏర్పాటు చేసి ప్రతి ఏటా రూ.1000 కోట్ల నిధులు సమకూర్చాలని డిమాండ్ చేశారు. ఆ సమాజ నేతలు ఆనంద్‌కుమార్, వెంకటప్ప, రమేష్, రంగయ్య, సుబ్బయ్య, ఈరణ్ణ, కేశవరాజులు, బాబు, రామాంజిని పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సంచార గిరిజన సమాజ నేతలు

లోయలో పడ్డ బైక్‌చోదకుడి రక్షణ



వినాయక్‌ను రక్షించిన పోలీసులు

రాయచూరు రూరల్: వాహనంపై వెళుతూ అదుపు తప్పి వంద అడుగుల లోతులోకి పడిన ఘటనలో ఓ ద్విచక్రవాహనదారుడిని రక్షించారు. మంగళవారం బెళగావి జిల్లా ఖానాపుర తాలూకా చికల్ ఫాల్స్ వద్ద ఈ ఘటన సంభవించింది. బెళగావి క్యాంప్ ప్రాంతంలో వినాయక్ బుత్తులర్ లోయలోకి పడ్డాడు. స్నేహితులతో కలిపి ఫాల్స్‌ను చూడడానికి వచ్చిన సమయంలో వంద అడుగుల లోయలో పడ్డారు. ఖానాపుర పోలీసులు సీఐ రామచంద్ర నాయక్ నేతృత్వంలో వినాయక్‌ను రక్షించారు.

బాలికలకు చదువే ప్రధానం



జ్యోతి వెలిగిస్తున్న శివకుమార్

రాయచూరు రూరల్: ఆడ పిల్లలకు బాల్య వివాహం కాదు విద్య ప్రధానమని మున్నూరు వాడి హైస్కూలు ప్రధానోపాధ్యాయుడు శివకుమార్ పిలుపు ఇచ్చారు. ఆయన మంగళవారం మహిళా శిశు అభివృద్ధి పథకంలో భాగంగా బేటీ పడావో, బేటీ బచావో కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. బాలురకు 21, బాలికలకు 18 ఏళ్లు నిండిన తర్వాతే వివాహాలు చేయాలన్నారు. ఎక్కడైనా బాల్యవివాహం జరుగుతుంటే పిల్లల సహాయవాణి 1098కి ఫిర్యాదు చేయాలని సూపర్‌వైజర్ భారతి కోరారు. సమావేశంలో అధికారులు సురేఖ, మహాలింగమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు శాంత, సరస్వతి, మల్లిక, గంగమ్మ, ఉరుకుందమ్మలున్నారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

హొసపేటి: విజయనగర జిల్లా హరపనహళ్లి తాలూకాలోని కన్ననాయకనహళ్లి, చిక్కమేగళగెరె గ్రామాల్లో జననీ పుష్పకళ యువక సంఘం కళాకారులతో ప్రభుత్వ పథకాలపై సమాచార పౌరసంబంధాల శాఖ ద్వారా పర్యావరణ పరిరక్షణ, పారిశుధ్యం, పలు అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు జిల్లా యంత్రాంగం జానపద సంగీత కార్యక్రమం చేపట్టింది. ఫిబ్రవరి 23 వరకు వివిధ గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తారు. ఫిబ్రవరి 20న తెలగి, నందిబేవూరు గ్రామాల్లో, 21న హుస్‌హళ్లి, హైగనూరు, 22న నారాయణపూర్, బావిహళ్లి, 23న మైదూరులో పుష్పకళా యువక సంఘం ప్రతిభావంతులైన కళాకారులతో జానపద సంగీత కార్యక్రమాలు జరుగుతాయి. ఈ కార్యక్రమాలకు గ్రామస్తులు, గ్రామస్తులు అధికారులు తగిన సహకారం అందించాలని విజయనగర జిల్లా వార్త పౌరసంబంధాల శాఖ సీనియర్ సహాయ సంచాలకులు గవిసిద్దప్ప హొసమని కోరారు.

నిప్పురవ్వతో ఫైర్ సిబ్బంది చెలగాటం

- అగ్ని ప్రమాదాల నియంత్రణలో విఫలం
- గోదాములు, ఫ్యాక్టరీలు, బహుళ అంతస్తు భవనాల్లో కానరాని సురక్షిత వ్యవస్థ
- బెంగళూరు, బెంగళూరు జిల్లాల్లో 7 నెలల్లో ఐదు భారీ అగ్నిప్రమాదాలు
- 25 మందికి పైగా కార్మికుల మృత్యువాత


అత్తిబెలె వద్ద టపాసుల గోదాములో చెలరేగిన మంటలు(ఫైల్)


బన్నేరుఘట్టరోడ్డులోని అపార్టుమెంటులో సంభవించిన అగ్నిప్రమాదం (ఫైల్)

బనశంకరి: నిప్పు రవ్వతో అగ్నిమాపక శాఖ చెలగాటమాడుతోంది. అగ్ని ప్రమాదాలకు ఆస్కారం ఉండే చోట్ల తగిన జాగ్రత్తలు తీసుకునేలా సంబంధిత వ్యక్తులను జాగృత పరచడంలో ఫైర్ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీనికితోడు గోదాములు, పరిశ్రమలకు అనుమతులు ఇచ్చే సమయంలో ఉదాసీనంగా ఉంటున్నారు. ఫలితంగా అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు భారీగా ఆస్తి, ప్రాణ నష్టం జరుగుతోంది. మంటలనుంచి తప్పించుకునేందుకు మార్గం లేక బాధితులు సజీవదహనమవుతున్నారు. బెంగళూరు నగర, బెంగళూరు గ్రామాంతర జిల్లాల్లో గత 7 నెలల్లో 5 భారీ అగ్నిప్రమాదాలు సంభవించగా సుమారు 25 మందికిపైగా కార్మికులు మృతిచెందారు.

6 ఏళ్లలో 2,848 అగ్నిప్రమాదాలు...

బెంగళూరులో ఆరు సంవత్సరాల్లో సుమారు 2,848 అగ్నిప్రమాదాలు సంభవించాయి. అగ్నిప్రమాదాలు సంభవించిన స్థలం, కట్టడాల్లో మంటలు ఆర్పివేసే సురక్షత పరికరాలు లేకపోవడం. 2015–16లో నిర్వహించిన ఆడిట్ ప్రకారం నగరంలో సుమారు 22 వేల బహుళ అంతస్తులు కట్టడాలు ఉండగా ఇందులో 16 వేలకు పైగా కట్టడాల్లో అగ్నిసురక్షతా వ్యవస్థ లేదు. 4 వేల కట్టడాలకు మాత్రమే ఎన్‌ఓసీ, అగ్ని సురక్షతా సర్టిఫికెట్ తీసుకున్నారు. మిగిలిన కట్టడాలకు ఎన్‌ఓసీ లేకపోయినప్పటికీ వాణిజ్య కార్యకలాపాలు, వసతి, కార్యాలయంతో పాటు వివిధ కార్యకలాపాలకోసం వాడుతున్నారు.

కారణాలు..ప్రమాదాల సంఖ్య

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో	1,889
వంటగ్యాస్ లీకేజీతో	785
రసాయనాల లీకేజీతో	42
ఆయిల్ లీకేజీతో	50
సిగరెట్ మంటలతో	82

అగ్నిప్రమాదాల వివరాలు

ఏడాది	దుర్ఘటనలు
2017	514
2018	603
2019	616
2020	513
2021	490
2022	111

అగ్నిప్రమాద దుర్ఘటనలు...

- అత్తిబెలె టోల్‌గేట్ వద్ద సర్వీస్ రోడ్డులో గత ఏడాది అక్టోబరు 7 తేదీన టపాసుల గోదాములో భారీ పేలుడు చోటు చేసుకొని 16 మందికి పైగా కర్ణాటక, తమిళనాడుకు చెందిన కార్మికులు మృత్యువాతపడ్డారు. 15 మందికి పైగా కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు.
- కోరమంగల వద్ద గత ఏడాది అక్టోబరు 19న మడ్‌పైప్ అనే రెస్టో కెఫెలో సంభవించిన అగ్ని ప్రమాదంలో ఇద్దరు కార్మికులు మృతిచెందారు. అగ్ని సురక్షత నిబంధనలు పాటించకపోవడం ఈ ప్రమాదానికి ప్రధాన కారణం.
- బెంగళూరు హజ్‌భవన్‌లో సంభవించిన ఆకస్మిక అగ్నిప్రమాదంలో రూ.3 కోట్లు నష్టం సంభవించింది.
- నగరంలోని హొసకెరెహళ్లి బస్సు గోదాములో గత ఏడాది నవంబరు 1వ తేదీన అగ్నిప్రమాదం సంభవించడంతో 20కి పైగా బస్సులు కాలిపోయాయి. గ్యారేజ్‌లో వెల్డింగ్ పనులు చేస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది.
- లగ్గెరె బాణసవాడి రోడ్డు వద్ద గత ఏడాది అక్టోబరు 4వ తేదీన ట్రాన్స్‌ఫార్మర్ పేలి గుజరి గోదాము, మెర్సిడిస్‌బెంజ్‌తో పాటు రెండుకార్లు దగ్ధమయ్యాయి.

ఈ ఏడాది ఫిబ్రవరి 18వ తేదీన కుంబళగోడు వద్ద రామసంద్ర సుగంధ ద్రవ్యాల పరిశ్రమలో అగ్ని ప్రమాదం జరిగి ముగ్గురు మృతిచెందగా 6 మంది తీవ్రంగా గాయపడ్డారు.


మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది(ఫైల్)

అగ్ని ప్రమాదాల నియంత్రణకు చర్యలు

గత 7 నెలల్లో 5 భారీ అగ్నిప్రమాదాలు సంభవించాయి. అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోవడంతో ఈ దుర్ఘటనలు చోటు చేసుకున్నాయి. రాష్ట్రం మొత్తంగా బెంగళూరు నగరంలోనే అధిక ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. వీటి పట్ల ప్రభుత్వం కఠినచర్యలు తీసుకుంది.

–రెవెన్యూ శాఖ మంత్రి కృష్ణబైరేగౌడ

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదాలకు అడ్డుకట్ట వేయండి


అధికారులకు సూచనలు ఇస్తున్న ఎమ్మెల్యే ఎస్.ఎన్.సుబ్బారెడ్డి

బాగేపల్లి : బాగేపల్లి పట్టణ సమీపంలో జాతీయ రహదారి 44లో పెచ్చుమీరిన రోడ్డు ప్రమాదాలకు అడ్డుకట్ట వేసి ప్రజల ప్రాణాలు కాపాడాలని ఎమ్మెల్యే ఎస్.ఎన్.సుబ్బారెడ్డి అధికారులకు సూచించారు. స్థానిక పోలీసులు, జాతీయ రహదారుల ప్రాధికార అధికారులతో కలిసి మంగళవారం ఆయన బ్లాక్ స్పాట్లను పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని, దీంతో ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ప్రమాదాలకు అడ్డుకట్ట వేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

విద్యుదాఘాతంతో ఎలక్ట్రీషియన్ మృతి


ఘటన స్థలంలో అక్బర్ ఖాన్ మృతిదేహం

మైసూరు : విద్యుదాఘాతంతో ఎలక్ట్రీషియన్ మృతి చెందాడు. ఈ ఘటన మైసూరులో నగరంలో చోటు చేసుకుంది. మైసూరులోని శాంతి నగరకు చెందిన అక్బర్ ఖాన్(60) ఒలంపియాడ్ సినిమా థియేటర్ సమీపంలోని భవనంలో కరెంటు రిపేరి పనులు చేస్తుండగా కరెంటు సరఫరా అయ్యింది. దీంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. దేవరాజ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

పట్టు సాగులో జాగ్రత్తలు పాటించాలి


మాట్లాడుతున్న అధికారి

తుమకూరు : పట్టు సాగులో జాగ్రత్తలు పాటించాలని సిరికల్చర్ శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ వైకే బాలకృష్ణ సూచించారు. పట్టు సాగు రైతులు, శాస్త్రవేత్తలతో ఆ శాఖ డైరెక్టరేట్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. వైకే బాలకృష్ణ మాట్లాడుతూ పట్టు సాగులో అనేక ఇబ్బందులను రైతులు ఎదుర్కొంటున్నారు. వాతావరణ పరిస్థితుల్లో మార్పుల వల్ల పట్టు దిగుబడులు సరిగా రావడం లేదన్నారు. ఈ నేపథ్యంలో రైతులు శాస్త్రవేత్తలు ఇచ్చిన సలహాలు పాటించాలన్నారు. పంట సాగు మొదలు పెట్టినప్పటి నుంచి పూర్తయ్యేవరకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగండి


ధ్రువీకరణపత్రాలు అందజేసిన దృశ్యం

గౌరిబిదనూరు: మహిళలు స్వయం ఉపాధితో ఆర్థిక స్వావలంబన సాధించాలని ధర్మస్థల గ్రామీణాభివృద్ధి సంస్థ జిల్లా డైరెక్టర్ ప్రశాంత్ సూచించారు. పట్టణంలోని మరిగమ్మ దేవాలయంలో ఆ సంస్థ అమలు చేస్తున్న జ్ఞానవికాస కార్యక్రమం కింద కుట్టుపనిలో శిక్షణ పొందిన 35 మంది మహిళలకు మంగళవారం ఆయన ధ్రువీకరణపత్రాలు అందజేశారు. ఇంటి వద్దనే ఉంటూ కుట్టు పని ద్వారా ఉపాధి పొందవచ్చన్నారు. బెంగుళూరు జ్ఞానవికాస యోజనాధికారి సంధ్యాశెట్టి, కమిషనర్ గీత, ప్రాజెక్ట్ అధికారి నాగరాజనాయక, సుమంగళి, లక్ష్మి పాల్గొన్నారు.

మూల వాక్యం మార్పుపై కర్ణాటక సేన నిరసన


ఆందోళన నిర్వహిస్తున్న నాయకులు

మైసూరు : జ్ఞానపీఠ అవార్డు గ్రహీత విశ్వకవి కువెంపు ప్రకటించిన వాక్యాన్ని ప్రభుత్వం మార్పు చేయడాన్ని వ్యతిరేకిస్తూ మంగళవారం మైసూరులోని డాక్టర్ రాజ్‌కుమార్ ఉద్యానవనం వద్ద కర్ణాటక సేన నాయకులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నాయకులు మాట్లాడుతూ సాంఘిక సంక్షేమ శాఖకు చెందిన వసతి పాఠశాల ద్వారంపై జ్ఞాన దేవాలయంలోకి చెతులతో మొక్కి లోనికి రండి అనే వ్యాఖ్యాన్ని జ్ఞాన దేవాలయం ఇది ధైర్యంగా ప్రశ్నించండి అని మార్పు చేయడం తగదన్నారు. వ్యాఖ్యం మార్పు చేయడం కన్నడ సంస్కృతిని, పాఠశాలల పవిత్రను పాడు చేయడమేనన్నారు.

ఛత్రపతి శివాజీ ఆదర్శ పాలకుడు


శివాజీ జయంతి కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే పుట్టస్వామిగౌడ

గౌరిబిదనూరు: ఛత్రపతి శివాజీ ఆదర్శ పాలకుడని ఎమ్మెల్యే పుట్టస్వామిగౌడ అన్నారు. తాలూకా కార్యాలయ సభాభవనంలో నిర్వహించిన శివాజీ జయంతి కార్యక్రమంలో ఆయన పాల్గొని శివాజీ చిత్రపటానికి నివాళులర్పించి మాట్లాడారు. తల్లి జిజాబాయి చెప్పిన రామాయణ, మహాభారత ఇతిహాసాల ద్వారా శివాజీ స్ఫూర్తి పొంది యుద్ధ విద్యలు నేర్చుకొని స్వంత సామ్రాజ్యాన్ని ఏర్పాటు చేశారన్నారు. చిన్న సైన్యంతోనే అనేక విజయాలు సాధించారన్నారు. శివాజీని యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

సొసైటీ ఎన్నికలు ప్రశాంతం


అధ్యక్ష, ఉపాధ్యక్షులు, డైరెక్టర్లను సన్మానించిన దృశ్యం

తుమకూరు : శిరా తాలూకా పట్టనాయకనహళ్లిలో శ్రీనంజావధూత స్వామీజీ పరపతి సహకార సంఘం ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. అధ్యక్షుడిగా రంగనాథ్, ఉపాధ్యక్షుడిగా రాజణ్ణలు ఏక గ్రీవంగా ఎన్నికయ్యారు. డైరెక్టర్లుగా శివానంద్, రంగణ్ణ, నేరలహళ్లప్ప, రాజణ్ణ, శివకుమార, శ్రీనివాస్, లక్ష్మీకాంత, కెంగరాజు, రేణుకమ్మలు ఎన్నికయ్యారు. అనంతరం నూతన పాలకవర్గాన్ని స్థానిక నాయకులు అభినందించారు.

లారీ ఢీకొని మాజీ జవాన్ మృతి

యశవంతపుర: కలబురగి నగరంలోని ఆళంద రోడ్డులో కెరిబోసగా గ్రామం వద్ద హైవేపై లారీ బైకును ఢీకొంది. ఈ ప్రమాదంలో విశ్రాంత సీఆర్‌పీఎఫ్ జవాన్ మారుతీ కాశినాథ ఘోడకె (56) అక్కడికక్కడే మృతి చెందాడు. ఆళంద తాలూకా సావళేశ్వర గ్రామానికి చెందిన మారుతి కలబురగికి బైకులో వెళుతుండగా లారీ ఓవర్ టేక్ చేయబోయి బైకును ఢీకొంది. మారుతీ తల, కాలుపై లారీ వెనుక చక్రాలు వెళ్లడంతో గాయాలై మరణించాడు. ట్రాఫిక్ పోలీసులు ఘటన స్థలంను పరిశీలించారు.

రూ.30 లక్షల సొత్తు స్వాధీనం


నిందితుడు సునీల్


ఆభరణాలు పరిశీలిస్తున్న కమిషనర్ బీ.దయానంద్

బనశంకరి: ఇంటి తాళం బద్దలు కొట్టి బంగారు నగల చోరీకి పాల్పడుతున్న సునీల్ అనే దొంగను మంగళవారం మైకోలేఔట్ పోలీసులు అరెస్టుచేశారు. ఇతడి వద్ద నుంచి రూ.30.15లక్షల విలువైన 525 గ్రాముల బంగారు ఆభరణాలు, 550 గ్రాముల వెండి ఆభరణాలు, రెండు మొబైల్స్, ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నారు. మైకోలేఔట్ పోలీస్‌స్టేషన్‌లో ఇతడిపై 11 చోరీకేసులు నమోదయ్యాయి. స్వాధీనం చేసుకున్న నగలను నగర పోలీస్ కమిషనర్ బి.దయానంద్, అదనపు పోలీస్ కమిషనర్ రమణ్‌గుప్తా, డీసీపీ సీకే.బాబా, ఏసీపీ మనోజ్ పరిశీలించారు.

విద్యార్థి అనుమానాస్పద మృతి


ఉరివేసుకున్న స్థితిలో ముత్తురాజు

మైసూరు: విద్యార్థి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఈఘటన మైసూరు జిల్లా హుణసూరు తాలూకా రత్నపురి గ్రామంలో చోటు చేసకుంది. దాసనపుర గ్రామానికి చెందిన రవి కుమార్, వసంత దంపతుల కుమారుడు ముత్తురాజు(17) పీయూసీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఇటీవల ఒక యువతితో మాటలు కలిపాడు. ఈ విషయంపై గొడవ జరిగింది. ఈక్రమంలో ముత్తురాజు రత్నపురిలోని బంధువుల ఇంటిలో కార్యక్రమానికి హాజరయ్యాడు. ఆ తర్వాత చెట్టుకు ఉరివేసుకున్న స్థితిలో వేలాడుతూ విగతజీవిగా కనిపించాడు. యువతి కుటుంబ సభ్యులపై అనుమానం ఉందని మృతుడి కుటుంబ సభ్యులు ఫిర్యాదు హుణసూరు గ్రామీణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

బైక్‌లు, సెల్‌ఫోన్ దొంగల అరెస్ట్

బనశంకరి: మొబైల్స్, బైక్‌లు, ఇళ్లలో చోరీలకు పాల్పడుతున్న నవీన్, శివరాజ్ అనే ఇద్దరిని మంగళవారం జ్ఞానభారతి పోలీసులు అరెస్టుచేశారు. వీరి వద్ద నుంచి రూ.11 లక్షల విలువచేసే 5 బైక్‌లు, 41 మొబైల్స్ స్వాధీనం చేసుకున్నామని నగర పోలీస్‌కమిషనర్ బి.దయానంద తెలిపారు. గత ఏడాది డిసెంబరు 23వ తేదీన ఇంటి ముందు పార్కింగ్ చేసిన బైక్ చోరీకి గురైనట్లు యజమాని ఇచ్చిన ఫిర్యాదుతో జ్ఞానభారతి పోలీసులు తీవ్రంగా గాలించి నిందితులను అరెస్ట్ చేశారు. జ్ఞానభారతిలో 2, కుంబళగోడు, బయప్పన హళ్లి, బేగూరు పోలీస్‌స్టేషన్లలో ఒక బైక్ చొప్పున చోరీ చేసినట్లు నిందితులు అంగీకరించారు. అదేవిధంగా దృష్టి మరల్చి 41 మొబైల్స్ చోరీలకు పాల్పడ్డారని కమిషనర్ తెలిపారు.

వ్యక్తి దారుణహత్య


హతుడు మహ్మద్ అక్తర్ ఆలీ (ఫైల్)

కృష్ణరాజపురం: దుండగుల చేతిలో వ్యక్తి హత్యకు గురైన ఘటన హలసూరు పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. హతుడిని మహ్మద్ అక్తర్ ఆలీ(44)గా పోలీసులు గుర్తించారు. దుండగులు ఇతన్ని కబ్బన్‌పేటె వద్ద నుంచి కారులో కిడ్నాప్ చేసి గొంతుకు తాడు బిగించి హత్య చేశారు. అనంతరం మృతదేహాన్ని హొసకోటె సమీపంలోని రాజ కాలువ వద్ద పడేసి ఉడాయించారు. హలసూరు గేట్ పోలీసులు మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. నిందితుడిని అరెస్ట్ చేశారు. వివాహేతర సంబంధంతోనే హత్య జరిగినట్లు పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

మార్చి 1 నుంచి ద్వితీయ పీయూసీ పరీక్షలు

శివాజీనగర: ద్వితీయ పీయూసీ, ఎస్ఎస్ఎల్‌సీ సంవత్సర పరీక్ష తేదీని పాఠశాల విద్యాశాఖ ప్రకటించింది. ద్వితీయ పీయూసీ పరీక్షలు మార్చి 1 నుంచి 22 వరకు జరుగనున్నాయి. మార్చి 25 నుంచి ఏప్రిల్ 6 వరకు ఎస్ఎస్ఎల్‌సీ పరీక్షలు జరుగుతాయి. ద్వితీయ పీయూసీకి 6,98,627 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో 3,30,644 మంది బాలురు, 3,67,980 మంది బాలికలు ఉన్నారు. ఎస్ఎస్ఎల్‌సీ పరీక్షకు మొత్తం 8,96,271 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు.

నిర్మాణంలో ఉన్న కట్టడంలో మృతదేహం

బనశంకరి: డబుల్‌రోడ్డులో నిర్మాణదశలో ఉన్న కట్టడంలో గుర్తు తెలియని యువతి మృతదేహం లభ్యమైంది. మంగళవారం ఉదయం స్థానికులు ఇచ్చిన సమాచారంతో సంపంగి రామనగర పోలీసులు పరిశీలించి మృతురాలికి సుమారు 25 నుంచి 26 ఏళ్ల వయస్సు ఉంటుందని నిర్ధారించారు. మృతదేహాన్ని శవపరీక్షల కోసం బౌరింగ్ ఆసుపత్రికి తరలించారు. యువతిది ఆత్మహత్య, ఎక్కడైనా చంపి ఇక్కడ పడేశారా అనేది దర్యాప్తులో తేలాల్సి ఉందని పోలీసులు తెలిపారు.

సీనియర్ రాజకీయ నేత మృతి


కే.ఎన్. రవిమంజేష్ (ఫైల్)

మండ్య : మండ్య జిల్లాకు చెందిన సీనియర్ రాజకీయ నేత కే.ఎన్. రవి మంజేష్(57) అనారోగ్యంతో మృతి చెందారు. జాత్యాతీత జనతాదళ పార్టీలో కొనసాగిన ఈయన రెబల్ స్టార్ అంబరీష్ ప్రభావంతో కాంగ్రెస్‌లో చేరారు. అంబరీష్ విజయం కోసం కృషి చేశారు. ఈయన అనేక సేవా కార్యక్రమాలు చేపట్టి ప్రజల మన్ననలు పొందారు. ఈయనకు భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు. రవి మంజేష్ అంత్యక్రియలు మంగళవారం చిక్కెర నగరం శ్మశానవాటికలో నిర్వహించారు.

వయనాడు మృతుడికి కర్ణాటక నుంచి పరిహారమా?

శివాజీనగర: ఏనుగు దాడిలో మృతి చెందిన కేరళలోని వయనాడు వ్యక్తి కుటుంబానికి కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ సలహా మేరకు కర్ణాటక ప్రభుత్వం పరిహారం అందించడం సరికాదని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు బీ.వై.విజయేంద్ర ఆరోపించారు. కర్ణాటక ఖజానా నుంచి రూ.15 లక్షలను పరిహారంగా వయనాడులోని మృతుడికి అందించడం అధికార దుర్వినియోగం కాదా? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో కరువు నెలకొని వందలాది మంది రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నారన్నారు. వారిని పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వం కాంగ్రెస్ హైకమాండ్ మెప్పు పొందేందుకు కర్ణాటక పన్నుదారుల సొమ్మును ఇతర రాష్ట్రాల వారికి పరిహారంగా అందించడం సరికాదన్నారు.

'మైషుగర్ ఆస్తుల విక్రయానికి ప్రభుత్వం కుట్ర'


వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

మండ్య : మైషుగర్ ఆస్తులు అమ్మి, కొత్త పరిశ్రమ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం కుట్ర చేస్తోందని బీజేపీ నాయకులు ఆరోపించారు. ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి సి.టి. మంజునాథ్ ఆధ్వర్యంలో నాయకులు మంగళవారం అదనపు కలెక్టర్ హెచ్.ఎల్.నాగరాజుకు వినతి పత్రం అందించారు. మండ్య జిల్లా జీవనాడి అయిన మైషుగర్‌ను, వాటి ఆస్తులను పరిరక్షించాలని వారు ఈసందర్భంగా కోరారు.

హోసూరు వార్తలు..

బ్యాటుతో బాది భర్త హత్య

- భార్య, అత్త అరెస్టు

హోసూరు: భర్తను క్రికెట్ బ్యాట్‌తో బాది హత్య చేసిన భార్య, అత్తను పోచ్చంపల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాల మేరకు పోచ్చంపల్లి సమీపంలోని బాలపాడి గ్రామానికి చెందిన చిన్నకణ్ణు కొడుకు విమల్‌కుమార్ (32) కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇతనికి కొడమాండపల్లి గ్రామానికి చెందిన పూర్ణిమ (32)తో గత కొన్నేళ్ల కిందట పెళ్లి జరిగి ఇద్దరు పిల్లలున్నారు. భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరిగేవి. గత రెండు రోజుల క్రితం రగడ పడి ఆమె పుట్టింటికెళ్లిపోయింది. నచ్చజెప్పి తీసుకొచ్చేందుకు విమల్‌కుమార్, తల్లితో కలిసి భార్య ఇంటికెళ్లారు. ఈ సమయంలో పూర్ణిమ, ఆమె తల్లి హంసవేణిలు క్రికెట్ బ్యాటుతో విమల్ కుమార్‌పై దాడి చేశారు. తీవ్ర గాయాలేర్పడిన అతను కొద్దిసేపటికి మృతి చెందాడు. పోచ్చంపల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని శవాన్ని ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని పూర్ణిమ, హంసవేణిలను అరెస్ట్ చేశారు.

కవి సర్వజ్ఞ జయంతి



కవి సర్వజ్ఞ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

తుమకూరు: తుమకూరు నగరంలోని గుబ్బి వీరణ్ణ కళాక్షేత్రంలో మంగళవారం జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో కవి సంత్ సర్వజ్ఞ జయంతి వేడుకలను నిర్వహించారు. తుమకూరు తాలూకా తహసీల్దార్ ఎం.సిద్దేశ్ పాల్గొని సర్వజ్ఞ చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటించారు. కన్నడ సాహిత్య పరిషత్, కుంబార సంఘం నాయకులు పాల్గొన్నారు.

పీడీఓకు సన్మానం

శిర తాలూకాలోని యలియూరు గ్రామ పంచాయతీలో పీడీఓ విజయ్‌కుమార్‌కు బదిలీ అయ్యింది. స్థానిక అధికారులు, గ్రామ పంచాయతీ సభ్యులు ఆయనకు సన్మానం చేసి వీడ్కోలు పలికారు. జీపీ అధ్యక్షురాలు భాగ్యమ్మ రంగనాథ్, సభ్యులు పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్ దుర్మరణం


రోడ్డుపై ఆటో డ్రైవర్ మృతదేహం

క్రిష్ణగిరి: ద్విచక్రవాహనాన్ని ఆటో ఢీకొన్న ప్రమాదంలో ఆటో డ్రైవర్ మృతి చెందిన ఘటన సూళగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం మధ్యాహ్నం చోటు చేసుకొంది. వివరాల మేరకు.. హోసూరు–క్రిష్ణగిరి జాతీయ హైవేలో సామలపల్లం వద్ద ఆటో– ద్విచక్రవాహనం ఢీకొన్నాయి. ఆటో బోల్తా పడగా డ్రైవర్ రోడ్డుపై పడడంతో తలకు తీవ్ర గాయాలై చనిపోయాడు. బైకిస్టు కూడా తీవ్రంగా గాయపడ్డాడు. సూళగిరి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలను చేపట్టారు.

జల్లికట్టు సంబరం



జల్లికట్టు కోలాహలం

క్రిష్ణగిరి: సూళగిరి సమీపంలోని త్యాగరసనపల్లి గ్రామంలో మంగళవారం జల్లికట్టును ఉత్సాహంగా నిర్వహించారు. సంక్రాంతి పండుగ సీజన్‌లో జనవరి 15 నుంచి మార్చి నెల వరకు క్రిష్ణగిరి జిల్లాలో జల్లికట్టు, పశువుల పండుగను జరుపుకోవడం ఆనవాయితీ. మంగళవారం సూళగిరి సమీపంలోని త్యాగరసనపల్లి గ్రామంలో జల్లికట్టు ఉత్సాహంగా సాగింది. సూళగిరి, బాగలూరు, బేరికె, అత్తిముగం, క్రిష్ణగిరి, రాయకోట, బాగలూరు, డెంకణీకోట, తళి, ఉద్దనపల్లి, అంచెట్టి తదితర ప్రాంతాల నుంచి పెద్దఎత్తున రైతులు జల్లికట్టు ఎద్దులను తీసుకెళ్లి పరిగెత్తించారు. యువకులు ఆ ఎద్దులను అడ్డుకోవడానికి సాహసోపేతంగా ప్రయత్నించారు. వేలాది మంది ప్రజలు వీక్షించారు.

మత్తు వల్ల పతనమే


ర్యాలీని ప్రారంభిస్తున్న సబ్‌కలెక్టర్ ప్రియాంక

హోసూరు: జిల్లా యంత్రాంగం, మద్య నిషేధ శాఖ సంయుక్తంగా మంగళవారం నాటుసారా, మాదక ద్రవ్యాల వల్ల ఏర్పడే దుష్ప్రయోజనాలపై చైతన్య కార్యక్రమాన్ని నిర్వహించారు. హోసూరు పట్టణంలోని ఆర్.వి. ప్రభుత్వ బాలుర ఉన్నతోన్నత పాఠశాల వద్ద ప్రారంభమైన చైతన్య ర్యాలీని సబ్‌కలెక్టర్ ప్రియాంక జెండా ఊపి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ నాటు సారా, మద్యం, మాధక ద్రవ్యాలను సేవించడం వల్ల పలు రకాల అనారోగ్యాలు వచ్చి ప్రాణహాని జరుగుతుందని తెలిపారు. పైగా కుటుంబంలో, సమాజంలో గౌరవం నశిస్తుందని, నేటి తరం యువతీ యువకులు మత్తు వినియోగానికి దూరంగా ఉండాలని సూచించారు. నాటుసారా, గుట్కా, మాదక ద్రవ్యాలను తరలిస్తున్నట్లు తెలిస్తే 10581 టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారమివ్వాలని కోరారు.


కెమ్మణ్ణుగుండి కొండపై కార్చిచ్చు

యశవంతపుర: చిక్కమగళూరు జిల్లాలో ప్రసిద్ధి చెందిన పర్యాటక కేంద్రమైన కెమ్మణ్ణుగుండి కొండకు కార్చిచ్చు వ్యాపించింది. సోమవారం రాత్రి నుంచి తరికెరె తాలూకా కెమ్మణ్ణుగుండి అటవీ ప్రాంతంలోని చెట్లు మంటల్లో దహనమవుతున్నాయి. అనేక ఔషధ విలువలున్న చెట్లు కాలి బూడిదవుతున్నాయి. జంతుజాలం మంటల్లో మాడి మసైపోతోంది. ఎండలు పెరుగుతుండటంతో చిక్కమగళూరు, పశ్చిమ ఘట్ట భాగంలో అగ్ని కీలలు ఎగసిపడి కొండ ప్రాంతంలో చెట్లు దగ్ధమవుతున్నాయి.

అన్న చేతిలో తమ్ముడు హత్య

క్రిష్ణగిరి: అన్నదమ్ముల మధ్య జరిగిన కలహాల్లో తమ్ముడు ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటన సోమవారం రాత్రి సూళగిరి వద్ద చోటుచేసుకుంది. వివరాల మేరకు సూళగిరి సమీపంలోని కాళింగవరం గ్రామానికి చెందిన బసప్ప కొడుకులు క్రిష్ణన్ (35), అన్న భూపతి మధ్య ఘర్షణ జరిగింది. భూపతి కత్తితో దాడి చేసి క్రిష్ణన్‌ను హత్య చేశాడు. గ్రామస్తులు సూళగిరి పోలీసులకు ఫిర్యాదు చేయగా చేరుకొని శవాన్ని ఆస్పత్రికి తరలించారు. పరారీలో ఉన్న నిందితుని కోసం గాలిస్తున్నారు.

ఏనుగు కోసం జల్లెడ


తళి అటవీ ప్రాంతంలో అటవీ సిబ్బంది

కెలమంగలం: డెంకణీకోట సమీపంలో గత కొన్నిరోజులుగా ఒంటి ఏనుగు సంచారంతో ఆ ప్రాంత ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో ఒంటి ఏనుగును బంధించేందుకు అటవీశాఖాధికార్లు తలమునకలయ్యారు. అందులో భాగంగా రెండు రోజులుగా కర్ణాటక, తమిళనాడు అటవీశాఖాధికార్ల బృందం పశువైద్యులతో కలిసి అటవీ ప్రాంతాల్లో ఏనుగులు, ఇతర వన్యమృగాల జాడలను గుర్తిస్తున్నారు. తళి, డెంకణీకోట చుట్టుపక్కల ప్రాంతాల్లో సంచరిస్తున్న జంతువుల జాడలను గుర్తించి స్థానిక ప్రజలకు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. ఆక్రోశంగా తిరుగుతున్న ఒంటి ఏనుగుకు మత్తుమందిచ్చి బంధించాలని పథకం వేశారు. ఏనుగు తిరుగుతున్న ప్రాంతాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు.

మార్గదర్శి డిపాజిట్లు చట్ట విరుద్ధం

సుప్రీంకోర్టుకు నివేదించిన రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా



సాక్షి, న్యూఢిల్లీ: మార్గదర్శి చిట్ ఫండ్ డిపాజిట్ల వ్యవహారంలో తాము ఎక్కడా చట్ట నిబంధనలను ఉల్లంఘించలేదంటూ ఇన్ని రోజులు బొంకుతూ వచ్చిన రామోజీరావుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) గట్టిగా మొట్టికాయ వేసింది. రామోజీరావు నోరు మూయించేలా మంగళవారం సుప్రీంకోర్టు ముందు ఆర్బీఐ అసలు వాస్తవాన్ని బయటపెట్టింది. హిందూ అవిభాజ్య కుటుంబం (హెచ్‌యూఎఫ్) పేరు మీద డిపాజిట్లు సేకరించడం ఆర్‌బీఐ చట్టంలోని సెక్షన్ 45ఎస్‌కు విరుద్ధమని నివేదించింది. ఈ కేసులో మార్గదర్శి డిపాజిట్ల సేకరణ అలానే జరిగిందని, ఆర్‌బీఐ తరఫు న్యాయవాది రమేష్ బాబు సుప్రీంకోర్టు దృష్టికి తీసుకొచ్చారు. ఈ వివరాల్లోని తీవ్రతను పరిగణనలోకి తీసుకున్న సుప్రీంకోర్టు, పూర్తి వివరాలతో ఓ నోట్‌ను తమ ముందుంచాలని ఆర్‌బీఐని ఆదేశించింది. అలాగే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో పాటు పిటిషనర్ ఉండవల్లి అరుణ్‌కుమార్‌ను సైతం మార్గదర్శి చిట్‌ఫండ్ డిపాజిట్ల సేకరణ విషయంలో నోట్‌ను తమ ముందుంచాలని ఆదేశిస్తూ న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కేసుకు సంబంధించి వివరాలు ఇలా..

విభజనకు ఒక్క రోజు ముందు తీర్పు...

ఆర్‌బీఐ చట్ట నిబంధనలకు విరుద్ధంగా దాదాపు రూ.2,600 కోట్లను డిపాజిట్ల రూపంలో సేకరించినందుకు గాను చట్ట ప్రకారం మార్గదర్శి ఫైనాన్షియర్స్, దాని యజమాని రామోజీరావును ప్రాసిక్యూట్ చేయాలంటూ 2008లో సీఐడీ అధీకృత అధికారి టి.కృష్ణరాజు నాంపల్లి మొదటి అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టులో క్రిమినల్ ఫిర్యాదు దాఖలు చేశారు. దీనిని కొట్టేస్తూ ఉమ్మడి హైకోర్టు విభజనకు ఒక్క రోజు ముందు (2018 డిసెంబర్ 31) అప్పటి న్యాయమూర్తి జస్టిస్ తేలప్రోలు రజనీ (ప్రస్తుతం ఎన్‌సీఎల్‌టీ సభ్యురాలు, అమరావతి బెంచ్) తీర్పునిచ్చారు. ఈ తీర్పును సవాలు చేస్తూ మార్గదర్శి అక్రమాలను వెలుగులోకి తెచ్చిన మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ 2019లో సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేశారు. 2020లో ఇదే వ్యవహారంలో మార్గదర్శి ఫైనాన్షియర్స్ కూడా సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఉమ్మడి హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ 2022లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా పిటిషన్ దాఖలు చేసింది. ఈ వ్యాజ్యాలన్నింటిపై మంగళవారం జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం మరోసారి విచారణ జరిపింది.

కోర్టు పరిధిలో ఉన్నా రూ.2వేల కోట్లు సేకరణ

ఈ సందర్భంగా మార్గదర్శి, రామోజీరావుల తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ వాదనలు వినిపిస్తూ... వసూలు చేసిన డిపాజిట్లు చాలా వరకు వెనక్కు ఇచ్చేశామన్నారు. ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకునే ఉమ్మడి హైకోర్టు మార్గదర్శిపై సీఐడీ నమోదు చేసిన ఫిర్యాదును కొట్టేసిందన్నారు. అసలు ఈ కేసుతో ఏపీ ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం లేదని తెలిపారు. ఈ సమయంలో ఏపీ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది ఎస్.నిరంజన్‌రెడ్డి జోక్యం చేసుకుంటూ... మార్గదర్శి వ్యవహారంలో ఏపీ ప్రభుత్వం కూడా పిటిషన్ దాఖలు చేసిందని, ఇందుకు సుప్రీంకోర్టు గతంలోనే అనుమతి మంజూరు చేసిందని ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. మార్గదర్శి అక్రమ డిపాజిట్ల వ్యవహారం కోర్టుకు వచ్చే సమయానికి నిబంధనలకు విరుద్ధంగా రూ.2,600 కోట్లు సేకరించిందని తెలిపారు. కోర్టులో విచారణ జరుగుతున్నప్పుడు కూడా మార్గదర్శి డిపాజిట్ల సేకరణను ఆపలేదని, అప్పుడు కూడా మరో రూ.2 వేల కోట్లు సేకరించిందని వివరించారు.

చట్ట విరుద్ధంగా డిపాజిట్లు సేకరించారా? లేదా?

ఈ కేసులో పిటిషనర్ అయిన ఉండవల్లి అరుణ్ కుమార్ పార్టీ ఇన్ పర్సన్ (కేసు దాఖలు చేసిన వ్యక్తి తన వాదనలను తానే వినిపించడం)గా వాదనలు వినిపిస్తూ... ఈ కేసులో తానే ఫిర్యాదుదారుడినని తెలిపారు. తీసుకున్న డబ్బు వెనక్కు ఇచ్చేశారా? ఎవరు ఇచ్చారు..? ఎవరికి ఇచ్చారు..? అన్న విషయాలు ముఖ్యం కాదన్నారు. చట్ట నిబంధనలకు విరుద్ధంగా డిపాజిట్లు వసూలు చేశారా? లేదా? అన్నదే ఇక్కడ చూడాల్సిన అంశమని తెలిపారు. హెచ్‌యూఎఫ్‌గా ఆర్‌బీఐ చట్టంలోని సెక్షన్45ఎస్‌కు విరుద్ధంగా డిపాజిట్లు సేకరించింది నిజమో.. కాదో.. తేల్చాలని ఆయన కోర్టును కోరారు. ఆర్‌బీఐ తరఫు న్యాయవాది కూడా ఇక్కడే ఉన్నారని, ఆయన్ను అడిగితే వాస్తవాలు తెలుస్తాయన్నారు. దీంతో ఆర్‌బీఐ తరఫు న్యాయవాది ఎంఆర్ రమేష్ బాబు స్పందిస్తూ... హెచ్‌యూఎఫ్‌గా సెక్షన్ 45ఎస్ ప్రకారం డిపాజిట్లు సేకరించడం ఆర్‌బీఐ చట్ట నిబంధనలకు విరుద్ధమని కోర్టుకు నివేదించారు. ఈ కేసులో కూడా ఇలాగే డిపాజిట్ల సేకరణ జరిగిందని తేల్చి చెప్పారు. ఈ సమయంలో ధర్మాసనం జోక్యం చేసుకుంటూ, ఇలా 45ఎస్‌కు విరుద్ధంగా డిపాజిట్లు సేకరించిన విషయాన్ని హైకోర్టుకు చెప్పారా? అని ప్రశ్నించింది. హైకోర్టులో మార్గదర్శి దాఖలు చేసిన వ్యాజ్యాల్లో తాము ప్రతివాది కానందున ఈ విషయాలను హైకోర్టు ముందుంచలేదన్నారు. సుప్రీంకోర్టులో ఉండవల్లి అరుణ్‌కుమార్ దాఖలు చేసిన వ్యాజ్యంలో తమను ప్రతివాదిగా చేర్చారని తెలిపారు. ఈ వాదనలను పరిగణనలోకి తీసుకున్న విస్తృత ధర్మాసనం అన్నీ వివరాలను నాలుగు పేజీల నోట్ ద్వారా తమ ముందుంచాలని ఇరుపక్షాలను ఆదేశించింది. ఆ వివరాల ఆధారంగా పూర్తి స్థాయి విచారణ జరుపుతామని స్పష్టంచేసింది. తదుపరి విచారణను ఏప్రిల్ 9కి వాయిదా వేసింది. ఈ విచారణకు మార్గదర్శి తరఫున సీనియర్ న్యాయవాదులు హరీష్ సాల్వే, సిద్ధార్థ లూత్రా, ఉండవల్లి తరఫున న్యాయవాదులు అల్లంకి రమేష్, అరుణా గుప్తాలు హాజరయ్యారు.

ఇదీ మార్గదర్శి బాగోతం

హిందూ అవిభక్త కుటుంబం పేరిట మార్గదర్శి ఫైనాన్షియర్స్ సాధారణ ప్రజానీకం నుంచి ఆర్‌బీఐ చట్టంలోని సెక్షన్ 45(ఎస్)కు విరుద్ధంగా రూ.2,600 కోట్లు సేకరించిందనే విషయాన్ని అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అన్ని ఆధారాలతో ఆర్‌బీఐ, కేంద్ర ఆర్థిక శాఖ దృష్టికి తీసుకెళ్లారు. వారి నుంచి తగిన స్పందన లేకపోవడంతో చట్ట ప్రకారం తమ ముందున్న ఆధారాల ఆధారంగా మార్గదర్శిపై రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా మార్గదర్శి ఉల్లంఘనలపై విచారణ జరిపేందుకు అప్పటి ప్రభుత్వ సలహాదారు ఎస్.రంగాచారిని నియమిస్తూ 2006లో జీవో 800 జారీ చేసింది. ఇదే సమయంలో సీఐడీ తరఫున సంబంధిత కోర్టుల్లో పిటిషన్లు, దరఖాస్తులు దాఖలు చేసేందుకు అధీకృత అధికారిగా టి.కృష్ణరాజును నియమిస్తూ జీవో 801 జారీ చేసింది. ఈ రెండు జీవోలపై మార్గదర్శి హైకోర్టును ఆశ్రయించగా, జీవోలపై స్టే చేసేందుకు హైకోర్టు నిరాకరించింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు మార్గదర్శి అక్రమాలపై విచారణ జరిపిన రంగాచారి 2007 ఫిబ్రవరిలో నివేదిక సమర్పించారు. రికార్డుల తనిఖీకి మార్గదర్శి ఏ మాత్రం సహకరించలేదని ఆయన తన నివేదికలో పేర్కొన్నారు. అలాగే మార్గదర్శి ఫైనాన్షియర్స్ భారీ నష్టాల్లో ఉందని, మెచ్యూరిటీ సమయంలో డిపాజిట్లు తిరిగి చెల్లించే పరిస్థితిలో ఆ సంస్థ లేదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. మార్గదర్శి ఫైనాన్షియర్స్ నిధులను ఇతర అనుబంధ కంపెనీలకు మళ్లించడమే ఈ పరిస్థితికి కారణమని ఆయన వివరించారు.

మార్గదర్శి చట్ట ఉల్లంఘనలపై అధీకృత అధికారి ఫిర్యాదు

మార్గదర్శి అక్రమాలు, చట్ట ఉల్లంఘనలపై అధీకృత అధికారి కృష్ణరాజు 2008 జనవరిలో నాంపల్లి మొదటి అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టులో క్రిమినల్ ఫిర్యాదు (సీసీ నెంబర్ 540) దాఖలు చేశారు. దీనిని కొట్టేయాలని కోరుతూ మార్గదర్శి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. విచారణ జరిపిన సింగిల్ జడ్జి సీసీ 540లో తదుపరి చర్యలను నిలిపేస్తూ మధ్యంతర ఉత్తర్వులిచ్చారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం ధర్మాసనం ముందు అప్పీల్ దాఖలు చేయగా, సీసీ 540లో తదుపరి చర్యలు కొనసాగించుకునేందుకు అనుమతించింది. ఆ తర్వాత ఇదే సీసీ 540పై మార్గదర్శి మరో రూపంలో పిటిషన్ దాఖలు చేయడం ద్వారా హైకోర్టు సానుకూల స్టే ఉత్తర్వులిచ్చింది.

ఏకంగా ఫిర్యాదు కొట్టేసిన హైకోర్టు

2011లో తిరిగి సీసీ 540ని కొట్టేయాలంటూ సీఆర్‌పీసీ సెక్షన్ 482 కింద మార్గదర్శి పిటిషన్ దాఖలు చేసింది. ఆర్‌బీఐ చట్టంలోని సెక్షన్ 45(ఎస్) కింద తామెలాంటి ఉల్లంఘనలకు పాల్పడలేదని, అందువల్ల క్రిమినల్ ఫిర్యాదును కొట్టేయాలని కోరింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఏదైనా కేసులో స్టే కాల పరిమితి ఆరు నెలలు కావడంతో, హైకోర్టు ఇచ్చిన స్టే గడువు ముగిసింది. స్టే గడువు పెంపు కోసం మార్గదర్శి 2018లో పిటిషన్ దాఖలు చేయగా సుప్రీంకోర్టు తిరస్కరించింది. ఇదిలా ఉండగా, సీసీ 540ని కొట్టేయాలంటూ మార్గదర్శి దాఖలు చేసిన పిటిషన్‌పై ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తేలప్రోలు రజనీ విచారణ జరిపారు. ఉమ్మడి హైకోర్టు విభజనకు చివరి రోజు 2018 డిసెంబర్ 31న మార్గదర్శికి అనుకూలంగా తీర్పు వెలువరించారు. మార్గదర్శి కోరినట్లు సీసీ 540ని కొట్టేశారు. అందరూ హైకోర్టు విభజన హడావుడిలో ఉన్నప్పుడు వెలువడిన ఈ తీర్పును అప్పట్లో ఎవరూ గుర్తించలేదు. తీర్పు వెలువడిన కొంత కాలం తర్వాత అసలు విషయం బయటకు వచ్చింది. దీంతో అప్పుడు ఉండవల్లి అరుణ్ కుమార్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. 2020 నవంబర్‌లో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తిగా పదవీ విరమణ చేసిన జస్టిస్ రజనీ 2021 సెప్టెంబర్‌లో జాతీయ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) అమరావతి బెంచ్ సభ్యురాలిగా నియమితులై ప్రస్తుతం ఆ పోస్టులో కొనసాగుతున్నారు. హైకోర్టు న్యాయమూర్తిగా ఉన్న సమయంలోనే ఆమెకు ఎన్‌సీఎల్‌టీ పోస్టు ఖరారైంది.

ఆర్‌బీఐ తొలిసారి వచ్చింది

ఏళ్ల తరబడి మార్గదర్శిపై తాను చేస్తున్న పోరాటంలో కీలక విషయాన్ని తెలపడానికి ఆర్‌బీఐ తొలిసారిగా కోర్టుకు వచ్చిందని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ తెలిపారు. కోర్టు విచారణ అనంతరం ఉండవల్లి మీడియాతో మాట్లాడారు. ఆర్‌బీఐ చట్టం సెక్షన్ 45 ఎస్ ప్రకారం డిపాజిట్లు సేకరణ చట్ట విరుద్ధమని న్యాయవాది రమేష్‌బాబు తెలిపారన్నారు. మార్గదర్శి, రామోజీరావు వంటి వారిపై కఠిన చర్యలు ఉంటేనే చిన్న చిన్న చిట్‌ఫండ్ మోసాలు కూడా అరికట్టవచ్చన్నారు. రామోజీరావు అరెస్టు కావాలనేది తన ఉద్దేశం కాదని, ఈ తరహా మోసాలు అరికట్టడమే తన అభిమతమని ఉండవల్లి స్పష్టంచేశారు. తన సొంత జిల్లాలో ఇటీవలే రెండు చిట్ ఫండ్ కంపెనీల మోసాలు వెలుగు చూశాయన్నారు. ఏపీలో ఫైనాన్స్ పేరుతో వసూళ్లు తగ్గుముఖం పట్టాలంటే కోర్టు ఈ కేసులో స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాల్సి ఉందన్నారు. ఏప్రిల్ 9 నాటి విచారణతో స్పష్టత వస్తుందని, చట్టవిరుద్ధంగా వసూళ్లకు పాల్పడే వారి ముక్కుకు తాడు పడుతుందని ఆశిస్తున్నానని తెలిపారు.

‘మార్గదర్శి’ కేసులో కీలక మలుపు

రామోజీ చేసింది ఆర్థిక నేరమేనని తేటతెల్లం

ఆర్‌బీఐ తేల్చి చెప్పడంతో బిగుసుకున్న ఉచ్చు


కేసును నిలబెట్టిన ఏపీ ప్రభుత్వం

సాక్షి, అమరావతి: మార్గదర్శి ఫైనాన్సియర్స్ పేరిట యథేచ్ఛగా ఆర్థిక అక్రమాలకు పాల్పడ్డ చెరుకూరి రామోజీరావుకు ఉచ్చు బిగుసుకుంది. నిబంధనలకు విరుద్ధంగా అక్రమ డిపాజిట్లు వసూలు చేయడం ఆర్థిక నేరమేనని ఆర్‌బీఐ విస్పష్టంగా ప్రకటించడంతో మార్గదర్శి ఫైనాన్సియర్స్ అక్రమ డిపాజిట్ల కేసు కీలక మలుపు తిరిగింది. తద్వారా 17 ఏళ్లుగా సాగుతున్న ఈ కేసు విచారణ తుది అంకానికి చేరుకున్నట్టయింది. చట్టానికి తాను అతీతం అన్నట్టుగా భావించే ఈనాడు రామోజీరావు మార్గదర్శి ఫైనాన్సియర్స్ పేరిట బరితెగించి ఆర్థిక అక్రమాలకు పాల్పడిన విషయం తెలిసిందే. మార్గదర్శి చిట్ ఫండ్స్ పేరిట కార్యాలయాలు తెరచి.. వాటి ముసుగులోనే మార్గదర్శి ఫైనాన్సియర్స్ పేరిట అక్రమంగా ఆర్థిక అక్రమాలకు పాల్పడ్డారు. ఆర్‌బీఐ చట్టంలోని సెక్షన్ 45ఎస్ ప్రకారం ఇన్ కార్పొరేటెడ్ కంపెనీలు మాత్రమే ప్రజల నుంచి డిపాజిట్లు సేకరించాలి. అంతేగానీ ఇన్‌కార్పొరేటెడ్ కంపెనీలు కానీ వ్యక్తులు, సంస్థలు, హిందూ అవిభక్త కుటుంబాలు (హెచ్‌యూఎఫ్) ప్రజల నుంచి డిపాజిట్లు సేకరించకూడదు. అయితే రామోజీరావు పరస్పర విరుద్ధంగా వ్యవహరిస్తూ కేసును తప్పుదోవ పట్టించేందుకు యత్నించారు. ప్రజల నుంచి నిబంధనలకు విరుద్ధంగా సేకరించిన డిపాజిట్లకు సంబంధించిన పత్రాలపై తమ మార్గదర్శి ఫైనాన్సియర్స్ సంస్థను ‘హెచ్‌యూఎఫ్’గా పేర్కొన్నారు. కానీ డిపాజిట్‌దారులకు చెల్లించే చెక్కులపై ‘మార్గదర్శి ఫైనాన్సియర్స్’ను ప్రొప్రైటర్‌గా పేర్కొనడం గమనార్హం. ఈ విధంగా చట్టాన్ని బురిడీ కొట్టించేందుకు ఆయన యత్నించారన్నది స్పష్టమైంది.

2006లో తాము సేకరించిన డిపాజిట్లు రూ.2,610.38కోట్లుగా పేర్కొన్న రామోజీరావు 2008లో కోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో తాము ఇంకా చెల్లించాల్సిన డిపాజిట్లు రూ.1,864.10 కోట్లని తెలిపారు. అంటే రూ.800 కోట్ల డిపాజిట్లు ఏమయ్యాయో ఆయన వెల్లడించలేదు. దీనిపై అప్పట్లోనే సీఐడీ, ఉండవల్లి అరుణ్‌కుమార్ ప్రశ్నించినా సూటిగా సమాధానం చెప్పలేదు. 2012 తర్వాత డిపాజిట్లను పూర్తిగా చెల్లించేశామని రామోజీ ప్రకటించారు. దీనిపై ఉండవల్లి అరుణ్‌కుమార్ అభ్యంతరం తెలుపుతూ డిపాజిట్లు ఎవరెవరి నుంచి ఎంతెంత సేకరించారు? ఎవరెవరికి ఎంతెంత డిపాజిట్లు ఏ ఏ తేదీల్లో చెల్లించారు? నగదు రూపంలోనా.. చెక్కుల రూపంలో చెల్లించారా.. అనే వివరాలు వెల్లడించాలని కోరారు. ఈ మేరకు మొదట హైకోర్టులో, తర్వాత సుప్రీంకోర్టును కూడా ఆశ్రయించారు. కాగా ఈ కేసును నమోదు చేసిన సీఐడీ ఇందులో పార్టీగా చేరి వాస్తవాలను తెలుసుకునేందుకు ప్రయత్నించాలి. కానీ అప్పట్లో రాష్ట్రంలో అధికారంలో ఉన్న కిరణ్ కుమార్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం, తరువాత అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం ఉద్దేశ పూర్వకంగా మౌనం దాల్చింది. ఆ తర్వాత 2019లో ఏపీలో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉండవల్లి అరుణ్‌కుమార్ సుప్రీంకోర్టులో వేసిన పిటిషన్‌లో ఇంప్లీడ్ అవ్వడం ద్వారా ఈ కేసు నీరుగారిపోకుండా చూడగలిగింది.

లోకేశ్ స్థాయికి మించి విమర్శలు చేస్తున్నాడు

- విస్సన్నపేట భూముల్లో ఒక్క ఎకరమైనా నా పేరిట ఉంటే రాజకీయ సన్యాసం చేస్తా
- 2019లో లోకేశ్ కుర్చీ మడతపెట్టాం.. వచ్చే ఎన్నికల్లో చంద్రబాబు కుర్చీని మడతపెట్టేస్తాం
- మంత్రి గుడివాడ అమర్‌నాథ్


ముద్దపప్పును చూపిస్తున్న మంత్రి అమర్‌నాథ్

సాక్షి, విశాఖపట్నం: టీడీపీ ప్రధాన కార్యదర్శి లోకేశ్ తన స్థాయికి మించి విమర్శలు చేస్తున్నాడని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ధ్వజమెత్తారు. చంద్రబాబు రాష్ట్రానికి చేసిన అన్యాయాన్ని మరిచిపోయి.. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధికి సంబంధించిన వాస్తవాలు తెలుసుకోకుండా తనపైన, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కుటుంబంపైన లోకేశ్ తప్పుడు వ్యాఖ్యలు చేశాడని మండిపడ్డారు. మంగళవారం స్థానిక సర్క్యూట్ హౌస్‌లో మీడియాతో మాట్లాడుతూ.. అనకాపల్లిలో జరిగిన టీడీపీ శంఖారావం సభలో మంత్రి అమర్‌నాథ్‌కు కోడిగుడ్డును గిఫ్ట్‌గా ఇస్తున్నట్టు లోకేశ్ అనడంపై తీవ్రంగా స్పందించారు. ఎవరైనా గిఫ్ట్ ఇస్తే.. రిటర్న్ గిఫ్ట్ ఇవ్వడం ఉత్తరాంధ్ర ప్రజల సంప్రదాయమని, అందుకే లోకేశ్‌కు ఇష్టమైన ముద్దపప్పును మట్టికుండలో వండి పంపిస్తున్నామని మంత్రి చెప్పారు. ఉత్తరాంధ్రను ఏమాత్రం అభివృద్ధి చేయకుండా వదిలేసిన తండ్రీ కొడుకులు చంద్రబాబు, లోకేశ్ సిగ్గు, లజ్జ లేకుండా ఈ ప్రాంతానికి వచ్చి తమపై విమర్శలు చేయటం విడ్డూరంగా ఉందన్నారు. లోకేశ్‌లా తాను బ్యాక్ డోర్ పొలిటీషియన్‌ను కాదన్నారు. ఆయన మంత్రి అయ్యాక ఎమ్మెల్సీ అయ్యాడని, ఆ తర్వాత ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయాడని గుర్తుచేశారు. తాను ఎమ్మెల్యే అయ్యాక మంత్రి అయ్యానన్నారు. తనకు, లోకేశ్‌కు పోలిక ఏంటని ప్రశ్నించారు. అనకాపల్లిని జిల్లా కేంద్రంగా అభివృద్ధి చేసింది వైఎస్ జగన్ ప్రభుత్వమని.. ఈ విషయం లోకేశ్ పక్కన కూర్చున్న బంట్రోతులకు తెలియదా అని ప్రశ్నించారు. విస్సన్నపేటలో ఒక్క సెంటు భూమైనా తన పేరిట ఉంటే రాజకీయాలను వదులుకుంటానని లోకేశ్‌కు సవాల్ విసిరారు. విస్సన్నపేట భూముల విషయంలో పెద్దఎత్తున అవినీతి జరిగిందంటూ పవన్ కళ్యాణ్ రోజంతా అక్కడి భూముల్లోనే ఉండి ఏం సాధించారని ప్రశ్నించారు.

ఉత్తరాంధ్రలో పోర్టు నిర్మించాలని ఏనాడైనా భావించారా!

చంద్రబాబు ఏనాడైనా ఉత్తరాంధ్ర ప్రాంతంలో పోర్టు నిర్మించాలని భావించారా అని మంత్రి అమర్‌నాథ్ నిలదీశారు. తాను మంత్రిగా ఉన్నప్పుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా మూలపేట పోర్టుకు శంకుస్థాపన చేసిన విషయం ఈ పప్పు ముద్దకి తెలియకపోవడం దురదృష్టకరమన్నారు. ఉద్దానంలో కిడ్నీ రీసెర్చ్ సెంటర్, ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు, ఎకహోమా టైర్ల కంపెనీ, గ్రీన్ హైడ్రోజన్ హబ్‌లు ఏర్పాటు చేసిన ఘనత తమ ప్రభుత్వానిదేనని నోరు తిరగని ఆ నాయకుడికి తెలుసా? అని ప్రశ్నించారు. ప్రతి కంపెనీలో స్థానికంగా ఉన్న వారికి 75 శాతం ఉద్యోగాలు ఇవ్వాలని చట్టం తీసుకొచ్చిన ఘనత జగన్ మోహన్‌రెడ్డిది అని, మీ హయాంలో ఎప్పుడైనా ఇటువంటి ఆలోచన చేశారా? అని ప్రశ్నించారు. ‘లోకేశ్.. 2019లో నీ కుర్చీ మడత పెట్టేశాం. వచ్చే ఎన్నికల్లో మీ నాన్న కుర్చీ కూడా మడత పెట్టేస్తాం’ అని మంత్రి స్పష్టం చేశారు.

నకిలీ కరెన్సీ ముఠా గుట్టురట్టు

- రూ.50 లక్షల నగదు, కారు స్వాధీనం
- ఇద్దరి అరెస్ట్, ప్రధాన నిందితుడి కోసం గాలింపు


వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ సత్తిబాబు. చిత్రంలో బ్లాక్ కరెన్సీ

గోపాలపట్నం (విశాఖ పశ్చిమ): నకిలీ కరెన్సీ ముఠా గుట్టు రట్టయింది. నల్లటి రంగు పూసిన కాగితాలను రసాయనంలో ముంచితే అసలు కరెన్సీగా మారుతుందని నమ్మించి మోసం చేస్తున్న ముఠా సభ్యుల్ని విశాఖ ఎయిర్‌పోర్టు పోలీసులు పట్టుకున్నారు. డీసీపీ మోకా సత్తిబాబు మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం.. అన్నవరం ప్రాంతానికి చెందిన ప్రధాన నిందితుడు గనిరాజుకు విశాఖకు చెందిన కోసుంపూరి వెంకట కనకదుర్గరాజు అలియాస్ భాస్కర్‌రాజు, పశ్చిమ గోదావరి జిల్లా యండగండికి చెందిన మద్దాల శ్రీనివాసరావుతో పరిచయం ఏర్పడింది. గనిరాజు తనవద్ద బ్లాక్ కరెన్సీ ఉందని, దీనిని కెమికల్‌లో ముంచితే అసలైన కరెన్సీగా మారుతుందని చెప్పాడు. వారి ఎదుటే కొన్ని నోట్లను కెమికల్లో ముంచి వారికి ఇచ్చి బయట మార్చమని చెప్పాడు. ఒక దుకాణం వద్ద రూ.500 నోటు ఇచ్చి సిగరెట్లు కొనుగోలు చేయించాడు. దీంతో గనిరాజుకు రూ.30 లక్షలు ఇచ్చి సుమారు రూ.3 కోట్ల విలువైన బ్లాక్ కరెన్సీ (ఫేక్ కరెన్సీ) తీసుకువచ్చారు. కాగా.. గనిరాజు కెమికల్ ఇవ్వకపోవడంతో దాని గురించి ప్రయత్నిస్తున్న క్రమంలో పోలీసులకు సమాచారం అందింది. దీంతో భాస్కరరాజు, మద్దాల శ్రీనివాసరావును అదుపులోకి తీసుకుని మూడు బ్యాగుల్లో 500 నోట్ల సైజులో ఉన్న 575 బ్లాక్ కరెన్సీ కట్టలు, కారు, రూ.50 వేల నగదు, 3 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితుడు గనిరాజు కోసం ప్రత్యేక బృందాలను నియమించామని డీసీపీ తెలిపారు.

210 ఉన్నత పాఠశాలల స్థాయి పెంపు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో 210 ఉన్నత పాఠశాలలను హైస్కూల్ ప్లస్ స్థాయికి ప్రభుత్వం పెంచింది. ఈ మేరకు మంగళవారం పాఠశాల విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్‌ప్రకాశ్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రతి మండలానికి రెండు జూనియర్ కాలేజీలు ఉండేలా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మేరకు కళాశాలల సంఖ్యను పెంచారు. హైస్కూల్ ప్లస్‌లో ఒకటి బాలికలకు, మరొకటి కో–ఎడ్యుకేషన్ ఉంటాయి. అప్‌గ్రేడ్ చేసిన 210 హైస్కూల్ ప్లస్ విద్యా సంస్థల్లో 207 కో–ఎడ్యుకేషన్, మూడు బాలికలకు కేటాయించారు. వీటిలో 2024–25 జూన్ 1 నుంచి ఇంటర్మీడియెట్ తరగతులు నిర్వహించనున్నారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపుల్లో 40 చొప్పున సీట్లు కేటాయించారు. దీంతో 679 మండలాల్లోను బాలికలకు, కో–ఎడ్యుకేషన్ కాలేజీలు అందుబాటులోకి వచ్చాయి.

టీడీపీలో సీనియర్ల సీట్లు గల్లంతు

కొన్ని చోట్ల చంద్రబాబు, కొన్ని చోట్ల పవన్ అభ్యర్థుల ప్రకటనలతో సీనియర్ల గగ్గోలు



పవన్ కళ్యాణ్‌కు మొక్కను అందిస్తున్న దుర్గేష్

సాక్షి, అమరావతి: తెలుగుదేశం పార్టీలో సీనియర్ల సీట్లు గల్లంతవుతున్నాయి. ఓ పక్క జనసేనతో పొత్తు, మరోపక్క చంద్రబాబు సమీకరణాల కారణంగా ఎప్పటి నుంచో పార్టీని అంటిపెట్టుకొని ఉన్న సీనియర్ నేతలకు ఈసారి సీట్లు దక్కని పరిస్థితి నెలకొని, వారంతా గొల్లుమంటున్నారు. జనసేన, బీజేపీ పొత్తులో టీడీపీకి సుమారు 75 సీట్లు పోతాయని భావిస్తున్నారు. పార్టీలో అంతర్గతంగా జరిగే సమీకరణాల్లో మరికొందరు సీనియర్లకు స్థానమే దక్కని పరిస్థితి నెలకొంది. పొత్తులో భాగంగా జనసేనకు ఎన్ని సీట్లు వస్తాయో ఇప్పటికీ ఖరారు కాలేదు. అయినప్పటికీ, జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ వరుసగా సీట్లు ఖరారు చేసేయడం టీడీపీ నేతలకు షాక్‌లా తగులుతోంది. గతంలో చంద్రబాబు ఏకపక్షంగా రెండు సీట్లలో అభ్యర్థులను ఖరారు చేయగా, ఆ తర్వాత పవన్ కూడా ఆ రెండు స్థానాల్లో అభ్యర్థులను ప్రకటించారు. ఇప్పుడు పవన్ ఉత్తరాంధ్ర, గోదావరి జిల్లాల్లో పర్యటించి సీట్లు ఖరారు చేయడం టీడీపీ నేతలకు మింగుడు పడటంలేదు. సోమవారం ఉమ్మడి విశాఖ జిల్లాలో పర్యటించిన పవన్.. పెందుర్తి, గాజువాక, విశాఖ దక్షిణం, భీమిలి, అనకాపల్లి, యలమంచిలి నియోజకవర్గాలకు అభ్యర్థులను ఖరారు చేసినట్లు జనసేన నేతలు వెల్లడించారు. దీంతో పెందుర్తి మాజీ ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, గాజువాక టీడీపీ ఇన్‌ఛార్జి పల్లా శ్రీనివాసరావు సీట్లు ఎగిరిపోయాయి. ఈ పరిణామంపై వారి వర్గాలు కారాలు మిరియాలు నూరుతున్నాయి.

మైలవరంలో మాజీ మంత్రి ఉమాకు షాక్

ఎన్టీఆర్ జిల్లా మైలవరంలో మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావుకు టీడీపీ అధినేత చంద్రబాబే గట్టి షాక్ ఇస్తున్నారు. అక్కడ ఉన్న సిట్టింగ్ ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్‌కు వైఎస్సార్‌సీపీ ఈసారి సీటు నిరాకరిస్తోంది. దీంతో కృష్ణప్రసాద్ టీడీపీ వైపు చూస్తున్నారు. ఆయనకు మైలవరం స్థానాన్ని ఇచ్చేందుకు చంద్రబాబు ప్రయత్నిస్తుండడంతో దేవినేని ఉమా కంగుతిన్నారు. ఇన్నాళ్లూ పార్టీ కోసం పనిచేసిన తనను కాదని తన ప్రత్యర్థికి సీటు ఇవ్వడం ఏమిటని ఆయన ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

బుచ్చయ్యకు నిరాశేనా!

ఆ తర్వాత రాజమండ్రి వచ్చిన పవన్.. రాజమండ్రి రూరల్ స్థానాన్ని కందుల దుర్గేష్‌కి కేటాయించినట్లు జనసేన నేతలు ప్రకటించారు. అది టీడీపీ సిట్టింగ్ సీటు. అక్కడి ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి ఇప్పటికే జనసేన నేతలపై బహిరంగంగానే మండిపడుతూ సీటు తనదేనని పదేపదే చెబుతున్నారు. పవన్ అక్కడ జనసేన అభ్యర్థిని ఖరారు చేయడంతో బుచ్చయ్యచౌదరి ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పరిటాల, జేసీ కుటుంబాలకు చంద్రబాబు దెబ్బ

ఉమ్మడి అనంతపురం జిల్లాలో పరిటాల సునీత, జేసీ దివాకర్‌రెడ్డి కుటుంబాలకు చంద్రబాబుకు గట్టి దెబ్బే కొట్టారు. కుటుంబంలో ఒకరికే సీటు ఇస్తానని చెప్పడంతో సునీత కుమారుడు శ్రీరామ్ ధర్మవరం స్థానాన్ని వదులకోక తప్పని పరిస్థితి ఏర్పడింది. అదే విధంగా జేసీ దివాకర్, ప్రభాకర్ కుమారుల్లో ఒకరికే ఎంపీగానీ, ఎమ్మెల్యేగానీ ఇస్తామని చంద్రబాబు తేల్చేశారు. అనకాపల్లిలో చింతకాయల అయ్యన్నపాత్రుడు కుటుంబానికీ ఒక్క సీటే ఇస్తామని చెబుతున్నారు. దీంతో ఆ కుటుంబాలన్నీ ఆగ్రహంతో రగిలిపోతున్నాయి. ఆళ్లగడ్డ సీటును మాజీ మంత్రి భూమా అఖిలప్రియకు ఇచ్చేందుకు బాబు నిరాకరించడంతో ఆమె కూడా అగ్గిమీద గుగ్గిలమవుతున్నారు. సీట్లు కోల్పోతున్న సీనియర్లందరూ చంద్రబాబుకు గట్టిగానే ధిక్కార స్వరం వినిపిస్తున్నారు. తమకు సీట్లు ఇవ్వకపోతే ఊరుకునేది లేదని హెచ్చరిస్తున్నారు.

అసెంబ్లీ నుంచి పారిపోయి ఇప్పుడు సవాల్ చేస్తారా?

చంద్రబాబుపై కొడాలి నాని ఫైర్



గుడివాడ టౌన్: ముఖ్యమంత్రిగా 14 సంవత్సరాలు వ్యవహరించిన చంద్రబాబు తన విజన్‌తో ప్రజలకు పనికొచ్చే ఒక్క పథకమైనా అమలు చేసినట్టు చెప్పగలరా అని గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నాని సవాల్ విసిరారు. మంగళవారం కృష్ణాజిల్లా గుడివాడలోని ఆయన నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ అసెంబ్లీలో అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పలేక పారిపోయిన చంద్రబాబు రాష్ట్రాభివృద్ధిపై చర్చకు సిద్ధమా అంటూ సీఎం జగన్‌కు చాలెంజ్ విసరడం విడ్డూరంగా ఉందన్నారు. భారతదేశంలో ఇద్దరు పెద్ద నాయకుల మధ్య చర్చ ఎక్కడైనా జరిగిందా అని ప్రశ్నించారు. డొంక తిరుగుడు మాటలు మాని దమ్ముంటే ప్రజలకు చేసిన మేలు చంద్రబాబు చెప్పాలన్నారు. తన పాలనలో ప్రజలకు ఏం మేలు చేశారనేది చంద్రబాబులాగా మాజీలుగా మారిపోయిన నాయకులతో చర్చించుకుంటే ఫలితం ఉంటుంది కానీ జగన్‌తో చర్చించి ఏం ప్రయోజనమని ప్రశ్నించారు. మూడు పార్టీలతో కలిసి వస్తున్నా జగన్‌ను ఎదుర్కొనే శక్తి ఆయనకు లేదన్నారు.

బ్రెయిన్‌లెస్ కిడ్ లోకేశ్

చంద్రబాబు నవ యువకుడని లోకేశ్ వ్యాఖ్యానించడంపై కొడాలి నాని స్పందిస్తూ 75 ఏళ్ల వయస్సున్న తన బాబుని ముసలోడు అనక ఏమనాలని ప్రశ్నించారు. ఆయన ఒక బ్రెయిన్ లెస్ కిడ్ అని తన పెర్ఫార్మెన్స్‌తో తెలంగాణాలో టీడీపీ తుడిచిపెట్టుకు పోయిందనీ ఎద్దేవా చేశారు. ఎన్టీఆర్‌కు రాష్ట్ర ప్రజలకు చేసిన మోసాలు, ద్రోహాలు, వెన్నుపోట్లకు దేవుడిచ్చిన గిఫ్ట్ లోకేశ్ అని అన్నారు. శంఖారావం పేరుతో చేస్తున్న సభలు సంకనాకి పోతున్నాయన్నారు. సీఎం జగన్‌లా ప్రజలకు చేసిన మేలు, చెయ్యబోయే మంచి పనులు చెప్పుకోలేక ఉత్తపుత్రుడు, దత్తపుత్రుడు, వదినమ్మ, చెల్లెమ్మలతో కలిసి చంద్రబాబు ఎన్నికలకు వస్తున్నాడని ప్రజలు మళ్లీ ఛీకొట్టడం తప్పదని వ్యాఖ్యానించారు.

ప్రతి ఎమ్మెల్యే కుటుంబ సభ్యుడే..

వైఎస్సార్‌సీపీలో ఉన్న ప్రతి ఎమ్మెల్యేని సీఎం జగన్ తన కుటుంబ సభ్యునిగా భావిస్తారని, సామాజిక సమీకరణాల దృష్ట్యా మంగళగిరి ఎమ్మెల్యే సీటును వేరే అభ్యర్థికి ఇస్తున్నట్లు చెప్పడంతో మనస్తాపానికి గురైన ఆళ్ల రామకృష్ణారెడ్డి ఆవేశంతో పార్టీ వదిలారని.. తరువాత బాగా ఆలోచించి తిరిగి వచ్చారన్నారు. జగన్‌తో పనిచేసిన ఎవరైనా సీటు వచ్చినా రాకపోయినా ఆయనతో కలిసి నడవడానికి ఇష్టపడతారని పేర్కొన్నారు.

నాగరకత ముసుగులో...
ఆదివాసీలకు ఆధునిక సమాజం పెట్టే పరీక్షలు...
అడవి బిడ్డల చుట్టూ ఊహకందని ప్రమాదాలు...
పల్లెపదాలు... జానపదజావళులకు... ఆమె అక్షరమైంది.
అలాగే...
అమెరికా ప్రకృతి అందాలు... మనవాళ్ల ప్రగతి సుగంధాలు కూడ.
అరుపదులు దాటిన ఆమెలోని రచయిత్రి...
ఇప్పుడు... పిల్లలకు కథల అమ్మమ్మ అవుతోంది.


కోరుపోలు కళావతి

కథల అమ్మమ్మ

విజయనగరం జిల్లా... స్వచ్ఛతకు, అమాయకత్వానికి నిలయం. అణచివేత, దోపిడీలను ప్రశ్నించే గళాలను పుట్టించిన నేల. ఇంటి గడపలే సప్తస్వరాలుగా సరిగమలు పలికే గుమ్మాలు ఒకవైపు. అరాచకాన్ని ఎదిరిస్తూ గళమెత్తిన స్వరాలు మరొకవైపు... పడుగుపేకల్లా అల్లుకుని సాగిన జీవన వైవిధ్యానికి ప్రత్యక్ష సాక్షి కోరుపోలు కళావతి. నాటి అమానవీయ సంఘటనలకు సజీవ సాక్ష్యాలు ఆమె రచనలు. చదివింది పదవ తరగతే. కానీ 'వాస్తవాలను కళ్లకు కట్టడానికి గొప్ప పాండిత్యం అవసరం లేదు, అన్యాయానికి అక్షరరూపం ఇవ్వగలిగితే చాలు. వాస్తవ జీవితాలు చెప్పే నీతి సూత్రం కంటే పాండిత్యం చెప్పగలిగిన న్యాయసూత్రం పెద్దదేమీ కాద'ని నిరూపిస్తోందామె. ఇటీవల 'మన్యంలో మధురకోయిల' రచనను ఆవిష్కరించిన సందర్భంగా ఆమె సాక్షితో పంచుకున్న అక్షర జ్ఞాపకాలివి.

''మాది విజయనగరం జిల్లా గుమ్మలక్ష్మీపురం గ్రామం. మా నాన్న పెదపెంకి కూర్మినాయుడు కమ్యూనిస్టు ఉద్యమంలో చురుగ్గా ఉండేవారు. వంగపండు ప్రసాద రావుగారితో కలిసి ప్రజాచైతన్యం కోసం పనిచేశారు. నేను చదివింది పదవ తరగతి వరకే. కానీ రాయాలనే దాహం తీరనంతగా ఉండేది. యద్దనపూడి సులోచనారాణి పెద్ద చదువులు చదవకపోయినా లెక్కలేనన్ని నవలలు రాశారని తెలిసి నాలో ఉత్సాహం ఉరకలు వేసింది. ఆమె స్ఫూర్తితోనే రచనలు మొదలుపెట్టాను. మా వారు టాటా స్టీల్‌లో అధికారి కావడంతో పెళ్లి తర్వాత మేము పాతికేళ్ల పాటు 'కద్మా'లో నివసించాం. కద్మా అనేది జార్ఖండ్‌లో జెమ్‌షెడ్‌పూర్ నగరానికి సమీపంలో, టాటా స్టీల్ కంపెనీ ఉద్యోగులు నివసించే ప్రాంతం. అక్కడ అన్ని ప్రాంతాలు, రకరకాల భాషల వాళ్లతో కలిసి జీవించడం నాకు మంచి అనుభవం. పిల్లలు పెద్దయ్యే వరకు ఇంటి బాధ్యతలే ప్రధానంగా గడిచిపోయింది నా జీవితం. కద్మాలో ఉన్న తెలుగు అసోసియేషన్ ఉగాది సంచిక కోసం వ్యాసాలు సేకరించడం, రాయడంతో సంతోషపడేదాన్ని. పదిహేనేళ్ల కిందట యూఎస్‌లో ఉన్న మా అమ్మాయి దగ్గర కొంతకాలం ఉన్నాను. ఇండియాకి వచ్చిన తర్వాత అక్కడి ప్రకృతి, మనవాళ్లు సాధిస్తున్న ప్రగతిని 'అమెరికా అందాలు గంధాలు' పేరుతో నవల రాశాను. అదే తొలి నవల. నేను రాయగలననే నమ్మకం వచ్చిన రచన కూడా. ఆ తర్వాత మా జిల్లా సంగీత కొశలాన్ని వివరిస్తూ 'భారత్‌లో భాసిల్లిన విద్యల నగర సాధము' రాశాను. మా గ్రామీణ ప్రాంతాల్లో నిరక్షరాస్యులు జీవితాన్ని చిన్న పదాలతో అల్లేసి, రాగయుక్తంగా పాడుతారు. ఆ వైనాన్ని 'జానపద జావళి' పేరుతో రాశాను. ఆదివాసీల స్వచ్ఛతకు అద్దం పట్టే 'గడ్డిగులాబీలు', ప్రతిమ, చిగురించే ఆశలు, వసివాడిన వసంతం, అవనిలో ఆంధ్రావని, జీవన స్రవంతి... ఇలా రాస్తూ ఉన్నాను, రాయడంలో ఉన్న సంతోషాన్ని ఇనుమడింప చేసుకుంటున్నాను. 'మన్యంలో మధురకోయిల' సుమారు యాభై ఏళ్ల కిందట ఆత్మహత్యకు పాల్పడిన మన్యం బాలికల యదార్థగాథ. అంతకుమునుపు రాసిన 'ప్రతిమ' అరకు చుట్టూ సాగింది. ఒక ఫొటోగ్రాఫర్ అరకు ప్రకృతి సౌందర్యాన్ని, అడవిబిడ్డ అచ్చమైన స్వచ్ఛతను ఫొటో తీయడానికి తరచూ వస్తుండేవాడు. ఒక గిరిజన అమ్మాయిని ఫొటోలు తీసి, పోటీకి పంపించి అవార్డు తెచ్చుకుంటాడు కూడా. ఫొటోల పేరుతో మళ్లీ అరకు బాట పట్టిన ఆ ఫొటోగ్రాఫర్ అవకాశవాదం నుంచి తమ అడవి బిడ్డను కాపాడుకోవడానికి గిరిజనులు పెట్టిన ఆంక్షలకు కథా రూపమిచ్చాను.

అలయాలు సరే... ఆశ్రమాలూ కట్టండి!

నన్ను నేను వ్యక్తం చేసుకునే అవకాశాన్నిచ్చింది అక్షరమే. కథ అంటే ఊహల్లో నుంచి రూపుదిద్దుకోవాలని అనడం కూడా విన్నాను. కానీ నా కథాంశాలన్నీ వాస్తవాలే. అమెరికాలో మనవాళ్లు... మన సంస్కృతికి ఆనవాళ్లుగా పెద్ద పెద్ద ఆలయాలను నిర్మిస్తుంటారు. భాషల పరంగా సంఘాలు ఏర్పాటు చేసుకుని సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించుకుంటారు. కానీ భారతీయుల కోసం ఒక్క వృద్ధాశ్రమాన్నయినా కట్టారా? వార్ధక్యంలో ఉన్న తల్లిదండ్రులను ఇంగ్లిష్ వాళ్లు ఏర్పాటు చేసిన వృద్ధాశ్రమంలోనే చేరుస్తారు. అక్కడ మనవాళ్లకు భాష తెలియక పోవడంతో మాట రాని మూగవాళ్లుగా జీవిస్తుంటారు. అదే మన భారతీయులే వృద్ధాశ్రమాలను నిర్మించి నిర్వహిస్తే... రిటైర్ అయిన తల్లిదండ్రులు మన ఆహారం తింటూ, మన భాష వాళ్లతో కబుర్లు చెప్పుకుంటూ అక్కడ సేదదీరుతారు కదా! అలాగే పండుగలు, సెలవులప్పుడు వీలు చూసుకుని కొడుకులు, కూతుళ్లు, మనవలు, మనవరాళ్లు వెళ్లి కలవడానికి వీలవుతుంది. నాకు కలిగిన ఈ ఆలోచననే ఆ రచనలో చెప్పాను.

నా అక్షరాలకు చిత్ర రూపం!

నా రచనలకు ముఖచిత్రం నా మనుమరాలు హర్షిత వేస్తుంది. తను సెవెన్త్ క్లాస్, ఇంగ్లిష్‌లో చిన్న చిన్న కథలు సొంతంగా రాస్తుంది. యూఎస్‌లో ఉన్న పెద్ద మనుమరాలు నందిని నా తొలి నవలను ఇంగ్లిష్‌లో ట్రాన్స్‌లేట్ చేస్తానని తీసుకువెళ్లింది. నా ఇద్దరబ్బాయిలూ విజయనగరంలో ఇంజనీర్లే. నేను, మా వారు వాళ్ల దగ్గర శేషజీవితాన్ని గడుపుతున్నాం. నా రచనల్లో కర్పూరకళిక, వలస వచ్చిన వసంతం, వాడినపూలే వికసించునులే, కలలగూడు' వంటి వాటికి పుస్తకరూపం ఇవ్వాలి. పిల్లలకు కథలు చెప్పే నానమ్మలు, అమ్మమ్మలు కరవైన ఈ రోజుల్లో 'బాలానందం' పేరుతో పిల్లల కథల పుస్తకం రాశాను. అది ముద్రణ దశలో ఉంది. అక్షరంతో స్నేహం... నాకు జీవితంలో ఎదురైన ఎన్నో సమస్యలను ఎదుర్కోగలిగిన మనోధైర్యాన్నిచ్చింది. నా ఈ స్నేహిత ఎప్పటికీ నాతోనే ఉంటుంది'' అన్నారు కళావతి.

– వాకా మంజులారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి
ఫొటోలు: కంది గౌరీ శంకర్, సాక్షి, విజయనగరం



తొలివాక్యం ఆత్మవిశ్వాసాన్నిచ్చింది!

నేను రాసిన తొలివాక్యం 'కొట్టు కొనమంటుంది– పొట్ట తినమంటుంది'. ఈ వాక్యానికి ఐదు రూపాయల పారితోషికం అందుకున్నాను. ఆ ఐదు రూపాయలను ఖర్చు చేయకుండా చాలా ఏళ్లు దాచుకున్నాను. అప్పుడు నేను ఐదవ తరగతి. చందమామ పత్రికలో ఫొటో ఇచ్చి ఒక వాక్యంలో వ్యాఖ్యానం రాయమనేవారు. మా పెద్దన్నయ్య భాస్కరరావు పుస్తకం తెచ్చిచ్చి క్యాప్షన్ రాయమన్నాడు. 'ఒక చిన్న కుర్రాడు ఆకలితో పచారీ కొట్టు ముందు బేలగా నిలబడి వేలాడదీసిన అరటి గెల వైపు చేయి చూపిస్తూ ఉన్నాడు. కొట్టతడేమో డబ్బిస్తేనే ఇస్తానంటూ కసురుకుంటున్నాడు' ఇదీ అందులో విషయం. ఆ తొలివాక్యమే కవయిత్రి కావాలనే కలకు కారణం అయింది. నేను చూసిన సంఘటనలు, నా గమనింపునకు వచ్చిన అంశాలు కొత్త రచనకు ఇంధనాలయి తీరుతాయి. అలా ఒక వాక్యంతో మొదలైన నా అక్షరవాహిని జీవనదిలా సాగుతోంది.

– కోరుపోలు కళావతి,
రైటర్

'ఐయాం సారీ'...
తప్పులు, పొరపాట్లు చేసి సారీ చెప్పడం అందరూ చేసే పని.
కాని జీవితంలో 'సారీ'లు కొనసాగుతూ ఉంటే మనం ఇంకా ఎదగలేదని, తప్పుల నుంచి నేర్చుకోవడం లేదని అర్థమంటారు ప్రియా కుమార్.
'అలవాటుగా తప్పు చేయడం దుర్లక్షణం' అనే ప్రియా కుమార్ తనవైన సూత్రీకరణలతో మోటివేషనల్ స్పీకర్‌గా మారారు.
పర్సనాల్టీ డెవలప్‌మెంట్ రచనలు చేస్తూనే దేశంలో టాప్ 10 మహిళా వ్యక్తిత్వ వికాస నిపుణులలో ఒకరిగా ఎదిగారు.
విజయానికి ఆమె చెప్తున్న సూత్రాలు.

'సారీ' చెప్తారా? ఎదుగుతారా?



ప్రియా కుమార్

'నెగెటివ్ థింకింగ్ ఉన్నవాళ్లు సమస్యలను ఊహించుకుంటూ భయపడుతుంటారు. వాళ్లు ఊహించి ఎదురు చూసే సమస్యలు చాలామటుకు ఎదురుపడవు. కాని ఇలా నెగెటివ్ థింకింగ్ వల్ల నిజంగా ఏదైనా సమస్య వచ్చినప్పుడు దానిని ఎదుర్కొందాం అనే కుతూహలం నశిస్తుంది. సమస్య మీద ఫోకస్ నిలువదు. సమస్యను పరిష్కరించాల్సింది పోయి దాని వల్ల నష్టపోతారు' అంటుంది ప్రియా కుమార్. ఈమెది చండీగఢ్.

47 ప్రపంచ దేశాలలో ప్రియా కుమార్ కార్పొరేట్ సంస్థలకు మోటివేషనల్ స్పీకర్‌గా ఉన్నారు. వ్యక్తిత్వ వికాసానికి సంబంధించి ఆమె రాసిన 12 పుస్తకాలు అంతర్జాతీయ అవార్డులను పొందాయి. బయోగ్రఫీలు రాయడం మరో ఆసక్తిగా కలిగిన ప్రియా కుమార్ తాజాగా పుల్లెల గోపీచంద్ బయోగ్రఫీ 'షట్లర్స్ ఫ్లిక్'ను వెలువరించిచారు. డ్రీమ్, డేర్, డెలివర్ అనేది ఆమె నినాదం.

ఇలా గెలవండి:

ఒక వ్యక్తి కెరీర్ సఫలం కావాలంటే అతని కుటుంబ జీవనం సరిగ్గా ఉండాలని అంటుంది ప్రియా. 'మీరు ఇల్లు విడిచి ఆఫీసుకు వస్తారు. మీరు విడిచి వచ్చిన ఇల్లు తిరిగి మీరు చేరే సమయానికి మీకు ఆహ్వానం పలికేలా ఉండాలి. అది మీ బడలిక తీర్చి మరుసటి రోజు మిమ్మల్ని కార్యోన్ముఖులను చేసేదిగా ఉండాలి. అలా ఉండాలంటే మీరు ఇంటిని, ఆఫీసును వేరు చేయకూడదు. అంటే మీ పనిలో ఏం జరుగుతున్నదో, మీరేం చేస్తున్నారో, మీరు ఎక్కడకు వెళుతున్నారో, ఎలాంటి సవాళ్లు ఎదుర్కొంటున్నారో కొద్దిగా అయినా ఇంటి సభ్యులకు తెలియచేయాలి. ఒక్కమాటలో చెప్పాలంటే మీ పనిని మీ ఇంటి సభ్యులతో జత చేయాలి. అప్పుడే వారు మీ ఉద్యోగ జీవితాన్ని సరిగా అర్థం చేసుకుని మీకు మద్దతుగా నిలుస్తారు' అంటుందామె. 'ఒక ఉద్యోగంలో మీరు చేరితే జీవితాంతం ఆ ఉద్యోగం చేయాలని లేదు. అక్కడ కొందరు రాజకీయాలు చేసి మీరు పని చేయలేని స్థితి వస్తే అలాంటి టాక్సిక్ వాతావరణం నుంచి బయటపడేయడానికి వారు మీకు సాయం చేస్తున్నారని అర్థం. అక్కడి నుంచి బయటపడి కొత్త జీవనాన్ని మొదలెట్టండి. మీకు ఉద్యోగం మీ సామర్థ్యాన్ని చూసి ఇస్తారు. మీరు ఉద్యోగంలో ఆ సామర్థ్యాన్ని ప్రదర్శించాలి. ఈ సామర్థ్యానికి– దాని ప్రదర్శనకు మధ్య ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొనడంలోనే మీ విజయం ఆధారపడి ఉంది' అని తెలుపుతుంది ప్రియ కుమార్.

సారీలు మానండి:

'జీవితంలో ఏదో ఒక దశలో సారీలు చెప్పలేని స్థితికి చేరుకోవాలి. సారీ చెప్తున్నామంటే పొరపాటో, తప్పో చేస్తున్నామని అర్థం. చేసిన తప్పుల నుంచి పాఠాలు నేర్చుకుని ఎదగలేకపోవడం వల్ల మళ్లీ మళ్లీ సారీ చెప్పాల్సి వస్తుంది. సారీ చెప్పొచ్చు. కాని దానినొక అలవాటుగా చేసుకుని అలాగే నెట్టుకొద్దామంటే ముందుకు పోలేరు' అంటుంది ప్రియ కుమార్. 'మీ గురించి ఎవరైనా మంచిగా మాట్లాడుతున్నారంటే మీరు వారి నుంచి మంచి ఆశించి, వారితో మంచిగా వ్యవహరిస్తున్నారని అర్థం. అలాగే మీ గురించి ఎవరైనా చెడుగా మాట్లాడుతున్నారంటే వారిలోని మంచి కాకుండా చెడు బయటకు వచ్చేలా వారితో మీరు వ్యవహరిస్తున్నారని అర్థం' అంటుందామె. 'కొందరు సమస్యలను ఆహ్వానించడమే పనిగా పెట్టుకుంటారు. లేదా సమస్యలను సృష్టిస్తారు. మీలోని సామర్థ్యాలను గుర్తించి వాటి కోసం మీ శక్తిని పాజిటివ్‌గా ఉపయోగిస్తే సమస్యల్లో కాకుండా విజయాలలో ఉంటారు' అని గెలుపు సూత్రాలు తెలుపుతోందామె.



రెడీ టు బడి

* ఎలా సాధించాలి
* ఎలా సంపాదించాలి

డిజిటల్ స్టార్ కావడం అనేది అదృష్టం కాదు. అవకాశం. ఆ అవకాశం చేతికి అందాలంటే 'ఎందుకు? ఏమిటి? ఎలా?' అనేది బాగా తెలిసి ఉండాలి. చాలామందిలో ఈ అవగాహన లోపించి 'ఆరంభ శూరత్వం' ప్రదర్శిస్తున్నారు. 'ఇది మనకు వర్కవుట్ అయ్యేలా లేదు' అని రథాన్ని వెనక్కి మళ్లిస్తున్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని.. డిజిటల్ కంటెంట్ క్రియేటర్ కావాలని కలలు కనే యువతరం కోసం 'స్ప్రియర్‌క్రాఫ్ట్ అకాడమీ'లాంటి నయా స్కూల్స్ వస్తున్నాయి. 'కంటెంట్ కోచ్'లాంటి నయా గురువులు వస్తున్నారు. కెమెరా యాంగిల్స్ నుంచి 'ఏ టైమ్‌లో వీడియోను పోస్ట్ చేయాలి?' 'బ్రాండ్‌లతో ఎలా కొలాబరేట్ కావాలి... లాంటి సమస్త విషయాలను నేర్చుకుంటున్నారు...

దిల్లీకి చెందిన ఇరవై సంవత్సరాల కడలికి డిజిటల్ కంటెంట్ క్రియేటర్ కావాలనేది కోరిక. పబ్లిక్ స్పీకింగ్, బ్లాగింగ్‌పై పట్టు సాధించడానికి షార్ట్ కమ్యూనికేషన్ కోర్సులో చేరింది. డిజిటల్ స్టార్‌డమ్ ప్రభావంతో, తాము కూడా ఆ స్థాయిలో పేరు తెచ్చుకోవాలనే లక్ష్యంతో పర్సనల్ బ్రాండ్ బిల్డింగ్ కోసం బడిబాట పడుతున్న అనేకానేక మందిలో కడలి ఒకరు.

2022తో పోల్చితే మన దేశంలో 2024లో కంటెంట్ క్రియేటర్‌ల సంఖ్య బాగా పెరిగిందని చెబుతోంది ఇన్‌ఫ్లూయెన్సర్ మార్కెటింగ్ ఫర్మ్ జెమ్‌ఫో.

'ఇంటర్నెట్ అందుబాటులో ఉంటే చాలు, ఆడియో అండ్ వీడియో కాప్చరింగ్ తెలిసి ఉంటే చాలు కంటెంట్ క్రియేటర్‌గా రాణించవచ్చు అని అనుకోవడానికి లేదు. నేర్చుకోవడానికి చాలా ఉంది' అంటున్నాడు కంటెంట్ కోచ్, బ్రాండ్ కన్సల్టెంట్ మనీష్ పాండే. మనీష్ లాంటి కంటెంట్ కోచ్‌ల ద్వారా సాంకేతిక విషయాలపై నైపుణ్యంతో పాటు ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్‌లలో ఎలాంటి వీడియోలు ఆదరణ పొందుతున్నాయో తెలుసుకుంటున్నారు ఔత్సాహిక కంటెంట్ క్రియేటర్‌లు.

డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని ఇన్‌ఫ్లూయెన్సర్‌లు కావాలనుకునేవారి కోసం 'స్ప్రియర్‌క్రాఫ్ట్ అకాడమీ' పేరుతో ఫస్ట్ స్కూలు ఏర్పాటయింది. 'కంటెంట్‌ను ఎలా క్రియేట్ చేయాలి? ఎలా ఎడిట్ చేయాలి? పర్సనల్ గ్రూమింగ్, వార్డ్‌రోబ్ మేనేజ్‌మెంట్, బాడీ లాంగ్వేజ్...ఇలా వెరైటీ కోర్సులను ఆఫర్ చేస్తున్నాం. మంచి స్పందన ఉంది' అని చెబుతున్నారు 'స్ప్రియర్‌క్రాఫ్ట్' ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సౌమ్యబాత్రసేన్ గుప్తా.

మరోవైపు మైక్రో అండ్ నానో ఇన్‌ఫ్లూయెన్సర్‌లు కంటెంట్ కోచ్‌లకు బిగ్గెస్ట్ క్లయింట్స్‌గా ఉన్నారు.

కన్సల్టేషన్ కోసం తన దగ్గరకు వస్తున్న వారిలో చిన్న వ్యాపారాలు చేస్తున్నవారు, నెయిల్ ఆర్టిస్ట్‌లు, స్కిన్‌కేర్ క్రియేటర్‌లు... ఇలా అన్ని రకాల వారు ఉన్నారని హైదరాబాద్‌కు చెందిన కంటెంట్ కోచ్ ఇషిక పన్సారీ చెబుతోంది.

'ఆరు నెలల వ్యవధిలో 600 మందికి శిక్షణ ఇచ్చాను' అని చెబుతుంది ఇషిక. సెషన్‌లో భాగంగా కంటెంట్ ఐడియాలు ఇస్తుంది.

'బార్టర్ డీల్స్ నుంచి బ్రాండ్ కొలాబ్రేషన్స్, యాడ్–జెనరేటెడ్ రెవెన్యూ వరకు కంటెంట్ క్రియేషన్ స్పేస్‌లో ఎన్నో అవకాశాలు ఉన్నాయి. అయినప్పటికీ 'డబ్బు' అనేది చివరి అంశం. డబ్బు సంపాదించడానికి ఓపిక, స్థిరత్వం ఉండాలి' అంటాడు కంటెంట్ కోచ్ మనీష్ పాండే.

ఇరవై రెండు సంవత్సరాల దామినీ చౌదురీ ఫుడ్, ఫ్యాషన్, లైఫ్‌స్టైల్ ఇన్‌ఫ్లూయెన్సర్‌గా రాణించాలనుకుంటుంది. 'ఇటీవలే పర్సనల్ స్టైలింగ్, ఇమేజ్ మేనేజ్‌మెంట్ కోర్సు పూర్తి చేశాను. నాకు 7,000 ఫాలోవర్స్ ఉన్నారు' అంటున్న దామిని శిక్షణ ద్వారా ఓవరాల్ ప్రెజెంటేషన్, అప్రోచ్‌లో చిన్న చిన్న మార్పులు చేసుకుంది.

'ఆడియెన్స్‌తో కనెక్ట్ అయ్యే స్పార్క్ అనేది ఏ కొద్దిమందికో పరిమితమైనది కాదు' అంటున్న కంటెంట్ కోచ్‌లు బ్రాండ్‌తో ఎలా కొలాబరేట్ కావాలి. ఎలా నెగోషియేట్ చేయాలి, కంటెంట్‌ను ఎలా ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలి, బెటర్ కెమెరా యాంగిల్ ఎలా ఉపయోగించాలి... మొదలైన టెక్నికల్ యాస్పెక్ట్స్‌ను సులభంగా తెలియజేస్తున్నారు.

కంటెంట్ క్రియేషన్ కోర్సుల కోసం చాలామంది స్కిల్స్ షేర్, ఉడెమీలాంటి ఆన్‌లైన్ లెర్నింగ్ ప్లాట్‌ఫామ్‌లపై ఆసక్తి ప్రదర్శిస్తున్నారు. వీడియో పోస్ట్ చేయడానికి రోజులో మంచి టైమ్ ఏమిటి? ఎలాంటి పరికరాలు కావాలి? ఎలాంటి లైటింగ్ బాగా ఉపయోగపడుతుంది... లాంటి విషయాలను నేర్చుకుంటున్నారు.

ప్రేక్షక లోకమే పాఠశాల

సీఏ పరీక్షలు పూర్తయిన తరువాత ఫైనాన్స్ ప్రొఫెషన్‌లోకి వచ్చింది ట్వింకిల్ జైన్. ఫైనాన్షియల్ లిటరసీని దృష్టిలో పెట్టుకొని 2021 నుంచి సోషల్ మీడియా వేదికగా వీడియోలు చేయడం మొదలు పెట్టింది. 'బిజినెస్ అండ్ ఫైనాన్స్‌కు సంబంధించిన వీడియోలు ఎవరు చూస్తారు?' అని అనుకొని ఉంటే 26 సంవత్సరాల వయసులోనే టాప్ డిజిటల్ స్టార్స్ జాబితాలో ట్వింకిల్ పేరు ఉండేది కాదు. తెలిసో తెలియకో జటిలమైన విషయాలను మరింత జటిలంగా చెబుతూ శ్రోతలను భయభ్రాంతులకు గురిచేస్తారు కొందరు. మరి కొందరు మాత్రం ఎంత జటిలమైన విషయాన్ని అయినా 'ఓస్ ఇంతేనా' అన్నట్లుగా సులభంగా అర్థమయ్యేలా చెబుతారు. ట్వింకిల్ జైన్ రెండో కోవకు చెందిన వ్యక్తి. ప్రేక్షక లోకమే ఆమె పాఠశాల. వారి నుంచే విలువైన పాఠాలను నేర్చుకుంది.


ట్వింకిల్ జైన్

కొండంత అండ...

మన దేశంలోని టాప్ డిజిటల్ స్టార్స్‌లో 27 సంవత్సరాల బృంద శర్మ ఒకరు. డిజిటల్ స్టార్ కావాలని, అవుతానని ఎప్పుడు అనుకోలేదు. కొండలు, గుట్టలు అంటే ఆమెకు ఇష్టం. వాటిని వెదుక్కుంటూ వెళ్లడం అంటే ఇష్టం. దుబాయ్‌లో చేసే 9–5 ఉద్యోగం కంటే కొండల గుండెల చప్పుడు వినడం అంటేనే ఆమెకు ఇష్టం. ఎన్నో దేశాలలో ఎన్నో పర్వతాలకు సంబంధించిన ఆసక్తికరమైన చరిత్రను ఇన్‌స్టాగ్రామ్ వేదికగా లోకంతో పంచుకునేది. ఆ తరువాత ట్రావెలింగ్‌కు సంబంధించిన వీడియోలతో ఫుల్–టైమ్ ఇన్‌ఫ్లూయెన్సర్‌గా మారింది. ప్రకృతిపై ప్రేమ, ప్రయాణం అనేది పూర్తిగా తన వ్యక్తిగత విషయం అన్నట్లుగా ఉండేది బృంద. అయితే అనునయ్‌సూద్ అనే ఫ్రెండ్ సలహాతో ఇన్‌స్టాగ్రామ్ మిషన్ ప్రారంభించింది. తన వీడియోలను వైరల్ చేయాలని, కావాలనీ... బృంద ఎప్పుడూ అనుకోలేదు. అయితే కంటెంట్‌లో ఉన్న సత్తాతో ఆ వీడియోలు వైరల్ అయ్యాయి. బృందశర్మను డిజిటల్ స్టార్‌ను చేశాయి.


బృంద శర్మ

తక్షణ నిగారింపు కోసం...

ఒక్కోసారి అనుకోకుండా ఏదైనా ఫంక్షన్‌కు వెళ్లాల్సి వస్తుంది. తీరిగ్గా తయారయ్యేంత సమయం ఉండకపోవచ్చు. అలాంటప్పుడు చిన్న టిప్స్ ద్వారా చర్మానికి తక్షణ నిగారింపు తీసుకురావచ్చు. అవేమిటో చూద్దాం..

క్లెన్సింగ్: ముందుగా కొద్దిగా రోజ్ వాటర్ ని తీసుకుని.. దానిని ముఖం అంతా అప్లై చేసుకోవాలి. ఇది స్కిన్ కి టోనర్ గా పని చేస్తుంది. ఇలా చేయడం వల్ల చర్మ రంధ్రాలు బిగుస్తాయి. చర్మానికి మేలు చేస్తుంది.

స్క్రబ్బింగ్: ఆ తర్వాత ఫేస్‌కి స్క్రబ్బింగ్ చేయాలి. ఇందు కోసం టమాటాను తీసుకుని దాన్ని మధ్యలోకి కట్ చేయాలి. ఇలా తీసుకున్న టమాటా మీద కాస్త పంచదార అద్ది దానితో ముఖంపై రుద్దాలి. ఇలా చేస్తే చర్మంపై ఉండే నల్ల మచ్చలు, ట్యాన్ తొలగి చర్మం మిలమిలలాడుతుంది.

మసాజ్
కలబంద గుజ్జు... అదే నండీ... కాస్తంత అలోవెరా జెల్‌ను తీసుకుని దీనితో చర్మంపై మృదువుగా మసాజ్ చేయాలి. ఆలోవెరాలో మాయిశ్చరైజింగ్ గుణాలు ఉండటం వల్ల అది మీ చర్మాన్ని కాంతిమంతంగా, మృదువుగా ఉండేలా చేస్తుంది.





గుల్‌వీర్ సింగ్ స్వర్ణం వెనక్కి...

ఆసియా ఇండోర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పురుషుల 3000 మీటర్ల విభాగంలో తాను గెల్చుకున్న స్వర్ణ పతకాన్ని భారత అథ్లెట్ గుల్‌వీర్ సింగ్ కోల్పోయాడు. టెహ్రాన్‌లో జరిగిన ఈ ఈవెంట్‌లో గుల్‌వీర్ రేసు సందర్భంగా తాను పరిగెడుతున్న వరుస నుంచి పక్క వరుసలోకి వెళ్లినట్లు తేలడంతో అనర్హత వేటు వేశారు. నిర్వాహకుల నిర్ణయాన్ని భారత బృందం అప్పీల్ చేయగా.. గుల్‌వీర్ నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరించినట్లు తేలడంతో అప్పీల్‌ను కొట్టివేశారు.



గ్రాండ్‌మాస్టర్‌ను ఓడించిన పిన్న వయస్కుడిగా...

క్లాసికల్ చెస్ ఫార్మాట్‌లో గ్రాండ్‌మాస్టర్‌ను ఓడించిన పిన్న వయస్కుడిగా భారత సంతతికి సింగపూర్ కుర్రాడు అశ్వథ్ కౌశిక్ (8 ఏళ్ల 6 నెలల 11 రోజులు) రికార్డు నెలకొల్పాడు. స్విట్జర్లాండ్‌లో జరిగిన బర్గ్‌డార్ఫర్ స్టాడస్ ఓపెన్ టోర్నీ నాలుగో రౌండ్‌లో అశ్వథ్ 45 ఎత్తుల్లో పోలాండ్‌కు చెందిన 37 ఏళ్ల గ్రాండ్‌మాస్టర్ జేసెక్ స్టోపాపై గెలిచాడు. ఈ క్రమంలో లియోనిడ్ (సెర్బియా: 8 ఏళ్ల 11 నెలల 7 రోజులు) పేరిట ఉన్న రికార్డును అశ్వథ్ బద్దలు కొట్టాడు.

కోహ్లికి పుత్రోత్సాహం

మగ బిడ్డకు జన్మనిచ్చిన అనుష్క



న్యూఢిల్లీ: భారత స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లికి కొడుకు పుట్టాడు. గత గురువారమే తన భార్య అనుష్క శర్మ మగ బిడ్డకు జన్మనిచ్చినట్లు, అతని పేరు 'అకాయ్' అంటూ సోషల్ మీడియా ద్వారా కోహ్లి ప్రకటించాడు. 'ఫిబ్రవరి 15న మా జీవితాల్లోకి వామిక సోదరుడు అకాయ్ వచ్చాడు. ఈ సంతోషాన్ని మీతో పంచుకుంటున్నాం. ఈ ఆనందకర క్షణాల్లో మీ దీవెనలు మాకు కావాలి. మా ఏకాంతాన్ని గౌరవించండి' అని కోహ్లి వెల్లడించాడు. కోహ్లి, అనుష్కకు 2017 డిసెంబర్‌లో వివాహం కాగా... 2021 జనవరిలో కూతురు వామిక పుట్టింది. వ్యక్తిగత కారణాలతోనే కోహ్లి ప్రస్తుతం ఇంగ్లండ్‌తో జరుగుతున్న టెస్టు సిరీస్‌కు పూర్తిగా దూరమయ్యాడు.

కేఎల్ రాహుల్ అవుట్



న్యూఢిల్లీ: భారత క్రికెటర్ కేఎల్ రాహుల్ ఇంగ్లండ్‌తో జరిగే నాలుగో టెస్టుకూ దూరమయ్యాడు. తొడ కండరాల గాయం కారణంగా గత రెండు టెస్టులు ఆడని రాహుల్ కోలుకున్నాడని... ఈనెల 23 నుంచి జరిగే రాంచీ టెస్టులో ఆడతాడని వార్తలు వచ్చాయి. అయితే అతను పూర్తి ఫిట్‌గా లేకపోవడంతో మరో మ్యాచ్ నుంచి తప్పుకున్నాడని బీసీసీఐ అధికారికంగా ప్రకటించింది. కోలుకుంటేనే చివరి టెస్టుకు అందుబాటులోకి వస్తాడని స్పష్టం చేసింది. మరోవైపు పని భారం కారణంగా ప్రధాన పేసర్ జస్‌ప్రీత్ బుమ్రాకు కూడా ఈ మ్యాచ్ నుంచి విశ్రాంతినిస్తున్నట్లు ప్రకటించిన బోర్డు... అతడిని జట్టు నుంచి విడుదల చేసింది. రాజ్‌కోట్ టెస్టు ఆడని ముకేశ్ నాలుగో టెస్టుకు అందుబాటులోకి వచ్చాడు.

సుమిత్ శుభారంభం

పుణే: మహారాష్ట్ర ఓపెన్ ఏటీపీ చాలెంజర్–100 టెన్నిస్ టోర్నీలో భారత అగ్రశ్రేణి క్రీడాకారులు సుమిత్ నగాల్, రామ్‌కుమార్ రామనాథన్ శుభారంభం చేశారు. మంగళవారం జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో సుమిత్ నగాల్ 7–6 (8/6), 6–4తో యు సియో సు (చైనీస్ తైపీ)పై... రామ్‌కుమార్ 7–6 (7/5), 7–6 (7/5)తో స్టెఫానో నపోలిటానో (ఇటలీ)పై కష్టపడి గెలిచి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లారు.



రంజీ 'ప్లేట్' చాంపియన్ హైదరాబాద్

ఫైనల్లో మేఘాలయాపై 5 వికెట్లతో విజయం ● వచ్చే సీజన్‌లో 'ఎలైట్' డివిజన్‌లో బరిలోకి

సాక్షి, హైదరాబాద్: దేశవాళీ ఫస్ట్‌క్లాస్ క్రికెట్ టోర్నీ రంజీ ట్రోఫీ ప్లేట్ డివిజన్ చాంపియన్‌గా హైదరాబాద్ జట్టు అవతరించింది. ఉప్పల్ స్టేడియంలో మేఘాలయ జట్టుతో జరిగిన ఫైనల్లో తిలక్ వర్మ సారథ్యంలోని హైదరాబాద్ జట్టు ఐదు వికెట్ల తేడాతో గెలుపొందింది. 198 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ఓవర్‌నైట్ స్కోరు 71/1తో నాలుగో రోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన హైదరాబాద్ 34.2 ఓవర్లలో 5 వికెట్లకు 203 పరుగులు చేసి గెలిచింది. కెప్టెన్ తిలక్ వర్మ (64; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు), రాహుల్ సింగ్ (62; 8 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధ సెంచరీలు చేయగా... రోహిత్ రాయుడు (34; 1 ఫోర్, 2 సిక్స్‌లు) కీలక పరుగులు సాధించాడు. తిలక్, రోహిత్ నాలుగో వికెట్‌కు 82 పరుగులు జోడించారు. అయితే విజయానికి 7 పరుగుల దూరంలో తిలక్, 5 పరుగుల దూరంలో రోహిత్ అవుటయ్యాడు. చివరకు ఆర్యన్ బౌలింగ్‌లో చందన్ సహనీ కొట్టిన భారీ సిక్సర్‌తో హైదరాబాద్ విజయం ఖాయమైంది. ఆరు జట్లున్న ప్లేట్ గ్రూప్‌లో లీగ్ దశలో ఐదు మ్యాచ్‌ల్లో, సెమీఫైనల్లో, ఫైనల్లో గెలిచి హైదరాబాద్ అజేయంగా నిలిచింది. హైదరాబాద్‌తోపాటు రన్నరప్ మేఘాలయ జట్టు కూడా వచ్చే రంజీ ట్రోఫీ సీజన్‌లో అగ్రశ్రేణి జట్లు పోటీపడే 'ఎలైట్' డివిజన్‌కు అర్హత సాధించగా... ఈ సీజన్ 'ఎలైట్' డివిజన్‌లో పోటీపడ్డ 32 జట్లలో ఓవరాల్‌గా చివరి రెండు స్థానాల్లో నిలిచిన గోవా, మణిపూర్ జట్లు వచ్చే సీజన్‌లో 'ప్లేట్' డివిజన్‌కు పడిపోయాయి. 2022–23 సీజన్‌లో ఎలైట్ గ్రూప్ 'బి'లో హైదరాబాద్ ఆడింది. 7 మ్యాచ్‌లలో తొలి మ్యాచ్‌ను తమిళనాడుతో 'డ్రా' చేసుకున్న టీమ్ ఆ తర్వాత వరుస ఆరు వరుస పరాజయాలతో (ముంబై, అస్సాం, ఆంధ్ర, సౌరాష్ట్ర, మహారాష్ట్ర, ఢిల్లీ చేతుల్లో) నిష్క్రమించి ప్లేట్ డివిజన్‌కు పడిపోయింది. వచ్చే సీజన్‌లో హైదరాబాద్ ఎలాంటి ఆటను ప్రదర్శిస్తుందో వేచి చూడాలి.

'ఎలైట్' రంజీ ట్రోఫీ గెలిస్తే బీఎండబ్ల్యూ కార్లు...

'ప్లేట్' డివిజన్‌లో విజేతగా నిలిచిన తమ జట్టుకు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) 10 లక్షల నగదు పురస్కారాన్ని అందించింది. 'ప్లేయర్ ఆఫ్ ద ఫైనల్' నితేశ్ రెడ్డి... సెంచరీ సాధించిన ప్రజ్ఞయ్ రెడ్డి... 'ప్లేట్' డివిజన్‌లో 56 వికెట్లతో టాపర్‌గా నిలిచిన బౌలర్ తనయ్ త్యాగరాజన్... కెప్టెన్ తిలక్ వర్మ... 7 మ్యాచ్‌ల్లో కలిపి 765 పరుగులు సాధించి 'టాప్ స్కోరర్'గా నిలిచిన ఓపెనర్ తన్మయ్ అగర్వాల్‌లకు ప్రత్యేకంగా తలా రూ.50 వేల ప్రోత్సాహక బహుమతిని కూడా అందజేశారు. దీంతోపాటు వచ్చే సీజన్‌లో జట్టుకు ప్రేరణ అందించేందుకు హెచ్‌సీఏ అధ్యక్షుడు అర్శనపల్లి జగన్ మోహన్ రావు మరింత భారీ ప్రోత్సాహకాన్ని ప్రకటించారు. రాబోయే మూడేళ్లలో సత్తా చాటి హైదరాబాద్ రంజీ ట్రోఫీ టైటిల్ సాధిస్తే జట్టుకు రూ. 1 కోటి నగదు బహుమతిని, దాంతోపాటు జట్టులోని ఒక్కొక్కరికి బీఎండబ్ల్యూ కార్లను అందజేస్తామని ఆయన తెలిపారు.



కెప్టెన్ తిలక్ వర్మకు విన్నర్స్ ట్రోఫీ అందజేస్తున్న హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మోహన్ రావు

మార్చి 22 నుంచి ఐపీఎల్!



న్యూఢిల్లీ: ఐపీఎల్–2024 పూర్తిగా భారత్‌లోనే నిర్వహించడం ఖాయమైంది. లీగ్ చైర్మన్ అరుణ్ ధూమల్ ఈ విషయాన్ని నిర్ధారించారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో భారత్ బయట మ్యాచ్‌లు జరిపే అవకాశాలపై జరిగిన చర్చకు దీంతో తెర పడింది. అయితే ఒకేసారి పూర్తి షెడ్యూల్ ప్రకటించకుండా ఎన్నికల తేదీలను దృష్టిలో ఉంచుకొని తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. 'మార్చి 22 నుంచి ఐపీఎల్ ప్రారంభించాలనే ఆలోచనతో ఉన్నాం. తేదీల విషయంపై మేం ప్రభుత్వ అధికారులతో చర్చిస్తున్నాం. ముందుగా 15 రోజుల మ్యాచ్‌ల షెడ్యూల్ విడుదల చేస్తాం. ఆపై తర్వాతి తేదీలను ప్రకటిస్తాం. అయితే అన్ని మ్యాచ్‌లు భారత్‌లోనే జరగడం ఖాయం' అని ధూమల్ స్పష్టం చేశారు. ఐపీఎల్ ప్రారంభమైన తర్వాతి ఎన్నికల సమయంలో 2009లో టోర్నీ మొత్తం దక్షిణాఫ్రికాలో జరిగింది. 2014లో కొన్ని మ్యాచ్‌లు భారత్‌లో, మరికొన్ని యూఏఈలో నిర్వహించారు. అయితే 2019లో మాత్రం మొత్తం టోర్నీ ఇక్కడే జరిగింది. ఇదే తరహాలో ఈసారి కూడా షెడ్యూల్‌ను ప్రకటించవచ్చు. ఐపీఎల్ తర్వాత కొద్ది రోజుల్లోనే టి20 ప్రపంచ కప్ ప్రారంభం కానున్న నేపథ్యంలో లీగ్ ఫైనల్ మే 26న జరిగే అవకాశం ఉంది.

నాకౌట్ దశకు భారత టీటీ జట్లు

రెండో రౌండ్‌లో ఇటలీ, కజకిస్తాన్‌లతో 'ఢీ'

బుసాన్ (దక్షిణ కొరియా): ప్రపంచ టేబుల్ టెన్నిస్ (టీటీ) టీమ్ చాంపియన్‌షిప్‌లో భారత పురుషుల, మహిళల జట్లు నాకౌట్ దశకు అర్హత సాధించాయి. గ్రూప్–1లోని చివరి లీగ్ మ్యాచ్‌లో భారత మహిళల జట్టు 3–2తో స్పెయిన్‌పై గెలిచి 7 పాయింట్లతో రెండో స్థానాన్ని దక్కించుకుంది. గ్రూప్–3లోని చివరి లీగ్ మ్యాచ్‌లో భారత పురుషుల జట్టు 3–0తో న్యూజిలాండ్‌ను ఓడించి 6 పాయింట్లతో మూడో స్థానాన్ని సంపాదించింది. నేడు జరిగే నాకౌట్ దశ రెండో రౌండ్ పోటీల్లో ఇటలీతో భారత మహిళల జట్టు... కజకిస్తాన్‌తో భారత పురుషుల జట్టు తలపడతాయి. క్వార్టర్ ఫైనల్ చేరితే భారత జట్లకు పారిస్ ఒలింపిక్స్ బెర్త్‌లు ఖరారవుతాయి.

స్పెయిన్‌తో జరిగిన పోటీలో తొలి రెండు మ్యాచ్‌ల్లో ఓడిపోయిన భారత బృందం ఆ తర్వాత వరుసగా మూడు మ్యాచ్‌ల్లో నెగ్గడం విశేషం. తొలి మ్యాచ్‌లో తెలంగాణ అమ్మాయి ఆకుల శ్రీజ 9–11, 11–9, 11–13, 4–11తో మరియా జియావో చేతిలో... రెండో మ్యాచ్‌లో మనిక బత్రా 11–13, 11–6, 11–8, 9–11, 7–11తో సోఫియా జువాన్ జాంగ్ చేతిలో ఓడిపోయారు. మూడో మ్యాచ్‌లో ఐహిక ముఖర్జీ 11–8, 11–13, 11–8, 9–11, 11–4తో ఎల్విరా రాడ్‌పై గెలిచి భారత ఆశలను సజీవంగా నిలిపింది. నాలుగో మ్యాచ్‌లో మనిక బత్రా 11–9, 11–2, 11–4తో మరియా జియావోపై నెగ్గడంతో స్కోరు 2–2తో సమమైంది. నిర్ణాయక ఐదో మ్యాచ్‌లో ఆకుల శ్రీజ 11–6, 11–13, 11–6, 11–3తో సోఫియా జువాన్ జాంగ్‌ను ఓడించి భారత విజయాన్ని ఖాయం చేసింది.



ఐహిక



మనిక



ఆకుల శ్రీజ

'టై'తో టైటాన్స్ ముగింపు



పవన్

పంచ్‌కులా: ప్రో కబడ్డీ లీగ్ పదో సీజన్‌ను తెలుగు టైటాన్స్ జట్టు 'టై'తో ముగించింది. యు ముంబా, తెలుగు టైటాన్స్ జట్ల మధ్య మంగళవారం జరిగిన తమ చివరి లీగ్ మ్యాచ్ 45–45 వద్ద 'టై' అయింది. కెప్టెన్ పవన్ సెహ్రావత్ 14 పాయింట్లు స్కోరు చేసి టైటాన్స్ జట్టును ఓటమి నుంచి కాపాడాడు. నిర్ణీత 22 మ్యాచ్‌లు పూర్తి చేసుకున్న తెలుగు టైటాన్స్ 19 మ్యాచ్‌ల్లో ఓడిపోయి, ఒక మ్యాచ్‌ను 'టై' చేసుకొని, రెండు మ్యాచ్‌ల్లో నెగ్గి 21 పాయింట్లతో చివరిదైన 12వ స్థానంతో సరిపెట్టుకుంది. తొమ్మిదో సీజన్‌లోనూ టైటాన్స్ చివరి స్థానంలోనే నిలిచింది. నేడు జరిగే చివరి రౌండ్ లీగ్ మ్యాచ్‌ల్లో పుణేరి పల్టన్‌తో యూపీ యోధాస్; హరియాణా స్టీలర్స్‌తో బెంగళూరు బుల్స్ ఆడతాయి.

శ్రీనిధి డెక్కన్ జట్టు గెలుపు



ఐజ్వాల్: ఐ–లీగ్ జాతీయ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో హైదరాబాద్‌కు చెందిన శ్రీనిధి డెక్కన్ ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ) జట్టు ఖాతాలో తొమ్మిదో విజయం చేరింది. ఐజ్వాల్ ఎఫ్‌సీ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో శ్రీనిధి డెక్కన్ జట్టు 5–1తో నెగ్గింది. శ్రీనిధి జట్టు తరఫున కాస్టనెడా (28వ ని.లో), ఎలీ సబియా (66వ ని.లో), బ్రాండన్ (90వ ని.లో) ఒక్కో గోల్ చేయగా... సిసోకో (83వ ని.లో, 90+6వ ని.లో) రెండు గోల్స్ సాధించాడు. ఐజ్వాల్ జట్టుకు జొహెర్లియానా (49వ ని.లో) ఏకైక గోల్ అందించాడు. 13 జట్లు పోటీపడుతున్న ఐ–లీగ్‌లో శ్రీనిధి జట్టు 14 మ్యాచ్‌లు ఆడి 29 పాయింట్లతో రెండో స్థానంలో ఉంది.

సినిమా

సినిమా చూసి సెల్యూట్ కొడతారు

- వరుణ్ తేజ్



● సందీప్ ముద్దా, మానుషీ చిల్లర్, వరుణ్ తేజ్, నవదీప్, శక్తి ప్రతాప్ సింగ్

''మన సైనికుల త్యాగాలని గుర్తు చేసుకుంటూ వారి ధైర్య సాహసాలని ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి చేసిన ప్రయత్నమే 'ఆపరేషన్ వాలెంటైన్'. మనందరికీ దేశభక్తి ఉంటుంది.. కానీ, మా సినిమా చూశాక అది మరింత పెరుగుతుందనే నమ్మకం ఉంది'' అన్నారు హీరో వరుణ్ తేజ్. శక్తి ప్రతాప్ సింగ్ హడా దర్శకత్వంలో వరుణ్ తేజ్ హీరోగా నటించిన చిత్రం 'ఆపరేషన్ వాలెంటైన్'. మానుషీ చిల్లర్, రుహానీ శర్మ, నవదీప్ కీలక పాత్రలు పోషించారు. సోనీ పిక్చర్స్ ఇంటర్నేషనల్ ప్రొడక్షన్స్, సందీప్ ముద్దా రినైసన్స్ పిక్చర్స్ నిర్మించిన ఈ సినిమా మార్చి 1న తెలుగు, హిందీ భాషల్లో రిలీజ్ కానుంది. ఈ సినిమా హిందీ ట్రైలర్‌ను హీరో సల్మాన్ ఖాన్, తెలుగు ట్రైలర్‌ను హీరో రామ్‌చరణ్ రిలీజ్ చేశారు. వరుణ్ తేజ్ మాట్లాడుతూ– ''మన దేశంలో సినిమా పెద్ద వినోద సాధనం. సరదాగా కాలక్షేపం చేయాలంటే అందరూ ముందు సినిమావైపు వెళ్తారు. అందుకే ప్రేక్షకులు ఖర్చు పెట్టే టిక్కెట్ డబ్బులకి న్యాయం చేయాలని ఎప్పుడూ ప్రయత్నిస్తుంటాను. చాలా కొత్తగా, ఎడ్జ్ ఆఫ్ ది సీట్ కూర్చుని గూస్ బంప్స్ మూమెంట్స్‌ని ఎంజాయ్ చేసే చాలా సన్నివేశాలు ఈ మూవీలో ఉన్నాయి. ఈ సినిమాని చాలా గర్వంగా, గుండెల నిండా దేశభక్తితో చూసి మన సైనికులకు సెల్యూట్ కొడతారు'' అన్నారు. ''యాక్షన్, ఫన్, ఎమోషన్.. ఇలా అన్ని అంశాలున్న చిత్రమిది'' అన్నారు శక్తి ప్రతాప్.

థ్రిల్లర్ డ్రామా

'బిగ్ బాస్' ఫేమ్ అర్జున్ కల్యాణ్, కుషిత కల్లపు జంటగా లక్ష్మణ వర్మ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'బాబు నెం1 బుల్ షిట్ గయ్'. దండు దిలీప్ కుమార్ రెడ్డి నిర్మించిన ఈ సినిమా మార్చి 8న విడుదలవుతోంది. ఈ చిత్రం ట్రైలర్ రిలీజ్ వేడుకకి నిర్మాతలు వివేక్ కూచిభొట్ల, ఎస్‌కేఎన్, దర్శకుడు సాయి రాజేశ్ అతిథులుగా హాజరై, ''ట్రైలర్ బావుంది.. సినిమా పెద్ద విజయం సాధించాలి'' అన్నారు. అర్జున్ కల్యాణ్ మాట్లాడుతూ– ''యునిక్ కాన్సెప్ట్‌తో థ్రిల్లర్, డ్రామాగా రూపొందిన చిత్రమిది'' అన్నారు. ''మా డీడీ క్రియేషన్స్‌ని ఈ సినిమా మరో స్థాయికి తీసుకెళుతుంది'' అన్నారు లక్ష్మణ వర్మ.



● కుషిత, అర్జున్ కల్యాణ్

ఇక నా లీగల్ టీమ్ చూసుకుంటుంది

''అటెన్షన్ కోసం ఏ స్థాయికైనా దిగజారిపోయే వారిని పదే పదే చూస్తుండటం అసహ్యంగా అనిపిస్తోంది. అలాంటి వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఇకపై నేను చేసేది, చేయాల్సింది నా లీగల్ టీమ్ చూసుకుంటుంది'' అని 'ఎక్స్'లో ఘాటుగా స్పందించారు త్రిష. కానీ ఎవరి పేరునూ ప్రస్తావించలేదు. కాగా తమిళనాడుకు చెందిన ఓ రాజకీయ నేత ఏవీ రాజు చేసిన అభ్యంతరకర వ్యాఖ్యల నేపథ్యంలోనే 'ఎక్స్' వేదికగా త్రిష పై విధంగా స్పందించారనే టాక్ కోలీవుడ్‌లో వినిపిస్తోంది. అక్కడి ఓ స్థానిక ఎమ్మెల్యేని ఉద్దేశించి కొన్ని ఆరోపణలు చేసే క్రమంలో త్రిషపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు ఏవీ రాజు. ఈ వ్యాఖ్యలను ఖండిస్తూ విశాల్, ఖుష్బూ వంటి పలువురు సినీ ప్రముఖులు సోషల్ మాధ్యమాల వేదికగా త్రిషకు మద్దతు తెలియజేస్తున్నారు.



● త్రిష



డాన్ ప్రేయసి

డాన్‌తో లవ్‌లో పడ్డారు హీరోయిన్ కియారా అద్వానీ. బాలీవుడ్ 'డాన్' ఫ్రాంచైజీలో రూపొందనున్న తాజా సినిమా 'డాన్ 3'. రణ్‌వీర్ సింగ్ హీరోగా నటించనున్న ఈ సినిమాను దర్శక–నిర్మాత –నటుడు–రైటర్ ఫర్హాన్ అక్తర్ తెరకెక్కిస్తారు. ఈ సినిమాలో హీరోయిన్‌గా కియారా అద్వానీ నటించనున్నట్లు చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటించింది. ''కొత్త శకం మొదలైంది. 'డాన్' యూనివర్స్‌లోకి కియారాకు స్వాగతం'' అని 'డాన్ 3' మేకర్స్ పేర్కొన్నారు. ఈ చిత్రంలో కియారాకు కొన్ని యాక్షన్ సీక్వెన్స్‌లు కూడా ఉంటాయట. ''ఐకానిక్ 'డాన్ 3' ఫ్రాంచైజీలో భాగం కావడం థ్రిల్‌గా ఉంది'' అన్నారు కియారా అద్వానీ.

● కియారా అద్వానీ

అతనో కామిక్ యాక్టర్

- సిద్ధు జొన్నలగడ్డ



● సిద్ధు, హర్ష

''సుందరం మాస్టర్' ట్రైలర్ బాగుంది. కల్యాణ్ సంతోష్‌కు తొలి చిత్రమిది.. మంచి ఫలితాన్నివ్వాలి. రవితేజగారు హీరోగా ఎంత బిజీగా ఉన్నా ఇలా కొత్తవాళ్లని ప్రోత్సహించేందుకు సినిమాలు నిర్మిస్తున్నారు'' అన్నారు హీరో సిద్ధు జొన్నలగడ్డ. హర్ష చెముడు, దివ్య శ్రీపాద జంటగా కల్యాణ్ సంతోష్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'సుందరం మాస్టర్'. హీరో రవితేజ, సుధీర్ కుమార్ కుర్రు నిర్మించిన ఈ సినిమా ఈ నెల 23న రిలీజవుతోంది. ఈ చిత్రం ప్రీ రిలీజ్ వేడుకకి సిద్ధు జొన్నలగడ్డ అతిథిగా హాజరై, మాట్లాడుతూ– ''హర్షని కమెడియన్ అనడం నాకు నచ్చదు. అతను ఓ కామిక్ యాక్టర్. ట్రైలర్‌లో చూసినట్టుగా హర్షని ఎప్పుడూ సీరియస్‌గా చూడలేదు'' అన్నారు. ''పదేళ్ల క్రితం ప్రేక్షకుల మధ్యలో ఉన్నాను. ఇప్పుడీ వేదికపై ఉన్నాను. గట్టిగా నమ్మితే ఏదైనా సాధించగలం'' అన్నారు హర్ష చెముడు. ''ఈ సినిమా అందరికీ నచ్చుతుందని ఆశిస్తున్నాం'' అన్నారు సుధీర్ కుమార్. ''ఈ సినిమా మా యూనిట్‌కి గౌరవం తెస్తుంది, ప్రేక్షకులకు సంతృప్తినిస్తుంది'' అన్నారు కల్యాణ్ సంతోష్.

సొంతంగా పైకి రావాలనుకుంటున్నాడు

- విశ్వక్ సేన్

''విరాన్, నేను జిమ్ ఫ్రెండ్స్. తనకెంతో బ్యాక్‌గ్రౌండ్ ఉన్నా సొంత కష్టంతో పైకి రావాలనుకుంటున్నాడు. 'ముఖ్య గమనిక' చిత్రం టీజర్, ట్రైలర్ బాగున్నాయి. ఈ సినిమా విరాన్‌కి, యూనిట్‌కి మంచి విజయం అందివ్వాలి'' అన్నారు హీరో విశ్వక్ సేన్. హీరో అల్లు అర్జున్ కజిన్ విరాన్ ముత్తంశెట్టి, లావణ్య జంటగా వేణు మురళీధర్ .వి దర్శకత్వం వహించిన చిత్రం 'ముఖ్య గమనిక'. రాజశేఖర్, సాయికృష్ణ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 23న రిలీజ్ కానుంది. ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో విశ్వక్ సేన్ అతిథిగా పాల్గొన్నారు. వేణు మురళీధర్ మాట్లాడుతూ– ''నేనీ రోజు ఈ స్థాయిలో ఉన్నానంటే కారణం అల్లు అర్జున్‌గారు. విరాన్ 'ముఖ్య గమనిక' ఒప్పుకోవడం నా లక్'' అన్నారు. ''ఈ చిత్రం మంచి హిట్టవుతుందని నమ్ముతున్నాను'' అన్నారు విరాన్.



● విశ్వక్ సేన్, విరాన్

యాత్ర ఆగదిక



● 'వెన్నెల' కిశోర్

'వెన్నెల' కిశోర్ హీరోగా నటించిన చిత్రం 'చారి 111'. టీజీ కీర్తి కుమార్ దర్శకత్వం వహించారు. సంయుక్తా విశ్వనాథన్ హీరోయిన్‌గా నటించిన ఈ మూవీలో మురళీ శర్మ ప్రధాన పాత్ర పోషించారు. అదితీ సోనీ నిర్మించిన ఈ సినిమా మార్చి 1న విడుదల కానుంది. సైమన్ కె. కింగ్ సంగీతం అందించిన ఈ చిత్రం నుంచి థీమ్ సాంగ్ విడుదల చేశారు మేకర్స్. 'చక చక మొదలిక... సాహసాల యాత్ర ఆగదిక... ఇది ఆపరేషన్ రుద్రనేత్ర' అంటూ ఈ పాట సాగుతుంది. ఈ పాటను రామజోగయ్య శాస్త్రి రాయగా, సంజీత భట్టాచార్య ఆలపించారు. ''చారి 111'లో ఈ ఒక్కటే పాట ఉంది. ఈ సాంగ్‌ని నేపథ్య సంగీతంలో ఉపయోగించాం'' అన్నారు దర్శక–నిర్మాతలు.

రీల్స్

పఠాన్ మళ్లీ రానున్నాడా?



● షారుక్ ఖాన్

షారుక్ ఖాన్ కెరీర్‌లో రూ. వెయ్యి కోట్లకు పైగా గ్రాస్ కలెక్షన్స్ సాధించిన చిత్రం 'పఠాన్' (2023). వైఆర్‌ఎఫ్ (యశ్‌రాజ్ ఫిలింస్) స్పై యూనివర్స్‌లో భాగంగా సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వంలో ఆదిత్యా చోప్రా 'పఠాన్' సినిమాను నిర్మించారు. షారుక్ ఖాన్ టైటిల్ రోల్ చేశారు. కాగా 'పఠాన్' సినిమాకు సీక్వెల్‌గా 'పఠాన్ 2' తెరకెక్కించే పనిలో ఉన్నారట దర్శకుడు సిద్ధార్థ్ ఆనంద్. ఆల్రెడీ 'పఠాన్ 2' స్క్రిప్ట్ వర్క్ మొదలైందని, స్టోరీ బేసిక్ ఐడియాకు షారుక్ ఖాన్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారని, వైఆర్‌ఎఫ్ స్పై యూనివర్స్‌లో భాగంగానే 'పఠాన్' ఉంటుందని బాలీవుడ్ భోగట్టా. ఈ చిత్రం షూటింగ్ ఈ ఏడాది డిసెంబరులో ప్రారంభం కానుందని టాక్.

ఆ సినిమాలతో పోలికే లేదు



● దీపక్ సరోజ్

''సిద్ధార్థ్ రాయ్'లో నా లుక్ చూసి 'అర్జున్ రెడ్డి', 'యానిమల్' సినిమాల్లా ఉంటుందేమో అనిపించవచ్చు.. కానీ, 'సిద్ధార్థ్ రాయ్' కథకీ, ఆ చిత్రకథలకీ ఏ విషయంలోనూ పోలిక లేదు'' అన్నారు దీపక్ సరోజ్. బాలనటుడు దీపక్ సరోజ్ హీరోగా పరిచయమవుతున్న చిత్రం 'సిద్ధార్థ్ రాయ్'. వి. యశస్వి దర్శకత్వం వహించిన ఈ సినిమాలో తన్వీ నేగి హీరోయిన్. జయ అడపాక, ప్రదీప్ పూడి, సుధాకర్ బోయిన నిర్మించిన ఈ సినిమా ఈ నెల 23న రిలీజవుతోంది. ఈ సందర్భంగా దీపక్ సరోజ్ మాట్లాడుతూ– ''బాల నటుడిగా 'మిణుగురులు'లో నా పాత్రకి నంది అవార్డు వచ్చింది. ఆ తర్వాత ఎంబీఏ పూర్తి చేసి, ఫ్యామిలీ బిజినెస్‌లోకి వచ్చాను. యశస్విగారు చెప్పిన 'సిద్ధార్థ్ రాయ్' కథ నచ్చడంతో ఈ సినిమా మొదలైంది. నా ప్రతిభను చూపించే అవకాశం ఈ మూవీ రూపంలో దొరికింది. నా పాత్రను ఒక సవాల్‌గా తీసుకుని చేశాను. ప్రస్తుతం రెండు కొత్త చిత్రాలు ఒప్పుకున్నాను'' అన్నారు.

కింగ్–జాకీ–క్వీన్



● శశి, యుక్తి

దీక్షిత్ శెట్టి, శశి ఓదెల, యుక్తీ తరేజా ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రానికి 'కింగ్–జాకీ–క్వీన్' టైటిల్‌ను ఖరారు చేసి, టైటిల్ టీజర్‌ను విడుదల చేశారు. 1990 నేపథ్యంలో సాగే ఈ పీరియాడికల్ క్రైమ్ డ్రామాకు కేకే దర్శకుడు. సుధాకర్ చెరుకూరి నిర్మించనున్నారు. ఈ చిత్రంలో కింగ్‌గా దీక్షిత్ శెట్టి, జాకీగా శశి, క్వీన్‌గా యుక్తీ తరేజా కనిపిస్తారు. ఇటీవల ఈ సినిమా ప్రారంభోత్సవం జరిగింది. ఈ వేడుకలో 'దసరా' ఫేమ్ దర్శకుడు శ్రీకాంత్ ఓదెల ముహూర్తపు సన్నివేశానికి క్లాప్ ఇచ్చారు. ఈ సినిమాకు సంగీతం: పూర్ణచంద్ర తేజస్వి, కెమెరా: నాగేశ్ బానెల్, ప్రొడక్షన్ డిజైన్: శ్రీకాంత్ రామిశెట్టి.

రొమాంటిక్ థ్రిల్లర్



● మేఘ శ్యామ్, రేఖా నిరోషా

మేఘ శ్యామ్, రేఖా నిరోషా జంటగా జీవన్ బండి దర్శకత్వంలో ఆదిత్య ముద్గల్ నిర్మించిన లవ్ అండ్ రొమాంటిక్ థ్రిల్లర్ 'వాస్తవం'. త్వరలో ఈ చిత్రం రిలీజ్ కానుంది. ఈ సినిమా టీజర్ లాంచ్ ఈవెంట్‌లో మేఘ శ్యామ్ మాట్లాడుతూ– ''కథ నుంచి ఆడియన్స్ డీవియేట్ కాకుండా చక్కగా తీశారు జీవన్'' అన్నారు. ''ఈ సినిమాలోని ప్రతి పాత్ర ఆడియన్స్‌కు గుర్తుంటుంది'' అన్నారు జీవన్. ''మా సినిమాను ప్రేక్షకులు ఆదరించాలని కోరుకుంటున్నాను'' అన్నారు ఆదిత్య.

సాక్షి బిజినెస్
బుధవారం
21-2-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
349	75
73,057	22,197

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	15,523	▼ 253
డోజోన్స్	38,500	▼ 128
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,719	▼ 9
డాక్స్	17,068	▼ 24
షాంఘై	2,923	▲ 12
నికాయ్	38,364	▼ 107

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	62,139	▲ 122
బంగారం (99.5 స్వచ్ఛత)	61,890	▲ 121
వెండి (కేజీ)	70,898	▼ 312

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒక్కటి	82.62	83.64
£	బ్రిటన్ పౌండ్	ఒక్కటి	103.35	105.91
€	యూరో	ఒక్కటి	88.31	90.73
¥	జపాన్ ఎన్ (100)	ఒక్కటి	54.68	55.94
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఒక్కటి	53.37	55.30
S$	సింగపూర్ డాలర్	ఛాయచిత్రం	59.39	64.06
SAR	సౌదీ రియాల్	ఛాయచిత్రం	21.21	22.79
UAE D	యూఏఈ దిర్హామ్	ఛాయచిత్రం	21.69	23.48
¥	చైనా యువాన్	ఛాయచిత్రం	10.41	12.48

వేల్యూ యాడెడ్ ఉత్పత్తులకు డిమాండ్

గోద్రెజ్ జెర్సీ సీఈవో భూపేంద్ర వెల్లడి

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: దేశీయంగా పనీర్, థిక్‌షేక్స్ వంటి వేల్యూ యాడెడ్ ఉత్పత్తుల (వీఏపీ) మార్కెట్ గణనీయంగా పెరుగుతోందని గోద్రెజ్ జెర్సీ సీఈవో భూపేంద్ర సూరి తెలిపారు. ఈ నేపథ్యంలో ఈ వేసవిలో తాము మరిన్ని ఉత్పత్తులను ప్రవేశపెడుతున్నామని చెప్పారు. ఇప్పటికే అత్యంత చౌకగా రూ. 10 నుంచి ప్రారంభమయ్యే మిల్క్ షాట్స్ లాంటి పలు ఉత్పత్తులను విక్రయిస్తున్నట్లు తెలిపారు. అందుబాటు ధరల్లో చిన్న ప్యాక్‌లను కూడా అందించే దిశగా సామర్థ్యాలను పెంచుకునేందుకు రూ. 20 కోట్లు ఇన్వెస్ట్ చేసినట్లు సూరి



చెప్పారు. ప్రస్తుతం తమకు 13 లక్షల లీటర్ల సామర్థ్యంతో మొత్తం 10 పాల ప్రాసెసింగ్ ప్లాంట్లు ఉండగా.. తెలుగు రాష్ట్రాల్లో ఆరు ఉన్నాయని పేర్కొన్నారు. నిత్యం ఏడు లక్షల లీటర్ల మేర పాల సేకరణ జరుపుతున్నామని, ఇందులో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ నుంచే ఏకంగా 2.30 లక్షల లీటర్లు సేకరిస్తున్నామని సూరి చెప్పారు. సుమారు రూ. 5 వేల కోట్లుగా ఉన్న హైదరాబాద్ మార్కెట్లో తమకు దాదాపు పది శాతం వాటా ఉందని వివరించారు. ఈ ఆర్థిక సంవత్సరం గరిష్ఠ సింగిల్ డిజిట్ స్థాయి ఆదాయ వృద్ధి సాధించగలమని పేర్కొన్నారు. గత ఆర్థిక సంవత్సరం కంపెనీ టర్నోవరు సుమారు రూ. 1,500 కోట్లుగా నమోదైంది.

అశోక్ లేలాండ్ కొత్త ప్లాంట్

ముంబై: వాణిజ్య వాహనాల తయారీలో ఉన్న అశోక్ లేలాండ్ కొత్త ప్లాంట్ ఏర్పాటు చేస్తోంది. ఉత్తర ప్రదేశ్‌లోని లక్నో వద్ద 70 ఎకరాల విస్తీర్ణంలో ఈ కేంద్రం రానుంది. ఇది కార్యరూపం దాల్చితే



సంస్థ ఖాతాలో మొత్తం ప్లాంట్ల సంఖ్య ఏడుకు చేరుకుంటుంది. ప్రతిపాదిత నూతన ఫెసిలిటీకి యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ మంగళవారం శంకుస్థాపన చేశారు. తొలి దశలో అశోక్ లేలాండ్ ఈ కేంద్రానికి రూ.200–500 కోట్లు వ్యయం చేయనుంది. ప్లాంటు కోసం కంపెనీ మొత్తం రూ.1,000 కోట్లు పెట్టుబడి చేసే అవకాశం ఉంది. లక్నో ప్లాంటులో ఎలక్ట్రిక్ బస్‌లను తయారు చేస్తారు. ఏటా 2,500 వాహనాలు తయారు చేయగలిగే సామర్థ్యంతో నిర్మించనున్నారు.

మూడేళ్లలో 17 బిలియన్ డాలర్లకు!

- దేశీ ఏఐ మార్కెట్‌పై అంచనా
- నాస్కామ్–బీసీజీ నివేదిక

ముంబై: దేశీయంగా కృత్రిమ మేధ (ఏఐ) మార్కెట్ ఏటా 25–35% వృద్ధి చెందుతోంది. కంపెనీలు టెక్నాలజీపై మరింతగా ఖర్చు చేస్తుండటం, ఏఐ నిపుణులు.. ఏఐపై పెట్టుబడులు గణనీయంగా పెరుగుతున్న నేపథ్యంలో 2027 నాటికి ఇది 17 బిలియన్ డాలర్లకు చేరనుంది. టెక్నాలజీ, లీడర్‌షిప్ ఫోరం 2024 సందర్భంగా సంయుక్త నివేదికలో టెక్ సంస్థల సమాఖ్య నాస్కామ్, బీసీజీ ఈ మేరకు అంచనా వేశాయి. అంతర్జాతీయంగా ఏఐపై పెట్టుబడులు 2019 నుంచి ఏటా 24% వృద్ధి చెందాయి. 2023లో 83 బిలియన్ డాలర్ల పెట్టుబడులు వచ్చాయి. ఎక్కువగా డేటా అనలిటిక్స్, జెన్‌ఏఐ, ఎంఎల్ అల్గోరిథమ్స్ ప్లాట్‌ఫామ్స్‌లో ఇన్వెస్ట్ చేస్తున్నట్లు నివేదిక తెలిపింది.

వినూత్న సొల్యూషన్స్ ..

టెక్నాలజీ సర్వీస్ ప్రొవైడర్లు సాంప్రదాయ ఐటీ సర్వీసుల పరిధిని దాటి ఏఐ ఆధారిత వినూత్న సేవలు, సొల్యూషన్స్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు నివేదిక పేర్కొంది.



ఆటోమేషన్ టూల్స్, డేటా అనలిటిక్స్ సొల్యూషన్స్‌తో పాటు హెల్త్‌కేర్, బ్యాంకింగ్.. ఫైనాన్స్, రిటైల్ వంటి నిర్దిష్ట రంగాల అవసరాలకు అనుగుణమైన ప్రొప్రైటరీ ఏఐ.. జనరేటివ్‌ఏఐ ప్లాట్‌ఫామ్స్ కూడా వీటిలో ఉన్నట్లు వివరించింది.

- ఇతర దేశాలతో పోలిస్తే దేశీయంగా ఏఐ నైపుణ్యాలున్న ప్రతిభావంతులు మూడు రెట్లు అధికంగా ఉన్నారు. గత ఏడేళ్లుగా చూస్తే ఏఐ నిపుణుల సంఖ్య 14 రెట్లు పెరిగింది. ఏఐ నిపుణుల విషయంలో టాప్ అయిదు దేశాల్లో భారత్ కూడా ఒకటిగా ఉంది.
- ఏఐలో పెట్టుబడులు పెరిగే కొద్దీ భారత్‌లో కృత్రిమ మేధ నిపుణుల సంఖ్య 2027 నాటికి వార్షికంగా 15 శాతం మేర వృద్ధి చెందనుంది.

వినోదం కోసం.. ఫైబర్‌కు సై!

- డీటీహెచ్‌కు తగ్గుతున్న ఆదరణ
- ఫైబర్ కనెక్షన్ల వైపు మొగ్గు
- హైస్పీడ్ నెట్, ఓటీటీ యాప్స్ ఆకర్షణ



న్యూఢిల్లీ: దేశీయంగా టీవీ వీక్షకులు వినోదం కోసం క్రమంగా డీటీహెచ్ (డైరెక్ట్ టు హోమ్) సర్వీసుల నుంచి ఫైబర్ కనెక్షన్ల వైపు మళ్లుతున్నారు. బ్రాడ్‌బ్యాండ్ ఇంటర్నెట్ స్పీడ్ వేగవంతంగా ఉండటం, అనేకానేక ఓటీటీ యాప్‌లు అందుబాటులోకి రావడం, నెట్‌వర్క్ స్థిరంగా ఉండటం వంటి అంశాలు ఇందుకు దోహదపడుతున్నాయి. దీంతో లక్షల మంది కస్టమర్లు డీటీహెచ్‌ను వదిలేసి ఫైబర్ కనెక్షన్లు తీసుకుంటున్నారు. టెలికం రంగ నియంత్రణ సంస్థ ట్రాయ్ ఇటీవల విడుదల చేసిన గణాంకాల ప్రకారం గత త్రైమాసికంలో డీటీహెచ్ కస్టమర్ల సంఖ్య ఏకంగా 13.20 లక్షలు తగ్గడం ఇందుకు నిదర్శనం. ఫైబర్ కనెక్షన్లకు ఆదరణ పెరుగుతుండటమనేది వినోదం విషయంలో ప్రజల అలవాట్లు మారుతుండటాన్ని సూచిస్తోందని విశ్లేషకులు పేర్కొంటున్నారు. వాతావరణంలో మార్పులు, సాంకేతిక లోపాల కారణంగా పదే పదే అంతరాయాలు వస్తుంటాయని డీటీహెచ్ సర్వీసులపై విమర్శలు ఉన్నాయి. అదే ఫైబర్ కనెక్షన్లయితే పటిష్ఠమైన, విశ్వసనీయమైన ప్రత్యామ్నాయంగా ఉంటాయని ధీమా ఉంటోంది. గ్యారంటీగా నిరంతరాయ సర్వీసుతో పాటు పనితీరు కూడా అత్యుత్తమంగా ఉండటంతో ఇవి మరింత ఆకర్షణీయంగా మారుతున్నాయి.

యువత దన్ను..

జియో సినిమా, జియోటీవీ వంటి ఓవర్ ది టాప్ (ఓటీటీ) యాప్‌లు, ప్లాట్‌ఫామ్‌లు ప్రజల ధోరణులు మారడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. ఫైబర్ కనెక్షన్ల ద్వారా అందుబాటులో ఉండే ఈ ప్లాట్‌ఫామ్‌లు.. భారతీయ వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా లైవ్ స్పోర్ట్స్, లేటెస్ట్ సినిమాలు, వెబ్ సిరీస్‌లు, టీవీ షోలు లాంటి బోలెడంత కంటెంట్‌ను హై డెఫినిషన్ నాణ్యతతో అందిస్తున్నాయి. ఇంటర్నెట్ ద్వారా నిరంతరాయంగా వినోద సర్వీసులు అందుబాటులో ఉండటమనేది ఆకర్షణీయంగా ఉండటంతో యువత ఎక్కువగా ఫైబర్ కనెక్షన్ల వైపు మొగ్గు చూపుతోంది. గణాంకాల ప్రకారం ఇప్పటికే 2.23 కోట్ల మంది యూజర్లు ఫైబర్‌వైపు మారారు. సాంప్రదాయ డీటీహెచ్ సేవలతో పోలిస్తే ఇంటర్నెట్ ఆధారిత ఎంటర్‌టైన్‌మెంట్ ప్లాట్‌ఫామ్‌లకు పెరుగుతున్న ప్రాధాన్యతకు ఇది నిదర్శనమని విశ్లేషకులు తెలిపారు. అదే సమయంలో డీటీహెచ్ సర్వీసులకు డిమాండ్ తగ్గుతుండటాన్ని కూడా సూచిస్తోందని పేర్కొన్నారు.

ర్యాలీతో రికార్డుల మోత

- ఆరో రోజూ మార్కెట్ల దూకుడు
- 75 పాయింట్లు ప్లస్.. 22,197కు నిఫ్టీ
- 349 పాయింట్లు అప్.. సెన్సెక్స్: 73,057

ముంబై: ప్రధానంగా బ్యాంకింగ్, ఎఫ్‌ఎంసీజీ దిగ్గజాలలో కొనుగోళ్లు మార్కెట్లకు జోష్‌నిచ్చాయి. దీంతో మరోసారి మార్కెట్లు లాభపడ్డాయి. నిఫ్టీ 75 పాయింట్లు ఎగసి 22,197 వద్ద ముగిసింది. దీంతోపాటు ఇంట్రాడేలో 22,216కు చేరడం ద్వారా మళ్లీ సరికొత్త రికార్డులను నెలకొల్పింది. మరోపక్క సెన్సెక్స్ 349 పాయింట్లు జంప్‌చేసి 73,057 వద్ద నిలిచింది. తద్వారా 73,000 పాయింట్ల మైలురాయిని మరోసారి అధిగమించడంతోపాటు.. చరిత్రాత్మక గరిష్ఠం 73,328ను అధిగమించే బాటలో సాగుతోంది. సోమవారం సైతం నిఫ్టీ 22,122 వద్ద రికార్డ్ సృష్టించిన విషయం విదితమే. అయితే మార్కెట్లు తొలుత వెనకడుగుతో ప్రారంభమయ్యాయి. నిఫ్టీ 22,046 దిగువన, సెన్సెక్స్ 72,510 వద్ద ఇంట్రాడే కనిష్ఠాలను తాకాయి. తిరిగి మిడ్ సెషన్ నుంచీ జోరందుకున్నాయి. దీంతో ఆరు రోజుల్లో నిఫ్టీ 580 పాయింట్లు, సెన్సెక్స్ 1,984 పాయింట్లు జమ చేసుకున్నాయి.



ప్రయివేట్ స్పీడ్

ఎన్ఎస్ఈలో ప్రధానంగా ప్రయివేట్ బ్యాంక్స్(1%) జోరు చూపాయి. నిఫ్టీ దిగ్గజాలలో పవర్‌గ్రిడ్, హెచ్‌డీఎఫ్‌సీ, యాక్సిస్, ఎన్‌టీపీసీ, కొటక్, ఎస్‌బీఐ లైఫ్, బీపీసీఎల్, ఇండస్‌ఇండ్, అపోలో హాస్పిటల్, గ్రాసిమ్, నెస్లే, హెచ్‌యూఎల్ 4.4-1 శాతం మధ్య ఎగశాయి. అయితే హీరోమోటో, బజాజ్ ఆటో, ఐషర్, కోల్ ఇండియా, టీసీఎస్, సిప్లా, బజాజ్ ఫిన్, ఇన్ఫోసిస్, విప్రో, హెచ్‌సీఎల్ టెక్ 4-1% మధ్య క్షీణించాయి.

చిన్న షేర్లు వీక్

అధిక విలువల కారణంగా ఇన్వెస్టర్లు చిన్న షేర్లలో అమ్మకాలు చేపట్టారు. బీఎస్ఈలో మిడ్, స్మాల్ క్యాప్స్ 0.2 శాతం డీలా పడ్డాయి. ట్రేడైన షేర్లలో 1,967 నీరసించగా.. 1,876 బలపడ్డాయి. ఇక నగదు విభాగంలో ఎఫ్‌పీఐలు రూ. 1,336 కోట్ల విలువైన స్టాక్స్ విక్రయించగా.. దేశీ ఫండ్స్ రూ. 1,491 కోట్లు ఇన్వెస్ట్ చేశాయి.

స్టాక్ హైలైట్స్..

- ఇష్యూ ధర రూ. 151తో పోలిస్తే విభోర్ స్టీల్ ట్యూబ్స్ 179% లాభంతో రూ. 421 వద్ద లిస్టయ్యింది. 193% (రూ.291) బలపడి రూ. 442 వద్ద స్థిరపడింది. కంపెనీ మార్కెట్ విలువ రూ. 838 కోట్లను దాటింది. ఎన్ఎస్ఈ, బీఎస్ఈలలో 23.3 లక్షలకుపైగా షేర్లు ట్రేడయ్యాయి. ఈ ఐపీవో భారీ స్థాయిలో 300 రెట్లు సబ్‌స్క్రయిబ్ అయ్యింది.
- ట్రాన్స్‌మిషన్ ప్రాజెక్టుల్లో రూ. 656 కోట్లు ఇన్వెస్ట్ చేయనున్నట్లు వెల్లడించడంతో పవర్‌గ్రిడ్ షేరు 4.2% ఎగసి రూ. 288 వద్ద క్లోజైంది.

వర్ల్‌పూల్ వాటా విక్రయం.. రూ. 4,090 కోట్ల సమీకరణ

రుణ భారాన్ని తగ్గించుకునేందుకు ప్రమోటర్ సంస్థ వర్ల్‌పూల్ మారిషస్ బ్లాక్‌డీల్స్ ద్వారా దేశీ అనుబంధ కంపెనీ వర్ల్‌పూల్ ఇండియాలో 24 శాతం వాటాను విక్రయించింది. యూఎస్ హోమ్ అప్లయెన్సెస్ దిగ్గజం వర్ల్‌పూల్ కార్పొరేషన్ మారిషస్ సంస్థ ద్వారా 75 శాతం వాటాను కలిగి ఉంది. కాగా.. బ్లాక్‌డీల్స్ ద్వారా రూ. 4,090 కోట్ల విలువైన 3.13 కోట్ల షేర్లు విక్రయించినట్లు బీఎస్ఈకి వర్ల్‌పూల్ ఇండియా వెల్లడించింది. రుణ చెల్లింపుల కోసం వర్ల్‌పూల్ ఇండియాలో 24 శాతం వాటాను విక్రయించనున్నట్లు గతేడాది వర్ల్‌పూల్ కార్ప్ వెల్లడించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో వర్ల్‌పూల్ ఇండియా షేరు 3.25 శాతం క్షీణించి రూ. 1,288 వద్ద ముగిసింది.

9 ప్రాజెక్టులకు జపాన్ తోడ్పాటు

రూ. 12,800 కోట్ల రుణ సాయం

న్యూఢిల్లీ: భారత్‌లో పలు రంగాలకు సంబంధించి తొమ్మిది ప్రాజెక్టులకు జపాన్ ప్రభుత్వం సాయం అందించనుంది. 232.20 బిలియన్ యెన్‌లను (రూ.12,800 కోట్లు సుమారు) రుణంగా అందించనున్నట్లు కేంద్ర ఆర్థిక శాఖ ప్రకటించింది. తెలంగాణలో స్టార్టప్‌లు, ఆవిష్కరణల ప్రోత్సాహానికి సంబంధించిన ప్రాజెక్ట్, నార్త్ ఈస్ట్ రోడ్ నెట్‌వర్క్ కనెక్టివిటీ, చెన్నై పెరిఫెరల్ రింగ్ రోడ్ ప్రాజెక్ట్, హరియాణాలో సస్టెయినబుల్ హార్టికల్చర్ ప్రాజెక్ట్, రాజస్తాన్‌లో క్లైమేట్ చేంజ్ రెస్పాన్స్ అండ్ ఎకోసిస్టమ్ సర్వీసెస్ ప్రాజెక్టులు జపాన్ ప్రభుత్వ దన్నుతో పట్టాలెక్కనున్నాయి.



ఇందుకు సంబంధించిన ఒప్పందంపై ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి వికాస్ షీల్, భారత్‌లో జపాన్ రాయబారి సుజుకి హిరోషి సంతకాలు చేశారు. తెలంగాణలో ఏర్పాటయ్యే స్టార్టప్, ఇన్నోవేషన్ ప్రాజెక్ట్ వినూత్నమైందని, మహిళలు, గ్రామీణుల్లోని పారిశ్రామిక నైపుణ్యాలను గుర్తించి ప్రోత్సహించేందుకు, ఎంఎస్ఎంఈల వ్యాపార విస్తరణకు ఉద్దేశించిందని కేంద్ర ఆర్థిక శాఖ ప్రకటించింది. చెన్నై పెరిఫెరల్ రింగ్ రోడ్ అన్నది వాహన రద్దీని తగ్గించి, రాష్ట్రంలోని దక్షిణాది ప్రాంతాన్ని చెన్నైతో అనుసంధానిస్తుందని వివరించింది.

జాబ్ పాయింట్

యూపీఎస్సీ-ఇండియన్ ఫారెస్ట్ సర్వీసెస్ ఎగ్జామినేషన్-2024

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ).. ఇండియన్ ఫారెస్ట్ సర్వీసెస్ ఎగ్జామినేషన్-2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 150
- » **అర్హత:** బ్యాచిలర్ డిగ్రీ(యానిమల్ హస్బెండరీ అండ్ వెటర్నరీ సైన్స్, బోటనీ, కెమిస్ట్రీ, జియాలజీ, మ్యాథమేటిక్స్, ఫిజిక్స్, స్టాటిస్టిక్స్, జువాలజీ) లేదా బ్యాచిలర్ డిగ్రీ(అగ్రికల్చర్, ఫారెస్ట్రీ లేదా ఇంజనీరింగ్) లేదా తత్సమాన అర్హత కలిగి ఉండాలి.
- » **వయసు:** 01.08.2024 నాటికి 21 నుంచి 32 ఏళ్ల మధ్య ఉండాలి.
- » **ఎంపిక విధానం:** ప్రిలిమినరీ పరీక్ష, మెయిన్ ఎగ్జామినేషన్, పర్సనాలిటీ టెస్ట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో ప్రాథమిక పరీక్ష కేంద్రాలు:** అనంతపురం, హైదరాబాద్, వరంగల్, విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 05.03.2024
- » **దరఖాస్తు సవరణ తేదీలు:** 06.03.2024 నుంచి 12.03.2024 వరకు
- » **ప్రాథమిక పరీక్ష తేది:** 26.05.2024.
- » **వెబ్‌సైట్:** www.upsc.gov.in

ఎస్‌బీఐలో 80 స్పెషలిస్ట్ ఆఫీసర్ పోస్టులు

ముంబైలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ) రెగ్యులర్ ప్రాతిపదికన స్పెషలిస్ట్ కేడర్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 80
- » **పోస్టుల వివరాలు:** అసిస్టెంట్ మేనేజర్(సెక్యూరిటీ అనలిస్ట్)-23, డిప్యూటీ మేనేజర్(సెక్యూరిటీ అనలిస్ట్)-51, మేనేజర్(సెక్యూరిటీ అనలిస్ట్)-03, అసిస్టెంట్ జనరల్ మేనేజర్(అప్లికేషన్ సెక్యూరిటీ)-03.
- » **విభాగాలు:** కంప్యూటర్ సైన్స్, కంప్యూటర్ అప్లికేషన్స్/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్/ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్స్/ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్.
- » **అర్హత:** సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్, ఎంఈ/ఎంటెక్, ఎంసీఏ, ఎంఎస్సీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- » **వేతనం:** అసిస్టెంట్ మేనేజర్ పోస్టుకు రూ.36,000 నుంచి రూ.63,840, డిప్యూటీ మేనేజర్‌కు రూ.48,170 నుంచి రూ.69,810, మేనేజర్‌కు రూ.63,840 నుంచి రూ.78,230, అసిస్టెంట్ జనరల్ మేనేజర్‌కు రూ.89,890 నుంచి రూ.1,00,350.
- » **వయసు:** అసిస్టెంట్ మేనేజర్ పోస్టుకు 30 ఏళ్లు, డిప్యూటీ మేనేజర్‌కు 35 ఏళ్లు, మేనేజర్‌కు 38 ఏళ్లు, అసిస్టెంట్ జనరల్ మేనేజర్‌కు 42 ఏళ్లు మించకూడదు.
- » **ఎంపిక విధానం:** దరఖాస్తు షార్ట్‌లిస్టింగ్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 04.03.2024
- » **పని ప్రదేశం:** ముంబై, నవీ ముంబై.
- » **వెబ్‌సైట్:** www.sbi.co.in

భారత తీరరక్షక దళంలో 70 అసిస్టెంట్ కమాండెంట్ పోస్టులు

ఇండియన్ కోస్ట్‌గార్డ్ వివిధ విభాగాలకు సంబంధించి అసిస్టెంట్ కమాండెంట్ 2025 బ్యాచ్‌లో ప్రవేశాలకు పురుష, మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 70
- » **పోస్టులు:** జనరల్ డ్యూటీ(జీడీ)-50, టెక్నికల్-20
- » **విభాగాలు:** మెకానికల్, ఎలక్ట్రికల్/ఎలక్ట్రానిక్స్.
- » **అర్హత:** విభాగాన్ని అనుసరించి పన్నెండో తరగతి, సంబంధిత విభాగంలో డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు నిర్దిష్ట శారీరక ప్రమాణాలు కలిగి ఉండాలి.
- » **ప్రారంభ వేతనం:** నెలకు రూ.56,100.
- » **ఎంపిక విధానం:** స్టేజ్-1, స్టేజ్-2, స్టేజ్-3, స్టేజ్-4, స్టేజ్-5 పరీక్షలు, ధ్రువపత్రాల పరిశీలన ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- » **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 19.02.2024
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 06.03.2024
- » **వెబ్‌సైట్:** https://joinindiancoast-guard.cdac.in

ఏపీపీఎస్సీలో లైబ్రేరియన్ పోస్టులు

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఏపీపీఎస్సీ).. ఏపీ మెడికల్ అండ్ హెల్త్‌సబార్డినేట్ సర్వీస్‌లో లైబ్రేరియన్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 04
- » **అర్హత:** మొదటి లేదా ద్వితీయ శ్రేణిలో ఎంఏ/ఎంఎస్సీ/ఎంకాం, ఎంఎల్‌ఐఎస్సీ ఉత్తీర్ణులవ్వాలి. డిగ్రీ(బయాలజీ), కంప్యూటరైజ్డ్ డేటాబేస్ పరిజ్ఞానం, కమ్యూనికేషన్ నైపుణ్యాలు ఉండాలి. **వయసు:** 01.07.2024 నాటికి 18 నుంచి 42 ఏళ్ల మధ్య ఉండాలి.
- » **పే స్కేల్:** నెలకు రూ.48,440 నుంచి 1,37,220
- » **ఎంపిక విధానం:** కంప్యూటర్ బేస్డ్ రిక్రూట్‌మెంట్ టెస్ట్, కంప్యూటర్ ప్రొఫిషియన్సీ టెస్ట్, ధ్రువపత్రాల పరిశీలన ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- » **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 27.03.2024
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 16.04.2024
- » **వెబ్‌సైట్:** https://psc.ap.gov.in

స్పెషలిస్ట్ ఆఫీసర్ కొలువుల పిలుపు

- » 606 పోస్టుల భర్తీకి యూనియన్ బ్యాంక్ నోటిఫికేషన్
- » ప్రొఫెషనల్ డిగ్రీలతో పోటీ పడే అవకాశం
- » రాత పరీక్ష, జీడీ, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక
- » వేతనం నెలకు రూ.40 వేల నుంచి రూ.80 వేలు

బీటెక్, ఎంటెక్, ఎంబీఏ వంటి ప్రొఫెషనల్ కోర్సుల ఉత్తీర్ణులకు ప్రభుత్వ రంగ బ్యాంకు.. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్వాగతం పలుకుతోంది! మొత్తం 606 స్పెషలిస్ట్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆన్‌లైన్ పరీక్ష, గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూల ద్వారా ఎంపిక ప్రక్రియ నిర్వహించనుంది. ఈ నేపథ్యంలో.. యూబీఐ స్పెషలిస్ట్ ఆఫీసర్ పోస్టుల వివరాలు, అర్హతలు, ఎంపిక విధానం, విజయానికి ప్రిపరేషన్ తదితర వివరాలు..

ఇంజనీరింగ్, ఎంబీఏ, సీఏ.. ఇలా ప్రొఫెషనల్ కోర్సులు పూర్తి చేసుకున్న వారు ప్రభుత్వ కొలువుల వైపు దృష్టి పెడుతున్నారు. వారు ప్రభుత్వ రంగంలో తమ అర్హతలకు సరితూగే పోస్టుల కోసం అన్వేషణ సాగిస్తున్నారు. ఇలాంటి అభ్యర్థులకు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తాజా నోటిఫికేషన్ చక్కటి అవకాశమని చెప్పొచ్చు. యూబీఐ.. స్పెషలిస్ట్ ఆఫీసర్ పోస్టులకు సంబంధించి సొంతగా నియామక విధానాన్ని చేపడుతోంది.

మొత్తం 606 పోస్టులు

యూబీఐ.. మొత్తం 606 స్పెషలిస్ట్ ఆఫీసర్ పోస్టులను భర్తీ చేయనుంది. ఆయా పోస్టులను బట్టి.. వీటిని జేఎంజీఎస్-1, ఎంఎంజీఎస్-2,3; ఎస్ఎంజీఎస్-4 గ్రేడ్‌లుగా వర్గీకరించారు.

అర్హతలు వేర్వేరుగా

ఆయా పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఎస్సీ, ఎంఎస్సీ, బీఈ/బీటెక్, ఎంఈ/ఎంటెక్, ఎంబీఏ, పీజీడీఎం, ఎంసీఏ, సీఏ, ఐసీడబ్ల్యూఏ, సీఏ, సీఎంఏ, సీఎఫ్ఏ తదితర అర్హతలతో పాటు అనుభవం ఉండాలి.

వయసు

ఫిబ్రవరి 1, 2024నాటికి చీఫ్ మేనేజర్ పోస్టులకు 30–45 ఏళ్లు; ఐటీ సీనియర్ మేనేజర్ పోస్టులకు 28–38 ఏళ్లు; సీనియర్ మేనేజర్ (సీఏ, రిస్క్), మేనేజర్ పోస్టులకు 25–35 ఏళ్లు; మేనేజర్ (రిస్క్) పోస్టులకు 25–32 ఏళ్లు; మేనేజర్ (లా) పోస్టులకు 26–32 ఏళ్లు; అసిస్టెంట్ మేనేజర్ పోస్టులకు 20–30 ఏళ్ల వయసు ఉండాలి.

మూడంచెల ఎంపిక విధానం

స్పెషలిస్ట్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి మూడంచెల ఎంపిక విధానాన్ని అనుసరిస్తారు. తొలుత రాత పరీక్ష నిర్వహిస్తారు. ఆ తర్వాత గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూలు ఉంటాయి. ఈ మూడింటిలో చూపిన ప్రతిభ ఆధారంగా నియామకాలు ఖరారు చేస్తారు.

రాత పరీక్ష.. వేర్వేరుగా

- తొలి దశ రాత పరీక్షను ఆయా పోస్టులకు సంబంధించి వేర్వేరు విధానాల్లో నిర్వహిస్తారు.
- చీఫ్ మేనేజర్, సీనియర్ మేనేజర్, మేనేజర్ పోస్టులకు సంబంధించిన రాత పరీక్షను సంబంధిత సబ్జెక్ట్‌లో 100 ప్రశ్నలతో నిర్వహిస్తారు. ఒక్కో ప్రశ్నకు రెండు మార్కులు చొప్పున మొత్తం 200 మార్కులకు ఈ పరీక్ష ఉంటుంది. పరీక్షకు కేటాయించిన సమయం రెండు గంటలు.
- అసిస్టెంట్ మేనేజర్ పోస్టులకు రాత పరీక్షను నాలుగు విభాగాల్లో మొత్తం 150 ప్రశ్నలు–200 మార్కులకు నిర్వహిస్తారు. ఇందులో క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ 25 ప్రశ్నలు–25 మార్కులు; రీజనింగ్ 50 ప్రశ్నలు–50 మార్కులు; సంబంధిత సబ్జెక్ట్ ప్రొఫెషనల్ నాలెడ్జ్ 50 ప్రశ్నలు–100 మార్కులు; ఇంగ్లిష్ లాంగ్వేజ్ 25 ప్రశ్నలు–25 మార్కులకు పరీక్ష ఉంటుంది. పరీక్ష వ్యవధి రెండు గంటలు. నెగిటివ్ మార్కుల నిబంధన ఉంది. ప్రతి తప్పు సమాధానానికి 1/4వ వంతు మార్కును తగ్గిస్తారు.



అన్ని పోస్టులకు రాత పరీక్ష ఆబ్జెక్టివ్ విధానంలో ఆన్‌లైన్ టెస్ట్‌గా నిర్వహిస్తారు.

గ్రూప్ డిస్కషన్

అభ్యర్థులు రాత పరీక్షలో చూపిన ప్రతిభ ఆధారంగా.. నిర్దేశిత కటాఫ్‌లను పరిగణనలోకి తీసుకొని గ్రూప్ డిస్కషన్‌కు ఎంపిక చేస్తారు. గ్రూప్ డిస్కషన్‌లో నిర్దేశిత టాపిక్‌ను పేర్కొని దానిపై చర్చించమని అడుగుతారు. 50 మార్కులకు నిర్వహించే జీడీలో జనరల్ కేటగిరీ అభ్యర్థులు కనీసం 25 మార్కులు, రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులు కనీసం 22.5 మార్కులు పొందాలి.

చివరగా పర్సనల్ ఇంటర్వ్యూ

రాత పరీక్ష, గ్రూప్ డిస్కషన్‌లో చూపిన ప్రతిభ ఆధారంగా.. రిజర్వేషన్ వర్గాల వారీగా నిర్దిష్ట కటాఫ్‌లను పరిగణించి.. ఒక్కో పోస్ట్‌కు ముగ్గురిని చొప్పున పర్సనల్ ఇంటర్వ్యూకు ఎంపిక చేస్తారు. ఇంటర్వ్యూకు 50 మార్కులు కేటాయించారు. ఇందులో అకడమిక్ నాలెడ్జ్, పని అనుభవం, భావవ్యక్తీకరణ, ఆలోచన సామర్థ్యం, నాయకత్వ లక్షణాలు, కమ్యూనికేషన్ స్కిల్స్ వంటి అంశాలపై ప్రశ్నలు అడుగుతారు.

తుది జాబితా ఇలా

తుది జాబితా రూపకల్పనలో ఆన్‌లైన్ రాత పరీక్ష, పర్సనల్ ఇంటర్వ్యూ మార్కులను పరిగణనలోకి తీసుకుంటారు. ఒకవేళ రాత పరీక్ష నిర్వహించకుంటే.. ఇంటర్వ్యూలో పొందిన మార్కుల ఆధారంగా నియామకాలు ఖరారు చేస్తారు. జీడీ, పర్సనల్ ఇంటర్వ్యూలను మాత్రమే నిర్వహిస్తే.. ఈ రెండింటిలో పొందిన మార్కులను పరిగణనలోకి తీసుకుని తుది ఎంపిక చేస్తారు.

ఆకర్షణీయ వేతనం

తుది జాబితాలో చోటు సాధించి.. నియామకాలు ఖరారు చేసుకున్న వారికి ఆకర్షణీయమైన వేతనాలు లభిస్తాయి. చీఫ్ మేనేజర్ పోస్టులకు ఎస్ఎంజీఎస్-4 హోదాలో రూ.76,010–రూ.89,890; సీనియర్ మేనేజర్ పోస్టులకు ఎంఎంజీఎస్-3 హోదాలో రూ. 63,840–రూ.78,230; మేనేజర్ పోస్టులకు ఎంఎంజీఎస్-2 హోదాలో రూ. 48,170–రూ.69,810; అసిస్టెంట్ మేనేజర్ పోస్టులకు జేఎంజీఎస్-1 హోదాలో రూ. 36,000–రూ. 63,840 శ్రేణిలో ప్రారంభ వేతనం ఉంటుంది.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** 2024, ఫిబ్రవరి 23
- **రాత పరీక్ష తేదీ:** మార్చి/ఏప్రిల్‌లో నిర్వహించే అవకాశం
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://www.unionbankofindia.co.in/english/recruitment.aspx

రాత పరీక్షలో రాణించేలా

క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్

ఈ విభాగానికి సంబంధించి అర్థమెటిక్‌పై పట్టు సాధించాలి. స్క్వేర్ రూట్స్, క్యూబ్ రూట్స్, పర్సంటేజెస్, టైం అండ్ డిస్టెన్స్, టైం అండ్ వర్క్, ప్రాఫిట్ అండ్ లాస్, రేషియోస్ సంబంధిత ప్రశ్నలను బాగా ప్రాక్టీస్ చేయాలి. వీటితోపాటు నంబర్ సిరీస్, డేటా అనాలిసిస్ విభాగాలను కూడా బాగా ప్రాక్టీస్ చేస్తే.. ప్రిలిమ్స్, మెయిన్స్ రెండింటిలోనూ మంచి మార్కులు పొందే అవకాశం ఉంటుంది.

రీజనింగ్

ప్రిలిమ్స్, మెయిన్స్ రెండింటిలో కీలకమైన రీజనింగ్ కోసం అభ్యర్థులు పటిష్ఠ ప్రిపరేషన్ సాగించాలి. సిరీస్, అనాలజీ, కోడింగ్-డీ కోడింగ్, డైరెక్షన్స్, బ్లడ్ రిలేషన్స్, ర్యాంకింగ్స్, సీటింగ్ అరేంజ్‌మెంట్స్, సిలాజిజమ్స్‌పై పట్టు సాధించాలి.

ఇంగ్లిష్ లాంగ్వేజ్

ఈ విభాగంలో రాణించాలంటే.. బేసిక్ గ్రామర్‌తో మొదలుపెట్టి వొకాబ్యులరీ పెంచుకోవడం వరకు కృషి చేయాలి. రీడింగ్ కాంప్రహెన్షన్, కరెక్షన్ ఆఫ్ సెంటెన్సెస్, జంబుల్డ్ సెంటెన్సెస్, ప్రిపోజిషన్స్, ఆర్టికల్స్ వంటి వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలి.

ప్రొఫెషనల్ నాలెడ్జ్

ప్రొఫెషనల్ నాలెడ్జ్ విభాగంలో స్కోర్ కోసం అభ్యర్థులు తాము దరఖాస్తు చేసుకున్న స్పెషలైజేషన్, దానికి సంబంధించి బ్యాచిలర్, పీజీ స్థాయి పుస్తకాలను అధ్యయనం చేయాలి. ముఖ్యమైన కాన్సెప్ట్‌లను అప్లికేషన్ అప్రోచ్‌తో అధ్యయనం చేయాలి. అంతేకాకుండా ఆయా విభాగాలకు సంబంధించి గత ప్రశ్న పత్రాలు, ఇతర పోటీ పరీక్షల ప్రశ్న పత్రాలను సాధన చేయడం కూడా ఉపయుక్తంగా ఉంటుంది.

క్లుప్తంగా...

'నెడ్‌క్యాప్' చైర్మన్‌గా వేల్పుల రవికుమార్

ఉత్తర్వులు జారీ చేసిన ఇంధన శాఖ



సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నూతన పునరుత్పాదక ఇంధన అభివృద్ధి సంస్థ (నెడ్‌క్యాప్) కార్పొరేషన్ చైర్మన్‌గా ఎన్టీఆర్ జిల్లాకు చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు వేల్పుల రవికుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయనంద్ ఉత్తర్వులు జారీ చేశారు. తనకు ఈ అవకాశం ఇచ్చిన సీఎం వైఎస్ జగన్‌కు రవికుమార్ కృతజ్ఞతలు తెలియజేశారు.

ఆర్టీసీ వైస్ చైర్మన్‌గా మిద్దెల హరి



సాక్షి, అమరావతి/రేణిగుంట/శ్రీకాళహస్తి: ఏపీఎస్‌ఆర్టీసీ వైస్ చైర్మన్, డైరెక్టర్‌గా మిద్దెల హరిని ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు రవాణా, రోడ్లు భవనాల శాఖ కార్యదర్శి ప్రద్యుమ్న పీఎస్ మంగళవారం నోటిఫికేషన్ జారీ చేశారు. తదుపరి ఉత్తర్వులు ఇచ్చే వరకు మిద్దెల హరి ఈ పదవిలో కొనసాగుతారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. తిరుపతి జిల్లా శ్రీకాళహస్తికి చెందిన మిద్దెల హరి ఆప్కో డైరెక్టర్‌గా కొనసాగారు.

185 సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్టుల పోస్టులు

ఈ నెల 28, మార్చి 1వ తేదీల్లో వాకిన్ రిక్రూట్‌మెంట్

సాక్షి, అమరావతి: సెకండరీ హెల్త్ డైరెక్టరేట్ (పాత వైద్య విధాన పరిషత్)పరిధిలో 185 మంది సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్ట్ వైద్యుల నియామకానికి ఈ నెల 28, మార్చి 1వ తేదీల్లో వాకిన్ రిక్రూట్‌మెంట్ చేపడుతున్నట్లు ఏపీ మెడికల్ సర్వీసెస్ రిక్రూట్మెంట్ బోర్డు మెంబర్ సెక్రటరీ ఎం.శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. తొలుత ఈనెల 21, 23, 26 తేదీల్లో తలపెట్టిన వాకిన్ రిక్రూట్మెంట్‌ను అనివార్య కారణాలతో తేదీలను మార్పు చేశామన్నారు. రెగ్యులర్, కాంట్రాక్ట్, కొటేషన్ పద్ధతిలో పోస్టులను భర్తీ చేయనున్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు తాడేపల్లి మండలం పాతూరు రోడ్డులోని తమ కార్యాలయంలో వాకిన్ రిక్రూట్‌మెంట్‌కు అర్హులైన అభ్యర్థులు హాజరవ్వాలని సూచించారు. జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, డెర్మటాలజీ, ఆర్థో, రేడియాలజీ, ఫొరెన్సిక్ మెడిసిన్ విభాగాలకు ఈ నెల 28న, గైనకాలజీ, పిడియాట్రిక్స్, ఎనస్తీసియా, ఈఎన్‌టీ, ఆప్తమాలాజీ, పాథాలజీ విభాగాలకు మార్చి 1న వాకిన్ రిక్రూట్‌మెంట్ నిర్వహిస్తున్నామన్నారు. పూర్తి వివరాలను http://apmsrb.ap.gov. in/msrb/, https://hmfw.ap.gov.inలో పొందుపరిచినట్లు చెప్పారు.

బీసీఎల్ఎస్‌పై సీనియర్ ఫ్యాకల్టీలతో శిక్షణ

సాక్షి, అమరావతి: గుండెపోటు సమయంలో వ్యక్తి ప్రాణాలను కాపాడేందుకు అవసరమైన బేసిక్ కార్డియోపల్మోనరీ లైఫ్ సపోర్ట్ (బీసీఎల్ఎస్)పై శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు ఆంధ్రప్రదేశ్ నర్సులు, మిడ్‌వైవ్స్ కౌన్సిల్(ఏపీఎన్ఎంసీ) రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె.సుశీల తెలిపారు. దీన్లో భాగంగానే మంగళవారం ఇండియన్ రెససిటేషన్ కౌన్సిల్ ఫెడరేషన్ (ఐఆర్‌సీఎఫ్)తో ఏపీఎన్ఎంసీ అవగాహన ఒప్పందం చేసుకుందని తెలిపారు. ప్రభుత్వ నర్సింగ్ కాలేజీల నుంచి సీనియర్ ఫ్యాకల్టీలతో బీసీఎల్ఎస్ శిక్షణ ఇవ్వడం ద్వారా నర్సింగ్ విద్యార్థులకు మరింత సులభంగా, అర్థమయ్యేలా బోధించవచ్చన్నారు. తద్వారా ప్రభుత్వ, ప్రైవేటు నర్సింగ్ కళాశాలల్లోని విద్యార్థులకు గుండెపోటు కేసుల్లో సమర్థంగా పని చేసేందుకు అవసరమైన నైపుణ్యాలు అందుతాయని తెలిపారు. బీసీఎల్ఎస్ శిక్షణ నైపుణ్యాలను అందించడం ద్వారా ప్రాణాలను వరకు కాపాడవచ్చునని వివరించారు.డీఎంఈ నరసింహం, డాక్టర్ ఎస్‌సీ చక్రరావు, ఐఆర్‌సీఎఫ్ వ్యవస్థాపకుడు టి.సూర్యశ్రీ, అదనపు డీఎంఈ సూరిశెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు.

జలవిద్యుత్కేంద్రాలపై ఏపీ పిటిషన్ మీద విచారణ వాయిదా

కేఆర్ఎంబీ పరిధిలోకి తేవాలంటూ సుప్రీంలో ఏపీ సర్కార్ పిటిషన్

సాక్షి, న్యూఢిల్లీ: కృష్ణానదీ పరీవాహక ప్రాంతంలోని జల విద్యుత్కేంద్రాలను కూడా కృష్ణానదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) పరిధిలోకి తేవాలంటూ ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణ వాయిదా వేసింది. ఏపీ ప్రభుత్వ పిటిషన్ మంగళవారం జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. నిర్వహణపై పూర్తిస్థాయి వాదనలు వినిపించడానికి సమయం పడుతుందని తెలంగాణ తరఫు సీనియర్ న్యాయవాది వైద్యనాథన్ ధర్మాసనానికి తెలిపారు. తొలుత సీనియర్ న్యాయవాది జైదీప్ గుప్తా మరో కోర్టులో ఉన్నందున ఏపీ ప్రభుత్వం తరఫు న్యాయవాది పాస్‌ఓవర్ అడిగారు. అయితే ధర్మాసనానికి విచారణ వాయిదా వేసే ఉద్దేశం ఉంటే తాము వాదనలకు సిద్ధమని ఏపీ ప్రభుత్వం తరఫున మరో సీనియర్ న్యాయవాది ఉమాపతి తెలిపారు. ఇప్పటికిప్పుడు వాదనలు వినలేమని, పూర్తిస్థాయి వాదనలు ఏప్రిల్‌లో చేపడతామని ధర్మాసనం తెలిపింది. ఏప్రిల్ 30కి విచారణ వాయిదా వేసింది.

ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం

నేటి నుంచి హాల్‌టికెట్ల జారీ



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో మార్చి 1 నుంచి 20 వరకు నిర్వహించనున్న ఇంటర్ వార్షిక పరీక్షలకు ఇంటర్ బోర్డు విస్తృత ఏర్పాట్లు చేసింది. ఈ పరీక్షల హాల్‌టికెట్లను బుధవారం నుంచి జారీ చేయనుంది. పరీక్షల కోసం రాష్ట్రవ్యాప్తంగా 1,559 సెంటర్లను ఏర్పాటు చేసింది. ఇప్పటికే పరీక్షలు జరిగే గదుల్లో అధికారులు సీసీ కెమెరాలను అమర్చారు. పరీక్షకు హాజరైన ప్రతి విద్యార్థి హాజరును ఆన్‌లైన్ ద్వారా తీసుకోనున్నారు. పరీక్ష పేపర్లకు క్యూఆర్ కోడ్‌ను జోడించారు. పేపర్‌ను ఎక్కడ ఫొటో తీసినా, స్కాన్ చేసినా వెంటనే తెలిసిపోయేలా చర్యలు తీసుకున్నారు. పరీక్ష కేంద్రం ప్రాంగణంలోకి ఫోన్లను అనుమతించరు. పేపర్లను భద్రపరిచే పోలీస్ స్టేషన్‌లో కూడా ఈసారి ఇంటర్ బోర్డు అందించే ప్రత్యేకమైన బేసిక్ ఫోన్‌ను మాత్రమే వినియోగించనున్నారు. ఇది కేవలం బోర్డు నుంచి పరీక్షల విభాగం అధికారులు ఇచ్చే మెసేజ్‌లను చూసేందుకే ఉపయోగపడుతుంది. తిరిగి సమాచారం ఇచ్చేందుకు, ఫోన్ చేసేందుకు సాధ్యపడదు. పైగా ఈ ఫోన్ పరీక్ష రోజు ఉదయం 15 నిమిషాలు మాత్రమే పనిచేస్తుంది.

ఈసారి ప్రత్యేక ఏర్పాట్లు

ఈసారి ఇంటర్ బోర్డు పబ్లిక్ పరీక్షలకు పటిష్ట చర్యలు చేపట్టింది. ఈ ఏడాది ఫీజు చెల్లింపు నుంచి ప్రాక్టికల్స్ మార్కుల నమోదు వరకు అన్ని అంశాలను ఆన్‌లైన్‌లోకి మార్చింది. దీంతో విద్యార్థులు, కళాశాలల యాజమాన్యాలకు వేగవంతమైన సేవలు అందుబాటులోకి వచ్చాయి. ప్రాక్టికల్స్ పూర్తయిన వెంటనే మార్కులను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఇందుకోసం ఇంటర్ బోర్డు ప్రత్యేక వ్యవస్థను అందుబాటులోకి తెచ్చింది. ఎక్కడా పొరపాట్లు జరగకుండా ఎగ్జామినర్ రెండుసార్లు ఆన్‌లైన్‌లో మార్కులు నమోదు చేసేలా చర్యలు తీసుకుంది. ఈ నెల 5 నుంచి ప్రారంభమైన ప్రాక్టికల్స్ పరీక్షలు మంగళవారం ముగిశాయి. దీంతో అధికారులు రాత పరీక్షలపై దృష్టి సారించారు. ఇందులో భాగంగా బుధవారం విజయవాడలోని రెండు సెంటర్లలో హాల్‌టికెట్ల జారీ ప్రక్రియను లాంఛనంగా ప్రారంభించాలని నిర్ణయించారు. 2022–23 విద్యా సంవత్సరంలో ఇంటర్ రెండేళ్లు కలిపి 8,13,063 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. ఈ ఏడాది మొత్తం 10,52,221 మంది పరీక్ష ఫీజు చెల్లించారు. ఇందులో మొదటి సంవత్సరం 4,73,058 మంది, రెండో సంవత్సరం 5,79,163 మంది ఉన్నారు.



'సాక్షి' అసిస్టెంట్ ఎడిటర్ పోతుకూరు శ్రీనివాసరావు, తులసీకుమారి దంపతుల కుమారుడి వివాహ వేడుకకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరయ్యారు. మంగళవారం తాడేపల్లిలోని సీఎస్ఆర్ గార్డెన్స్‌లో జరిగిన రిసెప్షన్ కార్యక్రమంలో పాల్గొని నూతన వధూవరులు దుర్గాచరణ్, హరిత సత్యరూపలకు శుభాకాంక్షలు తెలిపి ఆశీస్సులు అందజేశారు. – సాక్షి, అమరావతి

జర్నలిస్టుల క్రికెట్ పోటీల పోస్టర్ ఆవిష్కరణ

సాక్షి, అమరావతి: రాష్ట్రస్థాయిలో జర్నలిస్టుల క్రికెట్ పోటీలు నిర్వహించడం అభినందనీయమని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వై.శ్రీలక్ష్మి అన్నారు. ఈ నెల 26 నుంచి అనంతపురంలో ప్రారంభమయ్యే జర్నలిస్టు క్రికెట్ టోర్నీ పోస్టర్‌ను మంగళవారం విజయవాడలో ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ.. నిత్యం పని ఒత్తిడిలో ఉండే జర్నలిస్టులకు ఇలాంటి టోర్నీలు చక్కటి ఆటవిడుపుగా ఉంటాయన్నారు. వృత్తితో పాటు ఆరోగ్యంపై దృష్టి పెట్టాలని, క్రీడలను అలవాటు చేసుకోవాలని సూచించారు.



రాష్ట్ర స్థాయి జర్నలిస్టు టోర్నీ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీలక్ష్మి

వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మచ్చా రామలింగారెడ్డి, సీనియర్ జర్నలిస్టులు నగేష్, రాజగోపాల్, వెంకటేష్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో బహుజనుల అభివృద్ధి

1,241వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు



రిలే దీక్షలో పాల్గొన్న బహుజన పరిరక్షణ సమితి నాయకులు

తాడికొండ: ఎన్నడూ లేని విధంగా ఏపీలో బహుజనులకు సంక్షేమ పథకాలు అందడంతో వారు అభివృద్ధి వైపు పయనిస్తున్నారని బహుజన పరిరక్షణ సమితి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 1,241వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో మంగళవారం పలువురు మాట్లాడారు. రాష్ట్రంలో 35 లక్షల ఇళ్లస్థలాలు, ఇళ్లు నిర్మించి ఇవ్వడంతో పాటు నవరత్న సంక్షేమ ఫలాలు బహుజనులకు అందాయంటే అది జగనన్న పుణ్యమేనన్నారు. మూడు రాజధానులకు వ్యతిరేకంగా బాబు అండ్ కో కోర్టుల్లో తప్పుడు కేసులు వేసి అడ్డుకోవాలని చూడడం 5 కోట్ల ఆంధ్రుల భవిష్యత్తుపై నీళ్లు చల్లడమేనని తెలిపారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా వారిని తరిమికొట్టడం ఖాయమని హెచ్చరించారు. నాయకులు మాదిగాని గురునాథం, బూదాల సలోమీ, కొమరవల్లి కిషోర్ బాబు, బూదాల సౌమ్య, పులి దాసు, ఈపూరి ఆదాం, బొలిమేర శ్యామ్యూల్, కారుమూరి పుష్పరాజు, బట్టు రవి, కొలకలూరి లోకేష్, నూతక్కి జోషి తదితరులు పాల్గొన్నారు.

తమిళనాటా 'సిద్ధం' వైరల్

- తమిళ మీడియాలో మార్మోగిన రాప్తాడు సభ
- జన సునామీని కళ్లకు కట్టినట్టు చూపిన చానళ్లు, పత్రికలు

సాక్షి,చెన్నై: అనంతపురం జిల్లా రాప్తాడులో ఆదివారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో జరిగిన వైఎస్సార్‌సీపీ 'సిద్ధం' సభకు తమిళనాడులోని ప్రముఖ వార్తా చానళ్లు, పత్రికల్లోనూ ప్రముఖ ప్రాధాన్యం లభించింది. సభకు తరలివచ్చిన జన సందోహ దృశ్యాలను అక్కడి చానళ్లు ఆది, సోమ, మంగళవారాల్లో పదేపదే చూపించాయి. తమిళ మీడియా ఆంధ్రప్రదేశ్ సీఎం వైఎస్ జగన్ అమలు చేస్తున్న నవరత్నాలకు తొలి నుంచి ప్రాధాన్యం ఇస్తోంది. వైఎస్ జగన్ ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకున్నా దానికి సంబంధించిన కథనాలు, వార్తలకు ప్రముఖంగా చోటు కల్పిస్తోంది. ఫలితంగా తమిళనాడులోని తెలుగు వారే కాకుండా తమిళులూ వైఎస్ జగన్‌కు అభిమానులుగా మారారు. సామాజిక మాధ్యమాల్లో తమకూ ఇలాంటి సీఎం కావాలన్న నినాదాలతో పోస్టులను వైరల్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఆది, సోమ, మంగళవారాల్లో పుదియ తలైమురై, సన్‌న్యూస్, పాలిమర్ తదితర చానళ్లు రాప్తాడు జన సునామీని కళ్లకు కట్టినట్టు వార్తలను ప్రసారం చేశాయి. ఓ రాజకీయ సభకు 12 లక్షల మందికిపైగా జనం తరలి రావడం ఇదే ప్రప్రథమమని పుదియ తలైమురై కితాబిచ్చింది. దినకరన్ వంటి ప్రముఖ వార్తా పత్రికలూ సిద్ధం సభ జనసందోహం ఫొటోలను ప్రముఖంగా ప్రచురించాయి. కొన్ని యూ ట్యూబ్ ఛానళ్లు సభ వీడియోలను వైరల్ చేశాయి.



தினகரன் இந்தியா

என்னைப்போல் தனித்து போட்டியிட தயாரா?

சந்திரபாபு நாயுடுக்கு முதல்வர் ஜெகன்மோகன் சவால்

తమిళ పత్రిక దినకరన్‌లో మంగళవారం ప్రచురితమైన వార్త

ఎక్కువ 'ఉపాధి'కి చర్యలు తీసుకోండి

- అధికారులకు సీఎస్ ఆదేశం
- ఉపాధి హామీ, తాగునీరు కల్పనపై అధికారులతో సమీక్ష



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా పెద్దఎత్తున పనులు కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని, ముఖ్యంగా ప్రతి కుటుంబానికి కనీసం 100 రోజులు పనిదినాలు కల్పించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా. కేఎస్ జవహర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో ఉపాధి హామీ పథకం, తాగునీరు అంశాలపై పంచాయతీరాజ్ శాఖ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ.. ముఖ్యంగా శ్రీసత్యసాయి, వైఎస్సార్, అనంతపురం, ప్రకాశం, పల్నాడు తదితర జిల్లాలపై ప్రత్యేక దృష్టి సారించి పెద్ద ఎత్తున ఉపాధి హామీ పనులు చేపట్టాలని సూచించారు. మిగతా జిల్లాల్లో కూడా ఉపాధి పనులు పెద్ద ఎత్తున చేపట్టాలని ఆదేశించారు. రానున్న వేసవి దృష్ట్యా రాష్ట్రంలో ఎక్కడా తాగునీటి సమస్య లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్, కమిషనర్ ఎ.సూర్యకుమారి, ఈఎన్సీలు బి.బాలూ నాయక్, ఆర్వీ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎస్‌తో కేంద్ర ఎంఎస్ఎంఈ శాఖ కార్యదర్శి భేటీ

కేంద్ర ఎంఎస్ఎంఈ శాఖ కార్యదర్శి ఎస్సీఎల్ దాస్ మంగళవారం రాష్ట్ర సచివాలయంలో సీఎస్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో ఎంఎస్ఎంఈ రంగానికి సంబంధించి అమలు చేస్తున్న పలు ప్రాజెక్టులు, ఇతర అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర చేనేత జౌళి శాఖ ముఖ్య కార్యదర్శి సునీత తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక పరిజ్ఞానంపై అవగాహన అవసరం

- సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ చదలవాడ నాగరాణి
- ఫార్మసీ అధ్యాపకుల శిక్షణ కార్యక్రమం ప్రారంభం



సాక్షి, అమరావతి: ఆధునిక పరిజ్ఞానాన్ని ఫార్మసీ విద్యను బోధించే అధ్యాపకులు పెంపొందించుకోవాలని సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ చదలవాడ నాగరాణి అన్నారు. రాష్ట్రంలోని ఫార్మసీ అధ్యాపకుల శిక్షణలో భాగంగా ఆంధ్రప్రదేశ్ ఫార్మసీ కౌన్సిల్ సహకారంతో చెన్నైలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ టీచర్స్ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్ నేతృత్వంలో ఫార్మాకోథెరపీటిక్స్, హాస్పిటల్ అండ్ క్లినికల్ ఫార్మసీ పేరిట ఏర్పాటు చేసిన ప్రొఫెషనల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌ను మంగళవారం కమిషనర్ కార్యాలయంలో ప్రారంభించారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్‌ల ద్వారా ఫార్మసీ సిబ్బందికి నైపుణ్యత, పరిజ్ఞానాన్ని పెంపొందించమే లక్ష్యంగా నాలుగు రోజుల పాటు కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామన్నారు. అనంతరం డీ ఫార్మసీ విద్యార్థుల కోసం నూతనంగా రూపొందించిన సిలబస్ పుస్తకాలను నాగరాణి ఆవిష్కరించారు. ఈ సిలబస్ పుస్తకాలు ఎన్‌డీఏ అక్రెడిటేషన్‌కు సిద్ధమయ్యేలా రూపొందించారు. కార్యక్రమంలో బోర్డు అధికారులు రమణ బాబు, జేవీఎస్ మూర్తి, సుబ్బారెడ్డి, ప్రసాద్ బాబు, ఆంధ్రప్రదేశ్ ఫార్మసీ కౌన్సిల్ రిజిస్ట్రార్ డాక్టర్ విలియం కేరీ, సెంటర్ ఫర్ రూరల్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ ప్రతినిధి డాక్టర్ జకులిన్ దివ్య మేరీ తదితరులు పాల్గొన్నారు.



మిలాన్ రిహార్సల్స్ అదుర్స్

బీచ్‌రోడ్డు(విశాఖ తూర్పు): భారీ యుద్ధ నౌకలు... స్పీడు బోట్లు.. ఫైటర్ జెట్స్... యుద్ధ విమానాల విన్యాసాలతో విశాఖ తీరం యుద్ధక్షేత్రాన్ని తలపించింది. మిలాన్–2024లో భాగంగా విశాఖపట్నం బీచ్ రోడ్డులో మంగళవారం నిర్వహించిన ఫైనల్ రిహార్సల్స్ అద్భుతంగా సాగాయి. భారీ యుద్ధ నౌకలు, స్పీడ్ బోట్లు, ఫైటర్ జెట్స్, యుద్ధ విమానాలు తీరంలో తమ ప్రతిభను ప్రదర్శించాయి. ఇందులో భాగంగా హెలికాప్టర్ ద్వారా ప్రమాదంలో చిక్కుకున్న వారిని రక్షించటం, తీవ్రవాదుల దాడులను ఎదుర్కోవడం వంటి అంశాలను ప్రదర్శించారు. అనంతరం మిగ్, హాక్స్, ఫైటర్ జెట్స్ తీరంలో బాంబులను వెదజల్లుతూ అబ్బురపరిచాయి. అదే సమయంలో ఆకాశం నుంచి ఆరుగురు సైనికులు జాతీయ పతాకం, నేవీ పతాకం పట్టుకుని పారాచూట్ ద్వారా కిందికి దిగారు. వారు ఒక బహుమతిని ముఖ్య అతిథికి అందజేశారు. నేవీ స్కూల్ విద్యార్థుల నృత్య ప్రదర్శన, జాతీయ గీతాల ప్రదర్శనలు అలరించాయి. అనంతరం దేశ రక్షణ బలగాలు, రాష్ట్ర రక్షణ బలగాలు, విదేశీ నేవీ బలగాలు, రాష్ట్ర సంప్రదాయ కూచిపూడి, థింసా, కోయ నృత్యాలు, సంక్షేమ పథకాల నమూనాలతో భారీ పరేడ్ నిర్వహించారు. ఈ నెల 22వ తేదీన తుది పరేడ్‌ను నిర్వహించనున్నారు. కాగా, పరేడ్ ఫైనల్ రిహార్సల్స్ చూసేందుకు విశాఖ నగరవాసులు పెద్ద సంఖ్యలో తీరానికి చేరుకున్నారు. ఆర్కే బీచ్ నుంచి కురుసుర మ్యూజియం వరకు ఏర్పాటు చేసిన గ్యాలరీలు సందర్శకులతో కిటకిటలాడాయి. ఈ రిహార్సల్స్‌ను చూసేందుకు నేవీ సిబ్బంది తమ కుటుంబ సభ్యులతో కలిసి హాజరయ్యారు. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా పోలీసులు తగిన ఏర్పాట్లు చేశారు.



పారాచూట్ ద్వారా కిందకి దిగుతున్న ప్రత్యేక దళ కమాండోలు

ఎస్‌జీటీ పోస్టులకు బీఈడీలను ఎలా అనుమతిస్తారు!

- రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ప్రశ్న
- తదుపరి విచారణ నేటికి వాయిదా

సాక్షి, అమరావతి: స్పెషల్ గ్రేడ్ టీచర్ (ఎస్‌జీటీ) పోస్టులకు బీఈడీ అభ్యర్థులను అనుమతించడంపై హైకోర్టు అభ్యంతరం తెలిపింది. ఇలా అనుమతించడం సుప్రీంకోర్టు తీర్పునకు విరుద్ధమని గుర్తు చేసింది. విద్యావిధానంలో మార్పు పేరుతో చిన్న పిల్లలపై ప్రయోగాలు చేస్తామంటే అందుకు అంగీకరించబోమని స్పష్టం చేసింది. ఎస్‌జీటీ పోస్టులకు బీఈడీ అభ్యర్థులను అనుమతించడాన్ని ఎలా సమర్థించుకుంటారో చెప్పాలంది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ ఎస్.శ్రీరామ్ స్పందిస్తూ.. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలను కోర్టు ముందుంచుతామని తెలిపారు. దీంతో హైకోర్టు తదుపరి విచారణను బుధవారానికి వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్‌ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావు ధర్మాసనం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఎస్‌జీటీ పోస్టులకు బీఈడీ అభ్యర్థులను అనుమతించడం సుప్రీంకోర్టు తీర్పునకు విరుద్ధమని, ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని కోరుతూ గుంటూరు జిల్లాకు చెందిన భూక్యా గోవర్ధన్ సాయినాయక్, మరో నలుగురు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఇదే అంశంపై ప్రకాశం జిల్లాకు చెందిన బొల్లా సురేష్, మరొకరు కూడా పిటిషన్ వేశారు. ఈ రెండు వ్యాజ్యాలపై మంగళవారం సీజే ధర్మాసనం విచారణ జరిపింది. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది బి.ఆదినారాయణరావు, న్యాయవాది జడా శ్రవణ్‌కుమార్ వాదనలు వినిపించారు.

22న కాంగ్రెస్ ఛలో సెక్రటేరియేట్

సాక్షి, అమరావతి : రాష్ట్ర పీసీసీ అధ్యక్షురాలు షర్మిల నేతృత్వంలో ఈనెల 22న 'ఛలో సెక్రటేరియేట్' నిర్వహిస్తున్నట్లు సీడబ్ల్యూసీ సభ్యుడు గిడుగు రుద్రరాజు తెలిపారు. సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో విజయవాడలో మంగళవారం జరిగిన అఖిలపక్షం సమావేశం, ఆంధ్రరత్న భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

నార్కో టెస్ట్‌కు సిద్ధమా... చంద్రబాబూ

- నిజాయితీపరుడైతే ఎమ్మెల్యేలను ఎందుకు కొన్నారు?
- మోహన్‌బాబు నుంచి హెరిటేజ్‌ను ఎందుకు లాక్కున్నారు?
- వంగవీటి రంగాను హత్య చేయించింది చంద్రబాబు కాదా
- ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచింది చంద్రబాబే అని పబ్లిక్ డొమైన్లో ఉంది
- నా ప్రశ్నలకు సమాధానం చెప్పండి.. ఎప్పుడైనా, ఎక్కడికైనా వస్తా
- చంద్రబాబుకు ఏపీఎఫ్‌టీవీడీసీ చైర్మన్ పోసాని కృష్ణమురళి సవాల్



సాక్షి, అమరావతి: రాజకీయాల్లో చంద్రబాబు అంత నిజాయితీపరుడైతే ఎమ్మెల్యేలను డబ్బులిచ్చి ఎందుకు కొన్నారని, హెరిటేజ్ సంస్థను మోహన్‌బాబు నుంచి ఎందుకు లాక్కున్నారని ఆంధ్రప్రదేశ్ చలనచిత్ర, టీవీ, నాటక రంగ అభివృద్ధి సంస్థ (ఏపీఎఫ్‌టీవీడీసీ) చైర్మన్ పోసాని కృష్ణమురళి ప్రశ్నల వర్షం కురిపించారు. టీడీపీ అధినేత, ప్రతిపక్ష నేత నారా చంద్రబాబు గురించి ప్రజల్లో ఉన్న కొన్ని వాస్తవిక అంశాలపై ఆయన నిజాలు చెప్పాలని, ఇందుకోసం నార్కో టెస్ట్‌కు సిద్ధమా అని సవాల్ చేశారు. పోసాని మంగళవారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ.. చంద్రబాబు జైలులో ఉన్నప్పుడు కూడా ప్రజల కోసమే ఆలోచిస్తున్నారని ఆయన భార్య నారా భువనేశ్వరి చెబుతున్నారని, మరి అంతటి నిజాయితీపరుడైతే పబ్లిక్ డొమైన్లో ఉన్న వాటిపై నార్కో టెస్ట్‌కు సిద్ధం కావాలని సవాల్ విసిరారు. వంగవీటి రంగాను హత్య చేయించింది చంద్రబాబు కాదా అని ప్రశ్నించారు. హెరిటేజ్‌ను పెట్టిన ఆరు నెలల్లోనే మోహన్‌బాబును మోసం చేసి చంద్రబాబు లాక్కున్నాడని ఆరోపించారు. ఈ విషయం తనకు తప్ప మిగతావాళ్లకు పెద్దగా తెలియదన్నారు. హెరిటేజ్‌ను చంద్రబాబు లాక్కున్న విషయం అబద్ధమని అనుకుంటే తనకు నార్కో టెస్ట్ చేయించాలని అన్నారు. అబద్ధమని తేలితే తనను లైవ్‌లోనే చెప్పుతో కొట్టండంటూ సవాల్ చేశారు. ఎన్టీఆర్ పార్టీ పెట్టినప్పుడు టీడీపీలో చంద్రబాబు కార్యకర్త కూడా కాదని చెప్పారు. చంద్రబాబు అదే ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి పార్టీని లాక్కున్నట్టు పబ్లిక్ డొమైన్‌లో ఉన్న సంగతి నిజం కాదా అని ప్రశ్నించారు. జయప్రదను ఎలా అవమానించారో అందరికీ తెలుసని పోసాని గుర్తు చేశారు. రాజకీయాల్లో అనేక అవినీతి, అక్రమాలకు పాల్పడిన మీకు ప్రజలు ఎలా ఓట్లేస్తారని చంద్రబాబును ప్రశ్నించారు. నార్కో టెస్ట్‌కు, తన ప్రశ్నలకు సమాధానం చెప్పేందుకు సిద్ధమైతే.. ఎక్కడికి రమ్మన్నా, ఎప్పుడు రమ్మన్నా వస్తానని స్పష్టం చేశారు. నార్కో ఎనాలసిస్ టెస్ట్‌లో తన ప్రశ్నలు నిజం కాదని నిరూపించుకుంటే ఒక కమ్మోడిగా బాబు కోసం పాదయాత్ర చేస్తానని, కమ్మ ఓట్లన్నీ ఆయనకే పడతాయని, 175 సీట్లు మీకే వస్తాయని మీరే (చంద్రబాబు) సీఎం అవుతారని పోసాని చెప్పారు. ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ప్రవేశపెట్టిన మంచి పథకాలను చంద్రబాబు అధికారంలోకి రాగానే నాశనం చేశాడని విమర్శించారు. ఇప్పుడేమో సీఎం అవ్వడానికి ప్రపంచంలో ఎక్కడా లేని పథకాలన్నీ తెస్తామని అబద్ధపు హామీలు ఇస్తున్నారని మండిపడ్డారు.

పవన్ అలా చెప్పడం వ్యభిచారంతో సమానం

జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌పైన పోసాని సంచలన వ్యాఖ్యలు చేశారు. కాపు సామాజికవర్గానికి చెందిన పవన్.. ఆయన వర్గం ఓట్లను టీడీపీకి వేయమని చెప్పడం ఏమిటని ప్రశ్నించారు. పవన్ కళ్యాణ్ అలా అనడం వ్యభిచారంతో సమానమంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. పవన్ చేసిన పని కాపులను మోసం చేయడం కాదా అని ప్రశ్నించారు. ఏపీలో మహిళల అక్రమ రవాణా జరుగుతోందంటూ పవన్ గతంలో చేసిన వ్యాఖ్యలపైనా పోసాని విరుచుకుపడ్డారు. మహిళల అక్రమ రవాణా గురించి పవన్ చేసిన ఆరోపణలు నిరాధారమని, అసలు ఆ ఆరోపణల్లో న్యాయం ఉందా అని ప్రశ్నించారు. ఏపీలోని మహిళలు ఎవరి ఊళ్లలో వాళ్లు సంతోషంగా పని చేసుకుంటూ ఉంటే ఉమెన్ ట్రాఫికింగ్ జరుగుతోందనడం పవన్ జీవితంలోనే చేసిన అతిపెద్ద తప్పు అని మండిపడ్డారు. ఈ వ్యాఖ్యలపై పవన్ కళ్యాణ్ సిగ్గుపడాలని, ఏపీలోని ఆడబిడ్డలకు వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కనీసం కాపు మహిళల కాళ్లు పట్టుకుని క్షమాపణలు అడగాలని పోసాని డిమాండ్ చేశారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదాలకు అడ్డుకట్ట వేయండి


అధికారులకు సూచనలు ఇస్తున్న ఎమ్మెల్యే ఎస్.ఎన్.సుబ్బారెడ్డి

బాగేపల్లి : బాగేపల్లి పట్టణ సమీపంలో జాతీయ రహదారి 44లో పెచ్చుమీరిన రోడ్డు ప్రమాదాలకు అడ్డుకట్ట వేసి ప్రజల ప్రాణాలు కాపాడాలని ఎమ్మెల్యే ఎస్.ఎన్.సుబ్బారెడ్డి అధికారులకు సూచించారు. స్థానిక పోలీసులు, జాతీయ రహదారుల ప్రాధికార అధికారులతో కలిసి మంగళవారం ఆయన బ్లాక్ స్పాట్లను పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని, దీంతో ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ప్రమాదాలకు అడ్డుకట్ట వేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

విద్యుదాఘాతంతో ఎలక్ట్రీషియన్ మృతి


ఘటన స్థలంలో అక్బర్ ఖాన్ మృతదేహం

మైసూరు : విద్యుదాఘాతంతో ఎలక్ట్రీషియన్ మృతి చెందాడు. ఈ ఘటన మైసూరులో నగరంలో చోటు చేసుకుంది. మైసూరులోని శాంతి నగరకు చెందిన అక్బర్ ఖాన్(60) ఒలంపియాడ్ సినిమా థియేటర్ సమీపంలోని భవనంలో కరెంటు రిపేరి పనులు చేస్తుండగా కరెంటు సరఫరా అయ్యింది. దీంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. దేవరాజ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

పట్టు సాగులో జాగ్రత్తలు పాటించాలి


మాట్లాడుతున్న అధికారి

తుమకూరు : పట్టు సాగులో జాగ్రత్తలు పాటించాలని సిరికల్చర్ శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ వైకే బాలకృష్ణ సూచించారు. పట్టు సాగు రైతులు, శాస్త్రవేత్తలతో ఆ శాఖ డైరెక్టరేట్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. వైకే బాలకృష్ణ మాట్లాడుతూ పట్టు సాగులో అనేక ఇబ్బందులను రైతులు ఎదుర్కొంటున్నారు. వాతావరణ పరిస్థితుల్లో మార్పుల వల్ల పట్టు దిగుబడులు సరిగా రావడం లేదన్నారు. ఈ నేపథ్యంలో రైతులు శాస్త్రవేత్తలు ఇచ్చిన సలహాలు పాటించాలన్నారు. పంట సాగు మొదలు పెట్టినప్పటి నుంచి పూర్తయ్యేవరకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగండి


ధ్రువీకరణపత్రాలు అందజేసిన దృశ్యం

గౌరిబిదనూరు: మహిళలు స్వయం ఉపాధితో ఆర్థిక స్వావలంబన సాధించాలని ధర్మస్థల గ్రామీణాభివృద్ధి సంస్థ జిల్లా డైరెక్టర్ ప్రశాంత్ సూచించారు. పట్టణంలోని మరిగమ్మ దేవాలయంలో ఆ సంస్థ అమలు చేస్తున్న జ్ఞానవికాస కార్యక్రమం కింద కుట్టుపనిలో శిక్షణ పొందిన 35 మంది మహిళలకు మంగళవారం ఆయన ధ్రువీకరణపత్రాలు అందజేశారు. ఇంటి వద్దనే ఉంటూ కుట్టు పని ద్వారా ఉపాధి పొందవచ్చన్నారు. బెంగుళూరు జ్ఞానవికాస యోజనాధికారి సంధ్యాశెట్టి, కమిషనర్ గీత, ప్రాజెక్ట్ అధికారి నాగరాజనాయక, సుమంగళి, లక్ష్మి పాల్గొన్నారు.

మూల వాక్యం మార్పుపై కర్ణాటక సేన నిరసన


ఆందోళన నిర్వహిస్తున్న నాయకులు

మైసూరు : జ్ఞానపీఠ అవార్డు గ్రహీత విశ్వకవి కువెంపు ప్రకటించిన వాక్యాన్ని ప్రభుత్వం మార్పు చేయడాన్ని వ్యతిరేకిస్తూ మంగళవారం మైసూరులోని డాక్టర్ రాజ్‌కుమార్ ఉద్యానవనం వద్ద కర్ణాటక సేన నాయకులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నాయకులు మాట్లాడుతూ సాంఘిక సంక్షేమ శాఖకు చెందిన వసతి పాఠశాల ద్వారంపై జ్ఞాన దేవాలయంలోకి చేతులతో మొక్కి లోనికి రండి అనే వ్యాఖ్యాన్ని జ్ఞాన దేవాలయం ఇది ధైర్యంగా ప్రశ్నించండి అని మార్పు చేయడం తగదన్నారు. వ్యాఖ్యం మార్పు చేయడం కన్నడ సంస్కృతిని, పాఠశాలల పవిత్రను పాడు చేయడమేనన్నారు.

నిప్పురవ్వతో ఫైర్ సిబ్బంది చెలగాటం

- అగ్ని ప్రమాదాల నియంత్రణలో విఫలం
- గోదాములు, ఫ్యాక్టరీలు, బహుళ అంతస్తు భవనాల్లో కానరాని సురక్షిత వ్యవస్థ
- బెంగళూరు, బెంగళూరు జిల్లాల్లో 7 నెలల్లో ఐదు భారీ అగ్నిప్రమాదాలు
- 25 మందికి పైగా కార్మికుల మృత్యువాత


అత్తిబెలె వద్ద టపాసుల గోదాములో చెలరేగిన మంటలు(ఫైల్)


బన్నేరుఘట్టరోడ్డులోని అపార్టుమెంటులో సంభవించిన అగ్నిప్రమాదం (ఫైల్)

బనశంకరి: నిప్పు రవ్వతో అగ్నిమాపక శాఖ చెలగాటమాడుతోంది. అగ్ని ప్రమాదాలకు ఆస్కారం ఉండే చోట్ల తగిన జాగ్రత్తలు తీసుకునేలా సంబంధిత వ్యక్తులను జాగృత పరచడంలో ఫైర్ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీనికితోడు గోదాములు, పరిశ్రమలకు అనుమతులు ఇచ్చే సమయంలో ఉదాసీనంగా ఉంటున్నారు. ఫలితంగా అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు భారీగా ఆస్తి, ప్రాణ నష్టం జరుగుతోంది. మంటలనుంచి తప్పించుకునేందుకు మార్గం లేక బాధితులు సజీవదహనమవుతున్నారు. బెంగళూరు నగర, బెంగళూరు గ్రామాంతర జిల్లాల్లో గత 7 నెలల్లో 5 భారీ అగ్నిప్రమాదాలు సంభవించగా సుమారు 25 మందికిపైగా కార్మికులు మృతిచెందారు.

6 ఏళ్లలో 2,848 అగ్నిప్రమాదాలు...

బెంగళూరులో ఆరు సంవత్సరాల్లో సుమారు 2,848 అగ్నిప్రమాదాలు సంభవించాయి. అగ్నిప్రమాదాలు సంభవించిన స్థలం, కట్టడాల్లో మంటలు ఆర్పివేసే సురక్షత పరికరాలు లేకపోవడం. 2015–16లో నిర్వహించిన ఆడిట్ ప్రకారం నగరంలో సుమారు 22 వేల బహుళ అంతస్తులు కట్టడాలు ఉండగా ఇందులో 16 వేలకు పైగా కట్టడాల్లో అగ్నిసురక్షతా వ్యవస్థ లేదు. 4 వేల కట్టడాలకు మాత్రమే ఎన్‌ఓసీ, అగ్ని సురక్షతా సర్టిఫికెట్ తీసుకున్నారు. మిగిలిన కట్టడాలకు ఎన్‌ఓసీ లేకపోయినప్పటికీ వాణిజ్య కార్యకలాపాలు, వసతి, కార్యాలయంతో పాటు వివిధ కార్యకలాపాలకోసం వాడుతున్నారు.

కారణాలు..ప్రమాదాల సంఖ్య

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో	1,889
వంటగ్యాస్ లీకేజీతో	785
రసాయనాల లీకేజీతో	42
ఆయిల్ లీకేజీతో	50
సిగరెట్ మంటలతో	82

అగ్నిప్రమాదాల వివరాలు

ఏడాది	దుర్ఘటనలు
2017	514
2018	603
2019	616
2020	513
2021	490
2022	111

అగ్నిప్రమాద దుర్ఘటనలు...

- అత్తిబెలె టోల్‌గేట్ వద్ద సర్వీస్ రోడ్డులో గత ఏడాది అక్టోబరు 7 తేదీన టపాసుల గోదాములో భారీ పేలుడు చోటు చేసుకొని 16 మందికి పైగా కర్ణాటక, తమిళనాడుకు చెందిన కార్మికులు మృత్యువాతపడ్డారు. 15 మందికి పైగా కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు.
- కోరమంగల వద్ద గత ఏడాది అక్టోబరు 19న మడ్‌హైప్ అనే రెస్టో కెఫెలో సంభవించిన అగ్ని ప్రమాదంలో ఇద్దరు కార్మికులు మృతిచెందారు. అగ్ని సురక్షత నిబంధనలు పాటించకపోవడం ఈ ప్రమాదానికి ప్రధాన కారణం.
- బెంగళూరు హజ్‌భవన్‌లో సంభవించిన ఆకస్మిక అగ్నిప్రమాదంలో రూ.3 కోట్లు నష్టం సంభవించింది.
- నగరంలోని హొసకెరెహళ్లి బస్సు గోదాములో గత ఏడాది నవంబరు 1వ తేదీన అగ్నిప్రమాదం సంభవించడంతో 20కి పైగా బస్సులు కాలిపోయాయి. గ్యారేజ్‌లో వెల్డింగ్ పనులు చేస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది.
- లగ్గెరె బాణసవాడి రోడ్డు వద్ద గత ఏడాది అక్టోబరు 4వ తేదీన ట్రాన్స్‌ఫార్మర్ పేలి గుజరి గోదాము, మెర్సిడిస్‌బెంజ్‌తో పాటు రెండుకార్లు దగ్ధమయ్యాయి.

ఈ ఏడాది ఫిబ్రవరి 18వ తేదీన కుంబళగోడు వద్ద రామసంద్ర సుగంధ ద్రవ్యాల పరిశ్రమలో అగ్ని ప్రమాదం జరిగి ముగ్గురు మృతిచెందగా 6 మంది తీవ్రంగా గాయపడ్డారు.


మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది(ఫైల్)

అగ్ని ప్రమాదాల నియంత్రణకు చర్యలు

గత 7 నెలల్లో 5 భారీ అగ్నిప్రమాదాలు సంభవించాయి. అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోవడంతో ఈ దుర్ఘటనలు చోటు చేసుకున్నాయి. రాష్ట్రం మొత్తంగా బెంగళూరు నగరంలోనే అధిక ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. వీటి పట్ల ప్రభుత్వం కఠినచర్యలు తీసుకుంది.

–రెవెన్యూ శాఖ మంత్రి కృష్ణబైరేగౌడ

ఛత్రపతి శివాజీ ఆదర్శ పాలకుడు


శివాజీ జయంతి కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే పుట్టస్వామిగౌడ

గౌరిబిదనూరు: ఛత్రపతి శివాజీ ఆదర్శ పాలకుడని ఎమ్మెల్యే పుట్టస్వామిగౌడ అన్నారు. తాలూకా కార్యాలయ సభాభవనంలో నిర్వహించిన శివాజీ జయంతి కార్యక్రమంలో ఆయన పాల్గొని శివాజీ చిత్రపటానికి నివాళులర్పించి మాట్లాడారు. తల్లి జిజాబాయి చెప్పిన రామాయణ, మహాభారత ఇతిహాసాల ద్వారా శివాజీ స్ఫూర్తి పొంది యుద్ధ విద్యలు నేర్చుకొని స్వంత సామ్రాజ్యాన్ని ఏర్పాటు చేశారన్నారు. చిన్న సైన్యంతోనే అనేక విజయాలు సాధించారన్నారు. శివాజీని యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

సొసైటీ ఎన్నికలు ప్రశాంతం


అధ్యక్ష, ఉపాధ్యక్షులు, డైరెక్టర్లను సన్మానించిన దృశ్యం

తుమకూరు : శిరా తాలూకా పట్టనాయకనహళ్లిలో శ్రీనంజావధూత స్వామీజీ పరపతి సహకార సంఘం ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. అధ్యక్షుడిగా రంగనాథ్, ఉపాధ్యక్షుడిగా రాజణ్ణలు ఏక గ్రీవంగా ఎన్నికయ్యారు. డైరెక్టర్లుగా శివానంద్, రంగణ్ణ, నేరలహళ్లప్ప, రాజణ్ణ, శివకుమార, శ్రీనివాస్, లక్ష్మీకాంత, కెంగరాజు, రేణుకమ్మలు ఎన్నికయ్యారు. అనంతరం నూతన పాలకవర్గాన్ని స్థానిక నాయకులు అభినందించారు.

రూ.30 లక్షల సొత్తు స్వాధీనం


నిందితుడు సునీల్


ఆభరణాలు పరిశీలిస్తున్న కమిషనర్ బీ.దయానంద్

బనశంకరి: ఇంటి తాళం బద్దలు కొట్టి బంగారు నగల చోరీకి పాల్పడుతున్న సునీల్ అనే దొంగను మంగళవారం మైకోలేఔట్ పోలీసులు అరెస్టుచేశారు. ఇతడి వద్ద నుంచి రూ.30.15లక్షల విలువైన 525 గ్రాముల బంగారు ఆభరణాలు, 550 గ్రాముల వెండి ఆభరణాలు, రెండు మొబైల్స్, ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నారు. మైకోలేఔట్ పోలీస్‌స్టేషన్‌లో ఇతడిపై 11 చోరీకేసులు నమోదయ్యాయి. స్వాధీనం చేసుకున్న నగలను నగర పోలీస్ కమిషనర్ బి.దయానంద్, అదనపు పోలీస్ కమిషనర్ రమణ్‌గుప్తా, డీసీపీ సీకే.బాబా, ఏసీపీ మనోజ్ పరిశీలించారు.

బైక్‌లు, సెల్‌ఫోన్ దొంగల అరెస్ట్

బనశంకరి: మొబైల్స్, బైక్‌లు, ఇళ్లలో చోరీలకు పాల్పడుతున్న నవీన్, శివరాజ్ అనే ఇద్దరిని మంగళవారం జ్ఞానభారతి పోలీసులు అరెస్ట్‌చేశారు. వీరి వద్ద నుంచి రూ.11 లక్షల విలువచేసే 5 బైక్‌లు, 41 మొబైల్స్ స్వాధీనం చేసుకున్నామని నగర పోలీస్‌కమిషనర్ బి.దయానంద తెలిపారు. గత ఏడాది డిసెంబరు 23వ తేదీన ఇంటి ముందు పార్కింగ్ చేసిన బైక్ చోరీకి గురైనట్లు యజమాని ఇచ్చిన ఫిర్యాదుతో జ్ఞానభారతి పోలీసులు తీవ్రంగా గాలించి నిందితులను అరెస్ట్ చేశారు. జ్ఞానభారతిలో 2, కుంబళగోడు, బయప్పన హళ్లి, బేగూరు పోలీస్‌స్టేషన్లలో ఒక బైక్ చొప్పున చోరీ చేసినట్లు నిందితులు అంగీకరించారు. అదేవిధంగా దృష్టి మరల్చి 41 మొబైల్స్ చోరీలకు పాల్పడ్డారని కమిషనర్ తెలిపారు.

మార్చి 1 నుంచి ద్వితీయ పీయూసీ పరీక్షలు

శివాజీనగర: ద్వితీయ పీయూసీ, ఎస్ఎస్ఎల్‌సీ సంవత్సర పరీక్ష తేదీని పాఠశాల విద్యాశాఖ ప్రకటించింది. ద్వితీయ పీయూసీ పరీక్షలు మార్చి 1 నుంచి 22 వరకు జరుగనున్నాయి. మార్చి 25 నుంచి ఏప్రిల్ 6 వరకు ఎస్ఎస్ఎల్‌సీ పరీక్షలు జరుగుతాయి. ద్వితీయ పీయూసీకి 6,98,627 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో 3,30,644 మంది బాలురు, 3,67,980 మంది బాలికలు ఉన్నారు. ఎస్ఎస్ఎల్‌సీ పరీక్షకు మొత్తం 8,96,271 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు.

సీనియర్ రాజకీయ నేత మృతి


కే.ఎస్. రవిమంజేష్ (ఫైల్)

మండ్య : మండ్య జిల్లాకు చెందిన సీనియర్ రాజకీయ నేత కే.ఎస్. రవి మంజేష్(57) అనారోగ్యంతో మృతి చెందారు. జాత్యాతీత జనతాదళ పార్టీలో కొనసాగిన ఈయన రెబల్ స్టార్ అంబరీష్ ప్రభావంతో కాంగ్రెస్‌లో చేరారు. అంబరీష్ విజయం కోసం కృషి చేశారు. ఈయన అనేక సేవా కార్యక్రమాలు చేపట్టి ప్రజల మన్ననలు పొందారు. ఈయనకు భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు. రవి మంజేష్ అంత్యక్రియలు మంగళవారం చిక్కెర నగరం శ్మశానవాటికలో నిర్వహించారు.

వ్యక్తి దారుణహత్య


హతుడు మహ్మద్ అక్తర్ ఆలీ (ఫైల్)

కృష్ణరాజపురం: దుండగుల చేతిలో వ్యక్తి హత్యకు గురైన ఘటన హలసూరు పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. హతుడిని మహ్మద్ అక్తర్ ఆలీ(44)గా పోలీసులు గుర్తించారు. దుండగులు ఇతన్ని కబ్బన్‌పేటె వద్ద నుంచి కారులో కిడ్నాప్ చేసి గొంతుకు తాడు బిగించి హత్య చేశారు. అనంతరం మృతదేహాన్ని హొసకోటె సమీపంలోని రాజ కాలువ వద్ద పడేసి ఉడాయించారు. హలసూరు గేట్ పోలీసులు మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. నిందితుడిని అరెస్ట్ చేశారు. వివాహేతర సంబంధంతోనే హత్య జరిగినట్లు పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

నిర్మాణంలో ఉన్న కట్టడంలో మృతదేహం

బనశంకరి: డబుల్‌రోడ్డులో నిర్మాణదశలో ఉన్న కట్టడంలో గుర్తు తెలియని యువతి మృతదేహం లభ్యమైంది. మంగళవారం ఉదయం స్థానికులు ఇచ్చిన సమాచారంతో సంపంగి రామనగర పోలీసులు పరిశీలించి మృతురాలికి సుమారు 25 నుంచి 26 ఏళ్ల వయస్సు ఉంటుందని నిర్ధారించారు. మృతదేహాన్ని శవపరీక్షల కోసం బౌరింగ్ ఆసుపత్రికి తరలించారు. యువతిది ఆత్మహత్య, ఎక్కడైనా చంపి ఇక్కడ పడేశారా అనేది దర్యాప్తులో తేలాల్సి ఉందని పోలీసులు తెలిపారు.

వయనాడు మృతుడికి కర్ణాటక నుంచి పరిహారమా?

శివాజీనగర: ఏనుగు దాడిలో మృతి చెందిన కేరళలోని వయనాడు వ్యక్తి కుటుంబానికి కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ సలహా మేరకు కర్ణాటక ప్రభుత్వం పరిహారం అందించడం సరికాదని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు బీ.వై.విజయేంద్ర ఆరోపించారు. కర్ణాటక ఖజానా నుంచి రూ.15 లక్షలను పరిహారంగా వయనాడులోని మృతుడికి అందించడం అధికార దుర్వినియోగం కాదా? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో కరువు నెలకొని వందలాది మంది రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నారన్నారు. వారిని పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వం కాంగ్రెస్ హైకమాండ్ మెప్పు పొందేందుకు కర్ణాటక పన్నుదారుల సొమ్మును ఇతర రాష్ట్రాల వారికి పరిహారంగా అందించడం సరికాదన్నారు.

'మైషుగర్ ఆస్తుల విక్రయానికి ప్రభుత్వం కుట్ర'

మండ్య : మైషుగర్ ఆస్తులు అమ్మి, కొత్త పరిశ్రమ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం కుట్ర చేస్తోందని బీజేపీ నాయకులు ఆరోపించారు. ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి సి.టి. మంజునాథ్ ఆధ్వర్యంలో నాయకులు మంగళవారం అదనపు కలెక్టర్ హెచ్.ఎల్.నాగరాజుకు వినతి పత్రం అందించారు. మండ్య జిల్లా జీవనాడి అయిన మైషుగర్‌ను, వాటి ఆస్తులను పరిరక్షించాలని వారు ఈసందర్భంగా కోరారు.


వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

విద్యార్థి అనుమానాస్పద మృతి


ఉరివేసుకున్న స్థితిలో ముత్తురాజు

మైసూరు: విద్యార్థి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఈఘటన మైసూరు జిల్లా హుణసూరు తాలూకా రత్నపురి గ్రామంలో చోటు చేసకుంది. దాసనపుర గ్రామానికి చెందిన రవి కుమార్, వసంత దంపతుల కుమారుడు ముత్తురాజు(17) పీయూసీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఇటీవల ఒక యువతితో మాటలు కలిపాడు. ఈ విషయంపై గొడవ జరిగింది. ఈక్రమంలో ముత్తురాజు రత్నపురిలోని బంధువుల ఇంటిలో కార్యక్రమానికి హాజరయ్యాడు. ఆ తర్వాత చెట్టుకు ఉరివేసుకున్న స్థితిలో వేలాడుతూ విగతజీవిగా కనిపించాడు. యువతి కుటుంబ సభ్యులపై అనుమానం ఉందని మృతుడి కుటుంబ సభ్యులు ఫిర్యాదు హుణసూరు గ్రామీణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

లారీ ఢీకొని మాజీ జవాన్ మృతి

యశవంతపుర: కలబురగి నగరంలోని ఆళంద రోడ్డులో కెరిబోసగా గ్రామం వద్ద హైవేపై లారీ బైకును ఢీకొంది. ఈ ప్రమాదంలో విశ్రాంత సీఆర్‌పీఎఫ్ జవాన్ మారుతీ కాశినాథ ఘోడకె (56) అక్కడికక్కడే మృతి చెందాడు. ఆళంద తాలూకా సావళేశ్వర గ్రామానికి చెందిన మారుతి కలబురగికి బైకులో వెళుతుండగా లారీ ఓవర్ టేక్ చేయబోయి బైకును ఢీకొంది. మారుతీ తల, కాలుపై లారీ వెనుక చక్రాలు వెళ్లడంతో గాయాలై మరణించాడు. ట్రాఫిక్ పోలీసులు ఘటన స్థలంను పరిశీలించారు.

హోసూరు వార్తలు..

బ్యాటుతో బాది భర్త హత్య

- భార్య, అత్త అరెస్టు

హోసూరు: భర్తను క్రికెట్ బ్యాట్‌తో బాది హత్య చేసిన భార్య, అత్తను పోచ్చంపల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాల మేరకు పోచ్చంపల్లి సమీపంలోని బాలపాడి గ్రామానికి చెందిన చిన్నకణ్ణు కొడుకు విమల్‌కుమార్ (32) కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇతనికి కొడమాండపల్లి గ్రామానికి చెందిన పూర్ణిమ (32)తో గత కొన్నేళ్ల కిందట పెళ్లి జరిగి ఇద్దరు పిల్లలున్నారు. భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరిగేవి. గత రెండు రోజుల క్రితం రగడ పడి ఆమె పుట్టింటికెళ్లిపోయింది. నచ్చజెప్పి తీసుకొచ్చేందుకు విమల్‌కుమార్, తల్లితో కలిసి భార్య ఇంటికెళ్లారు. ఈ సమయంలో పూర్ణిమ, ఆమె తల్లి హంసవేణిలు క్రికెట్ బ్యాటుతో విమల్ కుమార్‌పై దాడి చేశారు. తీవ్ర గాయాలేర్పడిన అతను కొద్దిసేపటికి మృతి చెందాడు. పోచ్చంపల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని శవాన్ని ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని పూర్ణిమ, హంసవేణిలను అరెస్ట్ చేశారు.

కవి సర్వజ్ఞ జయంతి


కవి సర్వజ్ఞ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

తుమకూరు: తుమకూరు నగరంలోని గుబ్బి వీరణ్ణ కళాక్షేత్రంలో మంగళవారం జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో కవి సంత్ సర్వజ్ఞ జయంతి వేడుకలను నిర్వహించారు. తుమకూరు తాలూకా తహసీల్దార్ ఎం.సిద్దేశ్ పాల్గొని సర్వజ్ఞ చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటించారు. కన్నడ సాహిత్య పరిషత్, కుంబార సంఘం నాయకులు పాల్గొన్నారు.

పీడీఓకు సన్మానం

శిర తాలూకాలోని యలియూరు గ్రామ పంచాయతీలో పీడీఓ విజయ్‌కుమార్‌కు బదిలీ అయ్యింది. స్థానిక అధికారులు, గ్రామ పంచాయతీ సభ్యులు ఆయనకు సన్మానం చేసి వీడ్కోలు పలికారు. జీపీ అధ్యక్షురాలు భాగ్యమ్మ రంగనాథ్, సభ్యులు పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్ దుర్మరణం


రోడ్డుపై ఆటో డ్రైవర్ మృతదేహం

క్రిష్ణగిరి: ద్విచక్రవాహనాన్ని ఆటో ఢీకొన్న ప్రమాదంలో ఆటో డ్రైవర్ మృతి చెందిన ఘటన సూళగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం మధ్యాహ్నం చోటు చేసుకొంది. వివరాల మేరకు.. హోసూరు–క్రిష్ణగిరి జాతీయ హైవేలో సామలపల్లం వద్ద ఆటో– ద్విచక్రవాహనం ఢీకొన్నాయి. ఆటో బోల్తా పడగా డ్రైవర్ రోడ్డుపై పడడంతో తలకు తీవ్ర గాయాలై చనిపోయాడు. బైకిస్టు కూడా తీవ్రంగా గాయపడ్డాడు. సూళగిరి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలను చేపట్టారు.

జల్లికట్టు సంబరం


జల్లికట్టు కోలాహలం



క్రిష్ణగిరి: సూళగిరి సమీపంలోని త్యాగరసనపల్లి గ్రామంలో మంగళవారం జల్లికట్టును ఉత్సాహంగా నిర్వహించారు. సంక్రాంతి పండుగ సీజన్‌లో జనవరి 15 నుంచి మార్చి నెల వరకు క్రిష్ణగిరి జిల్లాలో జల్లికట్టు, పశువుల పండుగను జరుపుకోవడం ఆనవాయితీ. మంగళవారం సూళగిరి సమీపంలోని త్యాగరసనపల్లి గ్రామంలో జల్లికట్టు ఉత్సాహంగా సాగింది. సూళగిరి, బాగలూరు, బేరికె, అత్తిముగం, క్రిష్ణగిరి, రాయకోట, బాగలూరు, డెంకణీకోట, తళి, ఉద్దనపల్లి, అంచెట్టి తదితర ప్రాంతాల నుంచి పెద్దఎత్తున రైతులు జల్లికట్టు ఎద్దులను తీసుకెళ్లి పరిగెత్తించారు. యువకులు ఆ ఎద్దులను అడ్డుకోవడానికి సాహసోపేతంగా ప్రయత్నించారు. వేలాది మంది ప్రజలు వీక్షించారు.

మత్తు వల్ల పతనమే


ర్యాలీని ప్రారంభిస్తున్న సబ్‌కలెక్టర్ ప్రియాంక

హోసూరు: జిల్లా యంత్రాంగం, మద్య నిషేధ శాఖ సంయుక్తంగా మంగళవారం నాటుసారా, మాదక ద్రవ్యాల వల్ల ఏర్పడే దుష్ప్రయోజనాలపై చైతన్య కార్యక్రమాన్ని నిర్వహించారు. హోసూరు పట్టణంలోని ఆర్.వి. ప్రభుత్వ బాలుర ఉన్నతోన్నత పాఠశాల వద్ద ప్రారంభమైన చైతన్య ర్యాలీని సబ్‌కలెక్టర్ ప్రియాంక జెండా ఊపి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ నాటు సారా, మద్యం, మాధక ద్రవ్యాలను సేవించడం వల్ల పలు రకాల అనారోగ్యాలు వచ్చి ప్రాణహాని జరుగుతుందని తెలిపారు. పైగా కుటుంబంలో, సమాజంలో గౌరవం నశిస్తుందని, నేటి తరం యువతీ యువకులు మత్తు వినియోగానికి దూరంగా ఉండాలని సూచించారు. నాటుసారా, గుట్కా, మాదక ద్రవ్యాలను తరలిస్తున్నట్లు తెలిస్తే 10581 టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారమివ్వాలని కోరారు.

కెమ్మణ్ణుగుండి కొండపై కార్చిచ్చు

యశవంతపుర: చిక్కమగళూరు జిల్లాలో ప్రసిద్ధి చెందిన పర్యాటక కేంద్రమైన కెమ్మణ్ణుగుండి కొండకు కార్చిచ్చు వ్యాపించింది. సోమవారం రాత్రి నుంచి తరికెరె తాలూకా కెమ్మణ్ణుగుండి అటవీ ప్రాంతంలోని చెట్లు మంటల్లో దహనమవుతున్నాయి. అనేక ఔషధ విలువలున్న చెట్లు కాలి బూడిదవుతున్నాయి. జంతుజాలం మంటల్లో మాడి మసైపోతోంది. ఎండలు పెరుగుతుండటంతో చిక్కమగళూరు, పశ్చిమ ఘట్ట భాగంలో అగ్ని కీలలు ఎగసిపడి కొండ ప్రాంతంలో చెట్లు దగ్ధమవుతున్నాయి.

అన్న చేతిలో తమ్ముడు హత్య

క్రిష్ణగిరి: అన్నదమ్ముల మధ్య జరిగిన కలహాల్లో తమ్ముడు ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటన సోమవారం రాత్రి సూళగిరి వద్ద చోటుచేసుకుంది. వివరాల మేరకు సూళగిరి సమీపంలోని కాళింగవరం గ్రామానికి చెందిన బసప్ప కొడుకులు క్రిష్ణన్ (35), అన్న భూపతి మధ్య ఘర్షణ జరిగింది. భూపతి కత్తితో దాడి చేసి క్రిష్ణన్‌ను హత్య చేశాడు. గ్రామస్తులు సూళగిరి పోలీసులకు ఫిర్యాదు చేయగా చేరుకొని శవాన్ని ఆస్పత్రికి తరలించారు. పరారీలో ఉన్న నిందితుని కోసం గాలిస్తున్నారు.

ఏనుగు కోసం జల్లెడ


తళి అటవీ ప్రాంతంలో అటవీ సిబ్బంది

కెలమంగలం: డెంకణీకోట సమీపంలో గత కొన్నిరోజులుగా ఒంటి ఏనుగు సంచారంతో ఆ ప్రాంత ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో ఒంటి ఏనుగును బంధించేందుకు అటవీశాఖాధికార్లు తలమునకలయ్యారు. అందులో భాగంగా రెండు రోజులుగా కర్ణాటక, తమిళనాడు అటవీశాఖాధికార్ల బృందం పశువైద్యులతో కలిసి అటవీ ప్రాంతాల్లో ఏనుగులు, ఇతర వన్యమృగాల జాడలను గుర్తిస్తున్నారు. తళి, డెంకణీకోట చుట్టుపక్కల ప్రాంతాల్లో సంచరిస్తున్న జంతువుల జాడలను గుర్తించి స్థానిక ప్రజలకు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. ఆక్రోశంగా తిరుగుతున్న ఒంటి ఏనుగుకు మత్తుమందిచ్చి బంధించాలని పథకం వేశారు. ఏనుగు తిరుగుతున్న ప్రాంతాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు.